వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సంపుటి : 11 సంచిక : 12 హైదరాబాద్ 149 డిసెంబర్ 2013 పేజీలు : 68 రు. 15

- ప్రపంచ వ్యవసాయ సదస్సు
- మార్క్స్ యాత్ర ఎవరి కోసం?
- విధ్వంస శక్తుల ప్రతినిధి మోడీ
- భారతరత్న మాయాజాలం
- వోటు హక్కుకి విలువ ఉందా?
- రక్తాన్నైనా ఇస్తాం, భూములు ఇవ్వం
- మళ్లీ చిగురిస్తున్న శ్రీలంక తమిళ కల

149 ISSN 2231-6892

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

డిసెంబర్ 2013
సంపుటి : 11
సంచిక : 12

వ్యవస్థాపక సంపాదకులు: వి. హనుమంతరావు
సంపాదకులు: ఎన్. వేణుగోపాల్
కరస్పాండెంట్ / సర్క్యులేషన్ మేనేజర్: వై. రామచంద్రం
కంపోజింగ్: సి. రాజశేఖర్
సబ్ ఎడిటర్ : ఎ. మల్లేశ్
ఆఫీస్ అసిస్టెంట్ : ఎస్. వెంకటేష్

లోపలి పేజీల్లో...

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; హైదరాబాద్ – డి. విజయభాస్కర్; కరీంనగర్ – ద్యామర రేణుక; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ఎన్. భగవాన్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; నిజామాబాద్ – ఎం. నర్సయ్య; రంగారెడ్డి – వి. శంకరయ్య; వరంగల్ – ఎ.కుమార్; అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; నెల్లూరు – బాలగురువయ్య; విజయనగరం – డి. సుధాకర్; విశాఖపట్నం – పి.వి. రమణ; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత

'వీక్షణం'లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమైన అభిప్రాయాలన్నిటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు. 'వీక్షణం'ను నిజమైన ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో అన్నిరకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది.

ప్రింటర్స్
డక్కన్ ప్రెస్ / చరితా ఇంప్రెషన్స్
ఆజామాబాద్, హైదరాబాద్
ఫోన్ : 040 - 27678411

డిస్ట్రిబ్యూటర్స్
ఆనంద్ ఏజన్సీస్
హైదరాబాద్
ఫోన్ : 98484 28516
92468 26191

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, చెక్కులు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం
మైత్రీ రెసిడెన్సీ, 3-6-394,
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు	విద్యార్థులకు
విడి ప్రతి	రు. 15	రు. 15	రు. 15
సంవత్సరం	రు. 180	రు. 150	రు. 120
మూడు సంవత్సరాలు	రు. 500	రు. 400	రు. 350
ఐదు సంవత్సరాలు	రు. 800	రు. 650	–
పది సంవత్సరాలు	రు. 1500	రు. 1300	–

వీక్షణం అకౌంట్ నెంబర్ - **013911011002175**
ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్
ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 000/0139** నెంబర్ రాసి వేయవచ్చు.

జూన్, జూలై సంచికలలో 'శ్రమశక్తి ఉపయోగపు విలువ' గురించి రంగనాయకమ్మ రాసిన వ్యాసాలు చదివాను. మార్క్స్ గణితంలో చాలా ప్రజ్ఞావంతుడన్న విషయం తెలుసును. మేథమెటిక్స్ విద్యార్థిగా 'ప్రూఫ్ బై కాంట్రడిక్షన్' అనే పద్ధతి గురించి నాకు తెలుసు. 'ప్రూఫ్ బై కాంట్రడిక్షన్' అంటే, ప్రత్యర్థి చెబుతున్నదాన్ని 'అదే అనుకుందాం' అంటూ ప్రారంభించి, రకరకాల ప్రూఫులతో, వాదనలతో, ఆఖరికి అది తప్పు అని తేల్చడం. 'అమ్మడం – కొనడం' లా కనిపించే, పెట్టుబడిదారుడు, శ్రామికుడు మధ్యనున్న సంబంధాన్ని, 'సరే అలాగే అనుకుందాం' అని మొదలెట్టి, చివరికి అది కానేకాదని ప్రూవ్ చెయ్యడం. పెట్టుబడిదారుడు శ్రామికుడు మధ్య సమాన విలువల మారకం లేదు. అసలు మారకమే లేదు. పెట్టుబడిదారుడు తీసుకోవడమే తప్ప, ఇచ్చేది ఏమీ లేదు అని ప్రూవ్ చెయ్యడం. మార్క్స్ తన తర్కంలో ఈ పద్ధతిని ఉపయోగించాడు. అమ్మడం, కొనడం అన్న మాటల్ని పొరపాటు పడడం వల్ల ఉపయోగించలేదు. ఒక తర్కం ఆధారంగానే ఉపయోగించాడు అనుకుంటున్నాను.

– కె. శ్రీనివాస్, టీచర్, పిఠాపురం

నవంబర్ సంచికలోని 'ఇది కథ కాదు' అనే వ్యాసం ఇంతటిదని నేను వెలకట్టలేక పోతున్నాను. ఈ వ్యాసంలోనే ఇద్దరు యువకులు అన్న ఆ ఒక్క మాట 'మేము తినే ప్రతి ముద్దలో మాకు మన దేశంలోని 40 కోట్ల మంది ప్రజలు కనిపించారు అన్నారంటే ఆ 40 కోట్ల మంది ప్రజలకు వెలకట్టగలమా! అనేదే ఇప్పుడు మన ముందున్న ప్రశ్న. ఈ నాటి సామ్రాజ్యవాద ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రజల గురించి ఆలోచించేవారేరి? అట్లా ఆలోచించే వారిని వెర్రి వాళ్లంటున్నారు తెలివి మీరిన పెద్ద మనుషులు.

– కడియాల సుబ్బనాచారి, ఆయుర్వేద వైద్యులు, కావలి

'**శ్ర**మశక్తి ఉపయోగపు విలువ' వ్యాసం గురించి (వీక్షణం జూన్, జూలై 2013 సంచికలలో), ప్రధానం కాని విషయాల మీద చర్చలు కాదు కావలసింది. ఆ వ్యాసంలో, అత్యంత ప్రధానమైన మార్క్సిస్టులు కంగారు పడవలసిన విషయం ఉంది. దాన్ని గురించే చర్చించుకోవాలి. మార్క్స్ ప్రకారమే చూద్దాం – 'శ్రమశక్తి' ఒక సరుకు. దాన్ని కార్మికుడు అమ్ముతాడు, పెట్టుబడిదారుడు కొంటాడు. ఒక సరుకుని ఎవరు కొంటారో, ఆ సరుకుకి ఉండే ఉపయోగపు విలువ, ఆ సరుకుని కొన్నవాళ్లకే చెందుతుందని మార్క్సే చెప్పాడు. 'శ్రమశక్తి'కి ఉండే ఉపయోగపు విలువ ఏమిటో కూడా మార్క్స్ చెప్పాడు. శ్రమశక్తి ప్రతీ పని దినంలోనూ, మొత్తం అన్ని గంటలూ పని చేయడమే శ్రమశక్తికి ఉండే 'ఉపయోగపు విలువ'. ఆ ఉపయోగపు విలువ (చేసిన శ్రమ అంతా) శ్రమ శక్తిని కొన్నవాడిదే అవుతుందని మార్క్స్ చెప్పిందే. అలాంటప్పుడు శ్రమశక్తి ద్వారా దొరకని శ్రమని, ఆ సరుకుని కొన్నవాడు తీసుకోవడంలో తప్పు ఎలా అవుతుంది? 'నేను కొన్న సరుకు ఇచ్చే ఉపయోగపు విలువని నేను తీసుకోవడం నా తప్పు ఎలా అవుతుంది? నేను దోపిడీ చేయడం ఎలా అవుతుంది?' అని పెట్టుబడిదారుడు అడిగితే, దానికి కార్మికుడు ఇవ్వగలిగే జవాబు ఏమిటి? కార్మికుడు పది గంటలు శ్రమ చేసి, మూడు గంటల శ్రమనే జీతంగా తీసుకుని, మిగతా దాన్ని పోగొట్టుకోవడం, అది పెట్టుబడిదారుడికి పోవడం శ్రమ దోపిడీయే, కాని, సరుకుని కార్మికుడు అమ్మాడు, పెట్టుబడిదారుడు కొన్నాడు. ఎవరు కొన్న సరుకు వాళ్లదే. మరి ఈ 'అమ్మడం – కొనడం' అనే దానికీ, 'పెట్టుబడిదారుడు దోపిడీ చేస్తున్నాడు' అనే దానికీ పొంతన ఎలా కుదురుతుంది? ఈ విషయమే రంగనాయకమ్మ గారు అడిగారు. అసలు సమస్య మీద చర్చించాలి? లేకపోతే, పెట్టుబడిదార్ల దగ్గర కార్మికులు తెల్లమొహాలు వెయ్యవలసి వస్తుంది.

– జె.యు.బి.వి. ప్రసాద్, క్యూపర్టీనో, అమెరికా

విభజన మీద వచ్చిన అన్ని వ్యాసాలు విషయం మీద వెలుగును ప్రసరించాయి. ముఖ్యంగా జూలై 30, 2013 తెలంగాణపై ప్రకటన తర్వాత తెలంగాణ బిల్లుపై కాంగ్రెస్ చేస్తున్న తాత్సారంపై వచ్చిన వ్యాసం చాలా బాగుంది. గత మూడు నెలలుగా ఎపిఎన్‌జిఒల అధ్యక్షుడు పి. అశోక్‌బాబు చేస్తున్న సమైక్యాంధ్ర ఆందోళన కాంగ్రెస్ లబ్ధి కోసమేనని ఉద్యోగులు, విద్యార్థులు, సామాన్య ప్రజలు త్వరలోనే తెలుసుకుంటారు.

– కె.ఎం.వి.జి. కృష్ణమూర్తి

డా. నళిని రాసిన 'ఇది కథ కాదు' అనే నివేదిక చదివాను. కెరీర్ వెనుక పరుగులు తీయడం, బాయ్‌ఫ్రెండ్, గర్ల్‌ఫ్రెండ్ సంస్కృతి, క్రికెట్ పిచ్చి వగైరాల విషయాల్లోనే యువత మునిగి తేలుతున్న నేటి కార్పొరేట్ ప్రపంచంలో తుషార్, మాట్ లాంటి యువత కూడా ఉండడం ఊరట కలిగిస్తుంది. దీన్ని మిగిలిన యువత ప్రేరణగా తీసుకోవాలి. ఈ సందర్భంగా ఒక విషయాన్ని గుర్తు చేసుకోవడం వాజీబుగా ఉంటుంది. తెలంగాణలో 1978 నుండి 1985 వరకు 'గ్రామాలకు వెళ్లండి' పేరుతో ప్రతి ఏటా వందలాది మంది విద్యార్థుల్ని జట్లు జట్లుగా 15–20 రోజులపాటు గ్రామాలకు పంపి గ్రామీణ ప్రజల జీవితాల్ని ప్రత్యక్షంగా అనుభూతి చెందే సంస్కృతిని అప్పటి విప్లవోద్యమం నెలకొల్పింది. ప్రజల కష్టాల్ని తెలుసుకోవడమే కాకుండా వాటికి కారణాల్ని, కష్టాలు పోయే మార్గాల్ని చూపే విప్లవ రాజకీయాల్ని విద్యార్థులు ప్రజలకు బోధించేవారు. అదొక అద్భుతమైన ప్రయోగం. తరువాత కాలంలో ప్రభుత్వ క్రూర నిర్బంధం మూలంగా ఆ క్యాంపెయిన్ ఆగిపోయింది. తిరిగి ఏదో ఒక రూపంలో నేటి విద్యార్థులు, యువత తమ తల్లివేరు మూలాల్ని మరిచిపోకుండా ఆ సంప్రదాయాన్ని పునరుద్ధరించి, కొనసాగించడం అవసరం. అదే నేటి యువతను సరైన మార్గంలో ప్రయాణించేలా మార్గ నిర్దేశనం చేయగలదు.

వీక్షణంలో రచనలు చేస్తున్న రచయితలకు నా విజ్ఞప్తి ఏమిటంటే ఆంధ్రజ్యోతి దినపత్రికలో మార్క్సిజంపై విషం కక్కుతున్న జాహ్నవి రాస్తున్న వ్యాసాలను ఖండిస్తూ రాయడంపై కూడా శ్రద్ధ వహించడం అవసరం అని నా అభిప్రాయం. అడపాదడపా అలాంటి వ్యాసాలు వచ్చినా చాలా తక్కువ. కాబట్టి మార్క్సిస్ట్ రచయితలు దీన్ని తప్పక గమనంలోకి తీసుకుంటారని ఆశిస్తున్నాను.

– నటాషా, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్

పన్నెండు సంవత్సరాలుగా నడుస్తున్న తెలంగాణ ఆందోళనలో విప్లవ సంస్థలు, మేధావులు నిర్వహించిన పాత్ర చూస్తే (కొద్దిమంది పాతతరం వాళ్లను మినహాయించి) పతంజలిగారి 'గోపాత్రుడు' నవలలో భూమి బల్లపరుపుగా ఉందని మెజిస్ట్రేట్ చెప్పిన తీర్పు జ్ఞాపకం వస్తుంది. పూర్తిగా పెట్టుబడిదారీ, భూస్వామ్య, ప్రపంచీకరణ, పార్లమెంటరీ పార్టీల, రాజకీయాల పరిమితుల్లో నడుస్తున్న ఆందోళన నుండి ఉంచుకోవాల్సిన విమర్శనాత్మక దూరం ఉంచుకున్న దాఖలాలు అరుదు. ఒకటి రెండు రచనల్లో అందరు ఒకే తానులో ముక్కలే అనే మొక్కుబడి మాటలు చదివాను. కాని ఇది ఆచరణకు సంబంధించిన విషయం. విడిపోదల్చుకున్న వారికి విడిపోయే హక్కు ఉంది అనే సూత్రంతో రాజీ పడకుండానే, తెలంగాణ అంటే అంతర్గత వైరుధ్యాలు లేని ఒక సమూహం అనే ఫాసిస్ట్ భావాజాలాన్ని ప్రచారం చేస్తున్న వర్గాలతో సైద్ధాంతిక, రాజకీయ ఘర్షణ పడకుండా ఆ పార్టీలకు, ముఖ్యంగా తెరాసకు తోకలుగా మారిన విధానం కనబడుతుంది. కోస్తా, రాయలసీమ కానంత వరకు తెలంగాణలో దేనితోనైనా జత కావచ్చనే ధోరణి కనబడుతుంది. ఇరవై సంవత్సరాల క్రితం రాసిన తెలంగాణకు చెందిన భూస్వాముల, పెట్టుబడిదారుల ఆస్తులు తాక కూడదనే వ్యాసం ఎం.ఎల్. పత్రికలో ఇటీవల చూశాను. సమైక్యత / విభజన అనేది బైనరీ. దానిలో కూరుకొని ఐక్యత – పోరాటం అనే గతితార్కికాన్ని, లాంఛన ప్రాయమైన విషయంలో సారాన్ని నింపే అభావం (నెగేషన్) స్థానంలో తిరస్కరణ (రిజెక్షన్) ను అభావంగా దిగజార్చారు. సమైక్యత సాధించాలంటే తెలంగాణ ప్రాంతం లేవనెత్తిన సమస్యల మీద పోరాడండి అనే అన్ని ప్రాంతాల ప్రజలను కార్మిక వర్గ నాయకత్వంలో ఆందోళనకు కదిలించి ఉంటే, విభజన జరిగినా ఇప్పుడున్న అర్ధఫాసిస్ట్ భావజాలం, నిర్మాణం స్థానే ప్రజా సంస్థలు ఏర్పడి చచ్చిన పశువు లాగా కుళ్లి కంపుకొడుతున్న పార్లమెంటరీ రాజకీయాలలో, వాటి వెనుక జలగ లాగా రక్తం తాగుతున్న కార్పొరేట్ పెట్టుబడిపై పోరాటం చేయగలిగేవి. వేటగాళ్లు – వేటాడబడే వారికి నడుమ ఇప్పుడున్న రాజీ రాజ్యాధికారం, నయా ధనిక పాలకవర్గాల చేతిలో బలపడగానే అంతం కాక మానదు. ఈలోపు కొందరు వామపక్ష మేధావులు పాలకవర్గాల కూటమిలో చేరడం, వామపక్ష సంస్థలలో క్షీణత, అవకాశవాదం బలపడే ప్రమాదం కూడా ఉంది.

నేను పైన రాసిన విషయం కేవలం నా ఒక్కడి అభిప్రాయమే అని భావించడం లేదు. హైదరాబాద్ నుండి వచ్చిన ఇంకా అక్కడ ఉన్న వామపక్ష, అభ్యుదయ మేధావులలో ఉన్న మర్యాద, మొహమాటాల వల్ల కొందరు ఈ భావాలు ప్రకటించడం లేదు.

– నరేంద్ర మోహన్, ఆస్ట్రేలియా

'**శ్ర**మశక్తి' అమ్మకం, పెట్టుబడిదారు సమాన వెల చెల్లించడం అనే మాటల వాడకం గురించి రంగనాయకమ్మ రాసిన వ్యాసం గురించి రాస్తున్నాను. ఈ సందర్భంలో 'అమ్మకం' 'కొనుగోలు' అనే మాటలు వాడడంలో మార్క్స్ పొరపాటు పడ్డాడని, ఆ మాటలు వాడితే సమాన లావాదేవీ జరిపానని పెట్టుబడిదారు అనే ఇబ్బందికరమైన స్థితి తలెత్తుతుందని ఆమె రాశారు. దాని మీద వ్యాఖ్యానించడానికి గాని, వివరణ ఇవ్వడానికి గాని నేను సిద్ధంగా లేను. ఎందుకంటే ప్రస్తుతం నా దగ్గర ఇంగ్లిష్ ప్రతి లేదు. మార్క్స్ ఆ మాటలు సరిగా వాడాదో, తప్పుగా వాడాడో చెప్పలేను. కాని, విభిన్న రచనలలో మార్క్స్ ఈ మాటలను వాడడానికి సంబంధించి

(మిగతా 57వ పేజీలో...)

ప్రజలకు తాత్సారం, ఆశ్రితులకు అతివేగం

వీక్షణం

భారత పాలకవర్గాలు గత ఆరు దశాబ్దాలకు పైగా అనుసరిస్తున్న పాలనా విధానం ఏమిటనే ప్రశ్నకు ఒక్క వాక్యంలో జవాబు చెప్పాలంటే 'ప్రజలకు అవసరమైన వాటిలో తాత్సారం, తమ ఇష్టారాజ్యానికి మాత్రం అతివేగం' అని జవాబు చెప్పవచ్చు. ఇది ప్రజాస్వామ్యం అనీ, తాము ప్రజాసేవకులుగా, ప్రజాప్రతినిధులుగా చట్టబద్ధంగా ఎన్నికై రాజ్యాంగ బద్ధంగా అధికార బాధ్యతలు నిర్వహిస్తున్నామనీ చెప్పుకునే ఈ పాలకుల కార్యక్రమంలో ఎక్కడా ప్రజలు లేరని విస్పష్టంగా రుజువు చేసే ఉదాహరణలు వందలాదిగా ఉన్నాయి. మాటకు ముందు ప్రజలు అని చిలకపలుకుల్లాగ వల్లించడం అలవాటయింది గాని ఏ విధానమూ, ప్రణాళికా, కార్యక్రమమూ, పథకమూ ప్రజలను, ప్రజాప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తయారవుతున్నది కాదు. ఏదైనా కార్యక్రమంలో ప్రజల ప్రయోజనాల గురించి ఆడంబరమైన మాటలు, వాగ్దానాలు ఉన్నా, అవి అమలు కాకపోవడమే అరవై ఐదేళ్ల ఆనవాయితీ. మరొక వంక సంపన్నుల, భూస్వాముల, పెట్టుబడిదారుల, సామ్రాజ్యవాదుల ప్రయోజనాలు నెరవేర్చే విధానాలు, ప్రణాళికలు మాత్రం క్షణాలమీద తయారవుతాయి, ప్రకటించిన దానికన్న ఎక్కువ అమలవుతాయి. గత ఆరున్నర దశాబ్దాలలో ఏ విధానం చూసినా, ఏ రాజకీయపక్షపు అధికారిక ఆచరణ చూసినా ఈ అంశం తేటతెల్లమవుతుంది.

అత్యంత తాజా ఉదాహరణ చెప్పాలంటే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు గురించి కేంద్ర పాలకవర్గాలు అనుసరిస్తున్న సాచివేత వైఖరి ఒకపక్క, యుద్ధపరికరాల బహుళ జాతి సంస్థల మార్కెట్ ప్రయోజనాల కోసం, భారత పాలకవర్గాలలోని దళారీలకు వారు ఇచ్చే ముడుపుల కోసం భారత ప్రభుత్వం సాగిస్తున్న హడావుడి మరొకపక్క చూడవచ్చు. ఒకటి కోట్లాది మంది ప్రజలు ఆరు దశాబ్దాలుగా ప్రాణాలు బలిపెట్టి ప్రకటిస్తున్న ఆకాంక్ష. వేరువేరు పాలకవర్గ ముఠాలు వేరువేరు సందర్భాలలో అంగీకరించక తప్పని, పరిష్కరిస్తామని వాగ్దానం చేయక తప్పని సమస్య. స్వయంగా కేంద్ర ప్రభుత్వం పరిష్కారం దిశగా ప్రయత్నాలు ప్రారంభిస్తున్నానని నాలుగు సంవత్సరాల కింద చెప్పిన సమస్య. కాగా మరొకటి దేశానికి అవసరం లేని, దేశ ఆర్థిక స్థితి దృష్ట్యా భరించలేని వేల కోట్ల రూపాయల ఖర్చు సమస్య. పొరుగుదేశాలతో శాంతి సామరస్యాల కోసం చర్చలు జరిపి, యుద్ధ ప్రమాదాన్ని తగ్గించుకుని, వేల కోట్ల రూపాయలను బుగ్గిపాలు చేయకుండా, ప్రత్యామ్నాయంగా ప్రజాసంక్షేమం కోసం వినియోగించగల సమస్య. నాలుగైదు సామ్రాజ్యవాద, బహుళజాతి సంస్థలకూ, పిడికెడు మంది భారత దళారీలకూ మాత్రమే ఆర్థిక ప్రయోజనం చేకూర్చే వ్యవహారం. రాజ్యాంగ బద్ధమైన మొదటి పని చేయడానికి భారత ప్రభుత్వానికి సమయం దొరకడం లేదు, మనసు అంగీకరించడం లేదు, సవాలక్ష ఆటంకాల సాకులు అడ్డం వస్తున్నాయి. ప్రజావ్యతిరేకమైన రెండో పని మాత్రం ఆగమేఘాల మీద, బడ్జెట్ ఆమోదం ఉన్నా లేకపోయినా, ఆర్థికస్థితి అనుకూలించినా అనుకూలించక పోయినా, స్వయంగా ప్రధానమంత్రి ఆయాదేశాలకు వెళ్లి ఆయా ప్రభుత్వాలతో ఒప్పందాల మీద సంతకాలు పెట్టి రావలసినంత ముఖ్యమైన, అత్యవసరమైన పని అనిపిస్తున్నది.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో భారత పాలకవర్గాలలోని ప్రధాన ముఠాలకు కనీసం 2004 నుంచే అభ్యంతరం లేని స్థితి ఏర్పడింది. 2009 ఎన్నికల నాటికి ఒకటి రెండు చిన్న పాలకవర్గ ముఠాలకు తప్ప మరెవరికీ అభ్యంతరం లేదని స్పష్టమయింది. ఆ స్పష్టత వచ్చిన తర్వాతనే 2009 డిసెంబర్ 9 ప్రకటన వచ్చింది. రాష్ట్ర విభజన, కొత్త రాష్ట్రాల ఏర్పాటు అనేది చాల సాధారణమైన, పాలనాపరమైన, రాజ్యాంగబద్ధ ఏర్పాటు. ఆ పరిణామం ఎందుకు అనివార్యమయిందో వివరించడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత. ఆ పరిణామం వల్ల ఏమైనా హాని వాటిల్లుతుందేమో అని ఎవరికైనా అనుమానాలు ఉంటే వాటిని నివృత్తి చేసే బాధ్యత కూడ కేంద్ర ప్రభుత్వానిదే. ఆ పని చేయడంలో తాత్సారం చేసిన అధికార పాలకవర్గాలు రాష్ట్ర విభజనను, కొత్త రాష్ట్ర ఏర్పాటును అవసరమైన దానికన్న ఎక్కువ జటిలం చేశాయి. పాలకవిధానాలకూ ప్రజలకూ మధ్య వైరుధ్య ఫలితంగా వచ్చిన పరిణామాన్ని అనవసరంగా, అవాంఛనీయంగా రెండు ప్రాంతాల ప్రజల మధ్య వైరుధ్యంగా మార్చాయి. అలా నాలుగు సంవత్సరాలు నానబెట్టి చివరికి ముందుకు వెళ్లాలని నిర్ణయించుకున్న తర్వాత కూడ ఆ పని త్వరితగతిన చేయడంలేదు. రాజకీయ నాయకులు, సంపన్నులు స్వార్థప్రయోజనాలతో ప్రచారం చేసిన అబద్ధాలను సాధికారికంగా ఖండించడంలేదు. ప్రజలకు నిజాలు చెప్పి ఒప్పించడంలేదు. అనవసరపు కాలయాపన విధానాలతో, కమిటీలతో సాచివేత ధోరణిని కొనసాగిస్తున్నాయి. చేతులారా ప్రజల మధ్య విద్వేషాన్ని రగిలిస్తున్నాయి.

మరొకపక్క ఆయుధ కొనుగోళ్ల ఒప్పందాలు కుదుర్చుకోవడంలో, అతి విలువైన ప్రజాధనాన్ని అనవసరమైన ఆయుధాల మీద ఖర్చుపెట్టడంలో క్షణాల మీద పనులన్నీ జరిగిపోతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా నాలుగు నెలలు మిగిలి ఉండగానే, గడిచిన ఎనిమిది నెలలలోనే భారత ప్రభుత్వం సైనిక పరికరాలు కొనడానికి దాదాపు లక్షా యాభైవేల కోట్ల రూపాయల ఒప్పందాలు చేసుకుంది, నిర్ణయాలు చేసింది. తాజా బడ్జెట్ లో (2013-14) రక్షణ శాఖకు ప్రతిపాదించినది రు. 2,03,672 కోట్లు కాగా, ఈ కొత్త ఒప్పందాలు చాలవరకు అందులో భాగం కావు. ఇందులో అమెరికాకు చెందిన సంస్థల నుంచి దాదాపు రు. 35,000 కోట్లు, ఫ్రాన్స్ నుంచి రు. 1,05,000 కోట్లు, రష్యా నుంచి రు. 15,000 కోట్లు కొనుగోళ్లు ఉన్నాయి, రానున్న పదిహేను సంవత్సరాలలో భారత ప్రభుత్వం తొమ్మిది లక్షల కోట్ల రూపాయల ఆయుధ, సైనిక సామాగ్రి కొననున్నదని అంతర్జాతీయ పరిశీలకులు రాస్తున్నారు. చివరికి ప్రధానమంత్రే స్వయంగా 'వృథా కొనుగోళ్లు చేయకండి, పొదుపు పాటించండి' అని సైనికాధికారులకు నవంబర్ 23న విజ్ఞప్తి చేయవలసి వచ్చిందంటే పరిస్థితి ఎంత చెయ్యిజారిపోయిందో అర్థమవుతుంది.

ఇప్పటికైనా భారత పాలకవర్గాల ప్రాధాన్యతలు ఏమిటో, ప్రయోజనాలు ఏమిటో అర్థం చేసుకోకపోతే, భారత పాలకవర్గాల ప్రజావ్యతిరేకతను అర్థం చేసుకోకపోతే బుద్ధిజీవులుగా మన వివేకాన్ని అనుమానించవలసి వస్తుంది. వీ

తెలుగుసీమ మీద ప్రకృతి ఆగ్రహం

అక్టోబర్ – నవంబర్ నెలల్లో బంగాళాఖాతంలో తీవ్రమైన వాయుగుండాలు ఏర్పడడం, అవి తుపానులుగా, ఉప్పెనలుగా మారి ఆంధ్రప్రదేశ్ సముద్రతీరం పొడవునా పెద్దఎత్తున ప్రాణనష్టం, ఆస్తినష్టం కలిగించడం సాధారణమే. కాని నెలన్నర వ్యవధిలో వరుసగా మూడు తుపాన్లు – అక్టోబర్ రెండో వారంలో ఫైలిన్, నవంబర్ మూడో వారంలో హెలెన్, నాలుగో వారంలో లెహెర్ – ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతాన్ని అతలాకుతలం చేశాయి. వీటిలో ఫైలిన్ ఒడిశా తీరాన్ని తాకినప్పటికీ దాని ప్రభావం ఉత్తరాంధ్ర జిల్లాల మీద తీవ్రంగానే ఉండింది. ఇక హెలెన్ మచిలీపట్నం దగ్గర తీరాన్ని దాటింది. ఈ సంపాదకీయం రాస్తున్న సమయానికి లెహెర్ కాకినాడ సమీపంలో తీరం దాటడానికి సిద్ధంగా ఉంది. మొత్తానికి ఈ మూడు తుపాన్ల తాకిడికి శ్రీకాకుళం నుంచి నెల్లూరు దాకా తీరప్రాంతమూ, వర్షాలూ వరదలతో ఇతర జిల్లాలూ కూడ పెద్ద ఎత్తున నష్టాన్ని అనుభవించాయి. ఫైలిన్ ప్రభావంతో దాదాపు అరవై మంది చనిపోయారని ప్రభుత్వం ప్రకటించింది. అంతకన్న మిన్నగా కోసి పెట్టిన పంటలూ, కోతకు వచ్చిన పంటలూ నాశనమైపోయాయి. లక్షలాది ఎకరాలలో పంట చేతికి రాకుండా పోయింది. వేలాది ఇళ్లు నేలమట్టమైపోయాయి. వేలాది కొబ్బరిచెట్లు కూలిపోయాయి. రహదారులు ధ్వంసమైపోయాయి. ఈ మొత్తం బీభత్సంలో కొట్టవచ్చినట్టు కనిపించినది ప్రభుత్వ అలసత్వం. ప్రజల పట్ల నిర్లక్ష్యం. ప్రకృతి వైపరీత్యాలను ప్రభుత్వాలు ఆపలేకపోవచ్చు. కాని ప్రభుత్వాల దగ్గర ఉన్న సాధన సంపత్తితో ప్రకృతి వైపరీత్యాలను ముందస్తుగా గుర్తించే అవకాశం ఉంది. ఆ గుర్తింపుతో ప్రజలను ముందే హెచ్చరించడం, సురక్షిత ప్రాంతాలకు తరలించడం, తుపాను సంభవించినప్పుడు తక్షణమే రక్షణ, పునరావాస చర్యలకు ప్రభుత్వ యంత్రాంగాన్ని సిద్ధం చేయడం, తుపాను ప్రభావం వల్ల ఎక్కువ నష్టం జరగకుండా నిరోధించడం, తుపాను తీవ్రత తగ్గిన తర్వాత సహాయ, పునరావాస, పునర్నిర్మాణ చర్యలకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం ప్రభుత్వ బాధ్యత. కాని ఆంధ్రప్రదేశ్ పాలకులు గంభీరమైన ప్రకటనలకు, అధికారులతో సమావేశాలు జరిపి ఆదేశాలు జారీ చేయడానికి మాత్రమే పరిమితమవుతున్నారు. ఎక్కువలో ఎక్కువ కేంద్ర ప్రభుత్వ సహాయం కోసం అభ్యర్థనలు పంపుతున్నారు. తుపాను బీభత్సాన్ని అధికారపక్షం మీద విమర్శలు ఎక్కుపెట్టడానికి గొప్ప అవకాశంగా ప్రతిపక్షాలు భావిస్తున్నాయి. ఇవాళ బాధితులుగా ఉన్న ప్రజలను గత మూడు నెలలుగా 'సమైక్యవాదం' పేరుమీద తమ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకున్న రాజకీయ నాయకులు ఈ విషాద సమయంలో కూడ ఆ ప్రజలకు అవసరమైన సహాయ, పునరావాస చర్యలు తీసుకోవడం లేదు. తమ పోరాటం పాలకుల మీద, పాలకవిధానాల మీద మాత్రమేనని, ప్రజలతో వైరుధ్యం లేదని ఇన్నాళ్లుగా చెపుతూ వచ్చిన తెలంగాణ వాదులు కూడ తమ బాధిత సోదరులకు సానుభూతి ప్రకటించడం లేదు. తెలుగుసీమకు తెలిసిన ఉజ్వల ప్రజా చైతన్య, సంఘీభావ సంప్రదాయాలకు ఏమైపోతున్నది? వీ

ఇరాన్ మెడలు వంచిన సామ్రాజ్యవాద దౌష్ట్యం

ఇజ్రాయిల్ కోపం చల్లార్చడానికో, తన కోపం చల్లార్చుకోవడానికో అమెరికా ఈ క్షణమో, మరుక్షణమో ఇరాన్ మీద పంజా విసిరి, ఇరాక్ లో లాగ, అఫ్ఘనిస్తాన్ లో లాగ బీభత్సం సృష్టిస్తుందని గత కొద్ది సంవత్సరాలుగా నెలకొని ఉన్న ఆందోళన కొంతవరకైనా తగ్గే అవకాశం వచ్చింది. ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలోని ఐదు శాశ్వత సభ్యదేశాలు – అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, రష్యా, చైనా – వాటితో పాటు కలిసిన జర్మనీ, పి 5 ప్లస్ 1 అనే పేరుతో ఇరాన్‌తో అణుపరీక్షల నియంత్రణ ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇది ఇరాన్ మెడలు వంచి ఒప్పించిన ఒప్పందమే. ఇది ఒక మూడవ ప్రపంచ దేశం మీద అగ్రరాజ్యాల పెత్తందారీ దాష్టీకం తప్ప మరేమీ కాదు. తన మీద ఎన్నో సంవత్సరాలుగా సాగుతున్న ఆంక్షలను తప్పించుకోవడానికి, తన చమురు అమ్మకాల ద్వారా సంపాదించిన నాలుగువందల కోట్ల డాలర్ల నిధులను దిగ్బంధనం నుంచి విడిపించుకోవడానికి, తక్షణ యుద్ధ ప్రమాదాన్ని కొంతకాలమైనా వాయిదా వేయించడానికి ఇరాన్‌కు ఈ ఒప్పందానికి లోబడక తప్పలేదు. నిజానికి కుప్పలుగా అణ్వాయుధాలు తయారుచేసుకుని కూచున్న అగ్రరాజ్యాలకు, తమ దళారీ దేశాలకు అణ్వాయుధ సాంకేతిక నైపుణ్యాలను అందజేసే అగ్రరాజ్యాలకు, మరొక దేశం అణ్వాయుధ పరీక్షలు చేయగూడదని ఆంక్షలు విధించే అర్హత లేదు. కాని అగ్రరాజ్యాలు ఈ దుర్మార్గ నాటకాన్ని గత నాలుగైదు దశాబ్దాలుగా విజయవంతంగా ప్రదర్శిస్తున్నాయి. అణ్వాయుధాల తయారీయే తప్పు, అది జన విధ్వంసకం అనే వాదన వేరు. కాని ఆ అణ్వాయుధాల తయారీ హక్కు కొందరికే ఉందనీ, ఇతరులకు లేదనీ అగ్రరాజ్యాలు అనడం వేరు. నిజానికి ఇరాన్ అణ్వాయుధ సామర్థ్యం సమకూర్చుకోవడానికి అమెరికానే కారణం. అమెరికా తొత్తుగా ఉండిన షా పాలనా కాలంలో 1957లో అమెరికానే ఇరాన్ కు ఆ సాంకేతిక నైపుణ్యాన్ని ఇచ్చింది. అక్కడ ఇస్లామిక్ విప్లవం జరిగిన 1979 తర్వాత ఇరాన్ అమెరికాకు వ్యతిరేకిగా మారింది. అప్పటినుంచీ ఇరాన్ మీద కత్తిగట్టిన అమెరికా అణ్వాయుధ తయారీ సామర్థ్యాన్ని బూచిగా చూపుతూ ఇరాన్ కు వ్యతిరేకంగా ఆర్థిక ఆంక్షలు, ప్రచారం, యుద్ధ సన్నాహాలు ప్రారంభించింది. చమురు అమ్మకాల ద్వారా ఇరాన్ కు వచ్చిన నిధులను దాచుకున్న బ్యాంకులపై ఒత్తిడి తెచ్చి ఆ నిధులు విడుదల చేసుకోకుండా ఆంక్షలు విధించింది. బంగారం, పెట్రో కెమికల్స్, కార్ల విడిభాగాలు, విమాన విడిభాగాలు వంటి ఎన్నో సరుకుల వాణిజ్యంపై ఆంక్షలు విధించింది. మరొకవైపు ఇరాన్ మీద దాడి చేయడానికి యుద్ధ సన్నాహాలలో భాగంగా, ఇరాక్ మీద చేసినటువంటి అబద్ధపు ఆరోపణలనే ప్రచారం చేయడం మొదలుపెట్టింది. ఇరాన్ పాలకులు మత ఛాందసవాదులైనా, అక్కడ ప్రజావ్యతిరేక పాలనే సాగుతున్నదనుకున్నా, ఆ దేశపు సార్వభౌమాధికారం మీద దాడి చేసే అధికారం అమెరికాకు లేదు. కాని ఇవాళ ప్రపంచం దుడ్డున్నవాడిదే బర్రె చందంగా ఉన్నది గనుక దుడ్డున్న అమెరికా మాటే చెల్లుతున్నది. ఇరాన్ లొంగిపోయి, న అణు ఇంధన శుద్ధి కార్యక్రమాన్ని ఉపసంహరించుకుంటానని అంగీకరించక తప్పలేదు. సామ్రాజ్యవాద దౌష్ట్యానికి మరొక నిదర్శనం ఈ ఒత్తిడీ, ఒప్పందమూ. వీ

వర్తమాన చరిత్ర - రాజకీయార్థిక దృష్టి

మారిన రూపాలు – మారని దోపిడీ

మార్క్సిజం గొప్ప సంవిధానమని మాటవరుసకు ఒప్పుకుంటూనే, అది విశ్లేషణకు పనికివచ్చినంతగా, పరివర్తనకు పనికిరాదని సన్నాయినొక్కులు నొక్కుతున్న మేధావులు ఇటీవల పెరుగుతున్నారు. అసలు మార్క్స్ ఎంగెల్స్ లు విశ్లేషించిన కాలానికీ ఇప్పటికీ చాల మార్పులు జరిగాయనీ, వారి కాలపు పారిశ్రామిక ఉత్పత్తి విధానానికీ, ప్రస్తుత ఉత్పత్తి విధానానికీ చాల తేడా ఉందని, చివరికి మావో తర్వాత కూడ ప్రపంచం చాల మారిందనీ, కనుక ఇప్పుడు శ్రమ, అదనపు విలువ, శ్రమదోపిడీ వంటి మాటలకు అర్థం లేదనీ, ఇప్పుడసలు వర్గపోరాటమే లేదనీ చాల మంది అంటున్నారు. మరెంతో మంది అమాయకులు నమ్ముతున్నారు.

ఈ అభిప్రాయాల నేపథ్యంలో, భారత బడా, దళారీ బూర్జువావర్గపు ఆలోచనల ప్రతినిధి అయిన ది ఎకనమిక్ టైమ్స్ దినపత్రికలో ఈ నెలలోనే అచ్చయిన రెండు వార్తలను పరిశీలించడం ఆసక్తికరంగా ఉంటుంది.

మొట్టమొదటి వార్తావ్యాసం మహీంద్రా అండ్ మహీంద్రా అనే పారిశ్రామిక, వ్యాపార గృహంలో నలభై సంవత్సరాల పాటు పనిచేసి చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్ గా ఈ నెల పదవీవిరమణ పొందిన వ్యక్తి గురించిన కథనం. ఆవ్యక్తి గురించి చెప్పుకోవడం అంత ముఖ్యం కాదు గాని, ఆయన 1973లో ఆ కంపెనీలో చేరినప్పుడు అది రు. 50 కోట్ల కంపెనీ అని, ప్రస్తుతం అది రు. 44,000 కోట్ల గ్రూపుగా మారిందని ఆ కథనంలో చెప్పిన విషయం ముఖ్యమైనది. అంటే ఆ కంపెనీ అయినా, గ్రూపు అయినా గత నలభై ఏళ్లలో 2200 రెట్లు పెరిగిందన్న మాట.

ఈ కంపెనీ మొదట 1945లో బొంబాయిలో మహీంద్రా అండ్ మహమ్మద్ అనే ఉక్కు వ్యాపార కంపెనీగా ప్రారంభమయింది. భాగస్వాములలో ఒకరయిన గులాం మహమ్మద్ 1947 తర్వాత పాకిస్తాన్ కు వెళ్లిపోవడంతో ఇది పూర్తిగా మహీంద్రా సోదరుల అధీనంలోకి వచ్చి మహీంద్రా అండ్ మహీంద్రాగా మారింది. చిన్న మదుపుదారుల పెట్టుబడులను కూడ సేకరించే పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా ఉన్నప్పటికీ, ఇప్పుడు మూడో తరం మహీంద్రా చేతుల్లో ప్రధానంగా కుటుంబ వ్యాపార గృహంగానే ఉంది. 1947 తర్వాత జీపులు, ట్రాక్టర్ల ఉత్పత్తితో ప్రారంభించి ప్రస్తుతం 18 రకాల పరిశ్రమలు, వ్యాపారాలతో, ఒక లక్షా ఎనభై వేల మంది ఉద్యోగులతో, వంద దేశాలలో వ్యాపారాలతో విస్తరించింది.

దాని విస్తరణ ఎన్ని రంగాలలోకి సాగినా, అది ఎంత బహుళ జాతి సంస్థగా మారినా అట్టడుగున ఆలోచించవలసిన అంశం గత నాలుగు దశాబ్దాలలో దాని ఆస్తులు 2200 రెట్లు పెరుగుదల ఎలా సాధించాయనేది. ఆ కంపెనీ ఉక్కు అమ్మినా, జీపులూ ట్రాక్టర్లూ వాహనాలూ వ్యవసాయ పరికరాలూ తయారు చేసి అమ్మినా, రక్షణ, విద్యుదుత్పాదన, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, రియల్ ఎస్టేట్ వంటి రంగాలకు వ్యాపించినా పెరుగుదల ఎక్కడి నుంచి ఎట్లా వస్తోందనే ప్రశ్న మిగిలిపోతుంది. డబ్బును ఎంతకాలం నానబెట్టినా, పాతిపెట్టినా కొత్తగా డబ్బు పండదు. ద్రవ్య వ్యాపారంలో ఉంటే, ఇతరులకు పెట్టుబడులు పెట్టి వడ్డీ వసూలు చేస్తే, వడ్డీ వ్యాపారం చేస్తే కొంతవరకు పెరగవచ్చుగాని అక్కడ కూడ ఇంత పెరుగుదల ఉండదు. మహీంద్రా గ్రూపు ద్రవ్య వ్యాపారంలో కూడ ఉంది గాని అది దాని మొత్తం వ్యాపారంలో గణనీయమైనదేమీ కాదు. ఆ గ్రూపు వాడుకునే ఇనుము, ఉక్కు, ఇతర ఖనిజాలు, విద్యుత్తు, నీరు అన్నీ కలిసినా డబ్బును ఉత్పత్తి చేయలేవు, డబ్బుకు పిల్లలనూ పుట్టించలేవు. మానవశ్రమతో కలవకుండా, నెత్తురు చెమటయి చిందకుండా, ఏ సహజవనరూ దానికదిగా విలువను ఉత్పత్తి చేయజాలదు. ఆ మానవశ్రమకు ఇవ్వవలసిన దానికన్న తక్కువ వేతనం ఇవ్వకపోతే ఏ యజమాని దగ్గరా మొదట ఉన్న డబ్బుకు అదనంగా డబ్బు సమకూరదు. శ్రమశక్తిని దోపిడీ చేయడం ద్వారా తప్ప యాభై కోట్ల రూపాయల ఆస్తులను నలభై నాలుగువేల కోట్ల రూపాయల ఆస్తులుగా మార్చే మంత్రదండాన్ని ఇంతవరకూ ఎవరూ కనిపెట్టలేదు.

ఇది ఉదాహరణ ప్రాయమైన కథ మాత్రమే గాని ఒక్క మహీంద్రా గ్రూపుకు మాత్రమే సంబంధించిన విషయం కాదు. దేశంలోని పారిశ్రామిక, వ్యాపార గృహాలలో ఏ ఒక్కదాన్ని తీసుకుని పరిశీలించినా వాటి పెరుగుదల వెనుక శ్రమ దోపిడీ స్పష్టంగా బయటపడుతుంది. కాకపోతే ఆ శ్రమ దోపిడీ రూపాలు గత నూట యాభై సంవత్సరాలలో మారి ఉండవచ్చు. ఆమేరకు మార్క్స్ ఎంగెల్స్ ల మౌలిక సూత్రీకరణలకు కొన్ని చేర్పులు, అదనపు ఉదాహరణలు అవసరం కావచ్చు. దోపిడీ రూపాలు మారాయి గాని దోపిడీ మారలేదనీ, మార్క్స్ మౌలిక సూత్రీకరణను రద్దు చేసే అనుభవమేదీ మానవ సమాజానికి ఇంకా కలగలేదనీ ఏ పారిశ్రామిక, వ్యాపార సంస్థ చరిత్ర చూసినా రుజువవుతుంది.

శ్రామికులకు వారి శ్రమ ఫలితాన్ని ఇవ్వకపోవడం ద్వారానే, వారు సృష్టించే అదనపు విలువను కొల్లగొట్టడం ద్వారానే పారిశ్రామిక, వ్యాపారసంస్థలు లాభాలు చేసుకుంటాయని, ఆస్తులు కూడబెట్టుకుంటాయని పైవార్త స్పష్టం చేస్తుండగా, మరొక వార్త యజమానులు ఏమీ శ్రమ చేయకుండానే ఎంతెంత ఫలితం అనుభవిస్తున్నారో చెపుతుంది. తాము పెట్టిన పెట్టుబడికి ప్రతిఫలంగానో, తమ నిర్వహణా సామర్థ్యానికీ, తాము వెచ్చిస్తున్న కాలానికీ పారితోషికంగానో ఆ వేతనాలు తీసుకుంటున్నామని ఆ యజమానులు అనవచ్చు గాని, ఆ జీతభత్యాల అసాధారణ అంకెలు చూస్తే యాజమాన్యాల దుర్మార్గం తేటతెల్లమవుతుంది.

దేశంలో పారిశ్రామిక, వ్యాపార గృహాల ప్రధాన కార్యనిర్వహణ అధికారులుగా పది మంది బడా పెట్టుబడిదారులు తీసుకుంటున్న వార్షిక జీతాల జాబితాను ఎకనమిక్ టైమ్స్ వార్తగా ప్రచురించింది. ఆ కంపెనీల డైరెక్టర్లు, ఉన్నతాధికారులు తమకు తాము ఇచ్చుకుంటున్న ఈ భారీ జీతభత్యాల మీద ఆంక్షలు విధించాలని, ఈ జీతభత్యాలను ఆ సంస్థలలోని చిల్లర మదుపుదార్లు నియంత్రించేలా చూడాలని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ చేంజెస్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి – దేశంలోని స్టాక్ మార్కెట్ల నియంత్రణాధికార సంస్థ) చేస్తున్న ప్రతిపాదన మీద వార్త అది.

దాని ప్రకారం సన్ టివి నెట్‌వర్క్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ కళానిధి మారన్ సంవత్సరానికి తీసుకుంటున్న జీతభత్యాలు అక్షరాలా యాభై ఆరు కోట్ల ఇరవై ఐదు లక్షల రూపాయలు మాత్రమే. మామూలు మనుషులకు అర్థమయ్యేట్టు చెప్పాలంటే అది నెలకు నాలుగున్నర కోట్ల రూపాయలు, రోజుకు పదిహేను లక్షల రూపాయలు.

ఇక మిగిలిన తొమ్మిది మంది బడాపెట్టుబడిదారులు తమ కంపెనీలలో తాము తీసుకుంటున్న జీతభత్యాలు: సన్ నెట్‌వర్క్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కావేరి కళానిధి (రు. 56.24 కోట్లు), జిందాల్ స్టీల్ ఛైర్మన్ నవీన్ జిందాల్ (రు. 54.98 కోట్లు), హీరో మోటోకార్ప్ సిఇఒ పవన్ ముంజల్ (రు. 32.80 కోట్లు), హీరో మోటోకార్ప్ ఛైర్మన్ బ్రిజ్ మోహన్‌లాల్ ముంజల్ (రు. 32.73 కోట్లు), రామ్‌కో సిమెంట్ ఛైర్మన్ పి ఆర్ రామసుబ్రహ్మణ్య రాజా (రు. 30.96 కోట్లు), అల్ట్రాటెక్ సిమెంట్ ఛైర్మన్ కుమార్ బిర్లా (రు. 27 కోట్లు), దివిస్ లాబ్ ఛైర్మన్ మురళి కె దివి (రు. 26.46 కోట్లు), భారతి ఎయిర్‌టెల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ సునిల్ భారతి మిత్తల్ (రు. 24.33 కోట్లు), జెఎస్‌డబ్ల్యు స్టీల్ ఛైర్మన్ సజ్జన్ జిందాల్ (రు. 20.25 కోట్లు).

ఇప్పుడు కంపెనీల వాటాలు చిల్లర మదుపుదార్లకు కూడ విరివిగా అమ్ముతుండడం వల్ల గతకాలపు యాజమాన్య భావనలకు, గుత్తాధిపత్యానికి కాలం చెల్లిందని, కార్పొరేట్ ప్రజాస్వామ్యం వెల్లివిరుస్తున్నదని, క్రమంగా పెట్టుబడిదారీ విధానమే సోషలిజంగా పరిణమిస్తుందని కూడ కొందరు మేధావులు వాదిస్తున్నారు. కాని ఈ జీతభత్యాల వార్త చూస్తే కొట్టవచ్చినట్టు కనబడే అంశాలు ఆరు:

ఒకటి, ఈ పది మంది అత్యున్నత జీతభత్యాలు పొందుతున్న వ్యక్తుల సగటు ఆదాయం రు. 36.20 కోట్లు. ప్రపంచంలోకెల్లా అతి ఎక్కువ ఆదాయం పొందుతున్న పది మంది పారిశ్రామిక, వ్యాపారవేత్తల సగటు ఆదాయం తొమ్మిది కోట్ల డాలర్లు. అమెరికాలో అది పది కోట్ల డాలర్లు. మారకపు విలువల వల్ల తేడాలు ఉండవచ్చుగాని యూనిట్లలో చూసినప్పుడు అమెరికన్ వ్యాపారవేత్తల కన్న, ప్రపంచ వ్యాపారవేత్తల కన్న భారత వ్యాపారవేత్తలు నాలుగు రెట్లు ఎక్కువ ఆదాయాన్ని సొంతానికి తీసుకుంటున్నారు. ఆ ఆర్థిక వ్యవస్థల స్థాయినీ, భారత ఆర్థిక వ్యవస్థ స్థాయినీ పోల్చిచూసినప్పుడు ఈ మితిమీరిన ఆదాయాలు బందిపోటు దొంగతనానికి తక్కువ కాదు.

రెండు, ఆ వ్యాపార గృహాలు పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలైనా సరే, వాటిలో ప్రభుత్వ ద్రవ్య సంస్థలకు, చిల్లర మదుపుదార్లకు వాటాలు ఉన్నా సరే, తక్కువ వాటాలతోనే ఆ వ్యాపార గృహాలను నిర్వహిస్తున్న పెట్టుబడిదార్లు వాటిని తమ సొంత భూస్వామ్య ఆస్తులుగానే పరిగణిస్తున్నారు. 'ప్రజాస్వామిక', 'పెట్టుబడిదారీ' వ్యాపార సంస్థలలో నిరంకుశ, పెట్టుబడిదారీపూర్వ రాజవిలాసాలను మించిన విలాసాలు అనుభవిస్తున్నారు. నిజానికి ఈ అన్ని సంస్థలలోను ప్రభుత్వ ద్రవ్య సంస్థల పెట్టుబడులు, చిల్లర మదుపుదార్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇంత విలాసవంతమైన జీత భత్యాలు తీసుకుంటున్నవారి పెట్టుబడి ఎక్కువలో ఎక్కువ ముప్పై శాతానికి మించి లేదు. అంటే వారికి నిర్ణయాధికారం ఉండడానికే వీలులేదు. కాని చట్టంలోని లొసుగులను వాడుకునీ, ప్రభుత్వ ద్రవ్యసంస్థల ప్రతినిధులుగా ఉన్న డైరెక్టర్లను కొనివేసీ, చిల్లర మదుపుదారులు సంఘటితంగా లేనందువల్లా ఈ యజమానులు, యజమానులు కాకుండానే యాజమాన్యం నిర్వహిస్తున్నారు.

మూడు, ఈ పది మంది అధికాదాయపరులు ఎనిమిది వ్యాపార సంస్థలకు చెందినవారు కాగా, అందులో ఆరుగురు మూడు కుటుంబాలకు చెందినవారే. ఇంకా ఘోరం, మొదటి రెండు స్థానాలలో ఉన్నవారు భార్యాభర్తలే. అంటే కుటుంబాల గుత్తాధిపత్యం వడ్డీవ్యాపార కుటుబాలలో లాగ యథాతథంగా సాగుతోంది.

నాలుగు, ఈ పది అత్యున్నత జీతభత్యాల జాబితా చూస్తే ఇందులో ఉక్కు, సిమెంట్, ఔషధాలు, వాహనాలు వంటి పారిశ్రామిక ఉత్పత్తి సంస్థలతో పాటు టెలివిజన్, మొబైల్ ఫోన్ వంటి సేవారంగ సంస్థలు కూడ ఉన్నాయి. ప్రజల నిత్య జీవితావసర సరుకుల వ్యాపారంలో ఉన్న సంస్థల కన్న నిర్మాణ, సేవా రంగ సంస్థలే ఇంత ప్రాచుర్యంలో ఉండడం ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తతకు ఒక నిదర్శనం.

ఐదు, ఈ ఎనిమిది వ్యాపారసంస్థలలో పూర్తిగా భారతీయ పెట్టుబడికి చెందిన సంస్థగా చెప్పదగినది ఒక్కటి కూడ లేదు. అన్ని సంస్థల పెట్టుబడిలోనూ విదేశీ వాటానో, విదేశీ మిలాఖత్తు ఒప్పందాలో, విదేశీ వ్యాపారాలో ఉన్నాయి. నిజానికి నూటయాభై సంవత్సరాల పారిశ్రామిక అభివృద్ధి తర్వాత, ప్రపంచంలోకెల్లా అతి ఎక్కువ మంది శాస్త్ర సాంకేతిక నిపుణులు ఉన్న దేశంలో ఇంతగా విదేశీ సంస్థల మీద ఆధారపడవలసిన అవసరమే లేదు.

ఆరు, పెట్టుబడులు, లాభాలు, ఆస్తులు వంటి ఏ సూచిక ప్రకారమైనా దేశంలో అగ్రభాగాన ఉన్న 25 వ్యాపార సంస్థలలో, భారతి ఎయిర్ టెల్ మినహా, ప్రైవేటిలో ఏ ఒక్క సంస్థాలేదు. అంటే, అత్యున్నతాధికారుల జీతభత్యాల నిర్ణయం ఆ సంస్థ పరిమాణాన్ని, స్థాయిని బట్టి కాక ఇష్టారాజ్యంగా జరుగుతున్నదన్నమాట.

మరొకవైపు నుంచి చూస్తే ఈ ఆరు అంశాలూ కూడ భారత రాజకీయార్థిక వ్యవస్థ స్వభావాన్ని అర్థం చేసుకోవడానికి సూచికలుగా ఉపయోగపడతాయి. భారత ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడిదారులుగా కనబడేవారు కూడ నిజమైన, ప్రామాణిక అర్థంలో పెట్టుబడిదారులు కారనడానికి ఈ ఆరు అంశాలూ రుజువులుగా నిలుస్తాయి.

ప్రామాణిక అర్థంలో పెట్టుబడిదారుకు లాభమే పరమావధిగా ఉంటుంది. ఎప్పటికప్పుడు వచ్చిన లాభాన్ని తిరిగి పెట్టుబడి పెడుతూ మరింత అదనపు విలువను, లాభాన్ని రాబట్టుకోవడమే లక్ష్యంగా ఉంటుంది. అదనపు విలువను సంపాదించగలిగే పెట్టుబడిని సొంత విలాసాల కోసం ఖర్చుపెట్టడం, వృథా చేయడం కంటె తిరిగి మదుపు పెట్టడానికే పెట్టుబడిదారులు మొగ్గు చూపుతారు. ఆ రకంగా కొంతవరకు పారిశ్రామికాభివృద్ధికి, ఉత్పాదకత పెరుగుదలకు కూడ తోడ్పడతారు. మార్కెట్ లో భీకరమైన పోటీకి దిగుతూ ఉత్పత్తి సాధనాల మీద యాజమాన్యం అంతకంతకూ చిన్న బృందానికి కుదించుకుపోయేలా చూస్తారు. పెట్టుబడిదారీ విధానపు తొలిదశలో పెట్టుబడిదారులు ఇతర జాతుల పెట్టుబడిదారులతో వ్యాపార పోటీకి కూడ దిగి తమ జాతి రాజ్యాల పరిరక్షణకు దోహదం చేశారు. గుత్తపెట్టుబడిదారీ, వలసవాద, సామ్రాజ్యవాద దశలో తమ వ్యాపార విస్తరణ కోసం ఇతరదేశాలలో పెట్టుబడిదారులు తలెత్తి పోటీకి రాకుండా, వారిని దళారీలుగా మార్చుకోవడం ప్రారంభించారు.

భారత పెట్టుబడిదారీ వర్గం అంతకుముందరి భూస్వామ్య, పెత్తందారీ, వడ్డీ వ్యాపార వర్గం నుంచి తలెత్తి మొదట బ్రిటిష్ పెట్టుబడికి, ఆ తర్వాత సామ్రాజ్యవాద పెట్టుబడికి దళారీగా పెరిగింది గనుక దానికి పెట్టుబడికి ఉండే ప్రామాణిక లక్షణాలు తక్కువ. తన పాత వాసనలు పూర్తిగా పోలేదు. కొత్త పెట్టుబడిదారీ విలువలు రాలేదు. దళారీతనమే సామర్థ్యంగా చూపుకునే, భ్రమపడే స్వభావం వచ్చింది. వీ

ఆర్.ఎస్. రావు స్మారకోపన్యాసం, సదస్సు 2013

అరుదైన మార్క్సిస్టు ఆలోచనాచరణశీలి, సునిశిత ప్రజా మేధావి ఆర్ ఎస్ రావు స్మృతిలో ప్రతి సంవత్సరం తలపెట్టిన ఆర్ ఎస్ రావు స్మారకోపన్యాసం, ఆర్ ఎస్ రావు స్మారక సదస్సు కార్యక్రమాలు నవంబర్ 9, 10 తేదీల్లో హైదరాబాదులో అర్థవంతంగా, ఆలోచనాస్ఫోరకంగా, జయప్రదంగా జరిగాయి. గత సంవత్సరం స్మారకోపన్యాసానికీ, స్మారక సదస్సుకూ వేరువేరు ఇతివృత్తాలు ఉండగా, ఈ సంవత్సరం రెండిటికీ ఒకటే ఇతివృత్తం – సాహిత్యంలో సామాజిక చలనపు ప్రతిఫలనం – ఎంచుకోవడం జరిగింది.

నవంబర్ 9 శనివారం సాయంత్రం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ లో సామాజిక శాస్త్రవేత్త ప్రొ. జి. హరగోపాల్ అధ్యక్షతన విప్లవకవి పి. వరవరరావు 'సాహిత్యంలో సామాజిక చలనపు ప్రతిఫలనం' అనే అంశం మీద స్మారకోపన్యాసం ఇచ్చారు. తెలుగు సాహిత్య చరిత్రలో తెలుగు సామాజిక చలనం ఎలా ప్రతిఫలించిందో సోదాహరణంగా, సుదీర్ఘంగా సాగిన ఈ ప్రసంగం శ్రోతలను ఉత్తేజపరిచింది. గత నూట యాభై సంవత్సరాల తెలుగు సమాజ చలన చరిత్రను తెలుగు సాహిత్య చరిత్రలో, ముఖ్యంగా కవిత్వ చరిత్రలోని మూడు ప్రధాన దశలతో, అందులోని రెండో దశలో రెండు ఉపదశలతో, ఆయా దశలలో వెలువడిన ప్రధాన సాహిత్య ఉదాహరణలతో ఆయన వివరించారు. 'ఆకులందున అణగి మణగి కవిత కోయిల పలకవలెనోయ్' మొదటి దశకు, 'కదిలేదీ కదిలించేదీ పెనునిద్దుర వదిలించేదీ, మునుముందుకు నడిపించేదీ కావాలోయ్ నవకవనానికి' రెండో దశకు, 'ప్రజను సాయుధం చేస్తున్న రెవల్యూశనరీ నేడు కవి' మూడో దశకు ప్రాతినిధ్య కవితలని ఆయన అన్నారు.


నవంబర్ 10 ఆదివారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 6 వరకు (మధ్యలో భోజన విరామంతో) హైదరాబాద్ బేగంపేట సెంటర్ ఫర్ ఎకనమిక్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్) సెమినార్ హాల్‌లో జరిగిన ఆర్ ఎస్ రావు స్మారక సదస్సు పదకొండు పత్రాలతో, వందకు పైగా శ్రోతల భాగస్వామ్యంతో ఆలోచనాస్ఫోరకంగా జరిగింది. టి కృష్ణాబాయి అధ్యక్షతన జరిగిన మొదటి సమావేశంలో 'సాహిత్యం: సామాజిక చలనం' అనే అంశంపై డా. ముదునూరి భారతి, 'పరజ నవలలో చిత్రితమైన ఒడియా సమాజ చలనం' గురించి స్వాధీన్ పట్టనాయక్, 'సాహిత్యం – సమాజం – కొమురం భీం నవల' పై అల్లం రాజయ్య, 'కోస్తాంధ్ర సామాజిక చరిత్రపై నవలా రచన' గురించి నల్లూరు రుక్మిణి ప్రసంగించారు.

వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన రెండో సమావేశంలో 'రవీంద్రనాథ్ ఠాగూర్ ఘరే బైరే' గురించి పంకజ్ దత్, 'సాహిత్యం – సామాజిక శాస్త్రాలు' పై పాణి, 'పరజ, సునాపుట్ ర లోకె – ఆదివాసి జీవన చిత్రణ' పై సరోజ్ మొహంతి, 'ఉత్తరాంధ్ర జీవితం –ఉత్తరాంధ్ర నవలలు' పై కె వి కూర్మనాథ్, 'కరీంనగర్ గ్రామాలలో సామాజిక మార్పులు – అల్లం రాజయ్య కథలు' పై యాటెల్లి రామచంద్రం, డి.వి రామకృష్ణారావు, 'సాహిత్యంలో సామాజిక చలనపు ప్రతిఫలనం – అవకాశాలూ అవరోధాలూ' పై ఎన్ వేణుగోపాల్ ప్రసంగించారు. అనాదృత మహిళల సాహిత్యం – సామాజిక మార్పు – మహిళా విమోచన' పై షోమా సేన్ పత్రాన్ని కవితా రావు వివరించారు. సదస్సులో వి. హనుమంతరావు, ప్రొ. జి. హరగోపాల్, ప్రొ. ఎస్. కె. రావు, కాకరాల, బి.ఎస్ రాజు, ఎ. నర్సింహారెడ్డి, ఎన్ సుధాకర శర్మ, ఎం రాఘవాచారి, బి. రామకృష్ణ, కె. ప్రభాకర్, కె. రవి చందర్, ఎ. ఉపేంద్ర, డప్పు రమేష్, వనమాల, పి. జ్యోతి, ఎ. కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వీ




❖ **సంచలనం** (కవితా సంకలనం) – అక్కెనపెల్లి దుర్గేశ్ – ముంబై తెలంగాణ రచయితల వేదిక – 52 పేజీలు, 1/8 డెమీ, రు. 40, ప్రతులకు: అష్టవినాయక చౌల్, చౌల్ నెం. 7, ఆర్.నెం. 2, కండోబ మందిర్ దగ్గర, గణేష్‌నగర్, డోంబివలి (వెస్ట్), థానె, మహారాష్ట్ర; సహచర బుక్‌మార్ట్; వీక్షణం పబ్లికేషన్స్



❖ **రజ్మియ్య** – తెలంగాణ ముస్లిం కవిత్వం – సంపాదకులు : స్కైబాబ – 'నసల్' కితాబ్ ఘర్, తెలంగాణ ముస్లిం రచయితల వేదిక ప్రచురణ – 144 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు: హాజీ బేగమ్, స్కైబాబ, కేశరాజుపల్లి గ్రా., నల్లగొండ – 508 002; స్కైబాబ, 10-1-639, చింతల్‌బస్తీ, ఖైరతాబాద్, హైదరాబాద్ – 500 004, సెల్ : 9985921379, 9885420027, 7799059494, email : skybaaba@gmail.com, skybaaba.blogspot.com, www.facebook.com/skybaaba;




❖ **అమరవీరుడు కామ్రేడ్ పేరేప మృత్యుంజయుడు** (5-10-1914 – 16-5-1950) శతజయంతి సంవత్సరం 1914–2014 – 16 పేజీలు, 1/8 డెమీ, ప్రతులకు: పి.పి.సి. జోషి, ప్లాట్ నెం. 122, సెక్టర్ – 2ఎ, అలకాపూర్ టౌన్‌షిప్, పుప్పాలగూడ, హైదరాబాద్ – 500 089. సెల్ : 93466 89306, email : joshippc@yahoo.co.in




❖ **పల్లెను మింగిన పెట్టుబడి**– గ్రామీణ ఆర్థికం – ఒక పరిశీలన – ఎస్.ఎ. విద్యాసాగర్ – పీకాక్ బుక్స్ – 414 పేజీలు, 1/8 డెమీ, పేపర్ బ్యాక్ రు. 250, హార్డ్‌బౌండ్ రు. 425, ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్



❖ **నవనీతం** – డా. నలిమెల భాస్కర్ సాహిత్యంపై విశ్లేషణ – సంపాదకులు : నగునూరి శేఖర్ – సాహితీ సోపతి ప్రచురణ – 184 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: నగునూరి శేఖర్, ఫ్లాట్ నెం. 24, ఇ.నెం. 1-3-117/10, సాయి జయంతి అపార్ట్‌మెంట్స్, పద్మశాలి స్ట్రీట్, కరీంనగర్ – 505001, సెల్ : 9985411275



❖ **మానవహక్కులు – 2013** – విలువల గీటురాయిగానే ముందుకు సాగుదాం – బులెటిన్ – 13, ఐదవ రాష్ట్ర మహాసభల సంచిక – మానవ హక్కుల వేదిక ప్రచురణ – 184 పేజీలు, 1/8 డెమీ, రు. 20, ప్రతులకు: ఎస్. జీవన్ కుమార్, 3-12-117/ఎ-2/బి, పి.ఎస్. కాలనీ, గణేష్‌నగర్, రామంతపూర్, హైదరాబాద్ – 500 013, ఫోన్ : 040 27039519



❖ **ది టెర్రిబుల్ కాస్ట్ ఆఫ్ ఆన్ ఇన్‌హ్యూమన్ కౌంటర్ ఇన్‌సర్జెన్సీ** – హ్యూమన్ రైట్స్ ఫోరమ్ – అక్టోబర్ 2013 – హ్యూమన్ రైట్స్ ఫోరమ్ ప్రచురణ – 70 పేజీలు, 1/4 క్రౌన్, రు. 20, ప్రతులకు: ఎస్. జీవన్ కుమార్, 3-12-117/ఎ-2/బి, పి.ఎస్. కాలనీ, గణేష్‌నగర్, రామంతపూర్, హైదరాబాద్ – 500 013, ఫోన్ : 040 27039519; వి.ఎస్. కృష్ణ, 54-11-59/2, గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ, విశాఖపట్నం – 530 022, ఫోన్ : 0891-2543817

మరసం వార్షికోత్సవ సభ

హైదరాబాదులోని తెలుగు విశ్వవిద్యాలయంలో అక్టోబర్ 27న మంజీర రచయితల సంఘం (మరసం) 27వ వార్షికోత్సవ సభ జరిగింది. ఈ సభలో పాల్గొన్న వక్తలు హైదరాబాదు అస్తిత్వం, సంస్కృతి, చరిత్రల గురించి మాట్లాడారు. ఈ సభలో ఆంధ్రజ్యోతి సంపాదకులు కె. శ్రీనివాస్, సామాజిక విశ్లేషకులు ఘంటా చక్రపాణి, సామాజిక వేత్త ప్రొ.హరగోపాల్, టిఎన్‌జిఒ అధ్యక్షులు దేవిప్రసాద్, తెలంగాణ పొలిటికల్ జెఎసి చైర్మన్ కోదండరాం, విరసం సభ్యులు వరవరరావు, మరసం సభ్యులు నందిని సిదారెడ్డి, కవులు దేవిప్రియ, శివారెడ్డిల తోపాటు సాహిత్య, సామాజిక రంగాల్లో పనిచేస్తున్న వారు పాల్గొన్నారు.

బస్సు ప్రమాదం

మహబూబ్‌నగర్ జిల్లా, పాలెం గ్రామ సమీపంలో బెంగుళూర్ నుంచి హైదరాబాద్ వచ్చే ప్రైవేట్ వోల్వో బస్సు అక్టోబర్ 30న కల్వర్టును ఢీకొని ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో బస్సుకు మంటలు అంటుకోవడంతో 45 మంది ప్రయాణికులు కాలి చనిపోయారు. మిగిలిన 7 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలైనాయి.

ప్రపంచ వ్యవసాయ సదస్సు

హైదరాబాదులోని మాదాపూర్‌లో ఉన్న హైటెక్స్‌లో 'ప్రపంచ వ్యవసాయ వేదిక', రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో నవంబర్ 4 నుంచి 7 వరకు 8వ 'ప్రపంచ వ్యవసాయ సదస్సు' జరిగింది. చిన్నకారు, సన్నకారు రైతులకు సుస్థిర భవిష్యత్తు కల్పించే లక్ష్యంతో ఈ సదస్సు జరిగింది. ఈ సదస్సులో వివిధ దేశాల వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతాంగ ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

సినీ నటుడు ఎవిఎస్ మృతి

ప్రముఖ సినీరంగ హస్యనటుడు ఆమంచి వెంకట సుబ్రమణ్యం (56) హైదరాబాదులోని గ్లోబల్ హాస్పిటల్‌లో కాలేయ, మూత్రపిండాల వ్యాధితో బాధపడుతూ నవంబర్ 8న చనిపోయారు. ఆయన 1957 జనవరి 2న గుంటూరు జిల్లా, తెనాలిలో జన్మించారు. ఆయన 500 పైగా చిత్రాల్లో నటించారు. స్క్రీన్‌ప్లే, గేయ రచయితగా, నటునిగా, దర్శకునిగా, నిర్మాతగా పనిచేశారు.

అమరుల కడుపు కోత సభ

హైదరాబాదులోని నిజాం కాలేజి గ్రౌండ్‌లో నవంబర్ 10న ఎంఆర్‌పిఎస్ (మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) ఆధ్వర్యంలో అమరుల కడుపు కోత సభ జరిగింది. తెలంగాణ కోసం అమరులైన కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, తెలంగాణ రాష్ట్ర బిల్లును పార్లమెంటులో ఆమోదించాలని ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఈ సభకు తెలంగాణ కోసం అమరులైన వారి తల్లిదండ్రులు, తెలంగాణ వాదులు హాజరయ్యారు.

అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలు

చిల్డ్రన్ ఫిలిం సొసైటీ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల ఆధ్వర్యంలో నవంబర్ 14 నుంచి 20 వరకు 18వ అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవాలు హైదరాబాదులోని నాంపల్లిలోని లలిత కళాతోరణంలో జరిగాయి. ఎర్నెస్ట్ సెల్‌స్టెన్ అనే ఫ్రాన్స్, కౌబాయ్, బ్రేకింగ్ సైలెన్స్, టమోటోచోర్, ఏ హార్స్ ఆన్ ది బాల్కనీ చిత్రాలకు బహుమతులు లభించాయి. ఈ చిత్రోత్సవాల ముగింపుకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర గవర్నర్ నరసింహన్, రాష్ట్ర సమాచార, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి డి.కె. అరుణ, సినీ హీరో పవన్ కళ్యాణ్‌తో పాటు దేశంలో వివిధ ప్రాంతాల నుంచి అనేక మంది హాజరయ్యారు.

ఆదివాసి, గిరిజన సభలు

ఆదివాసి స్వయంప్రతిపత్తి పాలన కోసం ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఆదివాసి విద్యార్థి సంఘాల జెఎసి ఆధ్వర్యంలో నవంబర్ 14న బహిరంగ సభ జరిగింది. ఈ సభలో వక్తలు ఆదివాసులకు స్వయంపాలన మండలిని ఏర్పాటుకు డిమాండ్ చేశారు. ఈ సభకు ఆదివాసి ప్రజా ప్రతినిధులూ, ఆదివాసి సంఘాల నాయకులూ, విద్యార్థులతో పాటు ఆదివాసులు హాజరయ్యారు. ఇదే ప్రాంగణంలో నవంబర్ 17న గిరిజన విద్యార్థి సంఘం (జివిఎస్) ఆధ్వర్యంలో 'ఆత్మగౌరవం – అభివృద్ధి' అనే నినాదంతో గిరిజన రణభేరి జరిగింది. స్వయంపాలన కోసం అన్ని తండాలనూ, గూడెంలనూ ప్రత్యేక గ్రామ పంచాయితీలుగా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సభలో టిఆర్ఎస్ జనరల్ సెక్రెటరీ కేశవరావు, మాజీ ఎంపి రవీంద్రనాయక్‌తో పాటు గిరిజన విద్యార్థులూ, గిరిజనులూ పాల్గొన్నారు.

కెవిపిఎస్ ధర్నా

సబ్‌ప్లాన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కుల వివక్ష పోరాట సమితి (కెవిపిఎస్) ఆధ్వర్యంలో నవంబర్ 18న హైదరాబాదులోని సంక్షేమ భవన్ ముందు ధర్నా చేశారు. దళిత, గిరిజన వాడల్లో మౌలిక సమస్యలను పరిష్కరించాలని, సంక్షేమ హాస్టల్లో తాగు నీరు, మరుగుదొడ్లను నిర్మించాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు.

బీడీ కార్మికుల ధర్నా

బీడీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆలిండియా బీడీ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నవంబర్ 19న రాష్ట్రంలో ఉన్న జిల్లా కలెక్టర్ల కార్యాలయం ముందు ధర్నా చేశారు. దేశంలోని కార్మికులందరికి కేంద్ర ప్రభుత్వం ఒకే రకమైన వేతనం నిర్ణయించి జివో నెం. 4ను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సినీ నిర్మాత వడ్డే రమేష్ మృతి

ప్రముఖ సినీ నిర్మాత, దర్శకులు వడ్డే రమేష్ (65) నవంబర్ 21న హైదరాబాదులోని కిమ్స్ హాస్పిటల్‌లో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ చనిపోయారు. ఆయన 1948 అక్టోబర్ 10న కృష్ణా జిల్లా యలమర్రులో జన్మించారు. ఆయన పాండవ వనవాసం, పాడవోయి భారతీయుడా, పందంటి కాపురం, బొబ్బిలి పులి, కలహాల కాపురం మొదలైన సినిమాలను నిర్మించారు.

హెలెన్ తుపాన్

హెలెన్ తుపాన్ వల్ల కోస్తా జిల్లాల్లో 15 మంది చనిపోయారు, అలాగే కృష్ణా, గుంటూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, శ్రీకాకుళం, జిల్లాల్లో 15 లక్షల ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. వేల ఎకరాల కొబ్బరి, అరటి, కూరగాయాలు మొదలైన తోటలు నీటి పాలయ్యాయి. వందలాంది ఇండ్లు కూలి పోయాయి. వీ

ప్రపంచ వ్యవసాయ సదస్సు ఎవరి కోసం?

ఆహార అభద్రతను సృష్టిస్తూ, కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించే విధంగా జరిగే వ్యవసాయ సదస్సులతో సామాన్య రైతులకు ఎటువంటి ప్రయోజనం లేదనీ, వారి సమస్యలకు పరిష్కారాలు లభించవనీ అంటున్నారు ఎ. నర్సింహారెడ్డి

హైద్రాబాద్‌లో హైటెక్స్‌లో నవంబర్ 4 నుంచి 7 వరకు 'ప్రపంచ వ్యవసాయ సదస్సు' జరిగింది. ఈ సదస్సును 'ప్రపంచ వ్యవసాయ వేదిక', రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి వివిధ దేశాల నుండి 130 మంది శాస్త్రవేత్తలు వస్తారని ప్రకటిస్తే 30 మంది మాత్రమే హాజరయ్యారు. ప్రభుత్వం ముందుగానే ఎంపిక చేసిన 50 మంది 'ఆదర్శ రైతు' ప్రతినిధులు పాల్గొన్నారు. అమెరికాలోని సెయింట్ లూయిస్ నగరం కేంద్రంగా పనిచేస్తున్న 'ప్రపంచ వ్యవసాయ వేదిక' 1997లో ప్రారంభమైంది. అప్పటి నుంచి ఈ 16 సంవత్సరాలలో 7 అంతర్జాతీయ సదస్సులు నిర్వహించింది. హైద్రాబాద్‌లో జరిగిన సదస్సు ఎనిమిదవది. వివిధ దేశాలకు చెందిన వ్యవసాయ విధానాల రూపకర్తలను, ప్రభుత్వ అధికారులను, పరిశోధనా సంస్థలను ఆహ్వానించి ఆధునిక వ్యవసాయ విధానాలపై ఈ సదస్సుల్లో చర్చలు జరిపారు. ఈ చర్చల సారాంశం గమనిస్తే బీటి విత్తనాలు, కార్పొరేట్ వ్యవసాయం దేశంలో అమలు పరచడానికి సన్నాహక సదస్సుగా తెలుస్తోంది.

1997లో అమెరికా సోయాబీన్ అసోసియేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి చొరవతో 'ప్రపంచ వ్యవసాయ వేదిక' ఏర్పడింది. అంతర్జాతీయంగా వ్యవసాయ విధానాలను రూపొందించి రైతులను ప్రభావితం చేసేందుకు ప్రపంచంలోని అతి పెద్ద వ్యవసాయ వాణిజ్య బహుళజాతి సంస్థలు, కూటములు ఈ వేదికలో సభ్యులుగా ఉన్నారు. ఈ ప్రపంచ వ్యవసాయ వేదిక బోర్డు మెంబర్లలో చాలామంది మోన్‌శాంటో, నోవస్ ఇంటర్నేషనల్, బిఎఎస్ఎఫ్ అనే రసాయనాల సంస్థ వంటి బహుళజాతి కంపెనీలలో ఉన్నత స్థానాలలో ఉన్నవారే. 2013 సదస్సు నిర్వహణ కోసం కెల్లాగ్ ఫౌండేషన్, మోన్‌శాంటో, నెస్లే, టైసన్ ఫుడ్స్, బోల్‌గార్డ్ బిఎఎస్ఎఫ్, గేట్స్ ఫౌండేషన్, డి-1 ఆయిల్స్, ప్రపంచ బ్యాంకు, యుఎఫ్‌పిఆర్ఐ వంటి కార్పొరేట్ విత్తన, రసాయన, క్రిమిసంహారక సంస్థలు ఈ వేదికకు ఆర్థిక సహాయాన్ని అందించాయి. వివిధ దేశాల ప్రభుత్వ వ్యవసాయ విధానాలను రూపొందించే వారిని ప్రభావితం చేసి, తమ వ్యాపార ప్రయోజనాలకు అనుగుణంగా ఆ దేశాల వ్యవసాయాన్ని సంస్కరించడానికి ఉద్దేశించిన సంస్థ ఇది.

కార్యాచరణలేని ప్రతిపాదనలు

ప్రపంచ వ్యవసాయ వేదిక నిర్వహిస్తున్న సదస్సుల అసలు నైజం ఏమిటి? వ్యవసాయం రైతుల పాలిట గుదిబండగా, ఉరితాడుగా మారిన నేపథ్యంలో దేశ, విదేశాల్లో క్షేత్రస్థాయి వ్యవసాయ అనుభవాలను మదించి వినూత్న విధానాలను రూపొందిస్తున్నామంటున్నారు. అయితే చిన్న రైతులకు సుస్థిర భవిష్యత్తును అందించే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ సదస్సుకు ఆచరణాత్మకత కొరవడిందని పలువురు వ్యవసాయ నిపుణులు, వ్యవసాయ సంఘాలు విమర్శిస్తున్నాయి. సదస్సులో పాల్గొనే ప్రతినిధులకు ప్రవేశ రుసుము రు.5600 లుగా నిర్ణయించడంపై రైతు సంఘాలు తీవ్రంగా ఆక్షేపించాయి. లాంచనంగా జరిగే ఇలాంటి అంతర్జాతీయ సదస్సులు చేసే తీర్మానాలు, సిఫార్సులు ఆచరణయోగ్యం కాకపోవడం విదితమే. ఆయా దేశాల పరిస్థితులను బట్టి సదస్సు ప్రధాన చర్చాంశాన్ని నిర్ణయించినప్పటికీ, అగ్రి బిజినెస్ కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలే లక్ష్యంగా విధానాలు, తీర్మానాల రూపకల్పన జరిగింది. ఆహార భద్రత పేరుతో జన్యుమార్పిడి పంటల లాబీ గ్రూప్ (ఎబిఎల్ఇ), విత్తన కంపెనీల లాబీ గ్రూప్ (ఎన్ఎస్ఎఐ), భారత వ్యవసాయ శాఖలు సంయుక్తంగా గతంలో ఢిల్లీలో నిర్వహించిన సమావేశాలు వివాదాస్పదమైనప్పటికీ ప్రభుత్వం కార్పొరేట్ లాబీతో కలిసి ప్రపంచ వ్యవసాయ సదస్సును మన దేశంలో నిర్వహించడం ఇదే ప్రథమం.

ఈ సదస్సులో ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి ప్రారంభ ఉపన్యాసం చేస్తూ విద్యావంతులైన యువత వ్యవసాయాన్ని వృత్తిగా స్వీకరించాలని, దేశానికి వ్యవసాయమే జీవనాధారమని, దానిపై ఆసక్తి తగ్గడం బాధాకరమని వ్యాఖ్యానించారు. వ్యవసాయ రంగం ఎన్నో సమస్యలను ఎదుర్కొంటోందని, వాటికి పరిష్కారాలు కనుగొని రైతులకు లాభసాటిగా మార్చాలని, ఇందుకోసం విస్తృత పరిశోధనలు జరగాలని, స్థిరమైన ఆదాయం లేకపోవడంవల్లే యువత వ్యవసాయాన్ని చేపట్టేందుకు ముందుకురావడం లేదన్నారు. అందుకు కారణం ఇంతకాలం తాము అనుసరించిన విధానాలేనని గుర్తించకపోవడం ఆత్మవంచనే. వ్యవసాయానికి పునర్వైభవ దశ రావాలని రాష్ట్ర వ్యవసాయ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ ఆకాంక్షించారు. సంస్థలు, ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు ఇందుకోసం కృషి జరపాలని కోరారు. కేంద్ర వ్యవసాయశాఖ సహాయ మంత్రి తారిఖ్ అన్వర్ ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల కంపెనీలు రైతుల పట్ల ఉదారంగా వ్యవహరించాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తులకు తగిన గిట్టుబాటు కల్పించడం ద్వారా రైతుకు అదనపు ఆదాయం లభించేలా కృషి చేయాల్సి ఉందంటూనే జన్యుమార్పిడి విత్తనాలపై శాస్త్రీయ దృక్పథం అవసరమని, గుడ్డిగా వ్యతిరేకించవద్దని పేర్కొన్నారు. నిజానికి ఇప్పటివరకు చిన్న, సన్నకారు రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వాలు రూపొందించిన విధానాలు సత్ఫలితాలు యివ్వలేదు. పాలకులు బహుళజాతి సంస్థల మార్కెట్ మాయాజాలం బారిన పడి రైతులకు అన్యాయం చేస్తున్నారు.

ప్రపంచ వ్యవసాయ సదస్సు చైర్మన్ కెన్నెత్ బేకర్ భవిష్యత్తులో వ్యవసాయ రంగంలో చిన్న రైతుల పాత్రే కీలకమని తెలిపారు. 2030 నాటికి భారత జనాభా చైనాను అధిగమించనుందని అన్నారు. సహజ వనరుల వినియోగం విచ్చలవిడిగా సాగుతోందని, భూగర్భ జలాలు

అడుగంటి పోతున్నాయని, నదులు, కాలువల కింద సేద్యం తగ్గిపోతోందన్నారు. ఆహార ధరలు కలవరం కలిగిస్తున్నందున, అధిక దిగుబడి కోసం వ్యవసాయ ఉత్పత్తులను గణనీయంగా పెంచుకోవడంలో బయోటెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. డబ్ల్యుఎఫ్ సలహా సంఘం అధ్యక్షులు, న్యూజిలాండ్ మాజీ ప్రధాని జెమ్స్ బోల్గర్ పెరుగుతున్న జనాభా, ప్రతికూల వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతోనే వ్యవసాయంలో సవాళ్లను అధిగమించగలమని పేర్కొన్నారు. వీళ్ల దృష్టిలో అధికోత్పత్తికి జన్యు మార్పు పంటలు తప్ప మరో ప్రత్యామ్నాయం లేదన్నది కీలక వాదన.

అభివృద్ధి చెందిన దేశాలకు సంబంధించిన స్వచ్ఛంద సంస్థల కూటమి (డబ్ల్యుఎఫ్) వ్యాపార ధోరణితో నిర్వహించే ఇలాంటి సదస్సులలో మన దేశ చిన్న, సన్నకారు రైతుల ప్రయోజనాలేమి ఉండవు. ప్రపంచ వ్యవసాయంలో భారత వ్యవసాయమే పెద్ద మార్కెట్. ఇక్కడి రైతులే బహుళజాతి కంపెనీలకిప్పుడు అత్యంత కీలకమైన వినియోగ దారులు. వీరిని ఆకట్టుకునేందుకు ప్రపంచ కార్పొరేటు కంపెనీలన్నీ సర్కారు సహకారంతో ఈ సదస్సును పక్కాగా వినియోగించుకునేందుకు సమాయత్తమయ్యాయి. భారత రైతులు పొటాష్ వినియోగం తగ్గించారు. ప్రభుత్వం రైతులకిచ్చే రాయితీలు తగ్గించడమే ఇందుకు కారణమని కెనడా కంపెనీ ఆవేదన వ్యక్తం చేసింది. అంతర్జాతీయ ఎరువుల మార్కెట్‌లో కెనడాకు చెందిన పొటాష్ కార్పొరేషన్ స్థూల ఆదాయం ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లోనే 55.4 కోట్ల డాలర్లనుంచి 22.8 కోట్ల డాలర్లకు తగ్గిందని తాజా నివేదికలో వెల్లడించింది. అంతర్జాతీయ వ్యవసాయరంగ వ్యాపార సంస్థలకు భారత రైతులెంత కీలకమో చెప్పడానికి ఇది చిన్న ఉదాహరణ మాత్రమే. ఇక్కడి పొలాల్లో పొటాష్ వేయడం తగ్గిస్తే ఎక్కడో విదేశాల్లో ఉన్న కంపెనీలు నష్టాల సంద్రంలో మునుగుతాయి. ఒక్క ఎరువులు, విత్తనాల విషయంలోనే కాదు, వ్యవసాయ యంత్రాలు మొదలుకుని బియ్యం వ్యాపారందాకా అన్నింటికీ ఇప్పుడు భారత రైతాంగమే అత్యంత కీలకంగా మారింది.

వ్యవసాయ రంగంలో మూడవ వంతు మంది నష్టాలకు గురవుతున్న తరుణంలో ప్రపంచం ఎదుర్కొనే ఆహార సంక్షోభం నుంచి బయట పడాలంటే 1960ల్లో వచ్చిన హరిత విప్లవం మాదిరిగానే రెండో హరిత విప్లవాన్ని చేపట్టాల్సిన అవసరం ఉందని బేయర్ క్రాప్‌సైన్స్ సిఇఓ లియాం కాండన్ అన్నారు. ప్రపంచ వ్యవసాయ సదస్సులో '10 బిలియన్ల ప్రజలకు ఆహార సమస్య – నూతన వ్యవసాయక విప్లవం' అన్న అంశంపై ఆయన కీలకోపన్యాసం చేశారు. 2050 కల్లా ప్రపంచ జనాభా 1000 కోట్లకు చేరనుందని, ఇంత మందికి ఆహార భద్రత కలిగించాలంటే వ్యవసాయ రంగంలో నిరంతర అభివృద్ధి ద్వారానే ఇది సాధ్యమవు తుందన్నారు. వ్యవసాయం పట్ల పర్యావరణ కాలుష్యాన్ని తగ్గిస్తూనే, నిరంతర, సుస్థిర అభివృద్ధిని సాధించాలన్నారు. అందుకు తృణ ధాన్యాల సాగును ప్రోత్సహించడానికి, నూతన వ్యవసాయిక విప్లవాన్ని సాధించడానికి కృషి చేయాలన్నారు.

దేశంలో పెరుగుతున్న జనాభా అవసరాలకు సరిపడా ఆహారోత్పత్తులను పెంచాల్సిన అవసరం ఉందని భారతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐఎఆర్ఐ) మాజీ సంచాలకులు డాక్టర్ ఆర్.బి.సింగ్ సూచించారు. 2051 నాటికి భారతదేశంలోని పట్టణాలు, నగరాల్లో జనాభా 52 శాతానికి పెరిగినా, గ్రామీణ ప్రాంతాల్లో 48 శాతం మంది ఉంటారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే 75 కోట్ల (48 శాతం) మందిలో దాదాపు 40 కోట్ల మంది రైతాంగానికి చెందినవారేనని చెప్పారు. జనాభా పెరుగుదలకు సరిపడా ఆహారోత్పత్తులు అందించే విధంగా గ్రామీణ రైతాంగానికి చేయూతనివ్వాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. అందుకు గాను ఐదు ఎకరాల్లోపు ఉన్న రైతులకు కొత్త విధానాల్లో వ్యవసాయం చేయడం నేర్పించాలి. చౌడు భూములుగా మారిన వేలాది ఎకరాలను తిరిగి సాగులోకి తీసుకురావాలి. కర్బన ఉద్గారాలను తగ్గించి నీటి యాజమాన్య పద్ధతులు ఆచరణలోకి తీసుకురావాలి. అధిక దిగుబడిని ఇచ్చే వంగడాలను రైతులకు అందుబాటులోకి తీసుకువెళ్లాలి. సౌరశక్తి పంపులకు రాయితీలు ఇవ్వడం ద్వారా విద్యుత్తు వాడకంపై భారం తగ్గించాలి. భవన నిర్మాణాల్లో పచ్చదనం పెంచాలి. పెరటి తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలి. రైతులు పండించిన పంటలకు మార్కెటింగ్ సదుపాయాలు మెరుగు పరచాలన్నారు.

రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలు

మన దేశంలో వ్యవసాయ పరిశోధన రంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలిచ్చే ఆర్థిక సాయం ఎటూచాలక భారత పరిశోధన సంస్థలు ప్రైవేటు రంగంతో పోటీపడలేక వెలవెలబోతున్నాయి. పరిశోధన ఫలాల ద్వారా ప్రైవేటు సంస్థల నుంచి నిధులు రాబట్టుకోవడంలోనూ ఇక్కడి పరిశోధన సంస్థలు ఘోరంగా విఫలమవుతున్నాయి. ప్రస్తుత పంచవర్ష ప్రణాళికలో వ్యవసాయ పరిశోధన రంగానికి రూ. యాభై వేల కోట్లు కావాలని 'భారత వ్యవసాయ పరిశోధన మండలి' (ఐసిఎఆర్) కేంద్రానికి నివేదిస్తే అందులో సగానికి సగం కోత పెట్టి ప్రణాళికను ఆమోదించింది. దేశంలో ఉన్న 96 కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ పరిశోధన సంస్థలు, మరో 56 రాష్ట్రాల వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో దాదాపు పాతికవేల మంది శాస్త్రవేత్తలున్నారు. వీరికి జీతభత్యాలు, ఇతర మౌలిక సదుపాయాలకు వెచ్చించే మొత్తాలను పక్కనపెడితే, అంతిమంగా పరిశోధనలకు మిగిలేది చాలా తక్కువ. ఇలా ఆర్థిక ఇబ్బందుల నుంచి సంస్థలను ఆదుకోకపోవడం ఒక సమస్యయితే, వాటిలో పనిచేసే శాస్త్రవేత్తల్లో నిజాయితీ, చిత్తశుద్ధి లోపించడం మరో పెద్ద సమస్య. ప్రభుత్వ రంగంలోని పరిశోధన లోపాలే ప్రైవేటు కంపెనీలకు వరంగా మారుతున్నాయి.

మన దేశ వ్యవసాయరంగంలో చిన్న, సన్నకారు రైతుల వాటా దాదాపు 80శాతం. ప్రభుత్వ విధానాలు, గిట్టుబాటుధర ఇవ్వని మార్కెట్ ఆర్థిక వ్యవస్థ మాయాజాలం, ప్రకృతి వైపరీత్యాలు వగైరా కారణంగా వ్యవసాయరంగం తీవ్రమైన సంక్షోభంలో ఉంది. అప్పుల భారం, అవమానాలు భరించలేక ఏటా వేలసంఖ్యలో చిన్న, సన్నకారు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో రైతులను సొంత భూమి నుండి తొలగించే కార్పొరేట్ వ్యవసాయం లక్ష్యంగా ప్రభుత్వాలు, వ్యవసాయోత్పత్తుల రిటైల్ వ్యాపారంలోకి దిగిన బడా పెట్టుబడిదారులు కాంట్రాక్టు వ్యవసాయ భావనను రైతుల బుర్రల్లోకి ఎక్కించే పనిలో ఉన్నారు. రెండు మూడు ఎకరాలతో కూడిన చిన్న కమతాలు (అది కూడా ఏకఖండంగా ఉండదు) ఆధునిక యంత్రాలు ఉపయోగించి వ్యవసాయం చేయడం సాధ్యం కాదని, వ్యవసాయాన్ని గిట్టుబాటుగా మార్చుకోవాలంటే కాంట్రాక్టు లేదా సహకార వ్యవసాయానికి సంసిద్ధులు కావాలని నిస్సిగ్గుగా బోధిస్తున్నారు.

బిటి పత్తి విత్తనాలను భారత రైతులకు అమ్మడం ద్వారా అమెరికాకు

చెందిన 'మోన్‌శాంటో' కంపెనీ గడచిన పుష్కరకాలంలో రాయల్టీ పేరుతో రెండువేల కోట్ల రూపాయల వరకూ ఆదాయాన్ని పట్టుకుపోయింది. ఇదే కాలంలో భారత జాతీయ పత్తి పరిశోధన సంస్థకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సొమ్ము కేవలం రు. 30 కోట్లలోపే. అదే కాలవ్యవధిలో పత్తిపై పరిశోధనలకు మోన్‌శాంటో కంపెనీ వెచ్చించిన సొమ్ము దీనికి పది రెట్లు. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే రైతులు ఏటా పత్తి విత్తన ప్యాకెట్లను కొనడానికి రు. వెయ్యి కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నారు. దీన్ని బట్టి అన్ని రకాల పంటల విత్తన వ్యాపారం ఏ స్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చు. మోన్‌శాంటోతో పాటు పలు ఇతర బహుళజాతి విత్తన కంపెనీలు మొక్కజొన్న, జొన్న, కూరగాయల సంకరజాతి విత్తనాల ధరలను ఇష్టానుసారం ఏటేటా పెంచుతూ బక్కరైతుల జేబులు కొల్లగొడుతున్నాయి. కిలో టమాటా విత్తనాలు కొనాలంటే కంపెనీ బ్రాండును బట్టి రు. 40 వేల నుంచి రు. 70వేల దాకా రైతులు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఈ కంపెనీల కూరగాయ విత్తనాల విక్రయాలకు లైసెన్సులివ్వడం మొదలుకొని వాటి విక్రయంలో రాయితీల దాకా అంతా లంచాల రాజ్యమే నడుస్తోంది.

'రైతుల సంక్షేమమే మా ధ్యేయం' అంటూ పాలకులు చేసుకుంటున్న ప్రచారం ఎంత బూటకమైనదో బూజుపట్టిన విత్తన చట్టాలను చూస్తే తెలుస్తుంది. ఆరేళ్లుగా కొత్త విత్తన చట్టాన్ని పార్లమెంటు ఆమోదించకుండా విత్తన కంపెనీల లాబీయింగు అడ్డుకుంటోంది. ఈ ఖరీఫ్ (జూన్) నుంచే కొత్త విత్తన చట్టం తెచ్చి కంపెనీలకు ముక్కుతాడు వేస్తామని రాష్ట్రప్రభుత్వం ఆర్నెల్లక్రితం బీరాలు పలికింది. ఖరీఫ్ అయిపోయి, రబీ మొదలై నెల గడిచింది. అయినా ఆ చట్టం ముసాయిదా ఎక్కడుందో ప్రభుత్వమే మర్చిపోయింది. రాష్ట్ర స్థాయిలో చట్టం ఎందుకంటూ ఢిల్లీ నుంచి విత్తన కంపెనీల లాబీ చేయించిన పైరవీతో అది కాస్త అటకెక్కింది. ప్రభుత్వ దివాళకోరు విధానాలను ఆసరా చేసుకుని విదేశీ కంపెనీలు మన దేశంలోకొచ్చి పెత్తనం చెలాయిస్తున్నాయి. రైతులకు రక్షణ కల్పించే చట్టాలను కంపెనీలు ఉల్లంఘిస్తున్నాయి. నాసిరకం విత్తనాలు సరఫరా చేస్తున్న కంపెనీలు నష్టపోయిన రైతులకు పరిహారం కూడా చెల్లించడం లేదు. నాసిరకం విత్తనాలు, ఎరువులు, పురుగు మందులతో రైతులను మోసం, దగా, దోపిడీ చేస్తున్నవి.

భారత్‌లో గడచిన పదేళ్లలో విపరీతంగా పెరిగిన బిటి పత్తి సాగు విస్తీర్ణాన్ని ఇప్పుడు ప్రపంచమంతా చాటుతూ ఆహార పంటల్లోనూ జన్యుమార్పిడి విత్తనాలు ప్రవేశపెట్టాలని విదేశీ కంపెనీలు తహతహలాడుతున్నాయి. పత్తి సాగు విస్తీర్ణాన్నే చాటుతున్న కంపెనీలు సగటు దిగుబడి ఎకరానికి ఆరేడు క్వింటాళ్లను సైతం మించడంలేదన్న వాస్తవాన్ని దాచిపెడుతున్నాయి. బిటి పత్తి సాగు తరవాతే రైతుల ఆత్మహత్యలు పెరిగాయన్న సంగతినీ చెప్పడం లేదు. మొక్కజొన్న, కంది, సోయాచిక్కుడు, వరి తదితర ఆహార పంటల్లో జన్యుమార్పిడి విత్తనాలు తెస్తే విత్తన వ్యాపారాన్ని లక్షల కోట్ల రూపాయలకు పెంచుకోవచ్చని కంపెనీల ప్రధాన వ్యూహం. విత్తన రంగంలో గత పదేళ్లలో వచ్చిన పరిణామాలను పరిశీలిస్తే విత్తనాల తయారీలో బహుళజాతి సంస్థలు గుత్తాధిపత్యం సాధించాయి. అధిక దిగుబడి వంగడాలతో రైతాంగాన్ని పారిశ్రామిక రంగానికి కట్టివేసిన గుత్తాధిపత్య కంపెనీలు యిప్పుడు జన్యుమార్పిడి విత్తనాలతో రైతాంగాన్ని, వ్యవసాయాన్ని సామ్రాజ్యవాద దోపిడీకి పంటభూమిగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నాయి.

సన్న, చిన్నకారు రైతులే 80 శాతం వరకూ ఉన్న భారత వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలంటే ఇక్కడి అవసరాలకు వాతావరణానికి తగ్గట్టుగా పరిశోధనలు జరగాలి. ఇక్కడ ధాన్యం అధిక దిగుబడి పెరగాలంటే ఇక్కడి వాతావరణంలో అధికంగా పండే దేశవాళీ హైబ్రిడ్ రకాల వంగడాలను తేవాలి. ఎన్నో ఏళ్లుగా ఈ విషయం కాగితాల్లోనే తప్ప కార్యరూపం దాల్చకపోవడం ప్రభుత్వ వైఫల్యమే!

మన దేశంలో ఆహార భద్రతకు ఎదురవుతున్న పెనుసవాళ్లు సాగునీటి, నిధుల సమస్య. వ్యవసాయ భూమిలో సగానికి కూడా సాగునీటి సౌకర్యం లేదు. బిందు, తుంపర్ల సేద్యంలో వస్తున్న ఆధునాతన పరిజ్ఞానాన్ని ఇక్కడి రైతులకు చేర్చేందుకు నిధుల కొరత, పాలన లోపాలు విధానాల్లో అవరోధంగా ఉన్నాయి. వాటిని అధిగమిస్తే సాగు నీటి సమస్యలు చాలా వరకూ తగ్గే అవకాశముంది. మన రాష్ట్ర వ్యవసాయ భూముల్లో సగానికి పైగా వర్షాభావ ప్రాంతాల్లోనే ఉన్నాయి. ఇక్రిశాట్ లాంటి ప్రపంచ స్థాయి సంస్థలు సైతం రాష్ట్రంలోనే ఉన్నా, ఈ భూముల్లో తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించే విధానాలు, విత్తనాలు ఇంకా పేద రైతుల దరిచేరలేదు. ఇలాంటి అనేక సవాళ్లకు ప్రపంచ వ్యవసాయ రంగ మేధావులు సరైన, స్పష్టమైన సమాధానాలివ్వటం లేదు. ప్రపంచ వ్యవసాయ సదస్సుకు మన దేశ చిన్న రైతుల ఎజెండా లేదు. ఈ సదస్సు వల్ల కంపెనీలకే ప్రయోజనం తప్ప రైతులకు ఒరిగేది శూన్యం.

ఆహార భద్రతకు జన్యు మార్పిడి పంటలే శరణ్యమా?

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ప్రపంచ వ్యవసాయ సదస్సు కేవలం బహుళజాతి సంస్థల ప్రచారానికే పరిమితమైంది తప్ప రైతుల సమస్యల పరిష్కారానికి ఎందుకూ ఉపయోగపడలేదు. అది రైతుల కోసం పెట్టిన సదస్సే కాదని, బహుళజాతి కంపెనీలు, ప్రభుత్వం కలిసి ఏర్పాటు చేసుకున్న సమావేశం అని రైతులు మండిపడుతున్నారు. రైతులకు ప్రవేశమే లేని సదస్సు రైతు సదస్సు ఎలా అవుతుందని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం రాష్ట్రం మొత్తం మీద 50 మంది ఆదర్శ రైతులను గుర్తించి సదస్సుకు తీసుకొచ్చింది. సదస్సుకు హాజరైన ఆదర్శ రైతుల్లోనూ గుంటూరు జిల్లా వారే ఎక్కువగా ఉన్నారు. పత్తి విత్తనాల ధర తగ్గించమన్నందుకు ఏకంగా రాష్ట్ర ప్రభుత్వంపైనే కోర్టుకెక్కిన మోన్‌శాంటో లాంటి బహుళజాతి కంపెనీలతో కలిసి సదస్సులు నిర్వహించడమేమిటని రైతు సంఘాల నేతలు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతుల పేరుతో నిర్వహించిన ఈ సదస్సుకు వ్యవసాయ, మార్కెటింగ్, ఉద్యాన శాఖ, ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం లక్షల రూపాయలు ఖర్చు చేశాయి.

చిన్న కమతాల స్థానంలో అతి పెద్ద వ్యవసాయ కమతాలు–కార్పొరేట్ వ్యవసాయాన్ని రైతాంగం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా బలీయంగా రైతులపై రుద్దడానికి జరుగుతున్న ప్రయత్నాల్లో భాగమే ఈ సదస్సు. జన్యు మార్పిడి పంటలను రైతులు, కోర్టులు, పార్లమెంటరీ స్థాయి కమిటీలు, విజ్ఞులైన వ్యవసాయ నిపుణులు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నా ఖాతరు చేయకుండా ఈ పంటలను బలవంతంగా కొనసాగించడానికి ఈ తరహా సదస్సుల ద్వారా ప్రభావితం చేయడానికి కార్పొరేట్ కంపెనీలు తమ ప్రయత్నాలను కొనసాగిస్తూనే ఉన్నాయి.

ఆహారోత్పత్తిని వృద్ధిచేసే పేరుతో జన్యుమార్పిడి పంటల లాబీ మన దేశంలో పెద్ద ఎత్తున ప్రచారం చేయడం ఒక వైపు జరుగుతుండగా, మరోవైపు జన్యుమార్పిడి విత్తనాల వల్ల భూసారం హరించుకుపోతుందని, కాలక్రమంలో చీడపీడల్ని అరికట్టటం సాధ్యం కాదని, బహుళజాతి

కార్పొరేట్ల ధనదాహానికి మన వ్యవసాయాన్ని బలిచేయవద్దని అంతే తీవ్రస్థాయిలో మన వ్యవసాయ, సామాజిక శాస్త్రవేత్తలు ప్రచారం చేయడం జరుగుతున్నది. అయినా, జన్యు మార్పిడి పంటల అండ లేకపోతే దేశానికి ఆహారభద్రత అసాధ్యమని హైదరాబాద్‌లో జరుగుతున్న ప్రపంచ వ్యవసాయ సదస్సులో బహుళజాతి కంపెనీలు ఊదరగొట్టాయి. వాస్తవానికి అపార జీవవైవిధ్యం, మానవ వనరులు, సాగు భూములు, జలసంపద ఉన్న భారతదేశానికి జన్యు మార్పిడి పంటల అవసరమే లేదని అనేక కమిటీలు తేల్చిచెప్పాయి. దేశంలోని ఆహార వ్యవస్థలు, సాగు వ్యవస్థలకు జన్యుమార్పిడి పంటలు విఘాతం కలిగిస్తాయి. తద్వారా గ్రామీణ జీవనోపాధి మార్గాలను దెబ్బతీస్తాయని పార్లమెంటరీ స్థాయీ సంఘం తెలిపింది. కచ్చితంగా అవసరమైన ఏ పంటలోనైనా ప్రత్యామ్నాయాలు లేవని నిపుణులు నిర్ధారించిన తరవాతే జన్యు మార్పిడి అవకాశాలు చూడాలని 'అగ్రిబయోటెక్ టాస్క్‌ఫోర్స్' ప్రభుత్వానికి నివేదించింది. ఈ నివేదికల సారాంశాన్ని బట్టి ప్రస్తుతం దేశంలో ఆహార పంటల్లో జన్యుమార్పిడి అవసరం లేదన్న సంగతి అవగతమవుతుంది.

2007లో పర్యావరణ, అడవుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో బిటి వంగపై నియమించిన నిపుణుల కమిటీ అనేక వాస్తవాలను వెలుగులోకి తెచ్చింది. లోపాలను ఎత్తి చూపింది. అవి 1) బిటి జన్యువు లక్షణాలను జన్యుమార్పిడి మొక్కల్లో బహిర్గతపరచే 'ప్రమోటర్ జన్యువు' కొన్ని రకాల మానవ కణాల్లోని జన్యువులతో కలుస్తుంది. 2) బిటి వంగ అభివృద్ధిలో వాడే 'స్ట్రెప్టోమైసిన్ నిరోధక జన్యువు' మానవ, జంతు అవయవాలకు హాని కలిగిస్తుందని నిపుణుల కమిటీ గుర్తించింది. 3) బిటి వంగ రూపకల్పనలో వాడిన 'అగ్రోబాక్టీరియం ట్యూమిఫేషియన్స్' అనే బాక్టీరియావల్ల అమెరికాలోని ప్రతి పంటలో ఎండు తెగులు తీవ్రత పెరిగిన రుజువులు ఉన్నాయి. 4) జన్యుమార్పిడి పంటల్లో వాడే 'యాంటీబయాటిక్ రెసిస్టెంట్ మార్కర్ జీన్' సాధారణ బాక్టీరియాలోకి చేరి ప్రమాదకర బాక్టీరియాగా మారుతుంది. దేశంలో అనేక వ్యాధుల చికిత్సలో ఈ యాంటీ బయాటిక్స్ వాడుతున్నారు. బిటి వంగ విరివిగా వాడటంవల్ల ఆయా బాక్టీరియాల్లో యాంటీ బయాటిక్ నిరోధకత ఏర్పడితే, ఇక అవి మానవుల వ్యాధుల చికిత్సకు పనికిరావు. అందుకే జీన్ క్యాంపైన్ సంస్థకు చెందిన సుమన్ సహాయ్ 'జన్యుమార్పిడి పంటల ద్వారా దేశంలో సృష్టించబడే సంక్షోభం 'అణుశక్తి' ద్వారా సంభవించే ముప్పుతో సమానమైంది' అన్నారు.

ఈ జన్యుమార్పిడి పంటల వలన రైతులు అధిక ధరలతో విత్తనాలు కొనుగోలు చేయాల్సి వస్తుందనీ, క్రమేపీ సాంప్రదాయ విత్తనాలు కనుమరుగై బి.టి విత్తనాలే మిగులుతాయనీ, ఇకపై ఏ కూరగాయ మొక్కలు పండించాలన్నా రైతులు ఈ కంపెనీలకు రాయల్టీలు చెల్లించాల్సి వస్తుందనీ, పర్యవసానంగా విత్తన సరఫరాలో ప్రభుత్వ అజమాయిషీ అంతరించి, విత్తన కంపెనీల యిష్టారాజ్యంగా మారుతుందనీ, విఫలమైన తమ బి.టి. పంటలను రైతులు వేయడానికి ఈ కంపెనీలు ఎక్కువ ధర విత్తనాలు, ఎక్కువ ఎరువులూ వాడాలని ప్రోత్సహిస్తున్నాయనీ, ఒకసారి బి.టి. పంట వేస్తే ఆ తర్వాత వేసే పంటపై దుష్ప్రభావం ఉంటుందనీ తెలియచేస్తూ శాస్త్రవేత్తలు ఈ పంటలను వ్యతిరేకిస్తున్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు సాంకేతికతను పరిష్కారంగా చూపిస్తున్న కంపెనీలు ఈ సాంకేతికతవల్ల తలెత్తే సమస్యలు, అనర్థాలకు పరిష్కారం చూపించడం లేదనీ, సమస్యలను పట్టించుకోవట్లేదనీ శాస్త్రవేత్తలు వాదిస్తున్నారు. నిజాలు బయటపడకుండా వ్యవసాయ శాస్త్రవేత్తలపై కూడా తీవ్రమయిన ఒత్తిడి వస్తోందని వీరు ఆరోపిస్తున్నారు.

'పర్యావరణ భద్రత, రైతు కుటుంబాల సంక్షేమం, సాగు వ్యవస్థల ఆర్థిక సుస్థిరత, వినియోగదారుల ఆరోగ్య భద్రత, పోషక భద్రత, విదేశీ వాణిజ్యం పెంపుదల, దేశీయ జీవభద్రతలను దృష్టిలో ఉంచుకుని జన్యు మార్పిడి ఆహార పంటల అభివృద్ధి, పరిశీలన, క్షేత్రస్థాయి వాణిజ్య విధులను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరాదు, ఇదే అభిప్రాయాన్ని దశాబ్దం క్రితమే డాక్టర్ స్వామినాథన్ నేతృత్వంలోని కమిటీ ప్రభుత్వానికి నివేదించింది. జన్యుమార్పిడి పంటలకు సంబంధించి ఇటీవలే సుప్రీంకోర్టు నియమించిన సాంకేతిక నిపుణుల కమిటీ సైతం బలహీనమైన జీవ సాంకేతిక నియంత్రణ వ్యవస్థ ఉన్న మన దేశంలో జన్యుమార్పిడి ఆహార పంటల సాగును అనుమతించాల్సిన అవసరం లేదంది. దేశ వ్యవసాయ భవిష్యత్తు అంధకారం కారాదంటే, బహుళజాతి విత్తన సంస్థల మానస పుత్రికలైన జన్యుమార్పిడి ఆహార పంటల అన్ని రకాల పరీక్షలను నిషేధించాలి. సుప్రీంకోర్టు తీర్పు అమలును పటిష్టంగా అమలుపరచాలి. అప్పుడే – ప్రపంచంలోనే అత్యంత అరుదైన వ్యవసాయ వైవిధ్యం, విశిష్టతలు కల్గిన భారతదేశాన్ని భావితరాలకు అందించగలం.

వ్యవసాయ రంగ సంక్షోభానికి పరిష్కారంగా ఆధునిక విధానాల్లో వ్యవసాయం చేయడం, చిన్న సన్నకారు రైతులకు చేయూతనివ్వడం, సాంకేతికతతో కూడిన పనిముట్లు వాడడం, ఆహారోత్పత్తులలో పోషక విలువలను పెంచడం, వివిధ సంస్థల మధ్య భాగస్వామ్యం పెంచడం అనే ఐదు సిఫార్సులను ఈ సదస్సుల్లో నిపుణులు ప్రతిపాదించారు. అయితే ముందుగా వ్యవసాయ రంగంలోని భూయాజమాన్య సంబంధాలు, మారక సంబంధాలు, పంపిణీ సంబంధాల్లో మౌలికంగా మార్పు రానిదే ఈ వ్యవసాయ సదస్సుల సిఫార్సులు అమలులోకి రావడం అసాధ్యం. దేశ ఆర్థిక వ్యవస్థకు పునాదిగా నిలుస్తున్న వ్యవసాయ రంగాన్ని బహుళజాతి సంస్థలకు అప్పజెప్పి, కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించే విధానాలకు ప్రభుత్వాలు స్వస్తి పలకాలి. పర్యావరణానికి, గ్రామీణ ప్రజల జీవనానికి హాని కలిగించని సుస్థిర వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా ప్రజల కొనుగోలు శక్తిపెంచాలి. అది పారిశ్రామిక రంగానికి ఊతమిచ్చి, దేశ ఆర్థిక పురోగమనానికి దోహదం చేస్తుంది.

కార్పొరేట్ వ్యవసాయాన్ని అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత కొంత కాలంగా భావిస్తున్నాయి. చిన్న, సన్నకారు రైతులను తమ భూములనుండి తరిమి వేయడానికి కుట్రలు పన్నుతున్నారు. ఇప్పటికే మన రాష్ట్రంలో 70 లక్షల ఎకరాల భూమి కార్పొరేట్, రియల్ ఎస్టేట్ శక్తుల పరమైంది. మన విశ్వవిద్యాలయాల్లో వ్యవసాయ సంబంధిత పరిశోధనలు లేకుండా పోయాయి. మోన్‌శాంటో, బేయర్ లాంటి బహుళజాతి సంస్థలు మన వ్యవసాయ రంగంలోకి చొరబడితే వ్యవసాయం అధోగతి కాక తప్పదు. దీంతో చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు నాశనం కాక తప్పదు.

సదస్సు చివరి రోజున వ్యవసాయాన్ని పరిశ్రమగా మార్చాలని తీర్మానించారు. ఇక మీదట పారిశ్రామిక రంగంలో చిన్న ఉత్పత్తి దారులు నాశనమైనట్లే వ్యవసాయ రంగంలోనూ 80 శాతంగా ఉన్న చిన్న, సన్నకారు రైతులు నాశనమవుతారు. రైతుకు రక్షణ కరువైందని భావిస్తున్న తరుణంలో సబ్సిడీల వల్ల వ్యవసాయం అసమర్థంగా మారిందని, వాటిని

మేకల రక్షణ కోసం తోడేళ్ల సమావేశం

ప్రపంచ వ్యవసాయ సదస్సు బహుళజాతి కంపెనీల ప్రయోనాల కోసమేననీ, చిన్న, పెద్ద , సన్నకారు రైతుల ప్రయోజనాల కోసం కాదనీ అంటున్నారు **కె.వి. కూర్మనాథ్**

'ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటె' అన్నది చాలా పాత నానుడి. దొంగతనం చేసినవాడు పోలీసును పట్టుకుని దొంగ, దొంగ అని అరవడం అన్న మాట. నవంబరులో హైదారాబాద్ లో జరిగిన ప్రపంచ వ్యవసాయ సమావేశానికి (వరల్డ్ అగ్రికల్చర్ ఫోరమ్) వెళ్తే ఈ నానుడి గుర్తురాక మానదు. ఎందుకంటే, ఈ సమావేశం ముఖ్యోద్దేశం సుస్థిర వ్యవసాయం కోసం, చిన్న కమతాల రైతుల బాగు కోసం వ్యవసాయాన్ని పునర్నిర్మించడం.

సుస్థిర వ్యవసాయ సూత్రాలు వ్యాపార వ్యవసాయ సూత్రాలకి వ్యతిరేకం. అంటే, సుస్థిర వ్యవసాయం చేస్తే డబ్బులు రావని కాదు. నష్టాలు వస్తాయని కాదు. వ్యాపార వ్యవసాయానికి లాభాపేక్ష తప్ప ఇంకోటి ఉండదు. లాభాలు పండే పంటలు పండించడం, దానికోసం సహజ వనరుల్ని సాధ్యమైనంతగా పిండుకోవడం, అందుకోసం రసాయనాలను, జన్యు టెక్నాలజీని వాడడం. నిజమైన అర్థంలో సుస్థిర వ్యవసాయం అంటే పర్యావరణంతో సంఘర్షణ లేకుండా, నష్టం కలిగించకుండా వ్యవసాయం చేయడం.

సుస్థిర వ్యవసాయం గురించి మాట్లాడడం మంచిదే కదా, చిన్న కమతాల రైతులకి మంచి కలిగించే ఎత్తుగడలు రచిస్తే మంచిదే కదా అని అనిపించవచ్చు. మంచిదే కూడా. కానీ, అవినీతి గురించి, హింస గురించి మనకంటే ఎక్కువగా ప్రభుత్వమే, పోలీసులే ఎక్కువ మాట్లాడి ఎలా మన దృష్టి మరలుస్తారో సరిగ్గా ఈ సంస్థ సుస్థిర వ్యవసాయం గురించి, చిన్న రైతుల గురించి మాట్లాడడం అలానే ఉంటుంది. ఎవరైతే అవినీతికి, హింసకూ పాల్పడతారో, వాళ్లే ఎక్కువగా వాటి గురించి సమాజంలో 'నోయిస్' సృష్టిస్తారు. ఈ నోయిస్ ఎంత ఎక్కువగా ఉంటుందంటే, బాధితుల రోదనలు ఎవరికీ వినబడవు. వినిపించుకునే అవకాశం ఉండే మధ్య తరగతికి ఆ ఆక్రందనల కంటె ఎన్నో రెట్లు ఎక్కువగా వినిపించే శబ్దాలే వినిపిస్తాయి. ప్రభుత్వం, పోలీసులు వీటి గురించి ఎందుకు పదే, పదే మాట్లాడతారు? ఎందుకంటే, ఇక భరింపసఖ్యంకాని స్థాయిలో హింస ఉన్నపుడు ప్రజలు తిరగబడే అవకాశం ఉంటుంది. లేదా, తిరగబడుతున్న సంస్థలకు విశ్వసనీయత పెరుగుతుంది. అందుకే, ప్రధానమంత్రి, హోం మంత్రి, ముఖ్యమంత్రి, అధికార ప్రతిపక్ష నాయకులందరూ ఒకే గొంతుతో హింసకీ, అవినీతికీ వ్యతిరేకంగా మాట్లాడతారు. ఈ శబ్దాల హోరులో బాధితులు, బాధితుల తరపున మాట్లాడే సమూహాల గొంతులు ఎవరికీ వినిపించవు. దొంగే గట్టిగా అరిచి, బాధితుడినే దొంగ అంటాడు.

ప్రపంచ వ్యవసాయ వేదిక సుస్థిర వ్యవసాయం గురించీ, చిన్న రైతుల గురించి మాట్లాడడం సరిగ్గా ఇలాంటిదే.

ఈ అంతర్జాతీయ సంస్థ ఇప్పుడు ఈ విషయాలని ఎందుకు మాట్లాడుతోంది? ఎందుకంటే, వ్యాపార వ్యవసాయంపై ప్రపంచ వ్యాప్తంగా విమర్శలు పెల్లుబుకుతున్నాయి. పర్యావరణంపై ఎలాంటి ప్రభావం వేస్తున్నాయో పట్టించుకోకుండా, పంటలకు అవసరమయ్యే, ఉపయోగపడే క్రిమికీటకాల్ని కూడా మట్టుపెట్టే రసాయనాలు, టెక్నాలజీలపై ఎన్నో దేశాల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వస్తోంది. ఇలాంటి టెక్నాలజీలన్నీ మాన్‌శాంటో, సింజెంటా, పయనీర్, బేయర్ వంటి బహుళజాతి కంపెనీలు కనిపెట్టినవే. ప్రచారం చేస్తున్నవే. ఈ టెక్నాలజీలు లేకపోతే ఆహార భద్రత కష్టమని, విపరీతంగా పెరిగిపోతున్న ప్రజల ఆహార అవసరాల్ని తీర్చడానికి జన్యు టెక్నాలజీ తప్పనిసరి అని వాదించడమే కాకుండా, ఈ వాదనలకు మద్దతునిచ్చే మధ్యతరగతి మేధావి వర్గాన్ని కూడా తయారు చేసుకున్నాయి.

ఎలాంటి, జన్యు టెక్నాలజీ సహాయం లేకుండా ఐదేళ్లకి, ఆరేళ్లకి సరిపడా ఆహారపు నిల్వలు మన గోడౌన్లలో ముక్కుతున్నాయి. సరైన రక్షణ లేక అవన్నీ కుళ్లిపోతున్న, పనికి రాకుండా పోతున్న వార్తలు కూడా చూస్తున్నాం.

ఈ సంస్థ ఇప్పుడు ఈ విషయాలపై మన దేశంలో సమావేశం పెట్టడానికి కూడా ఒక ఉద్దేశం ఉన్నది. ఈ సంస్థ బహుళజాతి విత్తన కంపెనీలకు మద్దతు కూడగట్టే పనిలో ఉన్నది. కాటన్ లో జన్యుమార్పిడికి అనుమతులు సంపాదించుకున్న కంపెనీలు, ఆహారపంటల్లో ఆటంకాలని ఎదుర్కొంటున్నాయి. ఈ ఆటంకాలు తొలగాలంటే ఈ కంపెనీల అసలు ఉద్దేశాల్ని కనబడకుండా చేసి, వాళ్లు చేస్తున్నదానికి పూర్తి భిన్నమైన ఇమేజ్ కల్పించాలి. 'వాళ్లు చెప్తున్న విషయాలు చూడండి ఎంత బాగున్నాయో. మన సమస్యలే మాట్లాడుతున్నారు,' అని మనకి చెప్పడం.

రద్దుపరిచి ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ విధానాన్ని ప్రవేశ పెట్టాలని సదస్సు సిఫార్స్ చేసింది. అంటే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి వ్యవసాయాన్ని బలి చేయడమే. ఆహార పంటల స్థానంలో వ్యాపార పంటలను ప్రోత్సహించి దేశంలో ఆహార అభద్రతను సృష్టించి, పరాధీనతను పెంచడమే లక్ష్యంగా 'ప్రపంచ వ్యవసాయ సదస్సు' జరిగింది. కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా జరిగిన ఈ సదస్సు వల్ల రైతులకు ఒరిగేదేమి లేదు, రైతు సమస్యలు చర్చించటానికి అవకాశంలేని వ్యవసాయ వ్యాపార సదస్సును రైతు సంఘాలు బహిష్కరించడం సముచిత నిర్ణయమే.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, రాజనీతిశాస్త్ర విద్యార్థి) వీ

అసలు ఈ ప్రపంచ వ్యవసాయ వేదిక అంటే ఏంటి?

అమెరికాలోని సెయింట్ లూయీ కేంద్రంగా ఏర్పడ్డ ఒక 'తటస్థ' వ్యవసాయ వేదిక ఇది. (ప్రపంచ వ్యవసాయ రంగంపై పూర్తి పట్టుకోసం ప్రయత్నిస్తున్న మాన్‌శాంటో కేంద్ర కార్యాలయం కూడా ఇక్కడే ఉంది) ప్రస్తుతం మేనేజ్‌మెంట్ కమిటీలో ఉన్న నలుగురిలో ఒకరు (లియోనార్డ్ గ్వార్రాయియా) మాన్‌శాంటోలో 13 ఏళ్లు పనిచేశాడు. అంతకు ముందు సింథటిక్ ఆర్గానిక్ కెమికల్ తయారీ కంపెనీల అసోసియేషన్ లో పనిచేశాడు.

అంతర్జాతీయంగా వ్యవసాయానికి సంబంధించిన విషయాలు, పాలసీల గురించి చర్చించడం (అంటే కాంపీనాల కోసం మద్దతు కూడగట్టడం). ఈ సంస్థ వెబ్‌సైట్‌లో ఉన్న సమాచారం మేరకు, ఆ సంస్థ నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడిన వాళ్లు ఏయే సంస్థలకి ప్రాతినిధ్యం వహిస్తున్నారో చూడండి.

ప్రపంచ బ్యాంకు, కెల్లాగ్ ఫౌండేషన్, మాన్‌శాంటో, డి1 ఆయిల్, కార్పొరేట్ కౌన్సిల్ ఆఫ్ ఆఫ్రికా, అమెరికా కాంగ్రెస్, నెస్లే, అమెరికా వ్యవసాయ మంత్రులు (సెక్రెటరీలు), ప్రపంచ వాణిజ్య సంస్థ. ఈ పేర్లు చూస్తే అర్థమవుతుంది, ఈ సంస్థ ఎవరి ప్రయోజనాల కోసం పని చేస్తోందో.

ఈ సమావేశాల్ని ఎవరు స్పాన్సర్ చేశారో చూస్తే తెలుస్తుంది, ఈ సమావేశాల అసలు ఉద్దేశం. ప్లాటినం స్పాన్సర్ బేయర్ క్రాప్ సైన్స్. ఇతర స్పాన్సర్లు ఎవరంటే, మాన్‌శాంటో, బిఎఎస్ఎఫ్ (రసాయనాల కంపెనీ), యునైటెడ్ ఫాస్ఫరస్, ఇక్రిశాట్. బియ్యంతో సహా అన్నీ ఆహార పంటల్లో జన్యు మార్పిడి పరిశోధనలు చేస్తూ, వాటిని పరీక్షిస్తున్న బేయర్ కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ లియామ్ కండోన్ ఈ సభల్లో ప్రధాన ఉపన్యాసం చేశారు. ఆయన కూడా, చిన్న కమతాల వ్యవసాయం కోసం తన కంపెనీ ఏం చేస్తోందో వివరించాడు.

చాలా చిత్రంగా, చిన్న రైతుల క్షేమం కోసం, లాభం కోసం జరిగిన ఈ సమావేశాలకి చిన్న రైతులకి ఆహ్వానం లేదు. సాంకేతికంగా అయితే, అందరూ వెళ్లొచ్చు. కాకపోతే, ఓ పదివేలు ఫీజు చెల్లించి వెళ్లాలి. ఏ చిన్న రైతు వెళ్లగలడు? ప్రభుత్వం ఎంపిక చేసిన కొందరు వెళ్లగలిగారు. వాళ్లు కూడా ఎక్కడికి వెళ్లగలిగారంటే, ఈ సమావేశాలు జరిగే హాలు పక్కన ఏర్పాటు చేసిన ప్రదర్శనకు. ఇక్కడ అప్పడాలు, వడియాలు, తాము ఎప్పటి నుంచో వాడుతున్న విత్తనాలు, డ్రిప్ పరికరాలు కొన్ని – ఇవి రైతులు చూసిన విషయాలు.

ఇక చిన్న రైతుల గురించి మీటింగులో ఏం మాట్లాడి ఉంటారో, మాట్లాడినా అవి ఎవరిని ఉద్దేశించి ఉంటాయో, వాటి ప్రయోజనం ఏమిటో చాలా సులభంగానే ఊహించవచ్చు. ఆశ్చర్యపడాల్సింది ఏమీ లేదు కానీ,

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఈ సమావేశం ఏర్పాటులో భాగం పంచుకుంది. దాదాపు సంవత్సరం నుంచి ఏర్పాట్లలో నిమగ్నమై ఉంది. రెండు – మూడు కోట్లు ఖర్చు పెట్టింది. మీటింగులో మాట్లాడిన వ్యవసాయ మంత్రి కన్నా కూడా చిన్న, సన్నకారు రైతులకు తాము చేస్తున్న మేలు గురించి చాలా మాట్లాడాడు. కానీ, అటు కంపెనీలు, ఇటు ప్రభుత్వం రెండూ చిన్న రైతుల గురించే మాట్లాడుతుంటే, వాళ్లకి అన్నీ చేస్తుంటే ఇక వాళ్లకి సమస్య ఏంటి? ఇది వరకు చెప్పుకున్నట్టు, ఎవరైతే సమస్యకి కారణం అవుతారో, వాళ్లే ఆ సమస్య గురించి గట్టిగా మాట్లాడేస్తారు. ఇక, మీకూ నాకూ మాట్లాడడానికి ఇంకేమీ ఉండదు.

పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోయి, గిట్టుబాటు ధర రాక, ఒకవేళ పంట పోతే సరైన ఇన్సూరెన్స్ లేక వ్యవసాయం రైతులకి గుదిబండ లాగా మారిపోయింది. వేరే పనేమీ చేయలేక, భూమిని నమ్ముకుని బతకలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. విశాల భూభాగాల్లో వ్యవసాయం చేసే అమెరికన్ తరహా వ్యవసాయ విధానాల్ని ఇక్కడ బలంగా రుద్దే ప్రయత్నం చేస్తున్నారు. చిన్న కమతాలకు సరిపడా టెక్నాలజీలను అభివృద్ధి చేసుకోవాలి. కానీ, ప్రభుత్వానికి, కంపెనీలకు నిజంగా కావాల్సింది అది కాదు.

సమావేశాన్ని ప్రారభించిన కేంద్ర వ్యవసాయశాఖ సహాయమంత్రి తారిఖ్ అన్వర్ చాలా స్పష్టంగా చెప్పాడు, దేశానికి కాంట్రాక్ట్ వ్యవసాయం చాలా అవసరం అని. ఆహార ధాన్యాల ఉత్పత్తి కోసం తప్పదని చెప్పాడు. కాంట్రాక్ట్ పద్ధతిని వాడుకుని పౌల్ట్రీ రంగం ఎలా అయితే విజయం సాధించిందో, వ్యవసాయ రంగం కూడా ఆ పద్ధతిని వాడుకోవాలని సూచించాడు. అంటే, ప్రభుత్వం ఏం కోరుకుంటున్నది అంటే చిన్న రైతులు వ్యవసాయం వదులుకుని వెళ్లిపోవాలి. ఎందుకంటే, పౌల్ట్రీ రంగంలో చిన్న కమతాల్లో లక్షల కోళ్లను పెంచవచ్చు. కానీ, ఆహార ధాన్యాల్లో ఆ విజయం సాధించాలంటే వేల ఎకరాలు ఒక చోట ఉండాలి. ఒకరివై లేదా ఏ కొందరివో అయి ఉండాలి. అంటే, చిన్న రైతులు చాలా మంది వ్యవసాయం నుంచి వెళ్లి పోయి కొందరు పెద్ద రైతులు మాత్రమే మిగలాలి. చిన్న రైతులు వెళ్లిపోతే, పెద్ద రైతులు కంపెనీలకు అనుగుణమైన పంటలు పండిస్తారు. ఇప్పటికే, ఈ పద్ధతిలో పెప్సి లాటి కంపెనీలు బేయర్‌తో కలిసి బంగాళ దుంపలు పండిస్తున్నారు. పెప్సి, మామిడి కూడా కొంటున్నది. మహీంద్రా వాళ్లు ద్రాక్ష, యాపిల్ పళ్లు ఈ పద్ధతిలో పండిస్తున్నారు. నిజానికి, ఈ కాంట్రాక్ట్ వ్యవసాయం కొత్తదేమీ కాదు. కానీ, ప్రభుత్వం, కంపెనీలు కోరుకుంటున్నదేమిటంటే విస్తారంగా ఉన్న చిన్న కమతాల్ని కబళించడం. గిట్టుబాటు గాని వ్యవసాయం వాళ్లెందుకు చేయాలి అన్న ప్రశ్న వస్తుంది. అసలు గిట్టుబాటు కాకుండా అడ్డు వస్తున్నది ఎవరు? వరి పండించడానికి ప్రభుత్వ లెక్కల ప్రకారం క్వింటాలుకి పదిహేను వందలు ఖర్చవుతుంది. కానీ, ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర పదకొండు వందలకి మించదు. అంటే, అక్కడే రు. 400 నష్టం. ఇక, మిల్లర్లు తగ్గించే విలువకైతే జవాబే ఉండదు.

వ్యవసాయంతో పాటు అనుబంధ వ్యాపకాలు (డైరీ వంటివి) ఉంటే రైతులకు కొంత వెసులుబాటు ఉంటుంది. అదనపు ఆదాయంతో పాటు, రైతు కుటుంబానికి కొంత పోషకాహారం కూడా దొరుకుతుంది. దీనికి ప్రభుత్వం సహాయం చేయాలి.

సమస్యలకి పరిష్కారం ఒకచోట ఉంటే, మన దృష్టిని వేరే చోటుకి మరలుస్తారు. అసలు ఈ సమావేశాలు జరిగే చోటుని చూస్తేనే తెలుస్తుంది, వాళ్లు ఎటు ఆలోచిస్తున్నారో. ఐదు నక్షత్రాల హోటల్‌లో, మొత్తం ఎయిర్ కండిషన్ హాలులో వీళ్లు ఏం మాట్లాడి ఉంటారు? కోట్ల మంది రైతుల జీవన్మరణ సమస్యల గురించి, వాళ్లకు అసలే సంబంధం లేకుండా జరిగే సమావేశాలు ఎవరికోసం? మేకల, గొర్రెల రక్షణ కోసం తోడేళ్లు, సింహాలు సమావేశం అయినట్టు ఉంది. వీ

(రచయిత పాత్రికేయులు)

జన్యుమార్పిడి పంటలకు పొలాల బలి

సామ్రాజ్యవాద దేశాల్లో జన్యుమార్పిడి పంటలపై నిషేధం విధించడంతో అక్కడి విత్తన కంపెనీలు భారతదేశంలో పెట్టుబడులు పెట్టి, తమ లాభార్జనకు దేశీయ పంటలను బలిచేస్తున్నాయని అంటున్నారు **వై. కృష్ణమూర్తి**

'వాల్‌మార్ట్' సూపర్ మార్కెట్లను నడిపే బహుళజాతి సంస్థ మన దేశ చిల్లర వ్యాపారంలో ప్రవేశించడానికి రు. 500 కోట్ల లాబీయింగ్ పేరున (లంచాలకు మరోపేరు) ఖర్చు చేసింది. విచారణను ఎదుర్కొంటోంది. బహుళజాతి విత్తన సంస్థలైన మాన్‌సోంటో, అవాంటిస్‌లు అమెరికాలోనూ, యూరపులోనూ చెల్లని వంగడాలను మన దేశంలో ప్రవేశపెట్టడానికి గట్టి ప్రయత్నం చాలా కాలం నుండి చేస్తున్నాయి. 2008 నుండి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నాయి. మన దేశ శాస్త్రజ్ఞులలో కొంత మంది దేశీయ విత్తన కంపెనీలలో పని చేస్తున్నారు. ఈ విత్తన కంపెనీలు అమెరికా విత్తన కంపెనీల లైసెన్సులు పొందాయి. అమెరికా విత్తన కంపెనీల లాబీయింగ్‌కు వారు తోడ్పడుతున్నారు.

మన దేశంలోని రైతు సంఘాలూ, శాస్త్ర, సాంకేతిక నిపుణులూ, మేధావులూ నిరంతరం వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్నారు. అందువల్ల ప్రభుత్వం కొంత నెమ్మదిగా ముందుకు సాగుతోంది. కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శరద్ పవార్ ఈ బహుళజాతి సంస్థలకు వత్తాసు పలుకుతున్నారు. పార్లమెంట్‌లో పచ్చి అబద్ధాలు చెప్పారు. మాజీ పర్యావరణశాఖ మంత్రి జైరాం రమేష్, నటరాజన్‌లు, సుప్రీంకోర్టు అడ్డుపడకపోయినట్లైతే జన్యుమార్పిడి సాంకేతిక చట్టం రూపం ధరించేదన్నారు. అరుణారోడ్రిగ్స్, వందన శివ, రాజేష్ క్రిష్ణన్ మొదలు స్వచ్ఛంద కార్యకర్తలు ఎన్నో విషయాల గురించి, ప్రమాదాల గురించి హెచ్చరిస్తూ ప్రచారం చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో రెండు సంఘటనలు జరిగాయి. ఒకటి 2013 ఏప్రిల్ 22న కేంద్ర ప్రభుత్వం జన్యుమార్పిడి సాంకేతికతో కూడిన బయోటెక్నాలజీ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. రెండు జన్యుమార్పిడి పొందిన వరి, గోధుమలు, మొక్కజొన్న, పత్తి మొదలగు 25 పంటల వంగడాలకు క్షేత్రస్థాయి పరీక్షలు జరుపుకోవడానికి 'మాన్‌సోంటో' 'అవాంటిస్' విత్తన సంస్థలకు జన్యుమార్పిడి సాంకేతికత మదింపు చేసే సంఘం (జనిటిక్ ఇంజనీరింగ్ అప్రైజల్ కమిటీ) అనుమతి ఇచ్చింది.

ఇవి జరిగిన కొద్ది రోజులకు 2013 మే 29న అమెరికాలో 'మాన్‌సోంటో' చేసిన దగా, మోసం బయటపడింది. అమెరికాలో నేటి వరకు జన్యుమార్పిడి పొందిన గోధుమలు పండించడానికి ఆదేశపు వ్యవసాయశాఖ అధికారికంగా ఎవరికి అనుమతివ్వలేదు. అమెరికాలో జొన్న, మొక్కజొన్న, పత్తి మొదలైన పంటల వంగడాలు మాత్రమే ప్రభుత్వ అనుమతి పొందాయి. ఈ జన్యుమార్పిడి పరీక్షలు గత 30 సంవత్సరాలుగా సాగుతూనే ఉన్నాయి. కాని నేటి వరకు జన్యుమార్పిడి పొందిన ఆహార పదార్థాలు తిన్నందున ఎటువంటి ఆరోగ్య హాని లేదని ప్రపంచంలో ఏ శాస్త్రీయ సాంకేతిక సంస్థ నిర్ధారించలేదు. ఈ విషయంలో ప్రపంచదేశాలు ఎంతో జాగ్రత్తగా ముందుకెళ్లుతున్నాయి. మనదేశంలో కూడ జన్యుమార్పిడి పంటలకు తీవ్ర వ్యతిరేకత ఉన్నది.

'మాన్‌సోంటో' రహస్యంగా ఒక జన్యుమార్పిడి పొందిన గోధుమ వంగడాన్ని తయారు చేసింది. దాని పేరు 'మాన్71800' అమెరికా వ్యవసాయశాఖ ఈ వంగడాన్ని అనుమతించలేదు. ఆ వంగడాన్ని ప్రసారంలో పెట్టలేదని 'మాన్‌సోంటో' ప్రకటించింది. కాని 'ఒరిగాన్' రాష్ట్రంలో ఒక రైతు పొలంలో బయటపడింది. రైతు తన పొలాన్ని 'పంట విరామం' కొరకు కోతలు తరువాత అలాగే ఉంచాడు. కొద్ది రోజుల తరువాత పొలం వద్దకు వెళ్లి చూస్తే పచ్చని మొక్కలు కనిపించాయి. అవి మామూలుగా మొలిచే కలుపు మొక్కలు కావు. దగ్గర ఉన్న వ్యవసాయ విశ్వవిద్యాలయానికి రైతు ఆ మొక్కలను పరీక్ష నిమిత్తం పంపగా ఆ మొక్కలు నిషిద్ధ 'మాన్ 71800' గోధుమ వంగడం అని తేలింది. వ్యవసాయశాఖ కూడా 'మాన్‌సోంటో' మీద బహిరంగ విచారణ జరుపకుండా అంతా రహస్యంగా నడిపింది. అంతేకాదు కొన్ని చోట్ల పిచ్చిగడ్డి (గరిక) విపరీతంగా పాకిపోతోంది. మందులు చిమ్మినా చావడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

అమెరికా గోధుమలు కలుషితం అయినాయని తెలియగానే జపాను, ఫిలిఫిన్సు, కొరియా, ఆసియా మొదలైన దేశాలు నాలుగు కోట్ల టన్నుల గోధుమలను దిగుమతి చేసుకోకుండా ఆపేశాయి. యూరోపియన్ యూనియన్ తన సభ్య దేశాలకు 'పరీక్షలు' జరపకుండా అమెరికా గోధుమలు దిగుమతి చేసుకొన వద్దని తాకీదు ఇచ్చింది. అమెరికా గోధుమ వ్యాపారం పెద్ద సంకటంలో పడింది. అమెరికాలో వ్యవసాయం ఒక జీవన విధానం కాదు. అది వందల కోట్ల వ్యాపారం.

మనదేశంలో క్షేత్రస్థాయి పరీక్షలకే అనుమతిచ్చాము కాని పంటకు, సాగుకు కాదనే బుకాయింపు ముందుకు వస్తున్నది. బహిరంగ క్షేత్రాలలో పరీక్షలు జరిపినప్పుడు ఆ పంట పుప్పొడి రేణువులు పక్క పొలాలలోకి వచ్చిపడే ప్రమాదం ఉన్నది. ప్రక్కన ఉన్న పంటలు కలుషితమవుతాయి. రక్షణ కలిగిన చోటే పరీక్షలు జరపాలి. మన దేశ నియంత్రణ సంస్థలు ఎంత సమర్థంగా పని చేస్తున్నాయో అందరికి తెలిసిందే. ఈ నియంత్రణ సంస్థల అలసత్వాన్ని తేలికగా సొమ్ము చేసుకొనుటకు 'మాన్‌సోంటో, అవాంటిస్'లు చూస్తున్నాయి, ఉబలాటపడుతున్నాయి.

మన దేశానికి జన్యుమార్పిడి పంటలు అవసరమనే లాబీ పెద్ద ఎత్తున జరుగుతోంది. ప్రపంచంలో సాగు అవుతున్న విస్తీర్ణంలో 5 శాతం కంటే తక్కువ విస్తీర్ణంలో జన్యుమార్పిడి వంగడాలు వాడుతున్నారు. మన దేశ ఆరోగ్య వ్యవస్థ సదుపాయాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. జన్యుమార్పిడి ఆహార పదర్థాలు పండించి ప్రమాదం

తెచ్చుకోకూడదు. ఇక దిగుబడులు వస్తాయని చెపుతూ మన రైతులను బోల్తాకొట్టించాలని ఈ విత్తన సంస్థలు, విత్తన కొరతను సొమ్ము చేసుకోవాలనుకొంటున్నరు.

పత్తిపంట విషయంలో కేంద్ర పరిశోధన సంస్థ కొన్ని నిజాలను బయటపెట్టింది. పత్తి పంటలు 10 సంవత్సరాల అనుభవాన్ని, దిగుబడులను సమీక్షించింది. పత్తి పండిస్తున్న మొత్తం విస్తీర్ణంలో జీవ సాంకేతిక (బిటి) పత్తి వంగడాలు వేసిన విస్తీర్ణం 5 నుండి 6 శాతం వరకు మాత్రమే ఉన్నది. అయినా 2002 నుండి 2004 వరకు మొత్తం పత్తి దిగుబడులు 50 నుండి 60 శాతం వృద్ధి ఉన్నట్టు గణాంకాల పరిశోధన సంస్థ వెల్లడించింది. అధిక దిగుబడులకు జన్యుమార్పిడి అవసరం లేదని నిర్ధారణ అవుతోంది.

'ఆహార భద్రత'ను గురించి జన్యుమార్పిడి పంటల అనుకూల లాబీ తెగ బాధపడిపోతుంది. అనుభవాలు మరో రకంగా ఉన్నాయి. 2012-13 సంవత్సరంలో 25 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు పండాయి. ప్రభుత్వం సేకరించిన ధాన్యాలకు గోదాములు లేక బహిరంగ ప్రదేశాలలో నిల్వ చేస్తున్నారు. 'ఆహార సేకరణ సంస్థ' (ఎఫ్‌సిఐ) వద్ద 6 కోట్ల టన్నులు నిల్వ ఉన్నాయి. మనదేశ చిన్నకారు, సన్నకారు రైతుల వ్యవసాయం స్వయంపోషకంగా చేస్తే ఆహార కొరతనేది ఎప్పుడూ రాదు. కారణం గ్రామీణ ప్రాంతాలలో వీరి జనాభా 87 శాతంగా ఉన్నది. వ్యవసాయానికి కావలసిన విత్తనాలకు, ఎరువులకు, మందులకు అధిక ధరలు చెల్లిస్తూ నష్టం వచ్చి అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకొంటున్నవారు వీరే. ప్రభుత్వం వారికి సాయం అందిస్తే ఆహార కొరత సమస్య రాదు. వ్యవసాయం నుండి తొలిగిపోయే దుస్థితి రాదు. ఆహార భద్రతా చట్టం అమలుకు రు. 113000 కోట్లు ఆహార సబ్సిడీ కింద ఖర్చు అవుతుందని అంచనా. చిన్నకారు, సన్నకారు రైతులకు రు. 50000 కోట్లు వ్యవసాయ ఖర్చులకు, తక్కువ వడ్డీకి రుణాలు, విత్తనాలు, ఎరువులు, మందులు రూపేణా అందిస్తే ఆహార కొరత సమస్యే ఉండదు.

పండ్లు, కూరగాయలు నిల్వ చేయడానికి శీతల గిడ్డంగులు లేక 30 నుండి 40 శాతం వరకు కుళ్లి చెడిపోతున్నాయి. అంతేకాదు గత రెండు సంవత్సరాలుగా రెండు లక్షల కోట్లు విలువ చేసే ఆహార పదార్థాలు ఎగుమతి చేసింది యథార్థం కాదా? కొనుగోలు శక్తి లేక రెండు పూటలు తిండి దొరకనందున ఆహార భద్రతను గురించి చర్చించాల్సి వచ్చింది కాని, మన దేశ ముఖ్యమైన ఆహార పదార్థాలు వరి, గోధుమల విషయంలో 'స్వయంపోషకం' సాధించింది. వీటికి తోడు ప్రజాపంపిణీ వ్యవస్థ లోపాలూ, చిల్లులూ 'ఆహార భద్రత' లాబీకి ఊతమిస్తూ జన్యుమార్పిడి పంటల ప్రచారానికి తోడ్పడుతున్నాయి.

నిజానికి 2013 జనవరి 1 నాటికి 6 కోట్ల 67 లక్షల టన్నుల ఆహార పదార్థాలు నిల్వ మూలుగుతున్నాయి. ఇది మన దేశానికి కావలసిన అవసర నిలువ (బఫర్‌స్టాకు) కంటే రెండున్నర రెట్లు ఎక్కువ.

జన్యుమార్పిడి వంగడాల విషయంలో కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును కూడా లెక్కచేసేటట్టు లేదు. జీవవిషం (టాక్సికాలజీ), సూక్ష్మ జీవశాస్త్రం (మైక్రోబయాలజీ), జీవవైవిధ్యం (బయోడైవర్సిటీ) శాస్త్రాలలో నైపుణ్యం కలిగిన ఐదుగురు నిపుణులతో కమిటీ నియమించి మన దేశవాళీ వంగడాలు ఏవీ కూడా తమ తుది తీర్పు వచ్చే వరకూ జన్యుమార్పిడి చేయకుండా చూడాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. జన్యుమార్పిడి పంటల విషయంలో తమ అభిప్రాయాలు తెలియచేయమని వారిని కోరింది. జన్యుమార్పిడి పరీక్షలు బలిష్టమైన నియంత్రణ అధికార సంస్థ లేకుండా పరీక్షలకు అనుమతించకూడదని సిఫారసు చేసింది. ఈలోగానే క్షేత్ర పరీక్షలకు మాన్‌సాంటో, అవాంటిస్‌లు అనుమతి పొందాయి.

1. అమెరికాలో జన్యుమార్పిడి గోధుమ పంటకు వ్యవసాయ శాఖ అనుమతి లేదు.

2. మొక్కజొన్న, జొన్న, పత్తి ఎక్కువగా జన్యుమార్పిడి పొందాయి. (మొక్కజొన్న, జొన్నల నుండి బయోపెట్రోలు తయారు చేస్తున్నారు)

3. అమెరికాలో వ్యవసాయం ఒక జీవన విధానం కాదు. అది వేల కోట్ల వ్యాపారం.

4. గొంగళి పురుగులను చంపే పురుగుల మందు (స్టార్ లింకు) ప్రభావం టాక్‌షెల్ (అందరూ తినే పిస్తాలాంటిదే) మీద కనిపించింది.

5. 2006లో 'బేయర్స్ లిబర్టీ లింక్' అనే నిషిద్ధ బియ్యం ఇతర బియ్యంతో కలవగా మార్కెట్ పోగొట్టుకొన్న సహకార మార్కెట్ రైతులు 'మాన్‌సాంటో' మీద దావా వేసి రు. 13.6 కోట్ల నష్టపరిహారం పొందారు. (ఇది మన దేశంలో సాధ్యమేనా ?)

6. 2010 కోలరాడో రాష్ట్రంలో 'వెంట్రియాబయోసైన్సు' సంస్థ మీద ఇటువంటి నేరానికే లక్షల డాలర్లు జరిమానా విధించారు.

7. 2012లో ఒక జర్మన్ కంపెనీ సరఫరా చేసిన జన్యుమార్పిడి పంటలు వేసిన రైతులు నష్టపోతే పరిహారంగా 75 కోట్ల డాలర్లు అమెరికా రైతులు రాబట్టారు.

8. 2013 మే 29న అమెరికాలో బయటపడిన మాన్‌సాంటో మోసం వల్ల కోట్ల టన్నుల అమెరికా గోధుమల ఎగుమతులు ఆగిపోయాయి. (బిల్ డోనహ్యూ బ్లూంబర్గ్ బిజినెస్ వీక్‌లో పై విషయాలు తెలిపారు)

9. జపాన్‌లో జన్యుమార్పిడి విత్తనాలు ఉపయోగించరాదు.

10. న్యూజిల్యాండ్‌లో జన్యుమార్పిడి పంటలు పండించరు. ఆస్ట్రేలియాలో కొన్ని రాష్ట్రాలు నిషేధించాయి.

11. జర్మనీలో జన్యుమార్పిడి మొక్కజొన్న పంట మీద నిషేధం, బంగాళదుంపలకు అనుమతి.

12. అమెరికాలో కాలిఫోర్నియా రాష్ట్రంలో అనేక కౌంటీలు జన్యుమార్పిడి పంటలు అనుమతించవు. హవాయ్ టమోటా, బొప్పాయి మొదలైనవి అనుమతిస్తారు. రాష్ట్ర రాష్ట్రానికి తేడాలు ఉన్నాయి.

13. బ్రిటన్‌లో ప్రభుత్వపరంగా వ్యతిరేకత లేదు. కాని అక్కడ ప్రజల్లో విస్తృత భాగాలు అపనమ్మకం కలిగి ఉన్నారు. జన్యుమార్పిడి పదార్థాలు వాడరు.

14. ప్రపంచంలో 190 దేశాలు ఉండగా కేవలం 29 దేశాలలోనే జన్యుమార్పిడి పంటలు పండిస్తున్నారు.

15. చైనాలో జన్యుమార్పిడి పంటలు పండిస్తారు. విపరీతంగా కలుపు మొక్కలు, చీడ, తెగులు, కీటకాలు పెరగడంతో క్రిమిసంహార మందుల వాడకం ఎన్నోరెట్లు పెరిగింది. వ్యవసాయదారులు పునరాలోచనలో పడ్డారు.

ఇన్నీ తెలుసుకొన్న తరువాత జన్యుమార్పిడి పంటలను ఎందుకు ఆహ్వానించాలి. చిన్న ఆహార సమస్యను పెద్దగా చూపి ఆహార భద్రత పేరున జన్యుమార్పిడి పంటలే శరణ్యమని ప్రచారం చేసే, వత్తాసుపలికే (స్పిన్ డాక్టర్స్) వారిని విత్తన కంపెనీలు రంగంలోకి దించుతున్నాయి.

ఆర్థిక వ్యవస్థలోకి విదేశీ పెట్టుబడుల మాదిరి వ్యవసాయంలోకి జన్యుమార్పిడి పంటల విత్తనాల కంపెనీ కొరకు పాలకవర్గం ఎర్రతివాచీ పరుస్తోంది. తస్మాత్ జాగ్రత్త.

(రచయిత రాష్ట్ర ఇన్స్యూరెన్స్ ఉద్యోగుల నాయకులు) వీ

ఆహార పంటలకు కీడు చేసే కీటకాలు

క్రిమిసంహారక మందుల అతివాడకం వల్ల పంటలకు కీడుకంటే మేలుచేసే కీటకాలు ఎక్కువగా నాశనం అవుతున్నాయనీ, ఇది భవిష్యత్తులో ఆహార అభద్రతకు దారితీస్తుందనీ అంటున్నారు **బోరెడ్డి మధుసూదన్‌రెడ్డి**

ఝూంకార నాదం వినిపించే తేనెటీగలు ఈ ధరిత్రిపై మనుగడ కోల్పోతున్నాయి. ఈ కీటకాలు లేకపోతే భూమిపై పెరిగే చాలా మొక్కలలో పరాగ సంపర్క క్రియ జరగదు. ఈ క్రియ జరగకపోతే అనేక రకాల ఆహార పదార్థాల ఉత్పత్తి తగ్గి ఆహార భద్రతకు ముప్పు వాటిల్లుతుంది. అనేక కీటకాలూ, పక్షులూ, తేనెటీగలూ అంతరించి పోవడానికి కారణం వ్యవసాయ పంటలకు వాడే క్రిమి సంహారక మందులూ, శిలీంధ్ర నాశకాలే కారణం అని వ్యవసాయ శాస్త్రవేత్తలు అధికారికంగా ప్రకటించారు.

పరాగ సంపర్క ప్రక్రియ ముఖ్యంగా గాలి, కీటకాలు, పశుపక్షాదుల ద్వారా జరుగుతుంది. చాలా మొక్కలలో పూత, కాయగా మారాలంటే ఈ పరాగ సంపర్క క్రియ జరగాలి. ఇది జరిగితేనే ఫలధీకరణం జరుగుతుంది. దీనివల్లనే పూత పిందెగా, పిందె కాయగా, కాయ ఫలంగా మారుతుంది. ఈ ప్రక్రియ వల్లనే పంట మొక్కలలో ఆహార పదార్థాల ఉత్పత్తి జరుగుతుంది. పంట దినుసుల దిగుబడిలో ప్రధాన పాత్ర వహించే ఈ క్రియకు కారణమయ్యే కీటకాలూ, పక్షులూ, తేనెటీగలూ మనదేశంలో అంతరించి పోతున్నాయని 'డెన్నిస్ వాన్ ఎంగెల్స్ టోర్స్' అనే కీటక శాస్త్రవేత్త అన్నారు. దీనివల్ల మన దేశంలో ఆహార భద్రత తీవ్ర ప్రమాదంలో పడినట్లేనని అర్థం చేసుకోవాలి.

ఈ దుస్థితికి ప్రధాన కారణం మనం పంటల సాగులో ఉపయోగించే క్రిమిసంహారక మందులు, ముఖ్యంగా 'నియోనికోటి నోయిడ్స్' అనే రసాయన క్రిమి సంహారకాలు. మన ప్రభుత్వం ప్రపంచీకరణ పేరుతో సరళీకృత ఆర్థిక విధానాలు అమలు పర్చడంలో భాగంగా ప్రభుత్వ సంస్థలను ప్రైవేటుపరం చేయడం వల్ల ఈ కీటక నాశక మందులను బహుళ జాతి కంపెనీలు పెద్ద ఎత్తున ఉత్పత్తి చేస్తున్నాయి. ఆ ఉత్పత్తులు మన పంటలకు, మన వాతావరణానికి ఎంత వరకు ఉపయోగకరమో నిర్ధారించుకోకుండానే మన ప్రభుత్వాలు వాటిని ప్రోత్సహించాయి. మనం ఉపయోగిస్తున్న పంట తెగుళ్ల నివారణ మందులు చాలా రకాలు. ముఖ్యంగా ఈ 'నియోనికోటి నోయిడ్స్' పంటల దిగుబడిని పెంచుకోవడానికి తోడుపడతాయని భావిస్తున్న ఈ క్రిమి సంహారకాలు ఇప్పుడు ప్రజల ఆరోగ్య భద్రతకే ప్రమాదకారిగా పరిణమిస్తున్నాయి. దీనితో పాటు ఈ క్రిమినాశకాల వల్ల కీటకాలే కాకుండా, సీతాకోక చిలుకలూ, పక్షులు మొదలైన ఇతర పరాగ సంపర్క జీవుల ఉనికికి, వాటి మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదం ముంచుకొస్తుంది. చాలా మంది కీటక శాస్త్రవేత్తలు, తెగుళ్ల నివారణ నిపుణులు, అన్ని పంటలకు ఈ క్రిమి సంహారక మందులు ఉపయోగించాల్సిన అవసరం లేదని స్పష్టం చేస్తున్నారు. అయినప్పటికి మన పాలక విధానాలు, పర్యావరాణాన్ని పట్టించుకోకుండా, బహుళ జాతి సంస్థల ప్రయోజనాల కోసం, వాటి ఉత్పత్తుల మార్కెట్ కోసం రైతులు వాటిని ఉపయోగించేలా ప్రోత్సహిస్తున్నాయి.

కూరగాయల, పండ్ల జాతి మొక్కలలో ఎక్కువగా కీటకాల ద్వారానే పరాగ సంపర్కం జరిగే అవకాశం ఉంది. ఇలాంటి మొక్కల పుష్పాల నుండి సహజంగా వెలువడే సుహాసనలకు కీటకాలు వాటి ఆహారం కోసం ఆకర్శించబడి పుష్పాల పైన చేరడం వల్ల దానిలోని పరాగ రేణువులు కీటకాల కాళ్లకు, రెక్కలకు అంటుకుంటాయి. ఈ కీటకాలు వేరొక పుష్పాలపై వాలినప్పుడు ఈ రేణువులు ఆ పుష్పం కీలాగ్రంపై చేరతాయి. ఇదే పరాగ సంపర్క ప్రక్రియ. ఈ క్రియ జరిగిన తరువాత పరాగ రేణువులు కీలాగ్రం నుండి కీలం ద్వారా అండకోశం చేరి దానిలోని అండాలతో కలిపి 'ఫలధీకరణం' జరుగుతుంది. ఈ క్రియ జరిగితేనే పువ్వు పిందెగా, పిందె కాయగా, కాయ ఫలంగా మారుతుంది. ఇది సహజంగా, ప్రకృతి సిద్ధంగా జరిగే ప్రక్రియ. క్రిమి సంహారకాలను మొక్కలపై వాడడం వల్ల పరాగ సంపర్కానికి ఆటంకం కలిగే అవకాశం ఉంది. ఎందుకంటే సహజత్వానికి భిన్నంగా పుష్పాలు, సుహాసనకు బదులు దుర్వాసన వెదజల్లడం వల్ల కీటకాలు ఆకర్శింపబడకుండా, సంపర్క క్రియకు అవరోదం కలుగడమే కాకుండా వాటికి ఆహారం (మకరందం) దొరక్క అంతరించిపోయే ప్రమాదం ఉంది. దీని వల్ల కీటక జాతి అంతరించి పోవడమే కాకుండా పంటల దిగుబడి తగ్గుతుంది. రాబోయే కాలంలో ముఖ్యంగా నిత్యావసర ఆహార పదార్థాలు అయిన కూరగాయలు, పండ్ల ఉత్పత్తులు తగ్గి, వినియోగం పెరగడం వల్ల ప్రజల కొనుగోలు శక్తి తగ్గి, ముఖ్యంగా బీద, మధ్య తరగతి వర్గాల వారు ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడుతుంది.

క్రిమి సంహారకాల ద్వారా పండించిన పంటలను ఆహార పదార్థాలుగా తీసుకోవడం వల్ల వాటి రుచి, వాసన మారి పోవడంతో పాటు, మన శరీరంలోనికి హానికర రసాయనాలు చేరి మన రోగనిరోధక శక్తిని తగ్గించి వేస్తాయి. దీనివల్ల అనారోగ్యం ఏర్పడి ఆరోగ్య భద్రతకు ముప్పు వాటిల్లుతుంది. వ్యవసాయంలో సహజ ఎరువుల వాడకం తగ్గి, రసాయన ఎరువులు, క్రిమి సంహారకాల వాడకం పెరగడం వల్ల ఈ పరిస్థితి దాపురించింది. ఆహార ఉత్పత్తులను, అధిక దిగుబడులను పెంచడంలో భాగంగా ఆహార భద్రత గురించి ఆలోచించే ప్రభుత్వం ప్రజల ఆరోగ్య భద్రతను గాలికి వదిలేసింది. ప్రజా ఆరోగ్యంతో పాటు, ప్రకృతి రక్షణను, పర్యావరణ పరిరక్షణను పట్టించుకోకుండా వాతావరణ కాలుష్యానికి పాలకులు కారకులు అవుతున్నారు. ఇలాంటి చర్యల వల్ల ప్రకృతిలోని కొన్ని పక్షుల, పిచ్చుకల మనుగడకు ప్రమాదం ఏర్పడుతుంది. ప్రత్యేక సందర్భాలలో (దసరా పండుగ) ప్రకృతిలో సహజంగా కనిపించే పాలపిట్టలను కూడా పంజరంలో బంధించి దర్శించుకొనే పరిస్థితి

'మామ్' ఉపగ్రహ ప్రయోగం ఎవరికోసం?

ప్రజలకు శాస్త్ర పరిశోధనలూ, ప్రయోగాలూ చాలా అవసరమనీ, అవి ప్రజల సమస్యల పరిష్కారానికి మార్గం చూపేవిగా ఉండాలనీ, అవి సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసం ఉండకూడదనీ అంటున్నారు. **పి.వి. రమణ**

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) అంగారక గ్రహంలో వాతావరణం, ఖనిజాలు, జీవాన్వేషణ తదితర అంశాలపై పరిశోధన జరిపేందుకు నవంబర్ 5న, శ్రీహరికోటలోని షార్ కేంద్రం నుండి 'మార్స్ ఆర్బిటర్ మిషన్ (మామ్)' అనే పేరుతో పిఎస్ఎల్‌విసి–25 ఉపగ్రహాన్ని ప్రయోగించారు. దీనికి 'మంగళ్యాన్' అని పేరు పెట్టారు.

ఉపగ్రహం 25 రోజుల పాటు భూకక్ష్యలోనే తిరుగుతూ, 9 నెలల పాటు ప్రయాణం చేసి 2014 సెప్టెంబర్ 24న అంగారక గ్రహ కక్ష్యలోనికి చేరుతుంది. ఈ ఉపగ్రహంలో ఉన్న 5 పరికరాల ద్వారా పరిశోధన జరుపుతారు. భారత శాస్త్రవేత్తలు భారత్‌లోనే అభివృద్ధి చేసిన సాంకేతిక పరిజ్ఞానంతో, భారత్‌లోనే తయారైన పరికరాలతో దీనిని తయారు చేశామని, ఇది 100 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఉపగ్రహమని శాస్త్రజ్ఞులు తెలిపారు. భూమి ఆవరణం ఛేధించుకుని రోదసిలో మరో గ్రహాన్ని లక్ష్యంగా చేసుకుని భారతదేశం జరిపిన మొట్టమొదటి అంతరిక్ష ప్రయోగమని కూడా చెప్పారు. ఈ సంవత్సరం ఆగస్టు 19న మార్స్‌పై ప్రయోగాన్ని తలపెట్టి ఊహించని సాంకేతిక సమస్యలు తలెత్తడంతో అప్పుడు ప్రయోగాన్ని నిలిపేశారు.

ఇస్రో చైర్మన్ రాధాకృష్ణన్ ప్రయోగానికి ముందు రోజున సతీసమేతంగా రాకెట్ నమూనాతో తిరుపతి సందర్శించుకుని శ్రీవారి పాదాల చెంత ఉంచి స్వామి వారి ఆశీస్సులు పొందారు. అనంతరం శ్రీకాళహస్తీశ్వరుడ్ని, సూళ్ళూరుపేట గ్రామ దేవత చెంగాళమ్మను కూడా దర్శించుకున్నారు. రాధాకృష్ణన్ ఒక వ్యక్తిగా దేవుడ్ని కొలిస్తే ఎవరూ ప్రశ్నించరు. కాని శాస్త్రీయతకు గౌరవం తేవాల్సిన అత్యంత ఉన్నత స్థాయిలో ఉంటూ చేపట్టిన ఈ చర్య, సెక్యులర్ దేశంగా ప్రకటించుకున్న భారతదేశంలో, 'శాస్త్రీయ దృక్పథాన్ని, మానవతా దృష్టిని, జిజ్ఞాసను, సంస్కరణ అభిలాషను పెంపొందించడం పౌరుల విధి' అని ఆదేశించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఎ ను అవమానించినట్లే. దీనిపై స్పందిస్తూ 'మనుషులు అన్నింటికి భయపడుతారు. దేవున్ని ప్రార్థిస్తే తాము చేసే ప్రతిపనీ ఫలిస్తుందని వారి విశ్వాసం. రాకెట్ పూజలు మూఢనమ్మకమే' అని భారతరత్న ప్రొ. సి.ఎన్. రావు అన్నారు. నోబుల్ బహుమతి గ్రహీత, ప్రసిద్ధ శాస్త్రవేత్త అయిన సర్ సి.వి. రామన్ ఆఖరి గడియల్లో ఉన్నప్పుడు ఆయన భార్య ఇప్పుడైనా దేవున్ని తలుచుకోమని కోరినప్పుడు 'మానవుని చైతన్యంలోనే నాకు విశ్వాసం ఉందని' తెలుపుతూ గాంధీని, క్రీస్తుని, బుద్ధుడిని తలచుకుంటూ 'నా అంత్యక్రియలు అట్టహాసాలు, పటాటోపాలు లేకుండా నిరాడంబరంగా జరపాలని' కోరారని ప్రొఫెసర్ 'రామశేషన్' రాసిన 'సివి రామన్ పిక్టోరియల్ బయోగ్రఫీ'లో పేర్కొనడాన్ని ఈ సంధర్భంలో గుర్తు చేసుకోవడం చాలా అవసరం.

అమెరికాలో మార్స్‌పై ప్రయోగాలు జరిపిన శాస్త్రవేత్తలు మామ్ ప్రయోగంలో భారత శాస్త్రవేత్తలతో తమ ఆలోచనలను పంచుకున్నారు. 'చంద్రయాన్–1 ఆవిష్కరణతో ప్రారంభమైన అమెరికా, భారత్‌ల అంతరిక్ష సహకారం నిలకడగా సాగుతుంది. మన అంగారక యాత్రను కూడా నాసాతో పాటు అమెరికాకు చెందిన జెట్ ప్రొపల్షన్ ల్యాబరేటరీలు కూడా పాలుపంచుకుంటున్నాయి. ప్రస్తుత సహకారం ఉపగ్రహాల అభివృద్ధి దిశగా కూడా కొనసాగుతుంది' అని రాధాకృష్ణన్ వివరించారు. దీన్ని బట్టి స్వదేశీ పరిజ్ఞానంతో చేసినట్లుగా చెపుతున్న మన ప్రయోగంలో అమెరికా పాత్ర కూడా ఉన్నట్లు మనకు అర్థం అవుతుంది.

'అంగారక గ్రహం ఎగువన 1000 కిలోమీటర్ల దూరంలోని కక్ష్యలో ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టేందుకు 2 టన్నుల ఇంధనం అవసరం. ఇందుకు చాలా శక్తివంతమైన రాకెట్ కావాలి. అంత సామర్థ్యం మనకు లేకపోవడం వలన శక్తికి తగ్గట్టుగా పరిభ్రమణ కక్ష్యను ఖరారు చేశాం. మనకు జియో సింక్రనస్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ (జిఎస్ఎల్‌వి) రాకెట్ అందుబాటులో ఉన్నట్లయితే 1400–1500 కిలోల బరువైన ఉపగ్రహాన్ని పంపేవాళ్లం. కాని ప్రస్తుత పరిస్థితిని బట్టి 850 కిలోగ్రాముల

ఏర్పడింది. 'ఆహార భద్రతా సంస్థ' కూడా కొన్ని రకాల క్రిమి సంహారకాలను వాడకం వల్ల జీవుల మనగడకు ప్రమాదం అని నిర్ధారించారు.

హరిత విప్లవం పేరుతో అనాలోచితంగా, అవగాహన లేకుండా, అడ్డగోలుగా రసాయన ఎరువులు, కీటక నాశకాలను వాడడం వల్ల, పర్యావరణాన్ని పట్టించుకోక, సహజ వనరుల విధ్వంసం జరిగి వినాశనానికి దారితీస్తోంది. 'మితిమీరిన వినియోగత్వం, హద్దులేని ప్రకృతి సంపదల దోపిడి, ఈ రెండే పర్యావరణానికి ప్రధాన శత్రువులు' అన్న కాస్ట్రో మాటలను మననం చేసికోవలసిన అవసరం ఉంది. బహుళజాతి కంపెనీలు తమ వ్యాపార లబ్ధికోసం అసత్యాలను, అర్ధసత్యాలను ప్రచారం చేసి వాటి ఉత్పత్తులను పెంచుకొని లాభాలను ఆర్జిస్తున్నాయి. సరళీకృత ఆర్థిక విధానాలు అమలులోకి వచ్చిన గత రెండు దశాబ్దాలుగా వీటి తీవ్రత పెరిగింది. ప్రజారోగ్య భద్రతకు, ప్రకృతి పరిరక్షణకు వ్యతిరేకంగా చేపట్టే విధానాలను వ్యతిరేకించి పర్యావరణాన్ని కాపాడుకొనే బాధ్యత ఆలోచనపరుల, బుద్ధిజీవులతో పాటు ప్రజల మీద ఉంది.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

ఇంధనాన్నే తరలిస్తున్నాం. దీంతో అర్థవంతమైన ప్రయోగాన్ని చేయగలమా అనేది ప్రశ్న. అంగారక గ్రహ గురుత్వాకర్షణ శక్తి పరిధిలోని కక్ష్యలో ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టగలమా అన్నది పరీక్షించుకోవడమే మా లక్ష్యం' అని రాధాకృష్ణన్ అన్నారు. 'ఈ పరీక్షలో గెలిచిందీ లేనిదీ 10 నెలల తర్వాతే తెలుస్తుంది. 2016లో అంగారకుడు మీదికి ల్యాండర్‌ను, 2018లో రోవర్‌ను ప్రయోగించడానికి సన్నాహాలు చేస్తున్నాం. జి.ఎస్.ఎల్.వి. అందుబాటులో లేకపోవడం వల్ల 'పోలార్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ (పి.ఎస్.ఎల్.వి)' ని ఉపయోగించాం' అని కూడా అన్నారు.

ఈ ప్రయోగంపై ప్రతిస్పందిస్తూ 'ఇదంతా ప్రచారపు స్టంటు జియో సింక్రనస్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ బదులు (జి.ఎస్.ఎల్.వి) పోలార్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ (పిఎస్ఎల్‌వి)తో సరిపెట్టుకున్నారు. ఇది టోపీని సరిపెట్టడం కోసం తలను నరికినట్లుగా ఉంది. జిఎస్ఎల్‌వి కొరత వలన చాలా ముఖ్యమైన కార్యక్రమాలను తగ్గించుకోవాల్సి వచ్చింది. మిథేన్‌ను కనిపెడతామంటున్నారు గాని, దాని గురించి అమెరికా ఇప్పటికే వివరించింది. ప్రయోజనం లేదని తెలిసి కూడా ప్రయోగించడం శుద్ధదండగ. దీని బదులు చంద్రయాన్-II ని ప్రయోగిస్తే మనకు చాలా ఉపయోగపడి ఉండేది' అని మాజీ ఇస్రో చైర్మన్ మాధవన్ నాయర్ విమర్శించారు.

చంద్రుడి మీద పరిశోధనల కోసం, మన దేశంలో 2008 అక్టోబర్ 22న చంద్రయాన్ - I (పిఎస్ఎల్‌విసి-11) ను ప్రయోగించారు. ఇది భూమి నుండి 4 లక్షల కిలోమీటర్ల దూరం ప్రయాణం చేసింది. అంగారక గ్రహ యాత్ర దాదాపు 400 మిలియన్ కిలోమీటర్ల దూరం ఉంటుంది. చంద్రయాన్ చంద్రుడు చుట్టూ పరిభ్రమించినప్పటికీ అది భూమ్యాకర్షణ శక్తి పరిధిలోనే ఉంది. అంగారక ఉపగ్రహం ఈ పరిధిని దాటి అంగారక గ్రహ గురుత్వాకర్షణ శక్తి పరిధిలోనికి వెళుతుంది. అంగారకుడికి చేరువయ్యే కొద్దీ ఉపగ్రహపు వేగాన్ని తగ్గించాలి.

1998లోనే జపాన్ 'నోజుమి' ఉపగ్రహాన్ని మార్స్‌పై పరిశోధనలకు ప్రయోగించినా సాంకేతిక సమస్యల వలన విచ్ఛిన్నమైపోయింది. చైనా 2012లో మార్స్ పైకి పంపిన ఉపగ్రహం 'ఇంగ్ హు మో' కూడా భూమి ఆవరణం ఛేదించే సమయంలో కాలిపోయింది. ఇప్పటివరకు మార్స్‌పై 51 ప్రయోగాలు జరిగినా వాటిలో అమెరికా, రష్యా, యూరప్‌లకు చెందిన 21 ప్రయోగాలు మాత్రమే అంగారక యాత్రను జయప్రదంగా నిర్వహించాయి. నాసా ఇంతవరకూ మార్స్‌పైకి 20 ఉపగ్రహాలను ఉపయోగించింది. 21వ ఉపగ్రహం, 'మార్స్ అట్మాస్ఫియర్ అండ్ వాలటైల్ ఎవల్యూషన్ (మావెన్)' ను 2013 నవంబర్ 18న ఫ్లోరిడాలోని కేప్ కార్నివాల్ నుండి ప్రయోగించింది. మార్స్ రహస్యాలు ఛేధించడానికి, ప్రత్యేకంగా ఒకప్పుడు జీవుల ఉనికికి అవకాశమున్న మిథేన్‌ను కలిగిన గ్రహం, దాన్ని కోల్పోవడానికి దారి తీసిన పరిస్థితులను అన్వేషించడానికి ఈ ప్రయోగమని చెప్పారు. గతంలో అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా' పంపిన 'క్యూరియాసిటీ' జరిపిన పరిశోధనల ద్వారా మార్స్ గ్రహంపై జీవం ఉనికిని చాటే మిథేన్ వాయువు లేనట్లుగా గుర్తించారు. కాని క్యూరియాసిటీ ఒక్క ప్రాంతానికే పరిమితమైందని, గ్రహమంతటా పరీక్షించలేదని మన 'మామ్' ఆ పని చేయగలదని మన శాస్త్రజ్ఞులు అంటున్నారు.

భూమికి, అంగారక గ్రహానికి ఎన్నో సారూప్యతులున్నాయి. ఈ పరిశోధన వలన భూమిపై జీవం పుట్టుకకు సంబంధించిన మరిన్ని వివరాలు లభించవచ్చని భావిస్తున్నారు. అంగారక గ్రహం ఉపరితలంపై ఏమున్నదో, దాని స్వరూప స్వభావాలు ఎలా ఉన్నాయో, అక్కడ ఖనిజాలు ఉన్నాయా లేదా, అక్కడ వాతావరణం ఎలా ఉంటుంది, జీవం ఉనికికి సంబంధించిన మిథేన్ వాయువు ఉందా అనే ప్రశ్నల జవాబుల కోసమే ఈ ప్రయోగం జరుగుతుందని అంటున్నారు. అంగారకుడుపై ఒకప్పుడు జీవులు నివసించేవని, ఇప్పుడు అక్కడ జీవుల ఉనికికి అవకాశం లేకపోయినా 'టెర్రా ఫార్మింగ్' పద్ధతుల ద్వారా అలాంటి పరిస్థితులను సృష్టించవచ్చని కొంతమంది శాస్త్రవేత్తల అభిప్రాయం.

భూమి లాగే అంగారక గ్రహమంతా పూర్తిగా శిలామయంగా ఉంటుంది. అది సూర్యుడి నుండి నాలుగో గ్రహం. ఎరుపు రంగులో ఉండడం వలన దీనికి అరుణ గ్రహం (రెడ్ ప్లానెట్) అనే పేరు వచ్చింది. ఉపరితలం మీద ఐరన్ ఆక్సైడ్ ఎక్కువగా ఉండడం వల్లే ఆ రంగు వచ్చింది. భూమికి చంద్రుడు ఉన్నట్లే, అంగారకుడికి 'ఫోబోస్', 'డైమోస్' అనే రెండు సహజసిద్ధ ఉపగ్రహాలున్నాయి.

భూమికి అత్యంత చేరువలో ఉన్న రెండవ గ్రహం అంగారకుడు. దాదాపు 34 మిలియన్ మైళ్ల దూరంలో ఉంది. అంగారకుడి వ్యాసం 68,000 కిలోమీటర్లు. భూమితో పోలిస్తే ఇది దాదాపు సగం మాత్రమే. అంగారకుడిపై రోజుకు 24 గంటల 37 నిమిషాలు. భూమి సూర్యుడి చుట్టూ తిరిగి రావడానికి 365 రోజులు పడుతుండగా అంగారకుడికి 687 రోజులు పడుతుంది.

అంగారకుడిపై ఓజోన్ పొర లేకపోవడంతో భారీగా అణు ధార్మికతకు గురవుతుంది. ఈ గ్రహంలో 95 శాతం కార్బన్ డై ఆక్సైడ్, 3 శాతం నైట్రోజన్, 1.6 శాతం ఆర్గాన్, స్వల్ప పరిమాణాల్లో నీరు, ఆక్సిజన్ ఉన్నాయి. సరాసరి ఉష్ణోగ్రత 60 డిగ్రీల సెల్సియస్‌లో ఉంటుంది. భూమితో పోలిస్తే అంగారకుడి గురుత్వాకర్షణ శక్తి 37.5 శాతం మాత్రమే ఉంటుంది. భూమి మీద ఒక మీటరు ఎత్తు ఎగరగలిగితే, అంగారకుడిపై 3 మీటర్ల ఎత్తు ఎగరగలరు. 'స్పేస్ షూట్' ధరించకపోతే అక్కడ మన రక్తంలోని ఆక్సిజన్ బుడగల రూపంలోకి మారిపోయి మరణానికి దారి తీస్తుంది.

మామ్ ప్రయోగాన్ని గొప్ప ముందంజ అని పొగుడుతున్నారు. కాని అంతరిక్షంపై ఆధిపత్యం కొరకు ధనిక దేశాలు విచ్చలవిడిగా జరుపుతున్న ప్రయోగాల వలన ఇప్పటికే తీవ్రమైన ప్రమాదాలు జరిగే పరిస్థితి నెలకొంది. పైగా మన దేశ నూతన సైన్స్ టెక్నాలజీల విధానం పూర్తిగా విదేశీ పరిజ్ఞానం మీదే ఆధారపడే విధంగా ఉంది.

ప్రమాదకరంగా మారుతున్న అంతరిక్షం

భూమ్యాకర్షణ శక్తిని కొలవడానికి, తద్వారా సముద్రపు ఆటుపోటుల ఉధృతిని సమీక్షించడం కోసం 2009లో ప్రయోగించిన యూరప్‌కి చెందిన ఒక పరిశోధనా ఉపగ్రహం (జిఒసిఇ) విఫలమై 2013 నవంబర్ 11న భూమిపైకి దూసుకు వచ్చింది. సైబీరియా దాటి పసిఫిక్ మహాసముద్రం, పశ్చిమ భారత సముద్ర ప్రాంతం, అంటార్కిటికాల మీదుగా ప్రయాణం చేసింది. 1,100 కిలోగ్రాముల బరువున్న ఈ ఉపగ్రహంలో దాదాపు 75 శాతం వాతావరణంలో కలిసిపోయి, మిగిలిన 275 కిలోగ్రాముల భాగం ఫాక్ లాండ్ దీవులకు కొన్ని వందల

కిలోమీటర్ల దగ్గర్లో పడింది. ఇంతవరకూ ఎటువంటి నష్టం జరిగినట్లు సమాచారం లేదు. 2013 అక్టోబర్ 21 నాటికి దాని ఇంధనం అయిపోవడం వలన 3 వారాల పాటు వాతావరణంలోనే తిరుగుతూ చివరకు నవంబర్ 11న భూమిని ఢీకొంది.

ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటి వరకూ దాదాపు 6,600 ఉపగ్రహాలను ప్రయోగించారు. వీటిలో ప్రస్తుతం రోదసిలో 3,600 ఉన్నా, వాటిలో 1000 మాత్రమే పనిచేస్తున్నాయని యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ తెలిపింది. అమెరికాకు చెందిన 'స్పేస్ సర్వైలెన్స్ నెట్‌వర్క్' జరిపిన సర్వే ప్రకారం ఆకాశంలో ఈ ఉపగ్రహాల విడిభాగాలు దాదాపు 23,000 ఉన్నాయి. వీటిలో కొన్ని మనకు తెలియకుండానే భూమిపై పడిపోతాయి. ప్రతి వారం జిఒసిఇ లాంటి విఫలమైన ఉపగ్రహాలు వాటి పరికరాలు భూమి పైకి వస్తూనే ఉంటాయని, ప్రతి సంవత్సరం 100 నుండి 150 మెట్రిక్ టన్నుల ఉపగ్రహాల విచ్ఛిన్న భాగాలు భూ గురుత్వాకర్షణ శక్తిలోకి ప్రవేసిస్తుంటాయని 'యూరప్ స్పేస్ డెబ్రిస్' ఆఫీస్‌కు చెందిన అధికారి 'హోల్గర్ క్రాగ్' అన్నారు. గత 56 సంవత్సరాల్లో 15,000 మెట్రిక్ టన్నుల ఉపగ్రహ వ్యర్థాలు, వాటి విడి భాగాలు భూమి మీదకు వచ్చాయి. ఇవి భూమి పైకి 120 కిలోమీటర్ల దూరం వచ్చేవరకూ గంటకు 28,000 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించి, అక్కడి నుండి కొంచెం నెమ్మదిగా భూమి పైకి వచ్చిపడతాయి. ఆఖరి 10 నిమిషాలలో గంటకు 200 - 300 కిలోమీటర్ల వేగంతో భూమిని ఢీకొంటాయి. గ్రహాల శకలాలు మాత్రమే(ఉల్కలు) భూమిని ఢీకొనే ప్రమాదం ఉంది గాని, మానవులు ప్రయోగించిన ఉపగ్రహాల శకలాలు భూమిని ఢీక్కొనే ప్రమాదం లేదని కొంతమంది శాస్త్రజ్ఞులు అంటున్నారు. కాని, కొన్ని ఉదాహరణలు చూస్తే అది నిజం కాదని తెలుస్తుంది. 1979లో 74 మెట్రిక్ టన్నుల బరువున్న అమెరికాకు చెందిన 'స్కైలాబ్ స్పేస్ స్టేషన్' విచ్ఛిన్నమయి దాని భాగాలు ఆస్ట్రేలియాలోనూ, సముద్రంలోనూ పడ్డాయి. రష్యా ప్రయోగించిన 'మీర్ స్పేస్ స్టేషన్' కు చెందిన 135 మెట్రిక్ టన్నుల విడిభాగాలు 2001లో పసిఫిక్ సముద్రంలో పడ్డాయి. అంతరిక్షంలో ఆధిపత్యం కోసం సామ్రాజ్యవాద దేశాలు, వారి అనుయాయులు విచ్చలవిడిగా ప్రయోగిస్తున్న ఉపగ్రహాల వలన భవిష్యత్తులో తీవ్రమైన ప్రమాదాలు ఏర్పడే అవకాశం చాలా ఉంది.

శాస్త్ర పరిశోధనల్లో మనది అధమ స్థానం

మన దేశ పాలకులు కార్పొరేట్ ప్రయోజనాల కోసం దేశంలోని యువతను ఐటి రంగం వైపు ప్రోత్సహించడంతో శాస్త్ర పరిశోధనా రంగంలో ఉదాసీనత అలుముకున్నదని భారత రత్న బిరుదు పొందిన ప్రముఖ రసాయన శాస్త్రవేత్త ప్రొఫెసర్ సి.ఎన్.ఆర్. రావ్ అన్నారు. ఇంకా 'శాస్త్ర పరిశోధన రంగంలో నూతన ఆవిష్కరణలలో 140 ప్రపంచ దేశాల లిస్ట్‌లో భారత్‌ది 64వ స్థానం. పరిశోధనా పత్రాల సమర్పణలో అయితే మనం అధమ స్థానంలో ఉన్నాం. ఆసియా, ఆఫ్రికా దేశాలు ఎదుర్కొంటున్న తీవ్రమైన నీరు, శక్తి కొరతల గురించి పరిశోధనలు జరగాలి. ఒకవైపు వరదలు వచ్చే సమయంలో కూడా తాగు నీరు దొరకని పరిస్థితి దేశంలో ఉంది. కాలుష్యమైన నీటి వలన మన దేశంలో దాదాపు 60 శాతం చావులు సంభవిస్తున్నాయి. సెనెక్స్, వ్యాపారాలు బాగున్నంత మాత్రాన దేశం బాగున్నట్లు కాదు. మన దేశంలో కాస్త ఎక్కువ డబ్బులు వస్తే చాలు విదేశాలకు వెళ్లడానికి సిద్ధమైపోతారు. ఇన్ఫర్‌మేషన్ టెక్నాలజి అసలు సైన్సే కాదు. అది కొందరు డబ్బులు సంపాదించుకోవడానికి ఉపయోగపడుతుంది' అని నేటి పరిస్థితి మీద తీవ్రంగా స్పందించారు.

2013 జనవరి 3 నుండి 7 వరకు కోల్‌కత్తాలో జరిగిన 'ఇండియన్ సైన్స్ కాంగ్రెస్' సమావేశంలో సైన్స్, టెక్నాలజి, నూతన ఆవిష్కరణల కార్యక్రమాలకు పెట్టుబడుల నిర్వహణలకోసం, ప్రధాని మన్మోహన్ సింగ్ నూతన పాలసీని (ఎస్.టి.ఐ.పి) ప్రకటించారు. ఈ కొత్త విధానం 'ప్రజల కొరకు సైన్స్, టెక్నాలజి' గా కొనసాగాలని నిర్వచించారు. కాని, ఈ పాలసీని వివరిస్తూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజి కార్యదర్శి డా. టి. రామసామి 'కేంద్ర, రాష్ట్ర స్థాయిలో వ్యాపార సంఘాల నుండి (చాంబర్ ఆఫ్ కామర్స్) దాదాపు 4,800 ప్రతినిధుల అభిప్రాయాల సారాంశంగా ఈ విధానం తయారైందని' తెలిపారు. దీన్ని బట్టి మన దేశ సైన్స్ పాలసీ వ్యాపారస్తుల అవసరాల కోసం, వారి వ్యాపారాల అభివృద్ధి కోసం తయారైందని మనకు సులువుగానే అర్థమౌతుంది. నూతన సాంకేతిక అవసరాలకు కొత్త వ్యూహ రచనతో, నూతన వాటాదార్లతో కలవాల్సిన అవసరం ఉందని, తద్వారా విదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందగలమని ఈ పాలసీలో ప్రకటించారు. ఈ కొత్త పాలసీలో మార్కెట్ పోటీకి తట్టుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలనే విధానం వలన ప్రస్తుత ఆచరణలో అసమానతలు తలెత్తుతున్నాయని కార్యదర్శి తన వివరణలో వాపోవలసి వచ్చింది. వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూ.టి.ఒ) ఆదేశాలకు అనుగుణంగా చేసుకుంటున్న ఒప్పందాల సారాంశమే ఈ సైన్స్ పాలసీ అని, కొత్త ఆవిష్కరణలు చేయగల శక్తి, సామర్థ్యాలు గల శాస్త్రజ్ఞుల సలహాలు ఏమాత్రం తీసుకోకుండానే ఈ పాలసీ తయారైందని అనేకమంది శాస్త్రవేత్తలు విమర్శిస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భాగం చేస్తూ, నయా ఉదారవాద మార్గంలో ప్రయాణిస్తుండడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడిందని కూడా విమర్శించారు.

పేదరికంతో నేడు దేశంలో కోట్లాదిమంది ప్రజలు తిండిలేక పస్తులుంటున్నారు. వ్యవసాయరంగంలో లక్షలాదిమంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. సామ్రాజ్యవాద దేశాల అవసరాలకు దేశ వనరులన్నీ నాశనం అయిపోతున్నాయి. అన్ని రంగాలలోనూ అవినీతి విచ్చల విడిగా కొనసాగుతుంది. దీంట్లో ఇస్రో కూడా ఉంది. ఈ సమస్యలకు పరిష్కారాలు చెప్పలేని మన పాలకులు, శాస్త్రవేత్తలు 'ఉట్టికెగరలేనమ్మ స్వర్గానికి ఎగిరినట్టు' అంగారక గ్రహంపై మిథేన్ ఉందా లేదా అనే సమస్యను పరిష్కరించడం కోసం ప్రయోగాల పేరుతో పరుగులెత్తడం హాస్యాస్పదమే కాకుండా నేరం కూడా. దళారీ పాలకుల పాలనలో జరిగే పరిశోధనలు, ప్రయోగాల ఫలితంగా ఒనగూడే ప్రయోజనాలు ఏమైనా ఉన్నా, వాటి ఫలితాలు పెత్తందారీ దేశాలకే ఉపయోగపడతాయి. ప్రధాని ప్రకటించిన సైన్స్ పాలసీని గమనించిన వారికెవరికైనా, దానిలో స్వదేశీ పరిజ్ఞానం అన్న మాటకు ఏమాత్రం విలువ లేదని సులువుగానే అర్థమౌతుంది. శాస్త్ర పరిశోధనలను, ప్రయోగాలను ఎవరూ వ్యతిరేకించరు. అవి అత్యవసరం కూడా. కాని అవి ప్రజల సమస్యల పరిష్కారానికి మార్గం చూపే దిశగా కొనసాగాలి. అవి సామ్రాజ్యవాదుల పడగ నీడలో కాకుండా నిజమైన అర్థంలో స్వతంత్రంగా సాగాల్సిన అవసరం ఉంది.

(రచయిత కార్మికోద్యమ నాయకులు) వీ

విధ్వంస శక్తుల ప్రతినిధి మోడీ

ప్రజల ప్రాణాలు హరించిన నరేంద్రమోడీని దేశ ప్రధానిగా ముందుకు తేవడంలో సంఘ్‌పరివార్‌కి వెన్నుదన్నుగా కార్పొరేట్, సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ శక్తులు తమ వంతు పాత్ర పోషిస్తున్నాయని అంటున్నారు బి. రామకృష్ణ

మార్చ్ 1995 నుండి సెప్టెంబర్ 1996 వరకు దాదాపు సంవత్సరన్నర కాలం పాటు, అలాగే 1998 నుండి నేటివరకు గుజరాత్‌లో బిజెపి అధికారంలో ఉంటూ వస్తోంది. 7 నవంబర్ 2001 నుండి నిరాఘాటంగా నరేంద్రమోడీ గుజరాత్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉంటున్నాడు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) భావజాలాన్ని పుణికిపుచ్చుకుని, దాన్ని పకడ్బందిగా ముందుకు తీసుకెళ్తున్నాడు. సంఘ్ పరివార్ శక్తులు నరేంద్రమోడీ వంటి కరుడుగట్టిన వ్యక్తిని ముందుకేసి, ఒక రాష్ట్ర రాజకీయాధికారాన్ని కైవసం చేసుకుని, అక్కడ తమ వ్యూహాలను అమలు చేసుకుంటూ వస్తున్నాయి. ప్రజాస్వామ్యం పేరుతో ఎన్నికైన మోడీ ముఖ్యమంత్రి హోదాలో ఆర్ఎస్ఎస్ భావజాల వ్యాప్తితోపాటు, దాని కార్యాచరణను విస్తరిస్తూ, నిస్సిగ్గుగా మైనారిటీలపై విద్వేషపూరిత విషాన్ని చిమ్ముతూ అధికార దుర్వినియోగం చేస్తున్నాడు. మైనారిటీ మతస్తులపై విద్వేష పూరిత విషాన్ని భారత సమాజంలో అడుగడుగునా నింపే ప్రయత్నాన్ని ఆర్ఎస్ఎస్ దాని ఆవిర్భావం నుండి చేస్తూనే ఉంది. 1925 పోరాటకాలంలో ఎన్నడూ ఆంగ్లేయులకు వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపింది లేదు. ఆర్ఎస్ఎస్‌కు చెందిన సావర్కర్ ఆంగ్లేయులకు క్షమాపణలు చెప్పి అండమాన్ నికోబార్ జైలునుండి బయటపడ్డాడు. గొప్ప సహనమున్న మతం హిందూ మతమని గొప్పగా చెప్పుకుంటాయి. అయితే అహింస మార్గాన్ని చెప్పిన గాంధీని 1948లో పబ్లిక్‌లోనే ఆర్ఎస్ఎస్ భావజాలంతో ఉన్న నాధురాంగాడ్సే హత్య చేశాడు.

2002లో గుజరాత్ రాష్ట్రంలో ముస్లింలపై జరిగిన ఊచకోత దుర్మార్గమైన, అసహ్యకరమైన, హేయమైన చర్యగా భారత చరిత్రలో నిలిచిపోయింది. దాదాపు రెండువేల మంది చంపబడ్డారు. గృహ దహనాలు, లూటీలు, అత్యాచారాలు విచ్చలవిడిగా జరిగాయి. దీనికంతా కూడా రాష్ట్ర అధికార యంత్రాంగం వెన్నుదన్నుగా నిలిచింది. హక్కుల సంఘాలు, మీడియా స్పష్టంగా రిపోర్ట్ చేశాయి. ఈ దారుణ కాండను రూపకల్పన చేసి అమలు జరిపింది వివెచ్‌పి మరితర సంఘ్‌పరివార్ శక్తులేనని తెహెల్కా స్టింగ్ ఆపరేషన్‌లో సహితం బహిర్గతం అయ్యింది. ఆర్ఎస్ఎస్ గుజరాత్‌ను ప్రయోగశాలగా ఎంచుకుంది. చాపకింద నీరులా ఎన్నో ఏళ్ల నుండి తమ భావజాలాన్ని, విద్వేషపూరిత రాజకీయాలను, పర మతాల పట్ల అహేతుక ద్వేషాన్ని పెంపొందిస్తూ, దీన్ని విద్యార్థి దశ నుంచే నూరిపోసే (జ్ఞానభారతి, సరస్వతి శిశుమందిర్‌లలో) విధానాల్ని పకడ్బందీగా సంఘ్‌పరివార్ శక్తులు చేపట్టాయి. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగంలోని కీలకమైన, ఉన్నతమైన అధికారాల్లో తమ భావజాలం ఉన్న వారిని ఉండేలా జాగ్రత్త పడ్డారు. ఆర్ఎస్ఎస్ బలమైన రాజకీయ శక్తిగా, రాజకీయాధికారంలో తమకనుసన్నలలో నడిచే మోడీని నియమించుకుంది. ఇక దాని ఆడిందే ఆటలకు హద్దులు లేకుండా రోడ్ క్లియర్ చేసుకుంది. కచ్చితమైన దీర్ఘకాలిక పక్కా వ్యూహంతో హిందూత్వం పనిచేస్తున్నది. అది గుజరాత్‌లో 2002లో గోద్రాలో రైలు బోగీలో కరసేవకుల దహనానికి నిరసనగా అన్నట్లు దాన్ని ఒక సాకుగా తీసుకుని ముస్లిం జీనోసైడ్‌గా చెప్పబడుతున్న విచ్చల విడి మారణ హోమాన్ని చేపట్టి తన నిజ స్వరూపాన్ని బయట పెట్టుకుంది. ఈ దారుణ సంఘటన కంటే ముందు దేశంలో పలు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నో మతఘర్షణల్లో ప్రత్యక్ష హింసాపూరిత పాత్రను, పరోక్ష విద్వేష పూరిత భావజాల వ్యాప్తిని సంఘ్‌పరివార్ శక్తులే నిర్వహించాయని ఎన్నో కమీషన్‌లు నిరూపించాయి. అమాయక ప్రజల ప్రాణాలను అవలీలగా పొట్టన పెట్టుకున్న దుర్మార్గపు చరిత్ర ఈ శక్తులకున్నది.

తమిళనాడులో హిందువులకు, క్రైస్తవులకు మధ్య జరిగిన ఘర్షణల గురించి న్యాయ విచారణ జరిపిన జస్టిస్ వేణుగోపాల్ ఆర్ఎస్ఎస్ మతపరమైన అల్లర్లను, హింసను ఎలా రెచ్చగొడుతుందో వివరించాడు. క్రైస్తవులు దేశభక్తులు కారంటూ రెచ్చగొట్టడం వారిపై ద్వేషాన్ని పెంచడం, మైనారిటీల జనాభా పెరిగి హిందూ జనాభా తగ్గి పోతుందని చెపుతూ హిందువుల్లో అభద్రతా భావాన్ని పెంచడం, పాలనా యంత్రాంగంలో చొరబడి అందులో మతతత్వాన్ని పెంపొందించడం, హిందూ మత యువకులకు కత్తులు, ఇతరత్ర ఆయుధాలు ఉపయోగించడంలో తర్ఫీదునివ్వడం, ప్రతీ చిన్న సంఘటనకు మతం రంగు పులుముతూ ప్రచారం చేయడం, వదంతులు వ్యాపింపచేయడం ద్వారా భిన్న మతాలకు చెందిన ప్రజల మధ్య ఎడాన్ని పెంచడం అనే పద్ధతులను ఆర్ఎస్ఎస్ ఉపయోగిస్తుంది. సరిగ్గా ఇదే పద్ధతిలో గుజరాత్‌లో సంఘ్‌పరివార్ శక్తులు దశాబ్దాల తరబడిగా పనిచేస్తూ 2002లో తమ వ్యూహాన్ని అమలు చేశాయి. ఇది కేవలం ముస్లిం మైనారిటీలకు మాత్రమే ప్రమాదకరమైనది కాదు. ఈ దేశంలోని ప్రజాతంత్ర లౌకికవాద శక్తులన్నిటికీ ఒక హెచ్చరిక. బిజెపి ఒకే జాతి, ఒకే ప్రజ, ఒకే చట్టం అనడం ద్వారా హిందూత్వాన్ని ఆదివాసులు, దళితులు, స్త్రీలు, ముస్లింలు, క్రిస్టియన్‌లు ఇతర మైనారిటీ మతస్థులపై నిరంకుశంగా ఫాసిస్టు దురహంకారాన్ని రుద్దే ప్రయత్నం చేస్తున్నది. ఆర్ఎస్ఎస్ సిద్ధాంత కర్తలు భారతదేశాన్ని ఒక హిందూ దేశంగా, బలమైన అగ్ర రాజ్యంగా నిలబెట్టాలని, ఈ దేశంలో హిందువులు తప్ప మరెవ్వరు ఉండే వీలు లేదని భావించారు. వారి ప్రకారం హిందూ రాజ్యంలోని వారంతా హిందూ మతాన్ని అంగీకరించాలి. ఆదరించాలి. దాని నుండి బయటకు వెళ్లకూడదు.

దళితులైనా, స్త్రీలైనా, ఆదివాసులైనా, హైందవ సమాజం అమలుచేసే నియమాల అదుపు నుండి బయటకు పోవడానికి వీలు లేదు. వారిని బలప్రయోగంతో బయటకు పోకుండా ఆపుతారు. క్రిస్టియన్‌లుగా ఉన్న ఆదివాసులను హిందూ మతంలోకి తెచ్చే ప్రయత్నం పేరుతో లక్ష్మణానంద స్వామి (కందమాల్, ఒడిశా) వంటి వారితో హిందుత్వ వాదులు చేశారు, చేస్తున్నారు. అసలు, దళితులు, ఆదివాసులు ఒబిసిలను హిందువులని ఎలా అంటున్నారు? ఈ సిద్ధాంతం నేపథ్యంలో నేడు మోడీ బిజెపి నుండి ప్రధాని అభ్యర్థిగా ప్రకటింపబడ్డాడు. భారతదేశంలో జరిగిన ప్రతి మత కాల్పుల వెనుక సంఘ్‌పరివార్ క్షేత్రస్థాయి. కార్యకర్తలున్నారనేది నిర్వివాదాంశం. ఇవ్వాళ సంఘ్‌పరివార్ శక్తులు సుశిక్షితులై క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారు. ఎంతో సులభంగా మత విద్వేశాలను రెచ్చగొట్ట గలుగుతున్నాయి. పక్కా ప్రణాలికతో పనిచేసేలా ఆ శక్తులు విస్తరించి ఉన్నాయి. ఈ శక్తులే బిజెపిని ఒకప్పుడు కేంద్రంలో అధికారంలోకి తేగలిగాయి. కొన్ని రాష్ట్రాల్లో బిజెపిని అధికారంలో నిలబెట్టగలిగాయి.

నరేంద్రమోడీ ముఖ్యమంత్రిగా గద్దెనెక్కిన మూడు నెలల్లోనే గుజరాత్‌లో 2002లో సంఘ్‌పరివార్ శక్తులు జాతిహనన చర్యను జరిపారు. ఇంత దారుణమైన సంఘటన జరిగినా కూడా అదే సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో బిజెపి గెలిచి తిరిగి మోడీ ముఖ్యమంత్రి అయ్యాడు. అంతే కాకుండా ఆ తరువాత వరుసగా 2007, 2012ల్లో జరిగిన ఎన్నికల్లో సహితం బిజెపి అధికారంలోకి వచ్చింది. తిరిగి మోడీయే ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యాడు. గుజరాత్ రాష్ట్రంలో ప్రజలు ఇన్ని దారుణాలు చేసినా మోడీని ఎందుకు ఎన్నుకుంటున్నారో ఆలోచించాల్సిన విషయం. ఎందుకు జినోసైడ్‌ను వ్యతిరేకిస్తూ మోడీని ఓడించలేదు దానివెనుకున్న అసలు సంగతులను విశ్లేషించాల్సిన అవసరం ప్రజాస్వామిక, లౌకిక శక్తులపై ఉన్నది.

గుజరాత్ ప్రయోగంలో విజయం పొందిన సంఘ్‌పరివార్ శక్తులు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని బిజెపి ద్వారా ప్రధాని అభ్యర్థిగా ప్రకటింప చేశాయి. దాదాపుగా 2000 మంది ముస్లింలను చంపి మరణహోమం సృష్టించి దానికేమాత్రం పశ్చాత్తాపం ప్రకటించని వ్యక్తిని ప్రధానమంత్రిగా ముందుకు తెచ్చారు. ఇది దేశంలోని ప్రజాస్వామిక, లౌకిక శక్తులపై వారికున్న చులకన భావం అలాగే తమ ఫాసిస్టు దమనకాండను భవిష్యత్‌లో దేశవ్యాప్తంగా అమలు చేయడానికి దూకుడుగా ముందుకు రావడాన్ని సూచిస్తున్నది. ఈ మధ్య మోడీ సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని ప్రపంచంలోనే అతిపెద్ద విగ్రహంగా 182 మీటర్ల ఎత్తులో ఏర్పాటు చేస్తానని చెబుతున్నాడు. దేశ వ్యాప్తంగా ప్రజలు ఇనుము, ఉక్కు విరాళంగా ఇవ్వాలని కోరుతున్నాడు. ఈ విగ్రహ నిర్మాణ ఖర్చు 340 మిలియన్ డాలర్ల (2,040 కోట్ల రూపాయలు)ని అంచనా. పటేల్ వ్యవసాయదారుని కొడుకని, భారత ఉక్కుమనిషని, 550 వరకు విడివిడిగా ఉన్న సంస్థానాలను భారత యూనియన్‌లో కలిపిన వాడిని చట్టాన్ని ధృడసంకల్పంతో అమలు చేశాడని పటేల్ గురించి మోడీ చెప్పుకొస్తున్నాడు. 1947లో దేశ విభజనను పటేల్ వ్యతిరేకించాడు. ముస్లిం పాలకుడైన నిజాం పాలించిన పెద్ద సంస్థానమైన హైదరాబాద్ రాజ్యాన్ని, అలాగే జూనాగడ్ సంస్థానాన్ని నిరంకుషంగా, ఉక్కుపాదంతో అణిచివేసి భారత్‌లో కలిపేశాడు. ముక్కలు ముక్కలుగా ఉండే వివిధ సంస్థానాదీశుల పాలనలో ఉన్నటువంటి ప్రాంతాలను పటేల్ ఏకీకరణం చేశాడని అలా ఏకీకరణ పొందిన భారత్‌ను మేం గ్లోరిఫై చేస్తామని మోడీ చెబుతున్నాడు. నెహ్రూ ప్రభుత్వంలో హోం మంత్రిగా పటేల్ చేసిన ఈ పని హిందూత్వ ఎజెండాలోని అఖండ హిందూ రాజ్యానికి దగ్గరగా ఉందేమో ఆలోచించాలి.

భారత్‌ను అఖండ హైందవ జాతిగా, అగ్రరాజ్యంగా చూడాలను కుంటున్న సంఘ్‌పరివార్ శక్తులు ఏనాడైనా అమెరికా పెత్తందారీతనాన్ని, కుటల నీతిని అడ్డుకున్నది లేదు. కాంగ్రెస్ పాలనలో అమెరికాకు అనుకూలంగా, మన దేశానికి వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయాలను వ్యతిరేకించింది లేదు. సరికదా వాజ్‌పాయ్ (బిజెపి) పాలనలో అమెరికాకు అనుకూలంగా ప్రవర్తించారు. మనదేశ సంపదను కొల్లగొట్టుకుపోయే సామ్రాజ్యవాద శక్తులను నిలవరించక పోగా వారికి దాసోహం అయ్యారు. సామ్రాజ్యవాదం కాళ్లవద్ద మోకరిల్లడానికి జంకుబొంకు ఏమాత్రం లేకుండా నిస్సంకోచంగా సిద్ధపడుతున్నారు. దేశ సంపదను లూటీ చేస్తున్న అనేక ఎమ్ఎన్‌సిలకు, సామ్రాజ్యవాద శక్తులకు రెడ్ కార్పెట్ పరుస్తున్నారు. సెప్టెంబర్ 2001లో బిన్‌లాడెన్ డబ్లుటిసిపై చేసిన దాడి ప్రపంచ ముస్లిం సమాజంపై తీవ్రమైన కక్షను పెంచుకుంది. ముస్లింలంటేనే టెర్రరిస్టుల నేతగా ఆ సమాజంపై అనుమానంగా, అన్యాయంగా ప్రవర్తిస్తున్నది. ఈ పరిస్థితి సంఘ్‌పరివార్ శక్తులకు అనుకూలంగా మారింది. ఒకప్పుడు మోడీకి వీసా నిరాకరించిన అమెరికా నేడు అదే మోడీని ప్రధాని పదవికి అర్హుడని అనుకూలంగా మాట్లాడడం జరుగుతున్నది. అంటే మతతత్వం, సామ్రాజ్యవాద శక్తులు ఎంతగా మిలాఖత్ అయ్యాయో తెలుసుకోవచ్చు.

2004 ఎన్నికల్లో వాజ్‌పాయ్ నేతృత్వంలోని బిజెపి అన్నికల్లోకి వెళ్లినపుడు భారత్ వెలిగిపోతోంది (ఇండియా షైనింగ్) అని అబద్దపు ప్రచారం చేసింది. కాని ఆ ఎన్నికల్లో పరాజయం పాలయ్యింది. 2009లో కూడా అధికారంలోకి రాలేకపోయింది. ఈసారైనా కేంద్రంలో అధికారం దక్కించుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నది. గుజరాత్‌లో అభివృద్ధి జరిగిందని (వైబ్రంట్ గుజరాత్) దానికి మోడీ నాయకత్వాన్ని కారణంగా చూపింది. 2002 గుజరాత్ ఎన్నికల్లో ముస్లిం విద్వేష రాజకీయాలలో అధికారంలోకి వచ్చిన బిజెపి నేడు అభివృద్ధి పేరుతో ముందుకు వస్తున్నది. నిజంగా గుజరాత్‌లో జరిగిన అభివృద్ధి ఎంత? అది అట్టడుగు ప్రజానీకానికి అందిందా? గుజరాత్‌లో కార్పొరేట్లు, ఎమ్ఎన్‌సిలు పెట్టుబడులు పెట్టడానికి కారణమేమిటి. నేడు కార్పొరేట్ శక్తులు మోడీని ఎందుకు ఆకాశానికి ఎత్తుకుంటున్నాయో అర్థం చేసుకోవాల్సి ఉంది.

2012లో యుఎన్‌సిఇఎఫ్ ప్రచురించిన రాష్ట్ర వారీ రిపోర్ట్‌లో ఆరోగ్యం, పోషకాహారం గురించి తెలుపుతూ, గుజరాత్‌లో 5 ఏళ్ల లోపున్న ప్రతి రెండవ బిడ్డ పోషకాహార లోపంతో ఉంది. ప్రతి నలుగురు పిల్లల్లో ముగ్గురు రక్తహీనతతో ఉన్నారు. బాల్య మరణాలు గత దశాబ్దకాలంగా చాలా తక్కువ రేటులో తగ్గుతున్నాయి. ప్రతి ముగ్గురిలో ఒక తల్లి తీవ్రమైన పోషకాహార లోపంతో బాధపడుతున్నదని, బాల్య వివాహాల్లో గుజరాత్ 4వ స్థానంలో ఉన్నదని చెప్పింది.

యుఎన్‌డిపి ప్రకారం పిల్లలను పాఠశాలల్లో కొనసాగించడంలో గుజరాత్ 18వ స్థానంలో ఉన్నది. ప్రథమ స్థానంలో కేరళ ఉన్నది.

అక్షరాస్యతకు సంబంధించిన 15 ప్రధాన రాష్ట్రాలలో గుజరాత్ 7వ స్థానంలో ఉన్నది. గుజరాత్‌లో సగానికంటే తక్కువ మంది విద్యార్థులు మాత్రమే తమ వయస్సుకు తగ్గట్లుగా చదవడం, రాయడం, లెక్కలు చేయడంగాని చేయగలుగుతున్నారని యుఎన్‌సిఇఎఫ్ చెప్పింది. ప్రభుత్వ పాఠశాలలో రెగ్యులర్ ఉపాధ్యాయుల నియామకాల కంటే కూడా విద్యా సహాయకుల పేరుతో తక్కువ జీతాలిస్తూ మన రాష్ట్రంలోని విద్యా వాలంటీర్లవలే నియమిస్తున్నారు. విపరీతంగా ప్రైవేటు విద్యా సంస్థలకు అనుమతులిస్తున్నారు. ఫలితంగా పేదలకు, నాణ్యమైన ప్రభుత్వ చదువులు దూరమవుతున్నాయి.

ఎన్ఎస్ఎస్ఒ గణాంకాల ప్రకారం 2004 నుండి 2010 సంవత్సరాల మధ్య పేదరికం తగ్గుదల శాతం అధికంగా 20.2 శాతంగా ఒడిశాలో ఉంటే తక్కువగా గుజరాత్‌లో 8.6 శాతం మాత్రమే ఉన్నది. ఎన్ఎస్ఎస్ఒ-2011 గణాంకాల ప్రకారం ఒక కూలీ సగటు దినసరి వేతనం గుజరాత్ పట్టణంలో రు. 106 ఉంది. అయితే కేరళలో రు. 218గా ఉండి దేశంలో ప్రథమ స్థానంలో నిలిచింది. గ్రామీణ ప్రాంతాల్లో పంజాబ్ ప్రథమ స్థానంలో రు. 152లతో ఉన్నది. గుజరాత్‌లో రు. 83లుగా ఉండి 120వ స్థానంలో ఉన్నది. గుజరాత్ రాష్ట్రంలో 67 శాతం గ్రామీణ కుటుంబాలకు టాయ్‌లెట్ వసతులు లేవు. 65 శాతం కటుంబ సభ్యులు బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేస్తున్నారు. పై సమాచారం ద్వారా నిజంగా గుజరాత్‌లో మోడీ సాధించిన అభివృద్ధి ఎంతో తేలిపోతున్నది.

కాంగ్రెస్ పార్టీకి చెందిన శక్తిసిన్హాగోహల్ (2009-12 అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు), అర్జున్ మోద్వాడియా (2004-07 అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు) ఇద్దరు కలిసి మోడీ ప్రభుత్వం చేసిన అక్రమాలు, అక్రమ అనుమతులపై అప్పటి రాష్ట్రపతి ప్రతిభాపాటిల్‌కు ఫిర్యాదు చేస్తూ ఈ కింది సమాచారాన్ని జతచేశారు. ఈ అక్రమాలపై క్రిమినల్ చర్యలు తీసుకొమ్మని కోరుతూ వాటికి తగిన ఆధారాలను, డాక్యుమెంట్లను సమాచార చట్టం ద్వారా సేకరించిన వాటిని జతచేశారు. అవేమిటో కొన్నింటిని చూద్దాం.

వేలం వేయకుండానే వెటర్నరీ విశ్వ విద్యాలయానికి రిజర్వు చేయబడిన 1100 ఎకరాల భూమిని చదరపు మీటరుకు రు. 900 చొప్పున టాటా మోటర్స్ కంపెనీకి గుజరాత్ ప్రభుత్వం కేటాయించింది. ఈ భూమి మార్కెట్ ధర చదరపు మీటరుకు రు. 10,000గా ప్రభుత్వానికి చెల్లించాల్సిన సొమ్మును ప్రతి ఆరు నెలలకు రు. 50 కోట్ల చొప్పున చెల్లించే వెసులుబాటును కూడా ఇచ్చింది. ఈ ప్రాజెక్టు మొత్తం ఖర్చు 2,200 కోట్లు అయితే గుజరాత్ ప్రభుత్వం ఆ కంపెనీకి ఋణ సహాయంగా 9,570 కోట్లను 0.1 శాతం వడ్డీకి 20 సంవత్సరాల మారిటోరియంతో ఇచ్చింది. ఎవరైనా, ఏ ఫైనాన్స్ సంస్థ అయినా సరే ప్రాజెక్టు ఖర్చుకు మించిన రుణం ఇవ్వరు. కానీ గుజరాత్ ప్రభుత్వం టాటా మోటర్స్‌కు మాత్రం ప్రాజెక్టు ఖర్చుకు 4.25 రేట్లు అధికంగా రుణం ఇచ్చింది.

ముంద్ర పోర్ట్, ముంద్ర సెజ్‌లకు సంబంధించి ఆదని గ్రూప్‌కు 3,86, 83,079 చదరపు మీటర్ల భూమిని 2003, 2004 సంవత్సరాల్లో కేటాయించింది. ఇక్కడ భూమిని ఆదని గ్రూప్‌కు చదరపు మీటరుకు రు. 1 నుండి రు. 32 వరకు కేటాయిస్తూ రు. 46,03, 16,292లను వారి నుండి గుజరాత్ ప్రభుత్వం రికవరి చేసుకున్నది. ఎంత చవకగా ప్రభుత్వ భూములను పారిశ్రామిక వేత్తలకు కట్టబెట్టిందో గమనించవచ్చు.

నవశ్రీ అగ్రికల్చరల్ యూనివర్సిటీకి చెందిన 65,000 చదరపు మీటర్ల భూమిని ఎలాంటి వేలం లేకుండానే 224 కోట్లకు ఎమ్/ఎస్ (చత్రాల ఇండియా) హోటల్ గ్రూప్ లిమిటెడ్‌కు చెందిన 7 నక్షత్రాల హోటల్ కొరకు అమ్మేశారు. ఈ భూమిని చదరపు మీటరుకు రు. 15,000 చొప్పున చత్రాల వారికి కేటాయించమని ప్రభుత్వ రెవెన్యూ ముఖ్య కార్యదర్శి 2005లో తెలిపారు. అయితే సూరత్ మున్సిపల్ కార్పొరేషన్‌వారు చదరపు మీటరుకు రు. 44,000 డిమాండ్ చేశారు కాని చత్రాల గ్రూప్ ఒప్పుకోలేదు. ఈ భూమి మార్కెట్ విలువ చదరపు మీటరుకు ఒక లక్షగా ఉందని దీని విషయంలో సుప్రీం కోర్టులో వాదనలు జరిగాయి. చదరపు మీటరుకు రు. 15,000కు బదులుగా రు. 35,000గా నిర్ణయించారు.

అహ్మదాబాద్‌లో సర్ఖేజ్-గాంధీనగర్ హైవే దగ్గర గల 21,300 చదరపు మీటర్ల నివాస స్థలాన్ని భారత్ హోటల్స్ లిమిటెడ్‌కు చదరపు మీటరుకు రు. 4,424 చొప్పున వేలం పాట లేకుండానే ఇచ్చేశారు. అక్కడ భూమి మార్కెట్ విలువ చదరపు మీటరుకు ఒక లక్ష రూపాయలున్నది.

గుజరాత్ రాష్ట్రంలో ముఖ్యమైన పట్టణాలకు, జిల్లా కేంద్రాలకు సమీపంలోని ఖరీదైన భూములను పరిశ్రమలకు, పారిశ్రామిక వేత్తలైన కార్పొరేట్ శక్తులకు వేలం లేకుండా డైరెక్టుగా కారుచవకగా లేదా నమ మాత్రపు ధరతో ఇచ్చేశారు. లార్సన్, టర్బో కంపెనీలకు హజారియాలో 8,00,000 చదరపు మీటర్ల భూమిని చదరపు మీటరుకు ఒక రూపాయి చొప్పున కేటాయించారు. చట్ట ప్రకారం వేలం వేయకుండా తమకు నచ్చిన, తమను మెచ్చిన కార్పొరేటు శక్తులకు వాటి ప్రయోజనాల కొరకు ప్రభుత్వ (ప్రజా) భూములను కారు చవకగా ఇచ్చి, ఋణ సదుపాయాలు, మౌలిక వసతులు కల్పించే ముఖ్యమంత్రి మోడీని పొగడకుండా కార్పొరేటు బాబులు ఉండగలరా? కార్పొరేటు శక్తులకు అండగా, రక్షణగా ఉండే ఒక నియంత వంటి వాడు వారికి అవసరంగా ఉన్నది. కార్పొరేట్ దోపిడీ శక్తులకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు వస్తే వాటిని నిర్దాక్షిణ్యంగా అణచి వేయగల కర్కోటకుడు వారికివ్వాళ అవసరమే మరి. పశ్చిమ బెంగాల్‌లో సింగూర్‌లో టాటాకార్ల కంపెనీకి భూమి కేటాయిస్తే ప్రజలు పోరాడి దాన్ని తరిమేస్తే గుజరాత్‌లో మోడీ దానికి రెడ్ కార్పెట్ పరిచి ఎంత చవకగా భూమిని కేటాయించి, ఋణం ఇచ్చి సహకరించాడో ఇంతకు ముందే చర్చించడం జరిగింది. కార్పొరేటు, బహుళజాతి సామ్రాజ్యవాద శక్తులకు అండగా ఉంటూ వాటి దోపిడీని ప్రజా ఉద్యమాల నుండి రక్షించగలిగే నియంత, ప్రతిభా పాటవాలను 2002లో గుజరాత్‌లోని ముస్లింలపై జరిపిన దారుణం సందర్భంగా చూసే ఉన్నారు కదా. ఇంత దారుణ మారణకాండ జరగడానికి కారకుడైన మోడీని దశాబ్ద కాలంగా ఏ కోర్టు, ఏ చట్టం, ఏ న్యాయం ఏమి చేయలేకపోయినా కళ్ల ముందు కదలాడే వాస్తవాన్ని ఈ శక్తులు గమనిస్తూనే ఉన్నాయి కదా. మరి అంతటి వికాస పురుషున్ని, తమ ప్రతినిధిగా, రక్షకుడిగా భావించకుండా ఎలా ఉండగలరు?

ఇవ్వాళ సంఘ్‌పరివార్, కార్పొరేట్, సామ్రాజ్యవాద శక్తులు హిందుత్వాన్ని మోస్తున్న నరేంద్రమోడీని ఎందుకు ముందుకు

రోడ్డు ప్రమాదాలు

***ప్రజా రవాణా వ్యవస్థను ప్రైవేట్‌పరం చేయడంలో భాగంగా ఆర్‌టిసిని బలహీనపరచడం, ప్రైవేట్ రవాణా వ్యవస్థపై నిఘా లేకపోవడం, ప్రజల ప్రాణాలను బలిగొంటున్నాయని అంటున్నారు* చిమ్మె జాన్ బర్నబాస్**

ఇటీవల 2013 అక్టోబర్ 30న హైదరాబాద్– బెంగుళూరు హైవే రోడ్ నెం.7 మీద కొత్తకోట సమీపంలోని 'పాలెం' గ్రామం వద్ద బస్సు ప్రమాదంలో 45 మంది ప్రయాణికులు కాలి బూడిదయ్యారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఎపిఎస్‌ఆర్‌టిసి)ని నిర్లక్ష్యం చేస్తూ, దానిని ఏదో ఒక విధంగా ప్రైవేట్‌పరం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తూ, మరోవైపు ప్రైవేట్ బస్సు ఆపరేటర్లను ప్రోత్సహిస్తోంది. ప్రైవేట్ బస్‌లో అయితేనే త్వరగా 'గమ్యం' చేరవచ్చనే దురభిప్రాయానికి ప్రజలు వచ్చేటట్లుగా ప్రభుత్వమే ప్రైవేట్ బస్సు ఆపరేటర్లను ప్రోత్సహిస్తూ వస్తోంది.

ఘటన జరిగిన తర్వాత ప్రభుత్వ రవాణాశాఖ స్పందిస్తున్న తీరు చూస్తుంటే, తమ తప్పులను తామే అంగీకరిస్తున్నట్లు ఉన్నది. గత సంవత్సరం క్రితం 'షిర్డి'కి పోయే బస్సు ప్రమాదం జరిగినప్పుడు కూడా ఇదే విధంగా రవాణాశాఖ బూటకపు దాడులు చేసి, కొన్ని ప్రైవేట్ బస్సులను 'సీజ్' చేస్తున్నట్లు ప్రకటించి, చేతులు దులుపేసుకుంటున్నది. అసలు ఈ రాష్ట్రంలో రోడ్డు భద్రతా అధికారిక సంస్థ అనేది ఒకటి మనుగడలో ఉన్నదా? ఈ సంస్థ సంవత్సరానికి ఒకసారి 'జనవరి' నెలలో భద్రతా వారోత్సవాలు జరపడం ఆ తర్వాత తమపని అయిపోయినట్లు చూస్తూ ఊరుకోవడం ఒక 'రివాజు' గా మారిపోయింది. ఈ రాష్ట్రంలో ఒక సంవత్సరానికి రోడ్డు ప్రమాద బాధితులు (మృతులు) దాదాపుగా 15 వేల మంది ఉన్నారు. అందులో శాశ్వత వికలాంగులు–అంగవైకల్యం–మృతులు అందరూ కలిపి 30 వేల మందిదాక ఉండవచ్చు. రోడ్డుకు ఇరువైపులా నిద్రించే వారిపై చాలాసార్లు వాహనాలు దూసుకెళ్లి మరణాలు సంభవిస్తున్నాయి. ఆగిన వాహనాన్ని 'ఢీ' కొట్టి, ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇందుకు ఆ వాహన డ్రైవర్లను మాత్రమే బాధ్యులను చేయడం విచారకరం. ఎందుకనగా, కేవలం గమ్యం త్వరగా చేరుకోవాలనే లక్ష్యం తోనే పనిచేస్తుంటారు తప్ప– వారు మిగతా విషయాలు ఆలోచించరు. మద్యం సేవించి, వాహనాలు నడుపుతున్న వారిపై రవాణాశాఖా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

రవాణాశాఖా అధికారులు కేవలం వాహన 'రిజిస్ట్రేషన్'లు, డ్రైవర్‌కు లైసెన్సులు జారీ చేయడం వరకే తమ పని అన్నట్లు వ్యవహరిస్తుండడం బాధ్యతారాహిత్యం. వాహనాల వేగాన్ని నియంత్రించడం, డ్రైవర్ల పని తీరును గమనించడం కూడా వారి విధి అయితే కేవలం మామూళ్ల మత్తులో మునిగి పోయిన అధికారులు ఉండడం చేత అందులోనూ ప్రైవేట్ బస్సు ఆపరేటర్లకు అధికార పార్టీ నాయకుల అండదండలు ఉండడం చేత, రవాణాశాఖా అధికారులు మత్తులో నిద్ర పోతున్నారు. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అత్యధికంగా రోడ్డు – రవాణా ప్రమాదాలు జరుగుతున్నాయంటే అందుకు బాధ్యత వహించవలసిన ప్రభుత్వంలోని పెద్దలు ఏమి చేస్తున్నట్లు.

'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భద్రతా అధికార సంస్థ'లో రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ (డిజిపి), రవాణాశాఖా ముఖ్య కార్యదర్శి, రవాణాశాఖా కమీషనర్, ప్రైవేట్ బస్సు ఆపరేటర్ల సంఘం ప్రతినిధులూ,

---

తెస్తున్నాయో అర్థం చేసుకోవడానికి బాలగోపాల్ ఏప్రిల్ 24, 1993 ఇపిడబ్లులో డిసెంబర్ 6, ఎందుకు జరిగింది? అనే వ్యాసంలో చెప్పిన మాటలతో ఈ వ్యాసం ముగిస్తాను.

'హిందూత్వ, మౌలిక ప్రాపంచిక దృక్పథం ఏమిటంటే సమాజం లేదా ప్రపంచం అన్నది భిన్న హోదాలు, భిన్న విశిష్ట అధికారాలతో నిర్మించబడిన దైవదత్త వ్యవస్థ. ఈ నిర్మాణంలో మనం ప్రతి ఒక్కరం ఒక నిశ్చిత స్థానానికి చెంది ఉంటాం. ధర్మం అంటే మనకు కేటాయించ బడిన ఆ స్థానానికి సంబంధించిన నియమాలను పాటించడమే. మంచి జీవితం అంటే ఎవరి స్థానాల్లో వాళ్లు బుద్ధిగా ధర్మానుసారం నడుచుకుంటూ నిచ్చెన మెట్ల వ్యవస్థలో జీవించడమే. ఈ విషయంలో హిందూత్వం రాజీపడే ప్రసక్తే లేదు. ఈ అంశాన్ని వదులుకునే ప్రశ్నే లేదు. సరిగ్గా ఈ కారణం వల్ల కొన్ని వర్గాలకు హిందూత్వం తెగనచ్చుతుంది. సమానత్వం, న్యాయం అనే భావాల స్ఫూర్తితో జాతి సంపదలో, హోదాలో వాటా కోరుకునే హక్కుల ప్రకటనలపైనా, ఈ హక్కుల ఉద్యమాల కారణంగా తమ స్వంత ఆస్తులు అభివృద్ధి చేసుకునే జాతీయ ఘనకార్యాలకు ఎదురయ్యే అవాంతరాలపైనా తీవ్ర ఆగ్రహం కలిగే వర్గాలకు హిందూత్వ భావజాలం అంటే అందుకే ఇష్టం'.

'భగవంతుడే భగవద్గీతలో తానే స్వయంగా చెప్పుకున్నట్లు గుణాన్ని బట్టి పూర్వజన్మ కర్మలను బట్టి మనుషులు, అధికులుగా, అల్పులుగా, స్వేచ్ఛా జీవులుగా, బానిసలుగా, ఉన్నతులుగా, నీచులుగా విభజించి నప్పుడు ఆ దైవదత్తమైన విభజనను అంగీకరించి బతకడమే ఉత్తమ జీవితం' అని హిందూత్వ స్పష్టంగా ప్రకటిస్తుంది. కాబట్టి జీవితం పట్ల అసంతృప్తి, దాన్ని మార్చుకోవాలని, బాగు చేసుకోవాలని కోరుకోవడం మొదలైనవన్నీ తప్పు అని వివరించే హిందూత్వను మించిన భావజాలం ఈరోజు దోపిడి వర్గాలకు ఎక్కడ దొరుకుతుంది.

(రచయిత ఉపాధ్యాయులు, పౌరహక్కుల సంఘ సభ్యులు) వీ

ఎపిఎస్ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ ఉంటారు. వీరందరూ రాష్ట్ర రవాణాశాఖా మంత్రి (బొత్స సత్యానారాయణ) పర్యవేక్షణలో ఉంటారు. పత్రికల ద్వారా, ప్రజల నుంచి వచ్చే డిమాండ్‌ను వీరు ఎంతవరకు స్వీకరిస్తున్నారు? అసలు ఇందులో ప్రజాభిప్రాయానికి చోటు ఉందా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రజలు, ప్రజాసంఘాలూ, ఇచ్చే విజ్ఞప్తులను వీరు అవలంభిస్తున్నారా? కేవలం మొక్కుబడిగా చేసే కార్యక్రమాలు తప్ప రోడ్డు భద్రతపై వీరు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? ప్రతి మూడు నెలలకోసారి సమావేశం కావలసిన 'భద్రతా అధికార సంస్థ' గత మూడు సంవత్సరాలుగా నిద్రపోతోంది. దీనిని పట్టించుకునే నాథుడే లేదు. సామాన్య ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతుంటే, 'తమకెందుకులే' అనే విధంగా ప్రవర్తిస్తున్నారు. ఇది పూర్తిగా ప్రభుత్వ పాలనాతీరుకు నిదర్శనం, దివాళాకోరుతనం. ప్రభుత్వం – ప్రజల మాన, ప్రాణాలకు బాధ్యత వహించాల్సిన పని లేదా? ఇది రాజ్యాంగ విరుద్ధం కాదా? ప్రజల ప్రాథమిక హక్కులను ఉల్లంఘించినట్లు కాదా? ప్రజల 'జీవించే హక్కు' ను నడి రోడ్డుపైనే ప్రభుత్వ అధికారులు కాలరాస్తున్నారు. రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం కూడా (తమకుగా తామే) కేసుగా స్వీకరించాలి. పత్రికా కథనాల ఆధారంగా, గతంలో రాష్ట్ర హైకోర్టు, సుప్రీంకోర్టు ఎన్నోసార్లు స్పందించింది. లేనిచో ప్రభుత్వంలోని పెద్దలు చూస్తూ, ఊరకుండి పోతారు. వీరి బాధ్యతా రాహిత్యానికి కఠిన చర్యలు ఉండవలసిందే.

'నేషనల్ హైవే' మార్గాలపై పర్యవేక్షణ లేకపోవడం భద్రతా వైఫల్యంలో భాగమే. వర్షాలకు దెబ్బతిన్న కల్వర్టులనూ, రోడ్డు మలుపులనూ వెంటనే, ఎప్పటికప్పుడు బాగుపరచడం లేదు. రోడ్డు కోసుకొని పోయినప్పుడు, ఫుట్‌పాత్ దెబ్బతిన్నప్పుడు, ఎప్పటికప్పుడు సరిచేయాలి. ఇది పూర్తిగా కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని 'ఉపరితల రవాణాశాఖా' పరిధిలోని అంశం. అంతేకాకుండా, వేల కోట్లలో వాటి టెండర్లను పెద్ద, పెద్ద కాంట్రాక్టర్లకు అప్పచెప్పుతూ ఉంటారు. వాటి రిపేరు పనులు సంవత్సరాల కొకసారి జరుగుతూ ఉంటాయి. అవి ఎన్ని సంవత్సరాలయినా పట్టవచ్చు. ఇది మరీ దారుణం. కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో వీటి పనులు జరగాలి. ఆ విధంగా జరగడం లేదు. దాదాపు 100 కిలోమీటర్లకు ఒక అగ్నిమాపక కేంద్రం కూడా ఉండాలి. అది అసలు కనబడదు. నేషనల్ హైవేపై బహిరంగంగా మాముళ్లు వసూళ్లు చేసుకునే బ్రేక్ ఇన్‌స్పెక్టర్లూ, ఆర్‌టిఓలూ దర్శనమిస్తుంటారు తప్ప, వేరొకరు కనబడరు. ఇది పూర్తిగా వసూళ్ల రాజ్యం అని కళ్లెదుటే కనబడుతుంది. రాష్ట్ర సరిహద్దుల వద్ద అయితే మరీ దారుణంగా ఉంటుంది.

ప్రైవేట్ బస్ ఆపరేటర్ల దురాగతాలు; ఒకే బస్ నంబర్ రిజిస్ట్రేషన్ చేయించుకొని, ఆ నంబర్‌తోనే 4 బస్‌లు నడుపుతూ ఉన్నారు. ఇది బహిరంగ రహస్యమే. జెసి. దివాకర్‌రెడ్డి (తాడిపత్రి శాసనసభ్యుడు) సోదరుడు జెసి. ప్రభాకర్‌రెడ్డి గత 35 సంవత్సరాల నుంచి ఇదే నిర్వాహకం. అనంతపురం – తాడిపత్రి, బెంగళూరు – హైదరాబాద్, అనంతపురం – మైసూర్, 'అనంతపురం – మదనపల్లి – చిత్తూరు' ఈ విధంగా వీరి ప్రైవేట్ బస్‌లు దాదాపుగా 150 ఉంటాయి. కానీ అన్నీ బినామీ పేర్లతో నడుపుతూ ఉన్నారు. రాష్ట్ర ప్రైవేట్ బస్ యజమానుల సంఘానికి అధ్యక్షునిగా జెసి. ప్రభాకర్‌రెడ్డి చాలా కాలం వ్యవహరించి, ఇటీవలే మరొకరికి అప్పజెప్పారు. బెంగళూరులోని కర్ణాటక రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్టాండ్ (మెజెస్టిక్) ఎదురుగా జెసి. ప్రభాకర్‌రెడ్డి కార్యాలయం 'దివాకర్ రోడ్‌లైన్స్' పేరుతో ఉంటుంది. వీరి వ్యాపార కార్యకలాపాల గురించి ఎంత రాసినా తక్కువే. ఇలాంటి వ్యక్తులపై చర్యలు తీసుకునే ధైర్యం ఏ ప్రభుత్వ అధికారికి ఉంది? ఇంతవరకూ ఏమి చేశారు?

ఒక్క బస్‌లే కాదూ, మైనింగ్, సిమెంట్ పరిశ్రమలూ, లిక్కర్, పెట్రోల్ బంక్‌లూ, ఈ విధంగా వారు నిర్వహించనీ, భాగస్వామ్యంలేని వ్యాపారం లేదు. ఇలాంటి వ్యక్తులను కేవలం జన బాహుళ్య చైతన్యంతోనే కట్టడి చేయగలం తప్ప మరి ఏం చేయలేం. ఒక పెద్ద వ్యవస్థగా మారిన వీరు ప్రజలపై పెత్తనం చేస్తూ, దౌర్జన్యాలు చేస్తూ, రాజకీయ అండతో, అధికారులను చెప్పుచేతల్లో పెట్టుకొని, తమ దోపిడిని కొనసాగిస్తున్నారు. ఇదంతా చట్టబద్ధంగానే జరుగుతూ ఉంది. వీరు కూడా 'రాజ్యాంగం' గురించి, రాజ్యాంగ మౌలిక సూత్రాల పట్లా విశ్వాసం ఉన్నట్లు మాట్లాడుతూ ఉంటారు. కానీ, అసలు ఈ దురాగతాలను ఏ విధంగా ఎదుర్కోవాలన్నదే మనముందు ఉన్న కర్తవ్యం కావాలి. ఒక్క జెసి. సోదరులే కాదు ఇలాంటివారు ఈ రాష్ట్రంలో వందల కొద్దీ ఉన్నారు. వీరందరూ ఏదో ఒక దుశ్చర్యలో భాగస్వాములే. ప్రజల హక్కులను ఏదో ఒక రూపంలో భంగం కలిగించేవారే. కావున 'ప్రభుత్వ' భాగస్వామ్యాన్ని పెంచుతూ, ప్రైవేట్ మార్కెట్ శక్తులను నిరోధించే ఉద్యమం జరగాలి. ఎపిఎస్ఆర్‌టిసిని బలోపేతం చేసే దిశగా ఈ రాష్ట్ర ప్రభుత్వం పయనించకుండా, దానిని మరింత బలహీనం చేసే దిశగా అడుగులు వేస్తోంది. దీనికి పెద్ద ప్రజా ఉద్యమం వస్తే తప్పా, ఈ ప్రభుత్వం మేల్కోదు. నిద్రపోతున్న ఈ ప్రభుత్వ యంత్రాంగాన్ని మేల్కొల్పడానికి అన్ని ప్రజాస్వామిక శక్తులూ ఏకమవ్వాలి. ముఖ్యంగా విద్యార్థి, యువజన, మహిళా, ఉద్యోగ, కార్మిక శక్తులు నడుంబిగించాలి. లేనిచో భవిష్యత్తులో మరిన్ని ప్రమాదాలు ఎదుర్కోక తప్పదు.

ప్రజల ప్రాణాలను కాపాడవలసిన, ప్రాణాలకు రక్షణ కల్పించ వలసిన ప్రభుత్వం ప్రజల ప్రాణాలను హరిస్తుంటే చూస్తూ ఊరుకోవడం కూడా నేరం అవుతుంది. దీనిని నిరోధించడానికి మనవంతు కర్తవ్యాన్ని, బాధ్యతను నిర్వహించాలి. లేనిచో భావితరాలు మనలను క్షమించవు.

(రచయిత న్యాయవాది, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర కమిటీ సభ్యులు)

వీ

ఇటీవల పోస్టల్ శాఖ అన్ని మనీ ఆర్డర్‌లను టెలిగ్రాఫిక్ మనీ ఆర్డర్‌లుగా పంపుతున్నది. మీరు ఎం.ఒ. చేసినప్పుడు కింద కూపన్‌లో రాసిన ఉత్తరం ఈ టెలిగ్రాఫిక్ ఎం.ఒ.లో మాకు చేరదు. కనుక ఎం.ఒ.లు చేసేవారందరూ విడిగా ఒక పోస్ట్‌కార్డు మీద మీరు ఎం.ఒ. ఎందుకు పంపుతున్నారో రాయండి. – సం.

'భారతరత్న' మాయాజాలం

సచిన్ టెండూల్కర్‌కు భారతరత్న ఇవ్వడం వెనుక పాలకుల ఓట్ల రాజకీయాలు, బహుళజాతి సంస్థల మార్కెట్ ప్రయోజనాలు తప్ప ప్రజల ప్రయోజనాలేమీ లేవంటున్నారు **డా. శ్రీనివాసరావు చొప్పర**

మరోసారి దేశంలో భారతరత్న అవార్డు ప్రధానంపై చర్చ జరుగుతోంది. అయితే గతంలో పలానా వ్యక్తికి భారతరత్న ఇవ్వాలని, ఆవ్యక్తి పూర్తిగా అర్హుడు అని కొంతమంది అంటే, అంతకంటే గొప్ప వ్యక్తి మావాడని అతనికే భారతరత్న ఇవ్వాలని చర్చ జరిగింది. రాజకీయ నాయకులకు ఈ అవార్డు ప్రధానం చేసినప్పుడు ఈ చర్చ ఇరుపక్షాల మధ్య జరిగేది. మా నాయకుడు గొప్పఅంటే మా నాయకుడు అంతకంటే గొప్పఅనే పద్ధతిలో ఆ చర్చ సాగి చివరికి రాజీపడ్డ ఘటనలు ఉన్నాయి. 1954లో ఈ అవార్డును ఏర్పరిచిన నాటి నుండి ఎవరు అధికారంలో ఉంటే వాళ్ల నాయకులకు భారతరత్న ఇచ్చుకున్నదే ఎక్కువ. అయితే ఆపని ఆ నాయకులు చనిపోయిన తరువాత చేయడం వల్ల ఎవరూ అంతగా అభ్యంతరం చెప్పింది లేదు. అలా అవార్డును ప్రకటించడం ద్వారా పెద్దగా ఆశించింది ఏమీలేదు ప్రతిష్టను పెంచుకోవడం తప్ప. కాని నేడు జరుగుతున్న చర్చ అందుకు భిన్నంగా రాజకీయ పక్షాలలో కాకుండా మిగిలిన సమాజంలో, మేధావులలో జరుగుతుంది. ఈ చర్చ రెండు విధాలుగా సాగుతుంది. ఒకటి భారతరత్న లాంటి అత్యున్నత పౌర పురస్కారానికి టెండూల్కర్ అర్హుడేనా? కాదా అని. జరుగుతుంటే, రెండోవైపు 4 సంవత్సరాల విరామం తరువాత ఇప్పుడు ప్రకటించడంలో ఆంతర్యం ఏమిటి? అనే దానిపైనా చర్చ జరుగుతుంది.

2008వ సంవత్సరానికి గాను సంగీత విద్వాంసుడు పండిట్ భీంసేన్ జోషికి భారతరత్నను 2009లో ప్రకటించారు. నాటినుండి ఇప్పటివరకు ఎవరికీ ఈ పురస్కారం ప్రకటించలేదు. ఒక సంవత్సరానికి గరిష్ఠంగా ముగ్గురికి మాత్రమే ఇస్తారు. ఇలా ఇప్పటి వరకు 41 మందికి ఈ అవార్డుని ఇవ్వగా ఇప్పుడు క్రికెట్ క్రీడాకారుడు సచిన్ రమేష్ టెండూల్కర్, సుప్రసిద్ధ శాస్త్రవేత్త ప్రధాన మంత్రి శాస్త్రీయ సలహామండలి అధ్యక్షుడు చింతామణి నాగేశ రామచంద్రరావులను భారతరత్నకు ఎంపిక చేస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది, సచిన్ 200వ టెస్ట్ మ్యాచ్ ఆడిన తరువాత అంతర్జాతీయ క్రికెట్‌కి సెలవు ప్రకటించే నవంబర్ 15ను ముహూర్తంగా పెట్టుకుని ఆ ప్రకటన చేసింది.

సచిన్ టెండూల్కర్ ఒక క్రీడాకారుడు. క్రికెట్ అంటే ఆయనకు ప్రాణం. 40 ఏళ్ల జీవితంలో 24 ఏళ్ల నుండి క్రికెట్ ఆడుతున్న వ్యక్తి. క్రికెట్‌లో ప్రపంచ రికార్డులను తిరగరాయడమే కాకుండా, తన ప్రపంచ రికార్డులను సమీప భవిష్యత్‌లో మరెవ్వరూ చేరుకోని విధంగా రికార్డులను సొంతం చేసుకున్న క్రికెటర్ టెండూల్కర్. అత్యధిక వండే సెంచరీలు, అత్యధిక టెస్ట్ సెంచరీలు, మొత్తం వంద సెంచరీలు చేసిన ప్రపంచ రికార్డు ఆయనదే. క్రికెట్ దేవుడిగా పేరు సంపాదించడమే కాకుండా స్వదేశంతోపాటు ప్రపంచ వ్యాప్తంగా లెక్కకు మించిన అభిమానులను గెలుచుకున్న నేటితరం క్రికెట్ క్రీడాకారుడు టెండూల్కర్. భారత ప్రభుత్వం ఇచ్చే ప్రతిష్ఠాత్మకమైన రెండవ పౌర పురస్కారంగా చెప్పబడే పద్మవిభూషణ అవార్డు, క్రీడారంగంలో అతి పెద్దదైన కేల్‌రత్న అవార్డులను తనకు ప్రధానం చేశారు. దేశంలో ఇలా ఏ ఆటకూ ఇవ్వనంత ప్రాధాన్యతనూ, గుర్తింపును క్రికెట్‌కు ఇచ్చి జాతీయ క్రీడగా ప్రకటించిన హాకీతో పాటు మిగిలిన క్రీడలన్నింటినీ బలహీనపరిచిన ఘనత ప్రభుత్వానిదే.

టీమ్ స్పిరిట్ కంటే వ్యక్తిగత రికార్డులకే అధిక ప్రాధన్యతనిచ్చే క్రీడ క్రికెట్. అందులో క్రీడాకారులు పరుగులు తీసినా, వికెట్లు తీసినా, క్యాచ్ పట్టినా, ఇలా పందుకున్నా, లేచినా రికార్డే. మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడి చెయ్యి ఎత్తినా, బాలును ముందు రుద్దినా, వెనుక రుద్దినా, కర్ఛీఫ్ జారవిడిచినా ప్రత్యర్థికి తగిన సంజ్ఞ అందించినట్లుగానే అన్నీ రికార్డులే. 2020 పేరుతో ఐపిఎల్ ఒక రకంగా అధికారికంగానే జూదం (అఫిషియల్ గ్యామిలింగ్) నడుపుతూ వేల కోట్ల రూపాయలు ఈ క్రీడ ద్వారా దోచుకోవడం, ఆ క్రమంలో క్రీడాకారులు మ్యాచ్ పిక్సింగ్‌లకు పాల్పడడం మనం చూస్తూనే ఉన్నాం. అలాంటి క్రీడకు ప్రాతినిథ్యం వహించిన వాడే సచిన్. ఇలా వ్యక్తిగత విశిష్టతకు అవసరమైన దానికన్నా ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చి, వ్యక్తిగత ప్రతిభ అనే భావనను తయారు చేసి వ్యక్తిని సమాజం కన్నా పైన నిలబెట్టడం జరుగుతుంది. సమాజానికి లేని శక్తులేవో వ్యక్తికి ఉన్నాయని భావించి ఆ వ్యక్తికి కిరీటం తొడగడం జరుగుతుంది. ఈ వ్యక్తివాదాన్ని పెట్టుబడిదారీ వ్యవస్థ మరింత ముందుకు తీసుకురావడమే కాకుండా వీలైనంత ఎక్కువగా తమ అవసరాలకు వినియోగించుకోవడం జరుగుతుంది. తమ సరుకులకు మార్కెట్ కల్పించుకోవడానికి, అవసరమైనప్పుడు అధికారంలోకి రావడానికి, ఉన్న అధికారాన్ని కాపాడుకోవడానికి అన్ని విధాలా ఉపయోగించుకుంటారు.

కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకత్వంలోని యుపిఎ-2 తిరిగి అధికారంలోకి రావడానికి అనేకఎత్తులు, వ్యూహాలు పన్నుతోంది. ఏ ఒక్క అవకాశాన్ని వదులుకోవడం లేదు. ప్రతిదాన్ని ఓట్లతో, సీట్లతో ముడిపెడుతుంది. ప్రతిదానిలో నాకు వనగూడే ప్రయోజనమెంత, నా శ్రేయోభిలాషులైన కార్పొరేట్ సంస్థలకు చేకూరే ప్రయోజనమెంత అనేది అంచనావేస్తుంది. తద్వారా అధికారాన్ని నిలబెట్టుకోవడానికి పడరానిపాట్లు పడుతుంది. ప్రస్తుతం జరుగుతున్న 5 రాష్ట్రాల ఎన్నికలలోనూ, రాబోయో పార్లమెంట్ ఎన్నికలలోనూ ఎలా లబ్ధి పొందాలన్నదే ప్రధానంగా ఉంది. ప్రతిపక్షాలను ఎలా చిత్తు చేయాలా అని ఆలోచిస్తుంది. అందులో భాగంగానే దేశ యువతను అమితంగా ఆకర్షిస్తున్న సచిన్ టెండూల్కర్‌కి భారతరత్న అవార్డు ప్రధానం చేయడం.

భారతరత్న పురస్కారం పొందడానికి నిర్దేశించిన నిబంధనల ప్రకారం అత్యున్నత జాతీయ సేవలు చేసి ఉండాలి. ఆ సేవలు కళా, సాహిత్య రంగాల్లో చేసి ఉండాలి. శాస్త్రవిజ్ఞాన రంగంలో విశిష్టమైన కృషిచేసిన

వారికి ఇవ్వవచ్చు. ఈ జాబితాలో క్రీడలు లేవు. 2011లో అప్పటి క్రీడల మంత్రి అజయ్‌మాకెన్ మహారాష్ట్ర అసెంబ్లీ తీర్మానం మేరకు టెండూల్కర్‌కి భారతరత్న పురస్కారం ఇవ్వడానికి వీలుగా భారతరత్న నిబంధనలను సడలించాలని ప్రభుత్వాన్ని కోరాడు. దానిని హోం శాఖ వ్యతిరేకించింది. వ్యతిరేకించడానికి గల మూడు, నాలుగు కారణాలలో ఒకటి సచిన్‌కి ఇవ్వాలంటే మొదట భారత హాకీ పితామహుడు ధ్యాన్‌చంద్‌కు ఇవ్వాల్సి ఉంటుందని, పరుగుల రాణి పి.టి.ఉషకి, గ్రాండ్ మాస్టర్ విశ్వనాథ్ ఆనంద్‌కు ఇవ్వాల్సి ఉంటుందని చెబుతూ అభ్యంతరం తెలిపింది. ఆ తరువాత అనూహ్యంగా 2011లోనే డిసెంబర్‌లో ఆ నిబంధనలను కేంద్రం సడలించింది. 'మానవ ప్రయత్నానికి' సంబంధించి ఏ రంగంలోనైనా అత్యున్నత ప్రదర్శన కనబరిస్తే భారతరత్న ఇవ్వవచ్చునని సవరణ చేశారు. క్రీడా రంగం అని నేరుగా ఆ సవరణలో ఎక్కడా పేర్కొనలేదు.

1954లో భారతరత్న అవార్డుని ఏయే రంగాలకు చెందిన వారికి ఇవ్వాలో తయారు చేసిన జాబితాలో క్రీడలు లేకపోవడానికి గల ప్రధాన కారణం అవి జాతిమొత్తానికి సేవలందించేవి కాకపోగా కేవలం మానసిక ఉల్లాసానికి, శారీరక ఆరోగ్యానికి మాత్రమే ఉపయోగ పడతాయి. మహా అయితే ప్రాంతాల మధ్య, దేశాల మధ్య సంబంధాలు మెరుగు పరుచుకోవడానికి (కచ్చితంగా మెరుగుపడతాయని ఏమీ లేదు) ఉపయోగ పడతాయి తప్ప మరే ప్రయోజనం లేదు. క్రీడలకు స్వాభావికంగానే ఆ పరిమితులు ఉన్న కారణంగానే ఆ జాబితాలో నాడు చేర్చలేదు. అంతర్జాతీయంగా ప్రకటించే నోబెల్ బహుమతుల జాబితాలో కూడా క్రీడలకు స్థానం లేకపోవడంలో ఇదే ప్రధానం అయి ఉంటుంది. కాని భారత ప్రభుత్వం ప్రధానంగా కాంగ్రెస్ అందుకు భిన్నంగా సవరణలు చేసి టెండూల్కర్‌కు భారతరత్న ప్రకటించింది. మరి హోంశాఖ సూచించినట్లుగా ధ్యాన్‌చంద్‌కు, ఇతరులకు ఎందుకు ఇవ్వలేదో ప్రభుత్వమే సమాధానం చెప్పాలి. టెండూల్కర్ కోసమే ధ్యాన్‌చంద్ పేరును పక్కన పెట్టినట్లు ఆరోపణ కూడా ఉంది. అయితే టెండూల్కర్‌కి భారతరత్న ఇవ్వడంలో తన మీద ఉన్న ప్రేమో, లేక మేటి క్రీడాకారుడ్ని సత్కరించాలన్న తపనో ప్రధానం అనుకుంటే అది మన పొరపాటే అవుతుంది.

టెండూల్కర్‌కు ఈ అవార్డును ప్రకటించడం ద్వారా ఎవరెవరు, ఏమి ఆశిస్తున్నారో పరిశీలించాలి. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ అధికారపక్షంగా ఉండి ఏమి ఆశిస్తుందో పరిశీలించినప్పుడు మనకు ఒక విషయం బోధపడుతుంది. నవంబర్ 15న టెండూల్కర్ తన 200వ టెస్ట్ మ్యాచ్ ఆడి ఇక క్రికెట్‌కు స్వస్తి చెప్పిన వెంటనే రాష్ట్రపతి భవన్ భారతరత్న అవార్డును సి.ఎన్.ఆర్. రావుతో కలిపి ప్రకటించింది. అయితే అలా ప్రకటించిన మరుక్షణమే 5రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో భాగంగా 15వ తేదీ రాత్రి మిజోరాం (ఎన్నికలు జరుగుతున్న 5 రాష్ట్రాలలో ఒకటి) లో ఒక ప్రచార సభలో దేశ ప్రధాని మాట్లాడుతూ 'క్రీడలకు మరింత ప్రాధాన్యతనిస్తాం. తద్వారా క్రీడాకారులకు అద్భుత భవిష్యత్తు ఉంటుంది. అంతర్జాతీయ క్రీడల్లో భారత్ గర్వపడేలా మీరు చేయవచ్చు. అందుకు కాంగ్రెస్‌కే ఓటెయ్యండి' అని ప్రసంగించడం కాంగ్రెస్ పార్టీ అవార్డు ప్రధానం ద్వారా ఏమి ఆశిస్తుందో సులభంగానే అర్థం చేసుకోవచ్చు. ఒక్క అవార్డు ప్రధానంతో కుంభకోణాలన్నింటిని రూపుమాపవచ్చునని ఆశిస్తుంది. ప్రస్తుతం యుపిఎ 2కి యువతను ఆకర్షించడానికి, వారి ఓట్లను కొల్లగొట్టడానికి గ్రామీణ ఉపాధి హామీ పథకం కంటే టెండూల్కర్‌కు భారతరత్న ఇవ్వడం ఆకర్షిత పథకంగా కనిపించిందనడంలో అతిశయోక్తి లేదు.

అందుకోసం గత రెండు సంవత్సరాలుగా ఎంతో ప్రయత్నం చేసింది. రాజ్యసభ సభ్యుడిగా కాంగ్రెస్ పార్టీ 2011లో నామినేట్ చేసింది. తద్వారా టెండూల్కర్ కాంగ్రెస్ ఎం.పిగా రాజ్యసభలో ప్రస్తుతం కొనసాగుతున్నాడు. ఫలితంగా అప్పటి వరకూ అందరివాడుగా ఉన్న సచిన్ కాంగ్రెస్ వాడిగా మారిపోయాడు. ఐనా క్రికెట్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించలేదు కాబట్టి అభిమానులలో ఆ ఆలోచన పెద్దగా రాలేదు. ఇది ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి కలిసివచ్చిన అంశం. ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్న సందర్భంలో ఇది ఎన్నికల కోడ్‌కు భిన్నమైనదైనప్పటికీ ఎన్నికల సంఘం కనీసంగా కూడా స్పందించలేదు. ఇదే అంశంపై ఒక ఆర్.టి.ఎ కార్యకర్త కోర్టుకు వెళ్లడం కూడా జరిగింది.

ప్రతిపక్ష బిజెపి గానీ, మరే ఇతర రాజకీయపార్టీ గాని కేంద్ర ప్రభుత్వ ఆలోచనలను గమనించినప్పటికీ అభ్యంతరం చెప్పడం లేదు. కారణం వ్యతిరేకిస్తే అతని అభిమానుల నుండి వ్యతిరేకతవచ్చి ఓట్లు కోల్పోతామేమో అని భయపడుతున్నాయి. అంతేకాక బిజెపి ఈ సందర్భంగా తన భారతరత్నాన్ని (వాజ్‌పేయి) ముందుకు తీసుకొస్తే, తెలుగుదేశం తెలుగు ఆత్మగౌరవం పేరుతో ఎన్‌టిఆర్‌ను ముందుకు తెచ్చి వారికి భారతరత్న ఇవ్వాలనే పాత డిమాండ్లకు పదును పెడుతున్నాయి. ఇలా రాజకీయ లబ్ధి పొందాలని ఎవరికి వారు ఆలోచిస్తున్నారు. తేలు కుట్టిన దొంగల్లా వ్యవహరిస్తున్నారు.

టెండూల్కర్ తన ప్రతిభను ఆరాధించే అభిమానులను క్రికెట్ పిచ్‌పైన అలరించడమే కాకుండా, బుల్లితెరపైనా, లేదా వీలైన ప్రతిచోటా ప్రత్యక్షమవుతూ అభిమానుల జేబులకు చిల్లులు పెట్టడం కూడా జరిగింది. ఇలా అభిమానుల పిచ్చి అభిమానాన్ని కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడంలో టెండూల్కర్ బూస్ట్ ద్వారా వచ్చిన ఎనర్జీని శాయశక్తులా ఉపయోగించాడనడంలో సందేహం లేదు. క్రికెట్ నిర్వాహకులు అతని చుట్టూ వేలకోట్ల రూపాయల విలువైన పరిశ్రమ నిర్మించుకోవడానికి సాధనమైనాడు. ప్రస్తుతం తను జాతీయంగా, అంతర్జాతీయంగా 17 బహుళజాతి కంపెనీల ఉత్పత్తులకు ప్రమోటర్‌గా వ్యవహరిస్తున్నాడు. అందులో గతంలో దేశం నుండి నిషేధించబడిన కోకాకొలా కూడా ఒకటి. ఇది భారతదేశ సంపదను దోచుకోవడమే కాకుండా యువతను మత్తు పదార్థాల వైపు ఆకర్షిస్తున్న కంపెనీ. దీనిని నిషేధించాలని అనేక మంది మేధావులు, ఉద్యమకారులు కోరుతున్నారు. అలాంటి కంపెనీకి టెండూల్కర్ ప్రమోటర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఆ కంపెనీ నుండి సంవత్సరానికి 1.2 మిలియన్ డాలర్లను పొందుతున్నాడు. గత సంవత్సరంలో టెండూల్కర్ మొత్తం ఆదాయం 22 మిలియన్ డాలర్లు కాగా అందులో 18 మిలియన్ డాలర్లు వ్యాపార ప్రకటనల పై పొందగా, జీతం, గెలుపు ప్రతిఫలం కింద 4 మిలియన్ డాలర్లు మాత్రమే పొందినట్లు వెల్త్ ఎక్స్ ఎస్టిమేట్స్ సంస్థ ప్రకటించింది. అలానే 160 మిలియన్ డాలర్లు అంటే సుమారు 1000 కోట్లకు అధిపతి అని కూడా ఆ సంస్థ ప్రకటించింది.

ఇప్పటివరకూ 17 కంపెనీలకే పరిమితం కాగా భారతరత్న ప్రకటించడంతో మరో 7 కంపెనీలు అగ్రిమెంట్‌కు సిద్ధంగా ఉన్నట్లు కూడా ఆ సంస్థ ప్రకటించింది. ఈ కంపెనీలు అంతా ఆశిస్తుంది టెండూల్కర్‌పై ఉన్న పిచ్చి అభిమాన జనాన్ని కొల్లగొట్టడం తప్ప మరొకటేమీలేదు. ఆ క్రమంలో తమ ప్రమోటర్ మరింత గుర్తింపు కలిగిన వ్యక్తిగా, ఇంకా ఎంతమంది అభిమానులను పొందగలిగే వ్యక్తిగా ఎక్కువ మార్కెట్‌ను సృష్టించగల వ్యక్తిగా నిలపాలన్నదే ఆ సంస్థల ప్రధాన ధ్యేయం. కాబట్టి ఆయా సంస్థలు భారతరత్న ప్రకటించిన వెంటనే

ఐదు రాష్ట్రాల ఎన్నికలు

పాలకులు తమ అధికారాన్ని అడ్డం పెట్టుకొని అవినీతికి పాల్పడుతూ, ప్రశ్నించే ప్రజలను అణచివేతలకు గురిచేస్తూ పేదరికంలో ఉంచిన కారణంగా ప్రజలు ఎన్నికల పట్ల విముఖత వ్యక్తం చేస్తున్నారని అంటున్నారు ఎల్. అరణ్య

ఎన్నికలంటే నాయకులు ప్రజలను మోసం చేయడమేనని, అది ఐదేళ్లకోసారి ప్రజలను వంచించే ప్రక్రియ అని, ఎన్నికలతో ప్రజలకేమీ ఒరగదని భావించే ఆలోచనాపరులు కొందరున్నారు. కాకుండా ఎన్నికలు ఏవో ఒరగబెడతాయని, ప్రజల జీవితాలను అవి పూర్తిగా మార్చేస్తాయనే అభిప్రాయం, నమ్మకం ఉన్నవారు, దేశంలో ఎన్నికలే అన్ని సమస్యలకు పరిష్కారమని, ఈ ప్రజాస్వామ్య సౌధాల పునాదులు ఎన్నికలేనని భావించే అత్యాశాపరులు కూడా ఉన్నారు. ప్రస్తుతం రెండు రకాల వారికి కూడా ఎన్నికలంటే వెగటు పుట్టే పరిస్థితులు తలెత్తుతున్నాయి. ప్రభుత్వాల, నాయకుల హేయ పరిపాలనల, క్రూర చర్యల వల్ల, పేదల పట్ల, వీరి హక్కుల పట్ల ప్రదర్శిస్తున్న అణిచివేతల వల్ల, వాగ్దానాలు, హామీల పేరిట నిత్యం జరుపుతున్న వంచనల వల్ల, మోస పూరిత చర్యల వల్ల ఆ వెగటు పరిమాణం రానురానూ పెరుగుతూ పోతున్నది. ఇప్పుడు జరుగుతున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ప్రజల అసంతృప్తులే సాక్ష్యాలు.

మిజోరం, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఢిల్లీ, చత్తీస్‌గడ్ రాష్ట్రాల్లో నవంబర్ – డిసెంబర్ నెలల్లో ఎన్నికలు జరుగబోతున్నాయి. ఐదు రాష్ట్రాల్లో ప్రజల తీర్పు ఎలా ఉండబోతుందనే ఉత్కంఠభరితమైన ఎదురుచూపులతో రాజకీయ పార్టీలు ఉన్నాయి. ఆయా రాష్ట్రాల్లో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి ఏమిటో, ప్రజల నిత్యజీవితంలో జరిగిన మెరుగు ఏమిటో చర్చించడానికి, కనీసం మాట్లాడడానికైనా అవి ముందుకు రావడం లేదు. వోట్లు – నోట్లు – సీట్లు ప్రాతిపదికలుగా ఎన్నికలను జూదంగా, బేరసారాల ప్రక్రియగా మార్చివేస్తున్నాయి.

రాజస్థాన్‌ను 2008 నుంచి పరిపాలిస్తున్న అశోక్ గెహ్లాట్ ప్రభుత్వం ప్రజలకు సుపరిపాలన అందించలేక పోయింది. 2003 నుంచి 2008 వరకు వసుంధర రాజె (బిజెపి) ప్రభుత్వం సాగించిన అస్తవ్యస్త పాలనకు వ్యతిరేకంగా ప్రజలు ఎన్నో ఆశలతో కాంగ్రెస్‌ను గెలిపించారు. అయితే ఈ ఐదేళ్ల గెహ్లాట్ పని తీరు కూడా చెప్పుకోదగ్గ స్థాయిలో లేదు. మొదటి మూడేండ్లైతే మరీ అధ్వాన్నంగా సాగింది. ఏడేళ్లు అధికారానికి దూరంగా ఉన్నామనే కారణంగా గెలిచిన మొదటి నెల నుంచే మంత్రులు, ఎంఎల్ఎలు ప్రజలను దోచుకుతినడం ప్రారంభించారు. అవినీతి రాష్ట్రమంతటా విస్తరించి పోయింది. కాంగ్రెస్ పార్టీ అనుకూల కాంట్రాక్టర్లు, అధికారులు, ప్రజా ప్రతినిధుల అవినీతికి అడ్డు, అదుపు లేకుండా పోయింది. మంత్రులు, ఎంఎల్ఎలు క్రిమినల్ కేసులలో ఇరుక్కున్నారు. దాంతో కొంతవరకైనా ప్రజలు ఆశతో గెలిపించిన ప్రభుత్వం నిరాశాజనకంగా తయారైంది. దీని నుంచి గట్టెక్కడానికి గెహ్లాట్ గత రెండేళ్లుగా ప్రయత్నిస్తూ వచ్చాడు. ప్రజాపంపిణీ వ్యవస్థలో కొన్ని మార్పులు తెచ్చాడు. తాగునీరు, సాగునీటి పై దృష్టి సారించే క్రమంలో ప్రాజెక్టుల కోసం టెండర్లు పిలిచాడు. ఉచితంగా మందుల పంపిణీ, వైద్య పరీక్షలు ప్రారంభించాడు. అయితే వీటిలోనూ అవినీతి, అస్తవ్యస్తతలే దర్శనమిచ్చాయి. ప్రజాపంపిణీ వ్యవస్థ ఫలితాలు బోగస్ లబ్ధిదార్లకు, డీలర్లకు, హోటళ్ల వారికి లభించాయి. ప్రాజెక్టుల టెండర్లలో భారీ అవినీతి జరిగింది. ఈ ప్రాజెక్టులు కూడా ముందుకు సాగలేదు. మందుల పంపిణీ, వైద్య పరీక్షలు కూడా తూతూ మంత్రంగానే సాగాయి. కార్పొరేట్ ఆసుపత్రులకు సౌకర్యాలు ఆపేసి ప్రభుత్వ వైద్యరంగాన్ని వృద్ధి చేయాల్సింది పోయి పైపై మెరుగులు దిద్దే వైద్య పరీక్షలు జరిగాయి. ప్రభుత్వం విద్యుత్ చార్జీలు విపరీతంగా పెంచింది. పేదలు, సామాన్యులకు విద్యుత్ చార్జీలు తలకు మించిన భారమయ్యాయి. మహిళలపై అత్యాచారాలు పెరిగాయి. పోలీసు వ్యవస్థ పనితీరు దిగజారిపోయింది. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయి.

రాష్ట్ర జనాభాలో గణనీయంగా ఉన్న గుజ్జర్లు 2008 ఎన్నికలలో ఉద్యోగాలలో నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పిస్తామనే అశోక్‌గెహ్లాట్ మాటలను నమ్మి కాంగ్రెస్‌కు ఓటు వేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ మాటను నిలబెట్టుకోలేదు. దాంతో గుజ్జర్లు కాంగ్రెస్‌పై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. అంతేగాక కాంగ్రెస్ ఈసారి అనేక మంది నేరస్తులను, ప్రజా వ్యతిరేకులను అభ్యర్థులుగా ప్రకటించింది. భన్వారిదేవి అత్యాచారం, హత్యకేసులో శిక్షపడ్డ మహిపాల్ మాదెర్న భార్య లీలా మాదెర్న (ఒసి–యాన్ స్థానం నుంచి), మిల్కాన్ సింగ్ బిష్ణోయ్ తల్లి అమ్రిదేవి (తానీ నుంచి), మరో అత్యాచారం కేసులో జైలుపాలైన బాబులాల్ నగార్ సోదరుడు హజారీ నగార్ (డుడు నుంచి), లైంగిక

పోటీపడి అభినందనలు తెలిపాయి. కార్పొరేట్ శక్తులకు లొంగిన ప్రభుత్వం మరో క్రీడాకారుడ్ని (ధ్యాన్‌చంద్‌ను) ఆ స్థానంలో కూర్చో బెట్టకుండా భారతరత్న పొందిన మొదటి క్రీడాకారుడిగా అతనికే గుర్తింపు నివ్వాలని భావించింది. ఇలా స్వామికార్యం, స్వకార్యం పూర్తి చేసింది కాంగ్రెస్‌పార్టీ.

ఇందులో మరోకోణం కూడా ఉంది. అది క్రికెట్‌కు విశిష్ట గుర్తింపు తీసుకురావడం ద్వారా యువతను మరింత ఆకర్షించడమే కాకుండా బెర్నాడ్‌షా చెప్పిన దాన్ని మరింత నిజంచేయాలి అన్నదే. క్రికెట్ గూర్చి బెర్నాడ్‌షా '22 మంది ఫూలీష్‌లు (ఆలోచనారహితులు) మైదానంలో తలపడుతుంటే 22వేల మంది ఫూలీష్‌లు వీక్షించడం జరుగుతుంది' అన్నట్లుగా యువతను మరింత ఆలోచనా రహితులుగా, శక్తిహీనులుగా మార్చి తమ సరుకులు కొనే వినియోగదారులుగా, డబ్బుకు అమ్ముడు బోయే ఓటర్లుగా మార్చడం నేడు మరింత అవసరం. అదే నేడు జరిగింది. ఇక క్రీడలను భారతరత్న అవార్డుల జాబితాలో చేర్చాలా వద్దా అనేదీ, టెండూల్కర్ ఆ అవార్డుకు అర్హుడా కాదా అన్నది తేల్చాల్సింది మీరే.

(రచయిత లెక్చరర్, జవహర్ భారతి డిగ్రీ కాలేజి, కావలి) వీ

వేధింపులతో మంత్రి పదవి కోల్పోయిన రాంలాల్‌జాట్ (అసిద్ నుంచి), అక్రమ మైనింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రి భరోసిలాల్ జాదవ్ (హిందాన్ నుంచి) లకు టికెట్లిచ్చారు.

కాంగ్రెస్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు సరిగ్గా గతంలో వసుంధర ప్రభుత్వం అనుసరించినవే కనుక వీటిపై పోరాడడానికి బిజెపికి కూడా మనసొప్పడంలేదు. రేపు తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఈ విధానాలనే కొనసాగించాల్సి ఉంటుంది కనుక శక్తివంతంగా వీటిపై బిజెపి ఉద్యమించడం లేదు. ప్రజలలో వసుంధర ప్రభుత్వంపై ఇంకా అసంతృప్తి పోలేదు. ఇప్పుడు గెహ్లాట్ ప్రభుత్వంపైనా అసంతృప్తి ఎక్కువగానే ఉంది. ఆ రెండు పార్టీలూ ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదనే నిరాశ ప్రజలను ఆవరించింది. అందుకే రాజస్థాన్ ప్రజలు ఈ ఎన్నికల పట్ల అయిష్టంగానే ఉన్నారు.

మిజోరం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. మిజో నేషనల్ ఫ్రంట్, మిజో పీపుల్స్ కాన్ఫరెన్స్‌లు అక్కడి ప్రాంతీయ పార్టీలు. మిజో ప్రాంతాలు మొదట్లో అస్సాంలో ఉండేవి. 1959 అస్సాం కరువు సమయంలో ఈ ప్రాంతాలను కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేసినందుకు గాను1961లో ఏర్పడి 1966, ఆ తర్వాత 1986 మిజో ఒప్పందం వరకూ మిజో నేషనల్ ఫ్రంట్ అజ్ఞాత పోరాటం సాగించింది. దాంతో 1987లో మిజోరం రాష్ట్రంగా అవతరించింది. 1998, 2003 ఎన్నికలలో గెలిచిన ఆ పార్టీ 2008 ఎన్నికలలో కేవలం 3 సీట్లు మాత్రమే గెలిచి ఘోర పరాజయం పాలైంది. మిజో ప్రజల స్వాభిమానం, జాతీయతలను పదేళ్ల అధికారంలో నిర్లక్ష్యం చేసిందనే కోపం ప్రజలలో పెరిగిపోయి కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. ఇప్పటికీ ఆ పార్టీ తీరు పెద్దగా మారలేదు. ఇక కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆ పార్టీకున్న సహజ లక్షణంగానే ప్రజల మౌలిక సమస్యలను విస్మరించింది. పదవుల సౌఖ్యంతో నాయకులు ప్రజలను దూరం కొట్టారు. అక్షరాస్యత ఉండీ నిరుద్యోగం ఎక్కువగా ఉన్న రాష్ట్రం మిజోరం. బంగ్లాదేశ్, నేపాల్, త్రిపురల నుంచి వలస వచ్చిన ప్రజల వల్ల స్థానికులకు ఉద్యోగావకాశాలు కరువయ్యాయి. ఈ వలస సమస్యలకు కాంగ్రెస్ పరిష్కారం కనుక్కోలేకపోయింది. రెండు దశాబ్దాలు ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ఉండి, ఇప్పుడు మూడవ స్థానానికి తగ్గిన మిజో పీపుల్స్ కాన్ఫరెన్స్ ఈ సారి కొంత పోటీని ఇచ్చేలా కనబడుతున్నా ప్రజల నమ్మకాన్ని పెద్దగా చూరగొనడం లేదు. వెరసి ప్రజలు ఈ మూడు పార్టీలనూ పెద్దగా నమ్మేటట్లు కనబడడం లేదు.

మధ్యప్రదేశ్‌లో గత ఎనిమిదేళ్లుగా శివరాజ్‌సింగ్ చౌహాన్ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలో ఉంది. వ్యక్తిగతంగా చౌహాన్‌కు ప్రజలలో కొంత మంచి పేరుంది. కానీ ఆయన మంత్రిగణం, శాసన సభ్యులు తీవ్రమైన అవినీతి చర్యలకు పాల్పడ్డారు. అధికారం ద్వారా ధనార్జనే ధ్యేయంగా వారు పనిచేస్తూ వచ్చారు. తద్వారా అనేక అభివృద్ధి పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందలేదు. ఈ ఐదేళ్లలోనయితే పరిస్థితి మరీ దిగజారింది. మంత్రులు అవినీతి కంపులో కూరుకుపోయారు. 13 మంది మంత్రుల అవినీతిపై లోకాయుక్తలో పిర్యాదులు నమోదయ్యాయి. కేంద్ర నిధులు కూడా మంత్రుల జేబుల్లోకి చేరాయి. గ్రామీణ ఆరోగ్య మిషన్, ఉపాధి హామీ వంటి కేంద్ర పథకాలు మంత్రులకు సంపాదనా మార్గాలుగా ఉపయోగపడ్డాయి. మహిళలపై అరాచకాలు పెరిగాయి. గనుల తవ్వకాలలో అనేక అక్రమాలు జరిగాయి. బిజెపి కార్యకర్తలే దళారులుగా, బడా వ్యాపారులుగా మారి ప్రజలను పీడించారు. ధరల విషయంలో గుత్తాధిపత్యంతో దోపిడికి పాల్పడ్డారు. వీరికి సిట్టింగ్ ఎంఎల్ఎల, మంత్రుల అండదండలు లభించాయి. ప్రభుత్వం రైతులను విస్మరించింది. కో – ఆపరేటివ్ సొసైటీల పట్ల కూడా ప్రజలలో వ్యతిరేకత పెరిగింది. సుపరిపాలనే ధ్యేయం అనే నినాదంతో ప్రచారం చేస్తున్న బిజెపి గత పదేళ్లుగా సుపరిపాలన ఎందుకు అందించలేదో చెప్పడం లేదు. సరిగ్గా ఈ వ్యతిరేకతను ప్రచారాంశంగా చేసుకుని కాంగ్రెస్ ఇబ్బడి ముబ్బడిగా హామీల వర్షం కురిపిస్తున్నది. పేదలే సభ్యులుగా ఉండే 'ఇందిరా గరీబీ హటావో కమిషన్' ఏర్పాటు చేస్తామని, పేదలకు వంట సిలిండర్ల పరిమితి 9 నుంచి 12 కు పెంచుతామని, రైతులకు ఐదు హార్స్‌పవర్ వరకు పంపుసెట్లకు ఉచిత విద్యుత్ ఇస్తామని, పేద కుటుంబాలకు నెలకు 35 కిలోల ఆహార ధాన్యాలిస్తామని, రైతుల రుణాలు మాఫీ చేస్తామని, మూడేళ్లకంటే ఎక్కువ లీజుపై ఉన్న కౌలుదార్లకు భూమిపై హక్కులు ఇస్తామని సాధ్యంకాని వాగ్దానాలిస్తూ ప్రజలంటే బిచ్చగాళ్లే అనే ధోరణితో కూడిన అహంకారాన్ని ప్రదర్శిస్తూ ప్రతి సభలోనూ ధనికాగ్రేసర కాంగ్రెస్ ప్రభువులు మాట్లాడుతున్నారు. ఏ కాంగ్రెస్ పాలిత రాష్ట్రంలోనూ ఈ వాగ్దానాలు ఆచరణ రూపంలో లేవు. అలాంటిది మధ్యప్రదేశ్‌లో మాత్రం ఎలా సాధ్యమనే అనుమానం ప్రజలలో లేకపోలేదు. ప్రజల నమ్మకం కోల్పోయిన బిజెపి మోడీ ఆకర్షణ మీద, వర్గపోరుతో స్థానిక నేతల మీద (దిగ్విజయ్, జ్యోతిరాదిత్య, కమల్‌నాథ్ మొదలగు వారి గ్రూపులు) ప్రజల నమ్మకాన్ని దూరం చేసుకున్న కాంగ్రెస్ రాహుల్ ఆకర్షణ మీద ఆధారపడి నెగ్గుకు రావాలని చూస్తున్నాయి. బిజెపి చేస్తున్న జన ఆశీర్వాద్ యాత్రలు, కాంగ్రెస్ చేస్తున్న ఏక్తాయాత్రలు రెండింటికీ ఆకలి కడుపుతో హాజరై నాయకులు ఈసడింపులతో విదిలించే అన్నం మెతుకుల కోసం ఎందరో బీదాబిక్కీలు పోటీ పడుతూనే ఉన్నారు. వీరంతా ఈ రెండు పార్టీల మీద బయటకు చెప్పుకోలేనంత అసంతృప్తితోనే బాధపడుతున్నారు.

ఇక ఢిల్లీ విషయానికి వస్తే షీలాదీక్షిత్ ముఖ్యమంత్రిగా అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు, మంచి వ్యక్తిగా పేరున్న హర్షవర్ధన్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఉన్న బిజెపికి మధ్య ప్రధాన పోటీ ఉన్నా ప్రజలు ఆ రెండు పార్టీలనూ నమ్మడానికి సిద్ధంగా లేరు. ఢిల్లీలో పరిస్థితులు చాలా దారుణంగా ఉన్నాయి. ప్రతి రంగంలోనూ ప్రగతి దాదాపు క్షీణించి పోయింది. ప్రజా జీవనం ఛిద్రమై పోయింది. మహిళల, విద్యార్థినుల మాన ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది. పారా మెడికల్ విద్యార్థిని జ్యోతిసింగ్ పాండే సామూహిక అత్యాచారం లాంటివి ఢిల్లీ నగరంలో బోలెడన్ని జరిగినా రాష్ట్ర ప్రభుత్వం ఏ రోజునా స్పందించిన పాపాన పోలేదు. ఉద్యోగినులపై లైంగిక వేధింపులు, శాంతి భద్రతలు క్షీణించడం వంటివి నిత్యకృత్యమైపోయాయి. రెండు పర్యాయాలు ఇచ్చిన అనధికార కాలనీల క్రమబద్ధీకరణ హామీని పదేళ్లు పట్టించుకోలేదు. మళ్లీ అదే వాగ్దానంతో ముందుకు రావడానికి కాంగ్రెస్‌కు ఏమాత్రం సిగ్గనిపించడం లేదు. 2008 ఎన్నికల ముందు కనీసం కాస్త హడావిడైనా చేసిన షీలా ప్రభుత్వం ఈసారి అది కూడా చేయకుండా ఢిల్లీలో ఉన్న 1639 అనధికార కాలనీల ప్రజలను మోసం చేస్తున్నది. నియోజక వర్గానికో సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి అని నమ్మించి ఆ మాటే మరిచింది. ధరల నియంత్రణలో దారుణంగా విఫలమైంది. పైగా 'ప్రజల కొనుగోలు శక్తి పెరిగింది' అని ధరల పెరుగుదలను, 'వినియోగదారులు చెల్లించే స్థితిలోనే ఉన్నార'ని పెంచిన విద్యుత్ చార్జీలను బాధ్యతారహితంగా సమర్థించుకుని ప్రజల ఆగ్రహానికి షీలాదీక్షిత్ గురయ్యారు. బిజెపిని 1998లో కళ్ల నీళ్లు పెట్టించిన ఉల్లి ఇప్పుడు ఢిల్లీ కాంగ్రెస్‌నూ వదలడం

లేదు. ఉద్యోగుల అవినీతికి అంతు లేకుండా పోయింది. అవినీతికి వ్యతిరేకంగా అన్నాహజారే సాగించిన ఉద్యమానికి అధిక స్పందన ఢిల్లీలోనే రావడం వల్ల దీన్ని అర్థం చేసుకోవచ్చు. ఆ స్పందనతోనే ఈసారి అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీలో ఆమ్‌ఆద్మీపార్టీ (ఎఎపి) స్థాపించి ఎన్నికలలో దిగుతున్నాడు.

ఇక బిజెపిని చూస్తే ప్రభుత్వ వ్యతిరేక అంశాల ప్రచారం, ఆందోళన కార్యక్రమాల విషయంలో బాగానే పనిచేస్తున్నా మోడీ గుజరాత్ నరమేధం, మతతత్వ ముద్ర, ప్రజలలో బిజెపికున్న సాధారణ బలహీనతల వల్ల ప్రజలకు బిజెపి పట్ల నమ్మకం కలగడం లేదు. ముఖ్యమంత్రి అభ్యర్థి హర్షవర్ధన్ ఆమ్‌ఆద్మీపార్టీ అరవింద్ కేజ్రీవాల్‌తో సమానంగా సాత్విక ముద్ర ఉన్నవ్యక్తి. అయితే అతనికి ఆకర్షించే గుణం, వాగ్ధాటి లేదు. ఇవన్నీ కాసేపు పక్కనపెడితే అసలు బిజెపి దేశం మొత్తంలోనూ, ముఖ్యంగా ఢిల్లీలోనూ ప్రజలలో విశ్వసనీయత కోల్పోయింది. మతం నుంచి బైటపడి లౌకికవాదం చేపట్టే విధంగా ఆపార్టీ ప్రజలలో నమ్మకాన్ని కలిగించలేకపోయింది. అందుకే ప్రజలు ఆ పార్టీకి దూరంగానే ఉండాలని భావిస్తున్నారు.

ఇక అన్నాహజారే స్ఫూర్తితో కొత్తగా ఏర్పాటు చేసిన ఆమ్‌ఆద్మీపార్టీ మధ్య తరగతి ప్రజలలో, యువకులలో బాగానే పట్టు సంపాదించింది. సాంప్రదాయ పద్ధతులకు స్వస్తిచెప్పి నిజాయితీయే గీటురాయిగా చెప్పుకుని బరిలోకి దిగింది. ప్రజాజీవితంలో నీతి నియమాలను నెలకొల్పుతామని, సుపరిపాలన అందిస్తామని చెప్తున్నది. అభ్యర్థుల ఎంపికలో నేరస్తులను కాకుండా సాదాసీదాగా, నిజాయితీతో గడిపిన వారికే టికెట్లిచ్చింది. చాలా నిరాడంబర ప్రచారం చేస్తున్నారు. ఒకే ఒక కారులో అరవింద్ ప్రచారానికి వెళ్తున్నాడు. మందీ మార్బలం వెంట లేకుండా, ప్రజలను తరలించకుండా సభల్లో పాల్గొంటున్నాడు. విద్యార్థులు ఎక్కువగా ప్రచారంలో పాల్గొంటున్నారు. ఎవరికి సరిపడా ఆహారం వారే ఒక సంచిలో తెచ్చుకుని సాయంత్రం వరకు ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే భద్రతను కూడా అరవింద్ వాడుకోవడం లేదు. ఎన్నికలకు అవసరమయ్యే ఖర్చుల నిమిత్తం కోట్ల రూపాయలు విరాళాలుగా సేకరించినా ప్రతి విరాళానికీ, చివరకు రెండు రూపాయల విరాళానికీ రశీదునిచ్చి ఇంటర్‌నెట్లో వివరాలు పొందుపరిచారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, అవినీతి, సామాన్యుల అవసరాలే ప్రాతిపదికగా ప్రచారంచేస్తూ వస్తున్నారు.

అయితే ఆమ్‌ఆద్మీపార్టీ ఇతర పార్టీల కంటే మెరుగ్గా కనిపిస్తున్నా ప్రజల పార్టీగా చెప్పుకునే అనేక లక్షణాలకు చాలా దూరంగానే ఉంది. నిజాయితీ గల ఒక కమ్యూనిస్టు పార్టీకున్న లక్షణాలలో వెయ్యోవంతు లక్షణాలైనా ఆ పార్టీకి లేవు. అసలు ఆమ్‌ఆద్మీపార్టీని, కమ్యూనిస్టు పార్టీతో పోల్చడమే సరికాదు. అది కూడా ఒక బూర్జువా పార్టీనే. అయితే మిగతా బూర్జువా పార్టీలతో పోల్చితే కాస్త మెరుగు. ఆ పార్టీకి విధానస్పష్టత లేదు. అధికారంలోకి వస్తే ప్రజల సమస్యలను ఎలా పరిష్కరిస్తారో ఒక విజన్ లేదు. సమస్యలంటే ఎవరి సమస్యలు? ఏ సమస్యలు? అనే స్పష్టత లేదు. మధ్యతరగతి ప్రజల అవసరాలనే తప్ప పేదల, మురికి వాడల ప్రజల సమస్యల గురించి పోరాడడం లేదు. కాంగ్రెస్, బిజెపి కంటే కాస్త మెరుగనే భావన ప్రజలలో ఉన్నా ఆ రెండు పార్టీల వల్ల తరాల తరబడి నష్టపోయిన ప్రజలకు ఈ కొత్తపార్టీ పైన సంపూర్ణ నమ్మకం కలగడం లేదు. ఆ తానులో ముక్కే కావచ్చుననే సందేహం లేకపోలేదు. తద్వారా ప్రజలు ఆ మూడు పార్టీల పట్లా అసంతృప్తితోనే ఉన్నారు.

చివరగా చత్తీస్‌గడ్ వైపు నుంచి ఈ ప్రజాస్వామ్య వ్యవస్థ మీదికి, ఎన్నికల మీదికి ఎంతగా ప్రశ్నలు సంధించవచ్చునంటే కనీసం ఒక్కటంటే ఒక్క సమాధానమైనా వ్యవస్థ ఇవ్వలేనంతగా. తప్పులతడక పాలకుల పాలనకు శాస్త్రీయమైన ప్రత్యామ్నాయ పాలనను ప్రజలు ధీటైన జవాబుగా ఇస్తున్న రాష్ట్రం ఇది. ప్రజల మౌలిక అవసరాలను విస్మరించి వారిని దోచుకునే పాలకులకు, వారి పాలనా సిద్ధాంతాలకు తమ స్వయం పాలన ద్వారా, ప్రత్యామ్నాయ పాలన ద్వారా చెంపదెబ్బ కొడుతున్న ప్రజలున్న రాష్ట్రం చత్తీస్‌గడ్. నాలుగు జిల్లాల్లో ప్రభుత్వ యంత్రాంగం, పాలనా వ్యవస్థలు అడుగుపెట్టే వీలు లేకుండా ప్రజల పాలన అక్కడ కొనసాగుతున్నది. క్రాంతికారి ఆదివాసి జనతన సర్కార్‌లు ప్రపంచానికి విజయవంతమైన పాలనా ఫలితాలను చూపిస్తున్నాయి.

ఈ పరిస్థితికి కారణం అవిభక్త మధ్యప్రదేశ్, చత్తీస్‌గడ్ రాష్ట్ర పాలకులే. గిరిజనులను పట్టించుకోకుండా, వారి అవసరాలు తీర్చకుండా, కనీసం రోడ్డు, విద్యుత్ లాంటి సాధారణ అవసరాలనూ తీర్చకుండా పాలకులు నిర్లక్ష్యం చేశారు. వారి ప్రాంతాలను భూస్వాములూ, రాజకీయ నాయకులూ ఆక్రమించుకుంటున్నా, వారి పంటను గుంజుకుని, వారిని బానిసలుగా చూస్తూ వెట్టికి గురిచేసినా, గిరిజన చట్టాలను ఉల్లంఘించినా ప్రభుత్వాలు చూస్తూ ఊరుకున్నాయి. నోటి ముందరి బుక్కను గుంజుకున్నా పట్టించుకోలేదు. పైగా ప్రభుత్వాలే ప్రత్యక్షంగా దోపిడీకి దిగి వేలాది ఎకరాల భూమిని వేదాంత లాంటి కంపెనీలకు అప్పనంగా అందిస్తూ వచ్చాయి. ఇదేమిటని అడిగిన అమాయకులపైకి కోబ్రాలను, గ్రేహౌండ్స్‌ను, మిలిటరీ బలగాలను ఆపరేషన్ గ్రీన్‌హంట్, హాకాల పేరిట వదిలారు. బస్తర్ ప్రాంత గిరిజనులు స్వాతంత్ర్యం వచ్చిన ఇన్ని సంవత్సరాలూ ఏ హక్కులూ, సౌకర్యాలు లేని ద్వితీయ శ్రేణి పౌరులుగా దేశంలో నివసిస్తూ వచ్చారు. కనుక చత్తీస్‌గడ్ రాష్ట్రం ప్రభుత్వ పాలనా వ్యవస్థల వైఫల్యానికి చక్కని ఉదాహరణ.

అందుకే అక్కడి ప్రజలెవ్వరికీ పాలకవర్గ బిజెపి పట్ల, తమను ఊచకోత కోయించిన మహేంద్రకర్మకు మహారాజ పోషకురాలైన కాంగ్రెస్ పట్ల విశ్వాసం పోయింది. పైగా ప్రత్యామ్నాయ పాలనాఫలాలను బీజప్రాయంగా రుచి చూస్తున్నందున వారికి ఆ పార్టీల పాలన మీద ఆసక్తిలేదు. తొలివిడత పోలింగ్‌లో దెబ్బకి పైగా బూత్‌లలో ఒక్క ఓటూ నమోదుకాని పరిస్థితి ఇందుకు ఉదాహరణ.

ఏదేమైనా, రాష్ట్రమేదైనా, దేశంలోని ప్రజలకు రాజకీయ పార్టీల పట్ల విశ్వాసం సన్నగిల్లిందనేది ఇప్పటి ఆవశ్యక అంశం. ప్రజాస్వామ్య బద్ధంగా పాలించాల్సిన పాలకులు, ఆ వ్యవస్థకు మూలమైన ప్రజలను, వారి అవసరాలను విస్మరించి, తాము మాత్రం వేల, లక్షల కోట్లు సంపాదిస్తూ, విలాస వంతమైన జీవితం గడుపుతుంటే, తమ కన్నీళ్లతో ఆటలాడుకుంటున్న పాలకుల పట్ల ఏహ్యత కలగడం చాలా సహజమైన విషయం. ప్రపంచ వ్యాప్తంగా చరిత్ర దీన్ని నిరూపించింది. అయితే ఈ ఏహ్యత క్రమంగా పెరిగిపోయి చివరకు వ్యవస్థ పునాదులను, పెకలించే దిశగా ప్రజలను నడిపిస్తే అందుకు ప్రధానంగా బాధ్యత వహించాల్సింది. ఈ రాజకీయాలే, వాటిని నడుపుతున్న పాలకులు, నాయకులే. కనుక పరిస్థితి చేయిజారక ముందే సర్దుకుంటే తమ సౌధాలను మరింత కాలం భద్రంగా కాపాడుకున్నవారవుతారు. ఎన్ని అసంతృప్తులున్నా ప్రజలు పోలింగ్ బూత్‌లదాకా వెళ్లి ఓట్లైతే వేస్తున్నారు కదా, ఇక ప్రజాస్వామ్యానికేం బాధలేదు అనుకుంటే ఓటుకంటే శక్తివంతంగా ఓటును కాదనుకుని మరీ ప్రజలే ప్రత్యక్షంగా కదులుతారనే చారిత్రక సత్యాన్ని నేర్చుకునే కాలం ఎక్కువ దూరంలో ఉండకపోవచ్చు.

(రచయిత సామాజిక కార్యకర్త) వీ

వోటు హక్కుకి విలువ ఉందా?

రాజకీయ పార్టీలు ఎన్నికల్లో గెలుపొందడానికి ప్రజాస్వామ్యాన్ని వదిలేసి కులాలను, మతాలను, విశ్వాసాలను, వెనుకబాటుతనాన్ని, మద్యాన్ని, డబ్బును, దొంగ వోట్లను ఎలా నమ్ముకుంటున్నారో వివరిస్తున్నారు సాజీగోపాల్

లైబ్రరీలో కొత్త పుస్తకాలు తిరగేస్తుంటే ఒక పుస్తకం పేరు నా దృష్టిని ఆకర్షించింది: 'డోంట్ వోట్, ఇట్ జస్ట్ ఎంకరేజెస్ బాస్టర్డ్స్' (వోటు వేయకండి, వోటు దొంగ వెధవలను ప్రోత్సహించడం మాత్రమే చేస్తుంది). రాజకీయ విశ్లేషకుడిగా నలభై సంవత్సరాల అనుభవం ఉన్న పి.జె.ఒ. రూర్కి ఈ పుస్తకం రాశారు. 'ఏ ప్రజాస్వామిక దేశంలోనైనా రాజకీయాలకు చిహ్నం అధికారం, స్వేచ్ఛ, బాధ్యతలు. కాని నేర ప్రవృత్తి పెరుగుతున్న వ్యవస్థలో, నిరంతర చిల్లర గొడవలు, మూర్ఖపు వాదనలు రాజకీయాలుగా చలామణీ అవుతున్నాయి. అమెరికాలో రాజకీయ వ్యవస్థను ఎలా సరి చేయాలి? హింసతో కూలదోయాలా? లేక రాజకీయ నాయకులు మనని వంచించినట్టుగానే, మనం కూడా వంచనకు పాల్పడాలా?' అని ప్రకటించిన ఈ పుస్తకంలో రచయిత అమెరికా రాజకీయ వ్యవస్థ విశ్వసనీయతను ప్రశ్నిస్తాడు.

భారతదేశంలో జనం ముందుకు మళ్లీ ఎన్నికలు రాబోతున్నాయి. ఒకవైపు కాంగ్రెస్, బిజెపి లాంటి రాజకీయ పార్టీలు ఎన్నికలలో తమకే వోటు వేసి గద్దెపైకి ఎక్కించాలని ప్రజలకు విన్నపాలు చేస్తున్నాయి. ఎన్నికలలో వోటు వేయడమే ప్రజాస్వామ్యానికి నిదర్శనమని చెపుతున్నాయి. మరొక వైపు 'వోట్లను డబ్బులతో, మద్యంతో, మత, కుల సెంటిమెంట్లతో కొనుక్కోగల ఈ వ్యవస్థను ప్రజాస్వామ్యం అనలేం. నేరగాళ్లు, బందిపోట్లు, అవినీతిపరులు రాజకీయ నాయకులుగా, తుపాకి బలంతో, బూత్‌ల ఆక్రమణతో, దొంగవోట్లతో ఎన్నికలలో గెలుస్తుంటే దీన్ని ప్రజాస్వామ్యం అని చెప్పడం హాస్యాస్పదం. అందుకే పార్లమెంటరీ వ్యవస్థను బహిష్కరించాలి. నిజానికి వోట్లు వెయ్యడం, వెయ్యకపోవడం రెండూ ప్రజల ప్రజాస్వామిక హక్కులే. కనుక ఎన్నికల బహిష్కరణ అనేది మన న్యాయమైన హక్కు కూడ' అని మావోయిస్టు పార్టీ చెబుతోంది. భారతదేశంలో అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పి. సదాశివం, ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులందరినీ తిరస్కరించే హక్కు ప్రజలకు ఉందని తీర్పు ఇచ్చారు. ఎన్నికలపైన ఇలాంటి భిన్నవాదనలున్నాయి.

వాస్తవానికి ఎన్నికలు మెజారిటీ ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయా అనే ప్రశ్న కూడ ఉదయిస్తుంది. 2009 లోకసభ ఎన్నికలలో, తమిళనాడు శివగంగ నియోజకవర్గంలో పోటీచేసిన చిదంబరంకు 31 శాతం వోట్లు మాత్రమే పడ్డాయి. అంటే 69 శాతం వోటర్లు చిందబరానికి వోటు వేయలేదు. పోలైన వోట్లలో కనీసం 10 శాతం దొంగ వోట్లు పడే అవకాశం ఉందనుకున్నా, ఆ దొంగ వోట్లను తీసివేస్తే, చిదంబరంకు కేవలం 28 శాతం మంది మాత్రమే వోటు వేసి ఉండవచ్చు, 72 శాతం ప్రజలు వోటు వేయలేదు. ఒక్కమాటలో చెప్పాలంటే, గెలిచిన అభ్యర్థి మెజారిటీ ప్రజలకు ప్రాతినిధ్యం వహించడం లేదు. రానురాను ఎన్నికలలో వోటింగ్ శాతం పడిపోతూ ఉంది (తాజా లెక్క 58 శాతం), దొంగ ఓట్ల శాతం (10–20) పెరిగిపోతూ ఉంది. ఎన్నికల పైన ప్రజలు నమ్మకం కోల్పోతున్నారు, యువతరానికి ఆసక్తి తగ్గుతోంది.

డబ్బుతో, సారాతో కొన్న వోటు పవిత్రమైనదా? దొంగ వోటా? మతోన్మాదంతో, కులోన్మాదంతో పోగేస్తున్న వోట్లు, న్యాయమైన వోట్లా? అన్యాయమైన వోట్లా? ఎన్నికలను డబ్బు శాసిస్తున్న నేపథ్యంలో, బడా వ్యాపారవేత్తలు రాజకీయ పార్టీల పైన వేలాది కోట్ల రూపాయలు పెట్టుబడి పెడుతున్న సందర్భంలో, ఎన్నికల వ్యవస్థలో ప్రజాస్వామ్యం బతికి ఉందా? లేక ప్రజాస్వామ్యం నేతిబీరకాయలో నెయ్యిలాంటిదా?

ప్రతి ఎన్నికలలో రాజకీయ నాయకులు గెలుస్తున్నారు, ప్రజలు ఓడిపోతున్నారు. రాజకీయ నాయకులు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు, గద్దెనెక్కిన తర్వాత మర్చిపోతున్నారు. జనం మళ్లీ మళ్లీ మోసపోతున్నారు. ఎన్నికలు ప్రహసనం అయిపోతున్నాయి.

ఎన్నికలలో గెలవడానికి కోట్లాది రూపాయిలు ఖర్చుపెడుతున్న రాజకీయ నాయకులు నిజాయితీగా ఉండాలని ఆశించడం ఎంతవరకు సమంజసం? ఎన్నికల చట్టాలను ఉల్లంఘిస్తూ, అక్రమాలకు పాల్పడుతూ, అవినీతిలో మునిగితేలుతూ ఉండే కిరాయి రాజకీయ నాయకులు నీతిగా ఉండటం సాధ్యమా? మహారాష్ట్ర బిజెపి నాయకుడు గోపీనాథ్ ముండే ఎన్నికలలో ఎనిమిది కోట్ల రూపాయలు ఖర్చు పెట్టినట్టు స్వయంగా అంగీకరించాడు. కాంగ్రెస్ నాయకుడు టి. సుబ్బరామిరెడ్డి నెల్లూరు లోకసభ ఎన్నికలలో 50 కోట్ల రూపాయలకు పైన ఖర్చు పెట్టినట్టు ఆరోపణలున్నాయి. గనులను దోచుకున్న గాలి జనార్ధనరెడ్డి, బిజెపికి కోట్లాది రూపాయిల ఎన్నికల నిధులు ఇచ్చాడని ఆరోపణలున్నాయి. నేటి ఎన్నికల రాజకీయాలలో సామాన్య ప్రజలకు పాత్ర ఏమైనా ఉందా? డబ్బే ప్రధాన పాత్ర పోషిస్తున్నదా? నేటి వ్యవస్థలో ప్రజాస్వామ్యం బతికి ఉన్నాదా? 2009 లోకసభ ఎన్నికలలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు రు. 18,900 కోట్లు (మూడు బిలియన్ డాలర్లు) ఖర్చు పెట్టారని, ఇది అమెరికా ఎన్నికల ఖర్చు (2.4 బిలియన్ డాలర్లు) కన్నా ఎక్కువని న్యూయార్క్ టైమ్స్ పత్రిక రాసింది.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఎన్నికల వ్యవస్థ ఇంతగా విఫలమవుతున్న నేపథ్యంలో, ప్రజల ముందు ప్రత్యామ్నాయం ఏమిటి? వ్యవస్థ ఇంతగా భ్రష్టు పట్టిపోయి, ఎన్నికలు అవినీతిలో కూరుకుపోయిన నేపథ్యంలో ఎన్నికలను విశ్వసించవచ్చా? లేక ప్రత్యామ్నాయ, ప్రజా ఉద్యమాలతో ఒక నూతన ప్రజాస్వామిక సమాజాన్ని, స్వేచ్ఛా హక్కుల ఊపిరి అందే, సామాన్యులకు న్యాయం జరిగే, ప్రజాస్వామిక విలువలతో వికసించే మానవీయ సమాజాన్ని నిర్మించుకోవలసిన అవసరమున్నదా? లేక అవినీతి మురికి కూపంలో మునిగి తేలుతున్న వ్యవస్థతో రాజీ పడాలా? ప్రతిఒక్కరూ నిర్ణయించుకోవాలి.

(రచయిత అమెరికాలో ఉద్యోగం చేస్తున్న ప్రవాస భారతీయుడు) వీ

స్కాముల భారతం

పార్లమెంటరీ వ్యవస్థలో ఉన్న లొసుగులను అడ్డం పెట్టుకొని రాజకీయ నాయకులు, వారి ఆశ్రితులు పాల్పడుతున్న కుంభకోణాలకు బలవుతున్నది సామాన్య ప్రజలే అని అంటున్నారు **వి. హనుమంతరావు**

ఆర్థిక సంస్కరణలు 1991లో ప్రవేశపెట్టిన తరువాత మన దేశం స్కాముల దేశంగా మారిపోయింది. దేశం అభివృద్ధి మాటేమిటో కాని స్కాముల అభివృద్ధి మాత్రం జోరుగా సాగుతోంది. ఈ స్కాముల్లో ఇరుక్కుపోయిన ధనం ప్రభుత్వానిది కాదు. అది మనం పన్నుల రూపంలో ప్రభుత్వానికి చెల్లించిన సొమ్ము; మనం బాంకుల్లో కార్పొరేట్ సంస్థల జేబులు నిండుతున్నాయి. ఎంతగా నిండుతున్నాయంటే స్విస్ బాంకుల్లో జమ అయిపోతున్నాయి. విదేశాల్లో పరిశ్రమలు పెట్టేటంతా అక్కడి వారి పరిశ్రమలనే కొనేసేటంత, ఆఫ్రికాలో భూములు కొనేటంతగా పెరిగాయి; రాజకీయ నాయకుల జేబులు నిండుతున్నాయి. వారిని చూసి బ్యురాక్రట్లు ఆ దారిలోనే పయనిస్తున్నారు. బ్యురాక్రట్లంటే ఉన్నతాధికారులే కాదు. ఇటీవల పత్రికల్లో జిల్లాస్థాయిలో ఉన్న చిన్న చిన్న అధికారుల ఇళ్ల మీద దాడులుచేస్తే లక్షల, కోట్ల ఆస్తులు వెలుగు చూస్తున్నాయి. పిల్లల తల్లితండ్రులు ఎలా ప్రవర్తిస్తే వారి బిడ్డలు అదే మూసలో తయారవుతున్నారు. సామాన్య జనానికి తల్లి, తండ్రియే ప్రభుత్వం, రాజకీయ నాయకులు. దేశాన్ని పరిపాలించే నాయకుల బుద్దే పెడదారి పట్టిందంటే, కంచే చేనుమేస్తుంటే, ఎవరికి చెప్పుకోవాలి. అన్యాయానికి చుట్టూ కంచె కట్టాల్సిన వారే న్యాయాన్ని ఏడు నిలువుల లోతున పాతేస్తుంటే అక్కడక్కడ న్యాయాధిపతులే గడ్డిమేస్తుంటే, సామాన్యునికి రక్షణ ఏది ఎక్కడా? సంస్కరణలు ప్రవేశపెట్టక ముందు చిన్న చిన్న స్కాములు పక్కనపెడితే, దేశ వ్యాప్తంగా ఉన్నత స్థాయిలో వేలు, లక్షలు, కోట్ల స్థాయిలో జరిగిన స్కాముల పర్వం చూడండి. ఈ స్కాములు ప్రస్తుత ప్రధానమంత్రి, పూర్వం ఆర్థికమంత్రి హయాంలో జరిగిన భారీ స్కాముల పట్టిక చూడవచ్చు.

ఇవన్నీ కాక స్విస్ బాంకుల్లో దాచిన సొమ్ము వివిధ రాష్ట్రాల్లో జరిగిన స్కాములు ఉండనే ఉన్నాయి. ఇవన్నీ పెద్ద పెద్ద కంపెనీలు, వాటి వెనుక రాజకీయ నాయకుల హస్తం, వాటాలు ఉండనే ఉంటాయి. బాంకులకు తెలియకుండా ఈ స్కామ్‌లు జరగవుకదా. ఆ బాంకు ఉద్యోగులు సేకరించిన సమాచారం ఇది. రాష్ట్రాల్లో (ఉదాహరణకు మన రాష్ట్రమే) జరిగిన చిన్న చిన్న స్కామ్‌లు ఉండనే ఉన్నాయి. ఇన్ని స్కాములకు కారణమైన సంస్కరణలను, ఆ సంస్కరణలను ప్రవేశపెట్టిన ప్రధాని, ఆర్థికశాస్త్రవేత్త మన్‌మోహన్ సింగ్ - ఆహ్లూవాలియా - చిదంబర త్రయంను ప్రజలు గద్దె దింపాల్సిందే.

ఇలాంటి స్కాములు 2005-2006/2010-2011 మధ్యకాలంలో ప్రభుత్వం స్కాములకు కారకులైన వారికి సుమారు 21 లక్షల కోట్ల సబ్సిడీ ఇచ్చిన ఫలితంగానే దేశంలో కుబేరుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. అలాంటి ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ఇవ్వాలంటే గింజు కొంటుంది; ఇంకా తెగ్గొయ్యాలని ప్రభుత్వానికి జోహుకుం చేసే ఆర్థిక

సం	స్కాము పేరు	స్కాము సొమ్ము (కోట్ల రూ.)
1992	హర్షద్ మెహతా సెక్యూరిటీ స్కాము	5,000
1994	పంచదార దిగుమతి స్కాము	650
1995	ప్రిఫరెన్షియల్ అలాట్‌మెంట్ స్కాము	5,000
....	యుగోస్లావ్ దిన్నార్ స్కాము	400
....	మేఘాలయ అడవుల స్కాము	300
1996	ఎరువుల స్కాము	1,300
....	యూరియా స్కాము	133
	బీహార్ పౌడర్ స్కాము	850
1997	సుఖరాం టెలికాం స్కాము	1,500
	ఎస్.ఎన్.సి పవర్ ప్రాజెక్ట్ స్కాము	374
	బీహార్ ల్యాండ్ స్కాము డీల్	400
	సి.ఆర్.భన్సాలీ స్కాము	1,200
1998	టేక్ ప్లాంటేషన్ స్కాము	8,000
2001	యుటిఐ స్కాము	4,800
	దినేష్ దాల్మియా స్కాము	595
	కేతన్ పరేంగ్ సెక్యూరిటీ స్కాము	1,250
2002	సంజయ్ అగర్వాల్ హోమ్ ట్రేడ్ స్కాము	600
2003	తెల్గీ స్టాంప్ పేపర్ స్కాము	172
2005	ఐ.పి.ఓ డెమాట్ స్కాము	146
	బీహార్ వరద సహాయ స్కాము	17
	స్కార్‌పీన్ సబ్‌మెరైన్ స్కాము	18,798
	పంజాబ్ సిటీ సెంటర్ ప్రాజెక్ట్ స్కాము	1,500
2006	తాజ్ కారిడార్ స్కాము	175
2008	హసన్ చౌన్ పన్నుల ఎగవేత స్కాము	5,000
	సత్యం స్కాము	10,000
	ఆర్మీ రేషన్ స్కాము	5,000
	సౌరాష్ట్ర స్టేట్ బాంకు స్కాము	95
2009	ఝార్ఖండ్ మెడికల్ ఎక్విప్‌మెంట్ స్కాము	130
	బియ్యం ఎగుమతి స్కాము	2,500
	ఒడిశా మైన్ స్కాము	7,000
	మధుకోడా మైనింగ్ స్కాము	4,000
2010	2జి స్కాము	1,76,000
2011	కామన్‌వెల్త్ గేమ్స్ స్కాము	8,000
2012	కోల్ స్కాము	1,86,000
	ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ స్కాము	1,63,557

(ఇందులో బిజెపి పాలన కాలంలో జరిగిన స్కాములు కూడా ఉన్నాయి.)

శాస్త్రవేత్తలు ప్రభుత్వానికి సిఫార్సులు చేస్తున్నారు. 2013 బడ్జెట్ ప్రకారం ఆహారానికి రు. 75, ఎరువులకు రు. 60, పెట్రోలియంకు 43 (అన్నీ వేలకోట్లలో) కేటాయించిందంటే రైతుల విషయం వచ్చేసరికి ఎంత పీనాసితనం అవలంబిస్తుందో విదితమవుతుంది. కార్పొరేట్ సంస్థలకు 21 లక్షల కోట్లు, రైతాంగానికి 14 వేల కోట్లు?

ఇలా ముందు నుంచి, వెనుక నుంచి మేపుతుంటే మిలియనీర్లు, బిలియనీర్లు ఎందుకు పుట్టుకురారు? దేశంలో మొట్ట మొదటి 100 మంది ఆస్తుల విలువ రు. 12,50,000 కోట్లు! ఈ బిలియనీర్ల క్లబ్బులో చేరాలంటే సంవత్సరానికి 370 మిలియన్ డాలర్ల కనీస ఆస్తి ఉంటుండగా, ఆ విలువను 460 మిలియన్ డాలర్లకు పెంచారు. (ఒక మిలియన్ డాలరంటే అయిదుకోట్ల రూపాయలు; ఒక బిలియన్ డాలర్ అంటే ఐదువేల రూపాయలు. ఇప్పుడు రూపాయి మారకం విలువ 60-65 రూపాయలుంటే పై గణాంకాలను పెంచాల్సివుంటుంది.

ఈ బిలియనీర్ల సంఖ్యను ఇతర దేశాలతో పోల్చి చూస్తే ఆసక్తికరమైనవిగా ఉంటాయి. బిలియనీర్లు 2011-2012 మధ్య చైనాలో 146 నుంచి 113కు రష్యాలో 101 నుంచి 96కు తగ్గగా మన దేశంలో 57 నుంచి 61కి పెరిగింది. ఎక్కువలో ఎక్కువ ఆస్తి పరుల లెక్కలు చూడగా, చైనాలో 106, ఇండియాలో 168.8, రష్యాలో 248.7 (బిలియన్ డాలర్లు) ఈ గణాంకాలు కూడా 2011-2012 మధ్యకాలం నాటివే. మొట్ట మొదటి 20 మంది అత్యంత ఎక్కువ ఆస్తులున్న 25 మందికి సంబంధించిన గణాంకాలు. తిరిగి మన దేశానికి వస్తే ముంబైలో 33, ఢిల్లీ 24, బెంగళూరు15, కోల్‌కతా 4, చెన్నై 4 మంది బిలియనీర్లున్నారు. ఇది ఒకవైపు నుంచి చూస్తే కనబడే చిత్రం; రెండోవైపు నుంచి అంటే మానవాభివృద్ధి (అంటే ఆరోగ్యం, విద్య వగైరా) పట్టిక ప్రకారం 81 దేశాల్లో మన దేశం 67వ స్థానంలో ఉంది. చైనా నాల్గవ స్థానంలో, అంటే అగ్రభాగాన ఉంది. టెండూల్కర్ లెక్కల ప్రకారం, పశ్చిమబెంగాల్ తర్వాత ఆంధ్రప్రదేశ్ ఉంది అంటే పేదరికపు రేఖ కింద ఉన్న జనాభా విషయంలో అన్నీ దక్షిణాది రాష్ట్రాలలో మన రాష్ట్రం అగ్రభాగాన ఉంది. సామాన్య ప్రజల విద్య, వైద్యం లాంటి కనీస అవసరాలకు కనీస మొత్తం కేటాయింపు, రెండవ పక్క కార్పొరేట్ల వద్ద నిధుల కోత విధిస్తున్నామని చిదంబరం ప్రకటన ఇది ఎవరి దేశం? పాలన సాగిస్తున్నది ఎవరికోసం?

ఇలా ఒకపక్క కార్పొరేట్ల వద్ద డబ్బు మూటలు పెరిగిపోతుంటే, ప్రధాని ఆర్థిక సలహాదారు రంగరాజన్ కూడా అటువంటి సంస్థల మీద పన్ను విధించాలని మాటవరసకైనా అనాల్సి వచ్చింది. ఒకపక్క పేదలకిచ్చే సబ్సిడీల పై కోత విధించాలని పదే పదే సలహాఇస్తూ వచ్చిన ఈ పెద్దమనిషే పన్నుపెంచాలని అనాల్సివచ్చిందంటే అది ఏదో కంటి తుడుపుకు మాత్రమే, నాలుక చివర నుంచి అన్నమాటే అని అనిపించడం లేదా? ఆ మధ్య ఆర్థికమంత్రి చిప్పచేతిలో పట్టుకొని దేశదేశాలు తిరిగి మా దేశంలో పెట్టుబడులు పెట్టమంటూ బిక్షాటన చేసివస్తే, స్పందించిన వారు ఒక్కరూ లేరు. బాంకుల్లో కోట్ల రూపాయలు అప్పుతీసుకొని చెల్లించకుండా తాత్సారం చేస్తుంటే, ఆ మొండి బాకీలు రెండు లక్షల కోట్లకు పెరిగితే వాళ్ల మీద కఠిన చర్యలు ఎందుకు తీసుకోరు? ఇటీవల రెండు మూడు సార్లు బాంకర్ల సమావేశాలు జరిగి ఈ మొండి బాకీలు వసూలు చేయాలని బాంకర్లను ఆదేశించడమే కాని కఠిన చర్యలు చిదంబరం ఎందుకు తీసుకోడు? వాళ్లకిస్తున్న సబ్సిడీలను నిలుపుదల చేయవచ్చుకదా. చేయరు ఎందుకంటే ఆ పని చేస్తే వాళ్ల నుంచి కాంగ్రెస్ పార్టీకి వచ్చే నిధులు ఆగిపోతాయి. రాబోయే జనరల్ ఎన్నికలకు ఖర్చులుంటాయి. ఇలా ఒకపక్క వొట్టొట్టి బెదిరింపులు చేస్తూ ఎన్నికలొచ్చే వరకు కాలం గడిపేస్తారు. కాంగ్రెస్ పార్టీ 2014 ఎన్నికల్లో గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తేగిస్తే మరో ఐదేళ్లు గడిపేయవచ్చు.

ఇదంతా జాతికి, ప్రజలకు ద్రోహం. ఇలాంటి ద్రోహులను తిరిగి అధికారంలోకి పంపిస్తే అది భస్మాసుర హస్తమే అవుతుంది. ఆలోచించుకోండి.

(రచయిత వీక్షణం వ్యవస్థాపక సంపాదకులు) వీ

వీఎచ్ కాలమ్

ప్రభుత్వ - ప్రైవేట్ బ్యాంకులు

ప్రభుత్వరంగ బ్యాంకులపై ప్రైవేట్‌రంగ చీకట్లు కమ్ముకొస్తున్నాయి. ప్రభుత్వం కార్పొరేట్ రంగానికి తలుపులు తెరిచింది. ఈ ప్రకటన వెలువరించక ముందే ప్రభుత్వ రంగంలో ఉన్న చిన్న, పెద్ద బ్యాంకులన్నిటిని రద్దు చేసి ఒక 'పెద్ద' బాంకును ఏర్పాటు చేస్తే బావుంటుందని చిదంబరం తన బుర్రలో ఉన్న ఆలోచనను బయటపెట్టాడు. మాట వరసకు అలా చేశారనే అనుకుందాం. అప్పుడేమవుతుంది? 28 ప్రభుత్వ రంగ బ్యాంకుల పెట్టుబడి రు. 18,250 కోట్లవుతుంది. అభివృద్ధి చెందిన దేశాల్లో ఒకే ఒక్క బాంకుకాలికింద బలాదూర్. ఉదాహరణకు పట్టిక చూడండి.

బార్‌క్లేస్ బాంకు, బ్రిటన్	1592 బిలియన్ డాలర్లు
యుబిఎస్, స్విడ్జర్‌ల్యాండ్	1568 బిలియన్ డాలర్లు
మిట్సుబిషి, జపాన్	1509 బిలియన్ డాలర్లు
హెచ్ఎస్‌బిసి, బ్రిటన్	1502 బిలియన్ డాలర్లు
సిటి బ్యాంకు, అమెరికా	1494 బిలియన్ డాలర్లు

ఈ బ్యాంకులలో మన దేశంలో బడా బ్యాంకులని అనుకునే కొన్ని బ్యాంకుల పెట్టుబడులను పోల్చిచూస్తే

స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా	267 బిలియన్ డాలర్లు
పంజాబ్ నేషనల్ బాంకు	90 బిలియన్ డాలర్లు
కెనరా బాంకు	75 బిలియన్ డాలర్లు
బరోడా బాంకు	94 బిలియన్ డాలర్లు
ప్రభుత్వ రంగంలోని 28 బ్యాంకుల పెట్టుబడి	1200 బిలియన్ డాలర్లు

నక్కెక్కడ, నాగలోకమెక్కడ? ప్రభుత్వ రంగ బ్యాంకుల పెట్టుబడి మొత్తం రు. 18250 కోట్లు అయితే, విదేశాలలో ఒక్క సిటీబాంకుపెట్టుబడి రు. 115000 కోట్లు ! చిదంబరం మరో వాదన ఏమిటంటే అన్ని బ్యాంకులను కలిపితే ప్రపంచ వ్యాపార రంగంలో ప్రవేశించవచ్చు. ఇది మరో చచ్చు ఆలోచన. ఎందుకంటే ప్రపంచ వ్యాపిత వ్యాపారంలో మన దేశం వాటా 1.50 శాతం మాత్రమే. పెట్టుబడిదారీ విధానానికి పుట్టినిల్లయిన అమెరికాలోనే 2008లో బ్యాంకులు దివాళా తీసి ప్రపంచ వ్యాపిత సంక్షోభానికి దారి తీసిన విషయం పాఠకులకు గుర్తుండే ఉంటుంది. అలాంటప్పుడు ఇలాంటి ఆలోచనలు పులిని చూసి నక్క వాతలు పెట్టుకొన్నట్లు ఉంది. రేపోమాపో బ్యాంకింగ్ రంగంలో ప్రైవేటీకరణ ప్రవేశించినా, పరిస్థితి మారబోదు. బాంకుఉద్యోగుల సంఘాల నాయకులారా, హోషియార్. వీ

రక్తాన్నైనా ఇస్తాం, భూములు ఇవ్వం

***బహుళజాతి కంపెనీల ప్రయోజనాల కోసం ఆదివాసి ప్రాంతాల్లో పాలకులు భారీ ప్రాజెక్టులను చేపడుతుంటే నిర్వాసితులైన ఆదివాసులు సహజ వనరులను కాపాడడానికి తమ ప్రాణాలను సైతం ఒడ్డుతున్నారని అంటున్నారు* నటాషా**

పొరుగు రాష్ట్రమైన ఒడిశాలో నిర్వాసిత సమస్య చాలా తీవ్రంగా ఉంది. అభివృద్ధి పేరుతో పాలకులు అమలు జరుపుతున్న పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద అనుకూల విధానాల ద్వారా ఇప్పటికే లక్షలాది ప్రజలు తమ ఇండ్లు, భూములు కోల్పోయి కట్టు బట్టలతో నిర్వాసితులై చెట్టుకొకరు పుట్టకొకరుగా చెల్లా చెదురయ్యారు. అధికారిక లెక్కల ప్రకారమే 1957 నుండి 1990 వరకు ఐదు లక్షల మంది ప్రజలు నిర్వాసితులయ్యారు. ప్రస్తుతం ఒడిశా ప్రభుత్వం దళారీ పెట్టుబడి దారులు, బహురాష్ట్రీయ కంపెనీలతో చేసుకున్న 146 ఎంఒయులు అమలులోకి రావడం ద్వారా మరో ఐదు లక్షల మంది ప్రజలు నిర్వాసితులు కానున్నారు. ఇందులో ప్రభావితులయ్యేది మెజారిటీ ఆదివాసులు, దళితులే. ఒడిశాలో అధికార మార్పిడి (1947) ముందు నుండే నిర్వాసిత సమస్య మొదలయింది. 1940లో ప్రస్తుత మల్కన్‌గిరి జిల్లాలోని మాచ్‌కండ్ జలవిద్యుత్ కేంద్ర నిర్మాణంతో, దేశంలోనే అత్యంత పేద ప్రజలైన ఆదివాసుల్ని తరతరాలుగా తాము నమ్ముకున్న అడవుల్నుంచి తమ నివాస స్థలాల నుంచి గెంటివేయడం ప్రారంభమయింది.

ఈ విధంగా 'గరీబీ హటావో' బదులుగా 'గరీబోంకు హటావో' అనే కార్యక్రమం మొదలైంది. 1948 ఏప్రిల్ 12న సంబల్‌పూర్ వద్ద మహానదిపై హీరాకుడ్ బహుళార్థకసాధక ప్రాజెక్ట్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తూ అప్పటి ప్రధాన మంత్రి (పిఎం) జవహర్‌లాల్ నెహ్రూ 'దేశ అభివృద్ధి కోసం పెద్ద ప్రాజెక్టుల నిర్మాణం చాలా అవసరం పెద్ద ఆనకట్టలు ఆధునిక దేవాలయాల్లాంటివి మొత్తం దేశ ప్రయోజనాల కోసం కొంత మంది త్యాగాలు చేయక తప్పదని హీరాకుడ్ డ్యాం మూలంగా విస్తాపితులవుతున్న వాల్లనుద్దేశించి ఉపదేశించాడు. ఈ ప్రాజెక్టుల ఉద్దేశం దేశాన్ని అంగుళం అంగుళం సశ్యశ్యామలం చేయడమేనని నమ్మబలికాడు. కానీ 1950లో బ్రిటిష్ వాళ్ల ఆయుధాల తయారీ కంపెనీ అల్కన్ తన నమ్మినబంట్లు అయిన భారత దళారీ పెట్టుబడిదారులతో కలిసి ఇండల్కో పేరుతో అల్యూమీనియం తయారుచేసే కంపెనీని నిర్మించబోయే విషయాన్ని హీరాకుడ్ డ్యాంలోని నీళ్లు, జల విద్యుత్ అలాంటి వాటి అవసరాల్ని తీర్చడానికే అనే వాస్తవాన్ని తన తీయని మాటల వెనుక ఉద్దేశ పూర్వకంగానే మరుగుపరిచాడు.

ప్రస్తుతం ఒడిశాలో ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌లో 60 శాతం పైగా సిబిబి, ఎంఎన్‌సి కంపెనీలకే కేటాయిస్తున్నారు. రైతుల నుండి నీటి పన్ను, కరెంట్ పన్ను వసూలు చేయడానికి ఇంట్లో ఉన్న బిందెల్ని, కరెంట్ మోటార్ల స్టాటర్లను జప్తుచేసుకొని ఒత్తిడిచేసే ప్రభుత్వాలు వందల కోట్ల రూపాయల బాకీలున్నప్పటికీ పాలకులు సిబిబి, ఎంఎన్‌సి కంపెనీలకు మాత్రం నిరాటంకంగా కరెంట్, నీరు సప్లై చేస్తూనే ఉన్నారు. ఒక్క హీరాకుడ్ డ్యాంలోని నీళ్లను వాడుకునే 12 కంపెనీలు (వేదాంత, అల్యూమీనియం లిమిటెడ్, వీరాజ్ స్టీల్, ఎనర్జీ, స్టెరిలైడ్ ఎనర్జీ లిమిటెడ్, ఇండో భారత్ ఎనర్జీ లిమిటెడ్, డ్యాం డిఆర్ఐ, ఎస్ఎస్‌సి ఫవర్ జనరేషన్ లిమిటెడ్, మెసర్స్ బూషన్ లిమిటెడ్, ఐటిపిఎస్, బిఐటిఎస్, ఓరియెంటల్ పేపర్ మిల్లు, సౌతీస్ట్ రైల్వే, ఇటిసి) 279 కోట్ల 29 లక్షల రూపాయల బకాయీలు ఉన్నాయి. ఇంకా వందల కోట్ల రూపాయల కరెంట్ పన్ను బకాయిలు ఉన్నాయి.

నెహ్రూ చెప్పిన ఆధునిక దేవాలయాల్లో దేవుళ్లు, పూజారులు, దళారీ పెట్టుబడిదారులు, బహురాష్ట్రీయ కంపెనీ యజమానులు కాగా పీడిత తాడిత ఆదివాసి, దళిత ప్రజలు గుడిలో ప్రవేశానికి నిరాకరించబడిన అంటరానివాల్లన్న మాట. హీరాకుడ్ జలాశయంలోని నీళ్లు, జల విద్యుత్‌ను కంపెనీలు విరివిగా వాడుకుంటుండగా అవి విడుదల చేసే వ్యర్థ పదార్థాల మూలంగా నీరు కలుషితమయ్యి ప్రజలు రోగాల భారిన పడుతున్నారు. మొదట్లో ఇచ్చినన్ని నాల్లు కూడా ఇవ్వకుండా సాగునీటిలో కోత విధిస్తూ కంపెనీలకు మాత్రం సరిపోను నీళ్లు ఇస్తుండడంతో రైతుల పొలాలకు నీల్లందక పంటలు ఎండిపోయి ఏట ఆందోళన చేస్తున్నారు. ఒడిశాలో విస్తాపితులైన వాళ్లలో 70 శాతం పెద్ద ఆనకట్టల మూలంగా 12 శాతం సిబిబి, ఎంఎన్‌సి కంపెనీల మూలంగా నిర్వాసితులయ్యారు.

ప్రస్తుతం ఒడిశాలో కొనసాగుతున్న విస్తాపన వ్యతిరేక పోరాటాల్లో కళింగనగర్, పరద్వీప్ దగ్గరి ఫోస్కో వ్యతిరేక పోరాటం, నియంగిరిలో వేదాంత వ్యతిరేక పోరాటం గురించి అందరికి సుపరిచితమే. జాతీయ మీడియాలో ప్రచారానికి నోచుకోని మరికొన్ని ప్రాంతాల్లో కూడా ప్రజలు విస్తాపనకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. ముఖ్యంగా పశ్చిమ (వెస్ట్) ఒడిశాలోని బొలంగీర్ జిల్లాలో సుక్తెల్ నదిపై నిర్మించతలపెట్టిన లోయర్ సుక్తెల్ ప్రాజెక్ట్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటం గురించి తెలుగు పాఠకులకు తెలియజేయడం ఈ వ్యాస లక్ష్యం. దీనితోపాటు నవపడ జిల్లా కోమ్న – రజకారియర్ బ్లాక్‌ల మధ్య నిర్మాణమైన అప్పర్ ఇంద్ర (టికాలి) ప్రాజెక్ట్ మూలంగా నిర్వాసితులైన వాళ్లు తమకు న్యాయమైన నష్టపరిహారం ఇవ్వాలనే డిమాండ్‌తో పోరాడుతున్నారు. బర్గడ్ జిల్లా పడంపూర్ బ్లాక్‌లోని పూజారిపల్లి వద్ద హ్యాంగ్ నదిపై నిర్మించ తలపెట్టిన డ్యాం కింద ముంపుకు గురయ్యే 30 గ్రామాల ప్రజలు దీనికి వ్యతిరేకంగా పోరాడుతున్నారు. వీటిలో ప్రస్తుతం లోయర్ సుక్తెల్ పోరాటం గురించి తెలుసుకుందాం.

బొలంగీర్ – బర్గడ్ జిల్లాల సరిహద్దులో ఎత్తైన గందమార్ధన్ పర్వతాలున్నాయి. వీటిలో 200 మిలియన్ టన్నుల బాక్సైట్ నిలువలున్నాయి. అల్యూమీనియం కంపెనీలకు ఈ బాక్సైట్, ఈ ఖనిజం అవసరం. 80 దశకంలో గందమార్ధన్ కొండలపైన బాక్సైట్ కంపెనీ

నిర్మాణానికి బాల్కో కంపెనీ ప్రయత్నించగా గందమార్ధన్ పర్వాతాల చుట్టూ ఉన్న గ్రామాల ప్రజలు మిలిటెంట్‌గా పోరాడి చివరకు బాల్కో కంపెనీని తరిమేసి పర్వాతాల్ని రక్షించుకున్నారు. గందమార్ధన్ కొండల గురించి ఇక్కడి ప్రజల్లో కొన్ని విశ్వాసాలున్నాయి.

గందమార్ధన్ పర్వతాల గురించి ప్రజల్లో కొన్ని విశ్వాసాలున్నాయి. రామ, రావణ యుద్ధంలో లక్ష్మణుడు గాయపడి స్పృహ కోల్పోయినపుడు రాముడు హనుమంతున్ని పిలిచి హిమాలయ పర్వాతాలకు వెళ్లి సంజీవని అనే ఔషధ మొక్కను తీసుకురమ్మని పంపుతాడు. హిమాలయాలకు వెళ్లిన హనుమంతుడు సంజీవని మొక్కను గుర్తించలేక మొత్తం సంజీవని అనే పేరుగల పర్వతాన్నే ఎత్తుకువస్తాడు. అప్పుడు రాముడు సంజీవని ఔషధంతో లక్ష్మణున్ని స్పృహలోకి రప్పిస్తాడు. ఆ సంజీవని పర్వతం ఇదేనని ఇక్కడ ప్రజల విశ్వాసం. రామాయణం పుక్కిటి పురాణమే అనే విషయాన్ని పక్కనబెట్టిన ఈ పర్వతాల్లో అమూల్యమయిన ఎన్నోరకాల ఔషధ మొక్కలు ఉన్నాయి. నూట ఇరవైకి పైగా సంవత్సరం పొడవునా పారే సెలయేర్లు ఉన్నాయి. 200 టన్నుల బాక్సైట్ ఉంది. స్వచ్ఛమైన వాతావరణంతో అపారమైన ఖనిజ సంపదలతో ఇక్కడి ప్రజలకు జీవనాధారంగా ఉన్నాయి. అలాంటి గందమార్ధన్ కొండల నుండి పుట్టి బార్గఢ్/బొలంగీర్ జిల్లాల సరిహద్దు గుండా ప్రవహించి సువర్ణపూర్ (సోన్‌పూర్) జిల్లాలో ప్రవేశిస్తుంది. బొలంగీర్ జిల్లా లోయిసిన్హా బ్లాక్‌లోని మగుర్‌బెడ గ్రామం వద్ద రెండు గుట్టల మధ్య నుండి ప్రవహిస్తుంది. ఈ రెండు గుట్టల్ని కలుపుతూ మధ్యలో పెద్ద ఆనకట్ట కట్టాలనేది చాలా కాలంగా ప్రభుత్వ యోచనలో (ప్లాన్) ఉంది.

ఈ ప్రాజెక్టు కింద 29 గ్రామాలు ముంపునకు గురవుతుండగా సుమారు 30 వేలకు పైగా ప్రజలు నిర్వాసితులవుతున్నారు. 740 హెక్టార్ల అటవి భూమి 5216 హెక్టార్ల సాగుభూమి ముంపునకు గురవుతుంది. ముంపుకు గురయ్యే 29 గ్రామాల ప్రజలు బుడి అంచల్ సంగ్రామ్ పరిషత్ (ముంపుకు గురయ్యే ప్రాంత పోరాట సమితి) అనే పేరుతో సంగటితులై దృడంగా వ్యతిరేకిస్తూ వస్తున్నారు. ప్రజల తీవ్ర నిరసన మూలంగా గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టను 2013 ఏప్రిల్ నెలలో పోలీసు బలగాల మోహరింపుతో అరెస్ట్, లాఠీ చార్జీలతో తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తూ బలప్రయోగంతో ప్రాజెక్టు నిర్మాణ పనులు ఒడిశా ప్రభుత్వం ప్రారంభించింది.

ప్రజల నిరసన మూలంగా పెండింగ్‌లో ఉన్న కాలమంతా ప్రభుత్వం ప్రజల పోరాటాన్ని నీరుగార్చడానికి తన సుప్రసిద్ద విభజించు – పాలించు రీతిలో భాగంగా నష్టపరిహారపు ప్రలోభాలతో కొందరిని బలహీనపరచడంతో పాటు బొలంగీర్ పట్టణవాసుల్లో మార్వాడి, దనిక, వ్యాపార వర్గాలకు చెందిన ఒక సెక్షన్‌ను పరోక్షంగా ప్రోత్సహించి లోయర్ సుక్తెల్ ప్రాజెక్టు అనుకూల ఆందోళనను సృష్టించింది. లోయర్ సుక్తెల్ యాక్షన్ కమిటీ బ్యానర్ కింద 'లోయర్ సుక్తెల్ బొలంగీర్ జీవనరేఖ' అనే నినాదంతో తక్షణం ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించాలనే డిమాండ్‌తో బొలంగీర్ పట్టణంలో ఒక ఆందోళన ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు ద్వారా బొలంగీర్ పట్టణ ప్రజలకు మంచి నీటి సౌకర్యం కలుగుతుందనేది నిజమే కానీ ఈ ఒక్క ప్రయోజనం కోసం మిగతా అన్ని రకాలుగా జరిగే నష్టాన్ని భరించడం అవసరమా? బొలంగీర్ తాగునీటి సమస్యను పరిష్కరించడానికి ప్రత్యామ్నాయ మార్గాలు లేవా? గుడి అంచల్ సంగ్రాం పరిషత్ వాళ్లు లోయర్ సుక్తెల్ ప్రాజెక్టును వ్యతిరేకించడంతో పాటు దానికి ప్రత్యామ్నాయంగా చిన్న మధ్యరకం చెక్ డ్యాంల ద్వారా ఎలా తాగు నీరు, సాగు నీరు సమస్యను పరిష్కరించవచ్చో నిర్దిష్టంగా సూచించారు. కాని అసలు సమస్య అది కాదు. చిన్న మధ్యరకం ప్రాజెక్టు అయితే సిబిబి, ఎంఎన్‌సి కంపెనీల నీటి విద్యుత్ అవసరాల్ని తీర్చలేవు. కాబట్టి పెద్ద ప్రాజెక్టులను నిర్మించడం పాలకుల, పెట్టుబడిదారుల, సామ్రాజ్యవాదుల అవసరం. గందమార్ధన్ కొండల్లో గల బాక్సైట్ నిధుల్ని కొల్లగొట్టుకు పోవడానికి, ఇంకా రకరకాల ఖనిజ సంపదను దోచుకు పోవడానికి కాచుకు కూర్చుని వందలాది ఎంఒయులు చేసుకున్న కంపెనీ యజమానుల ప్రయోజనాలు నెరవేరాలంటే లోయర్ సుక్తెల్, అప్పర్ ఇంద్రా, పూజారిపల్లి, సహోర విద్యుత్ ప్రాజెక్టులన్నీ నిర్మాణం కావలసిందే. ఇక్కడ పాలకవర్గాల అవసరాలు ప్రజల అవసరాల్ని స్పష్టంగా వేరుచేసి చూడగలగాలి. లేకుంటే పాలకులు చెప్పే 'లోయర్ సుక్తెల్ నిర్మాణం బొలంగీర్ పట్టణ వాసుల తాగునీటి కోసమే'లాంటి సాకులను నిజమని నమ్మి దాని వెనుక దాగి ఉన్న సిబిబి, ఎంఎన్‌సిల ప్రయోజనాల్ని గుర్తించకుండాపోయే ప్రమాదం ఉంది.

ఎట్టకేలకు ప్రభుత్వం 2013 ఏప్రిల్ 9న ఉదయమే పది ప్లాటూన్ల పోలీసు బలగాలతో ప్రొక్లెన్‌లు, బుల్డోజర్‌లతో కలెక్టర్, ఎస్‌పి, ప్రాజెక్టు నిర్వాహన విభాగపు అధికారులు యుద్ధరంగానికి బయలుదేరినంత ఆర్భాటంతో హటత్తుగా మగుర్‌బెడ చేరుకొని స్పైల్‌వే పనులు ప్రారంభించారు. హటాత్తుగా ఇప్పుడే ప్రాజెక్టు నిర్మాణ పనిని ప్రారంభించడం వెనుక మూడు కారణాలు ఉన్నాయి. ఒకటి ఒడిశా ప్రభుత్వంతో ఎంఒయులు చేసుకున్న కంపెనీ యజమానుల ఒత్తిడి ప్రధాన కారణం కాగా, రెండోది గత కొంత కాలంగా యాక్షన్ కమిటీ నాయకత్వంలో కొనసాగుతున్న ప్రాజెక్టు అనుకూల ఆందోళన. 2014లో జరగబోయే విధానసభ ఎన్నికల్లో, లోయర్ సుక్తెల్ ప్రాజెక్టు ప్రారంభించకుంటే బిజెడికి ఈ ప్రాంతంలో ఒక్క ఓటు కూడా దొరకక పోవచ్చు అనే ఇంటలిజెన్స్ వర్గాల రిపోర్ట్ కూడా నవీన్ సర్కార్‌ను వేగిరపరిచింది. 2013 మార్చ్ 3 లోగా నిర్మాణ పనులు ప్రారంభం కాకుంటే కేంద్రం నుండి ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం మంజూరయిన కోట్లాది రూపాయలు వెనక్కిపోతాయనే ఆందోళన. తమ తమ పనుల్లో మునిగివున్న ప్రజలకు హటాత్తుగా నిర్మాణ పనులు మొదలైన విషయం వెంటనే అర్థం కాలేదు. అర్థమైన కొద్దిమంది మొదటి రోజు అక్కడికి చేరుకొని తమ నిరసన వ్యక్తం చేశారు. రెండవ రోజు ముంపుకు గురయ్యే అన్ని గ్రామాలకు విషయం అర్థమవడంతో వందలాది మంది నిర్మాణ పనులు జరుగుతున్న చోట జమయి నిరసన తెలియజేశారు. పోలీసులు నిర్మాణ పనులు జరుగుతున్న చోటికి ప్రజల్ని రానీయకుండా తరిమేశారు.

రెండవ రోజున నిరసన తెలుపుతున్న బుడి అంచల్ సంగ్రాం పరిషత్‌కు చెందిన 68 మంది కార్యకర్తల్ని అరెస్ట్ చేసి జైలుకు పంపారు. జైలుకెళ్లిన ఆందోళనకారులు జైల్లో నిరాహార దీక్ష ప్రారంభించారు. కాగా మూడవ రోజు పెద్ద సంఖ్యలో మహిళలు, పిల్లలు జమయి తమ నిరసన తెలిపారు. మండుటెండలో (42 డిగ్రీలు) నదిలోని ఇసుక ప్రాంతంలో మహిళలు పిల్లలు వడదెబ్బకు గురవుతూ కూడా తమ నిరసన కొనసాగించారు. మూడవ రోజు నిరసన తెలుపుతున్న వాళ్లలో పొదముండ గ్రామానికి చెందిన రాజ్‌కిశోర్ అనే యువకుడు వడ దెబ్బ తగిలి మరణించాడు. ఐదవ రోజు నిప్పులు చెరిగే ఎండలో వేలాది మంది మహిళలు జమయి పోలీసులతో చర్చకు దిగారు. ఇంత ఎండలో

మళ్లీ చిగురిస్తున్న శ్రీలంక తమిళ కల

***శ్రీలంకలో ముప్పై ఏళ్ల పాటు నిరంకుశ పాలకులతో జరిగిన యుద్ధంలోనూ, ఆ తర్వాతా తమిళుల మానవ హననం జరిగిందనీ, జాతి ఆకాంక్షతో తమిళ ప్రజలు తిరిగి పోరాటం ప్రారంభించారనీ అంటున్నారు** డా. నూకతోటి రవికుమార్*

శ్రీలంకలో 30 ఏళ్లపాటు కొనసాగిన యుద్ధం ముగిసిపోయిందని రాజపక్సే సంబరపడిపోతున్నాడు. కానీ, యుద్ధ బాధితులు శరణార్థి శిబిరాల్లో, దేశంకాని దేశాల్లో, తమ వాళ్ల జ్ఞాపకాలను వడపోసుకుంటున్నారు. అంతే కాదు, ప్రపంచంలోని అనేక దేశాలలో యుద్ధ బాధితులుగా, బహిష్కృతులుగా చెల్లాచెదరైన వాళ్లంతా ఏకమవుతున్నారు. అంతేకాదు, ఆరిపోయిందనుకుంటున్న దీపానికి మళ్లీ వత్తులేసి, తమ సొంత దేశం కలలకు ఊపిర్లు ఊదుతున్నారు. పారిపోయారనుకుంటున్న వారంతా ప్రపంచం ముందు అనాథలైన, కనీస జీవన హక్కులకు కూడా నోచుకోని, పాతిపెట్టుకోడానికి చారెడు నేల కూడా లేని తమ దేశం గురించి ఐక్యరాజ్యసమితి ముందు మోకాళ్లతో నుంచుని వెతలు వలపోసుకున్నారు. శ్రీలంక పాలకుల రక్తపిపాస గురించి, మైనారిటీ తమిళులపై అగ్రజాతి సింహళీయులు చేస్తున్న ఆగడాలు, దుర్మార్గ దుండగాల గురించి ప్రపంచమంతా చాటిచెపుతున్నారు. శ్రీలంకలో రాజపక్సే ప్రభుత్వం ఎల్‌టిటిఇ పోరాటం మీద ఉక్కుపాదం మోపి, దాని సర్వశక్తులూ హరించివేసి, పరిమితులు లేని హింసను ప్రయోగించిన కథలు చాటిచెపుతున్నారు.

నెరవేరని కల మళ్లీ చిగురులేస్తున్నది

ప్రత్యేక తమిళవాదాన్ని కూకటివేళ్లతో సహా పెకలించాలని చెలరేగిపోయిన హింసోన్మాదం. ఇదుగో, ఈ సెప్టెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో తమిళ జాతీయ సమాఖ్య (టిఎన్ఎ) ఉత్తర ప్రావిన్సుల్లోని ఐదు జిల్లాల్లో అత్యధిక మెజారిటీ సాధించి కనుమరుగైపోతున్న కలను మళ్లీ మొలకెత్తిస్తున్నది. జాఫ్నా, కిలినోచ్చి, ముల్లైత్తీవు, మన్నార్, వాయునియా అనే జిల్లాల్లో 78.48 శాతంతో 38 సీట్లు సాధించి తమిళుల తీరని కలను తమిళ జాతీయ సమాఖ్య (టిఎన్ఎ) మళ్లీ వేదిక మీదికి తెచ్చింది.అధికార యుపిఎఫ్ఎ 18.38 శాతం ఓట్లతో కేవలం 7 సీట్లు మాత్రమే గెలుచుకుని చతికలపడింది. శ్రీలంకలో సుప్రీంకోర్టు విశ్రాంత జడ్జి విఘ్నేశ్వరన్ టిఎన్ఎ అధినాయకుడిగా ఎదిగి ఇప్పుడు ముఖ్యమంత్రిగా దేశాధ్యక్షుడు రాజపక్సే సమక్షంలోనే ప్రమాణస్వీకారం చేశాడు. ఆయన నేతృత్వంలోని టిఎన్ఎకి శ్రీలంక తమిళులు ఇంత పెద్ద ఎత్తున మద్దతు పలకడానికి వెనుక మర్చిపోకూడని చరిత్ర ఉంది.

ఈలం బతికి లేదని ఎలా అనుకోగలం ? 30 ఏళ్ల యుద్ధంలో మొత్తం 120000 మంది తమిళ ప్రజల బలిదానాల తర్వాత కూడా ఆ

ఎందుకొచ్చారు పోండి అని తరుముతున్నా పోలీసులతో 'మా తాత తండ్రుల నుండి పుట్టి పెరిగిన నేల మునిగిపోతుంటే మేము ఇంటిపట్టున కూర్చుండి ఎలా ఉంటాము? అని ఎదురు ప్రశ్నించారు. మహిళలపై అమానుశంగా జరిపిన లాఠి చార్జ్‌లో ఐదుగురు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. ఏడుగుర్ని అరెస్ట్ చేశారు. గాయపడిన మహిళల్ని బొలంగీర్ హస్పిటల్‌కు తరలించారు. ఈ వార్త తెలిసిన మిగతా మహిళలు పోలీసుల్ని నిలదీయగా మరోసారి పోలీసులు చేసిన లాఠీచార్జ్‌లో మరో నలుగురు మహిళలు గాయపడ్డారు. ఆరవ రోజు మహిళలు మరింత పెద్ద సంఖ్యలో జమయి నిర్మాణ స్థలంలో పడుకున్నారు. ఎండ దెబ్బ తగిలి ఆరోజు ముగ్గురు మహిళలు స్పృహ కోల్పోయారు. మరోవైపు ఐదు రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న 68 మంది బిఎఎస్‌పి కార్యకర్తల్ని చివరికి ప్రభుత్వం విడుదల చేయక తప్పలేదు. వీళ్లందరు జైలు నుండి వస్తూనే నేరుగా పోరాటంలో పాల్గొన్నారు. ఎనిమిదవ రోజున మరోసారి లాఠీచార్చ్ జరిపారు.

ఇలా రోజుల తరబడి వేలాది మంది ప్రజల తీవ్ర నిరసనను పెడచెవిన పెట్టి క్రూరంగా అణిచివేస్తూ పోలీసు బలంతో ప్రభుత్వం మొండిగా నిర్మాణ పనులు కొనసాగించింది. వారం రోజులు గడిచాకా సుక్తెల్ ప్రజల పోరాటానికి సంగీభావం తెలుపుతూ, ప్రజలపై లాటిచార్జిని ఖండిస్తూ, నియంగిరి, పోస్కో, సంబల్‌పూర్ ప్రాంతాల్లోని వివిధ ప్రజా సంఘాలు, బుద్ధి జీవులు సుక్తెల్ పోరాటానికి తమ మద్ధతు తెలపడంతో పాటు సంఘటన స్థలానికి వచ్చి బుడి అంచల్ ప్రజలతో కలిసి పోరాటంలో పాల్గొన్నారు. బయటి ప్రాంతాల నుండి ఈ పోరాటానికి దొరుకుతున్న సంఘీభావాన్ని బలహీనపరచడానికి ప్రజా సంఘాల కార్యకర్తల్ని బొలంగీర్‌కు రాకుండా అడ్డుకోవడంతో పాటు వచ్చిన వాళ్లను అక్రమంగా అరెస్ట్ చేశారు. నిషన్ పత్రిక సంపాదకుడు లెనిన్ కుమార్ ఇందులో భాగమే. అక్రమ అరెస్టులు, లాఠీ చార్జీలు, జైల్ నిర్బంధాల్ని దిక్కరిస్తూ బిఎఎస్‌పి నాయకత్వంలో నిర్వాసిత ప్రజలు మరింత సంఘటితమవుతూ మిలిటెంట్ పోరాటాలకు సిద్ధమవుతున్నారు. ఇటీవల వేలాది మంది ప్రజలతో పాథయాత్ర జరిపి దాని ముగింపుగా జరిపిన బహిరంగ సభలో మాట్లాడిన వక్తలు 'ఇది పాదయాత్ర ముగింపుకాదు మరింత దృడమైన పోరాటానికి ప్రారంభం మాత్రమే' అని ప్రకటించారు. నియంగిరి తదితర ప్రాంతాల ప్రజా సంఘాల నాయకులు ఈ సభలో పాల్గొని వీరికి అండగా నిలవగా సభలో పాల్గొన్న ముంపుకు గురయ్యే ప్రాంతపు వేలాది మంది ప్రజలు 'రక్తాన్నైనా ఇస్తాం భూములు మాత్రం ఇవ్వం' అని ప్రతిజ్ఞ చేశారు.

ఈ ప్రజల న్యాయమైన పోరాటానికి అండగా నిలువడం ప్రజాస్వామికవాదులందరి కర్తవ్యం.

(రచయిత ఫ్రీలాన్స్ జర్నలిస్ట్) వీ

గడ్డ మీద ఈలం ఆలోచనలు తుడిచి పెట్టుకుపోయాయని ఎలా అనుకోగలం? వీరిలో 30 వేల మంది సాధారణ తమిళ పౌరులు చిందించిన నెత్తుటి చారికలు తుడిచిపెట్టుకుపోతాయా? విచిత్రమేమంటే, ఇవాళ ప్రపంచవ్యాప్తంగా 88700 మందికి పైగా వేర్వేరు దేశాల్లోని తమిళ విద్యావంతులు, మేధావులు తమను తాము సమీకరించుకుని శ్రీలంకలో తమ జాతి అస్తిత్వంపై జరుగుతున్న నిరాటంక హింసను ప్రపంచానికి చాటిచెపుతున్నారు. తమకు ఆసరాగా నిలబడలేకపోయిన జెనీవా ఒప్పందంలోని లొసుగులను తేటతెల్లం చేస్తున్నారు.

యూరప్, ఆస్ట్రియా, స్విజ్జర్లాండ్, కెనడా తదితర దేశాలలో తలదాచుకున్న వందలాది మంది తమిళులు ఆరిపోయిందనుకుంటున్న ఎల్‌టిటిఇ దీపం విరజిమ్మిన జాతి అస్తిత్వపు వెలుగును కాపాడుకోవాలని తపిస్తున్నారు. ఒక్క స్విస్ దేశంలోనే 50 వేల మందికి పైగా తమిళ పౌరులు తలదాచుకున్నారని, వారి కథేందో కూడా చూస్తామని రాజపక్సే విర్రవీగుతున్నాడు. చివరికి ఆయన గర్వం, ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్ నావి పిళ్లై, శ్రీలంక దేశాన్ని సందర్శించినప్పటికీ సహకరించనంతగా ఎదిగింది. అంతేకాదు, ఈలంను దుంపనాశనం చేసి అభివృద్ధి పేరుతో మరో కొత్త నాటకానికి ఆయన తెరతీశారు. 14.2 బిలియన్ల డబ్బుతో జాఫ్నాలో పవర్‌గ్రిడ్‌ను నెలకొల్పుతాను అంటున్నాడు. టిఎన్ఎ డిమాండ్ చేస్తున్నట్టుగా రాజ్యాంగంలోని 13 నిబంధన ద్వారా తమిళుల స్వయం ప్రతిపత్తి అంశంపై చర్చిద్దామంటు న్నాడు. ఎన్నికల సమయంలో టిఎన్ఎ అభ్యర్థులను బెదిరించిన నోటితోనే, ఆర్మీతో ఓటర్లను సైతం అడ్డుకున్న చేతితోనే ఇప్పుడు అనేక వాగ్దానాలు చేస్తున్నాడు. కంకేసంతురై పోర్టులో కానీ, ఉత్తర జాఫ్నాలో కానీ ఆర్మీ క్యాంపులను ఎత్తివేయలేదు.

ఇంకోవైపు తమిళనాడు రాజకీయ నేతల ఒత్తిడితో శ్రీలంకలో మానవ హక్కుల హననం గురించి అడుగుతున్న ఇండియాతో సంబంధాలను వదులు కోడానికి సైతం సిద్ధపడుతున్నాడు. చైనాతో శాటిలైట్ టెక్నాలజీ ఒప్పందాలు చేసుకుంటున్నాడు. అదేమని అడిగితే, లంకలోని 46 ప్రముఖ అంతర్జాతీయ వాణిజ్య కంపెనీల్లో 43 కంపెనీల్లో సీఈవోలు ఇండియా వాళ్లే కదా అంటూ నమ్మబలుకుతున్నాడు. ఇంకోవైపు గతంలో ఎల్‌టిటిఈకి ఇండియాలోని తమిళనాడులోనే శిక్షణ ఇచ్చారని ఆరోపిస్తూనే, ఐరాసలో ఆ మధ్య జరిగిన ఒక సమావేశంలో తమిళ భాషలో మాట్లాడి నాటకాన్ని రక్తి కట్టించాలి అనుకుంటున్నాడు. ఇదంతా ఎందుకంటే, నవంబర్‌లో జరగనున్న 'కామన్వెల్త్ హెడ్స్ ఆఫ్ గవర్నమెంటు' సమావేశంలో తన వేటగాడి ధోరణి బయపడుతుందని. తద్వారా అంతర్జాతీయ సమాజం ముందు తన నేరాలు బయట పడతాయన్న ఉద్దేశ్యంతోనే ఈ రగ్బీ ఆటగాడు కొత్త ఎత్తులు వేస్తున్నాడు. నిజానికి దీవుల దేశాల రాజ్యాంగంలోని 13 నిబంధన ప్రకారం లంకలోని తమిళ జాతీయుల ప్రాంతాలకు స్వయం ప్రతిపత్తి ఇవ్వాలి. ఇందుకోసమే అప్పట్లో ఈలం కానీ, ఇప్పుడు పార్లమెంటరీ పంథాలో టిఎన్ఎ కానీ పట్టుపడుతున్నాయి.

గతం నుంచి వర్తమానంలోకి చూస్తే..లెక్కలేనన్ని గాయాలు

తమ జాతి అస్తిత్వం కోసం, తమను తాము లెథాల్ ఆత్మాహుతి బాంబులుగా అమర్చుకుని అమరులైన తమిళవీరుల హృదయం తునాతునకలయ్యే భయంకర హింసాత్మక విప్లవాన్ని కలగన్నారు. వాళ్ల కలలు బదాబదలయ్యాయి. ఆధిపత్య 'సింహళ' రాజకీయాలు వారి కలలను కల్లోలం చేశాయి. శ్రీలంక సైన్యం ఎల్‌టిటిఇ సానుభూతిపరులను సైతం మట్టుబెట్టింది. ప్రత్యేక తమిళ దేశపు ఆలోచనలనూ కకాకవికలం చేసింది. పుట్టిన గడ్డ మీదే లక్షలాది తమిళులను శరణార్థులుగా మార్చింది. ఒక నిరాటంక యుద్ధం. అదీ ఒకవైపే జరిగింది. నిరాయుధులుగా, మట్టి మనుషులుగా వెట్టిబతుకులతో బలయిన తమిళ పౌరులు. ప్రణాళికాబద్ధంగా జరిగిన హింసా పరాకాష్ఠ. చెప్పడానికి వీల్లేని నిర్మాణాత్మకంగా పేలిన యుద్ధ ట్యాంకుల కింద నిస్సహాయంగా సజీవంగా సమాధైపోయిన వేలాది తమిళ యువకులు.బండారు నాయకే అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి కొలంబో పట్టణం వరకూ నెమలి కన్నుల్లా కనిపించే సముద్ర ఘోష వారి దుఃఖాన్ని వ్యక్తీకరిస్తోంది. మహీంద్ర రాజపక్సే, ఆయుధాలతో ప్రజలను దీవించే ప్రభువుగా నెరిపిన నిర్దాక్షిణ్యానికి బుద్ధుడి విగ్రహాల వద్ద శాంతి సూక్తులు విస్తుపోయి చూస్తూనే ఉంటాయి. ఓ రకంగా 30 ఏళ్లుగా శ్రీలంకలో సామాన్య తమిళ పౌరులపై జరుగుతున్న యుద్ధం 2009తో ముగిసిందని చరిత్ర చెపుతోంది.ఇక నుంచి శ్రీలంక శాంతికి చిహ్నంగా వర్ధిల్లుతుందని, ఇక ప్రత్యక ద్వీపంగా అది టూరిస్టుల విహారకేంద్రంగా విరాజిల్లుతుందని, ఆ నేలలో ఎల్‌టిటిఈ ఆనవాలే లేవని సింహళ పౌరులు జబ్బలు చరిచి మరీ చాటుకోవచ్చు. ప్రతి వీధి మలుపులో చిరు నవ్వులు విరజల్లే బుద్ధుడి ప్రతిమలు మనకు ఆహ్లాదం కలిగిస్తూ ఆహ్వానిస్తూ ఉండొచ్చు. అదే సమయంలో విచిత్రంగా కొలంబో పురవీథుల్లో ప్రతిచోటా శ్రీలంక సైన్యం గుడారుల విడిది కేంద్రాలు కూడా డేగ కళ్లతో పరిశీలిస్తూ కనిపిస్తుంటాయి.

నాలుగున్నరేళ్ల క్రితం యుద్ధం ముగిసిందా ? వన్ని – అనే ఉత్తర ప్రావిన్సులోని చిన్న అడవిలో ఎల్‌టిటిఈ అధి నాయకుడు వేలుపిళ్లై ప్రభాకరన్‌ను సైన్యం 2009లో చిత్రవధల పరంపరలో నరికి పారేసిన జ్ఞాపకం గుర్తుండకపోవచ్చు. చాక్లెట్‌లో విషం కూరి పద్నాలుగేళ్ల ఆయన కొడుకుని సైన్యం క్యాంపులో చంపేసిన వైనం కూడా మదిలో ఉండకపోవచ్చు. వైద్యం కోసం ఆయన తల్లి వృద్ధాప్యంలో ఎన్నో కష్టాలు పడుతూ ఉండవచ్చు. ఈ కథనాలన్నీ, ఫోటోలన్నీ పత్రికల్లో టీవీల్లో చూసి మనం నిర్వాపకంగా వదిలేసి ఉండవచ్చు. కానీ, ఇప్పుడా జ్ఞాపకాలన్నీ జాఫ్నాలోంచి, శరవేగంగా వన్ని, మన్నార్, ముల్లైత్తీవు, వయానియా, కిలీనోచ్చి జిల్లాలను దాటుకుంటూ మనదేశంలోని తమిళనాడు దాకా పరీవ్యాప్తి చెందడం యాదృచ్ఛిక సత్యం కాదు. అలాగని, మిలటరీ విజయ సంకేతాలూ అబద్ధం కాదు. ప్లాస్టిక్ కవర్‌లో ఛిద్రమైన సలపరించే పెద్ద పెద్ద గాయాలతో షార్క్ చేపలా భయపెట్టే ప్రభాకరన్ మృతదేహం, రోడ్డు పక్కన చిందిన నెత్తురుతో ఎర్రని అతని మెదడు దృశ్యాలన్నింటినీ పదిలంగా లంక తమిళులకు పదునైన సందేశాన్ని పంపించి ఉంటాయి.

దశాబ్దాల లంక తమిళుల జాతి కల నిశ్శబ్దంగా నిష్క్రమిస్తుండడం విషాదమే కదా. 2009 ముల్లైత్తీవు జిల్లాలో ముల్లవైకల్ అనే చిన్న గ్రామంలో చిక్కిన ప్రభాకరన్, ప్రభాకరన్ దేహం తమిళుల చివరి కలలనూ నిరాశలో ముంచిందని చాలామంది భావించారు. ఎల్‌టిటిఈపై శ్రీలంక సైన్యం పట్టు సాధించిందనే వార్తను వినాలంటే,

చాలా మందికి చిరాకుగా ఉంటుంది. కానీ, ఆ గ్రామంపై ఆ రోజు ఆకాశం నుంచి రక్తదాహంతో తమిళ పౌరులపై వర్షించిన బుల్లెట్‌లు 3 లక్షల పైచిలుకేనంటే ఆశ్చర్యం వేస్తుందంటున్నారు ఇప్పటికీ ఆ గ్రామస్తులు. ఈ సంఘటనకు ఛానల్ 4 రిలే చేసిన సాక్ష్యాలు నిదర్శనంగా నిలుస్తాయి కూడా. ఓ ఎల్‌టిటిఈ మహిళా కార్యకర్త యుద్ధంలో పోరాడి చనిపోయిన తర్వాత ఆమె నగ్న దేహాన్ని, వేలాడే వక్షోజాలతో ఈడ్చుకుంటూ వెళ్లే సైన్యం విజయదరహాసాలు జుగుప్సాకరంగా టీవీల్లో చూసిన తమిళులు గడ్డ కట్టిన కన్నీళ్లను పెదవి దాటి రానీయకపోవడమే విచిత్రం. చివరికి అక్కడికి కవరేజ్‌కు వెళ్లిన పాత్రికేయులకూ ఆ దృశ్యాలను తీయడానికి సాహసం రాలేదు. ఎందుకంటే బంకర్‌ల్లో దాక్కున్న సైన్యం తుపాకుల మొనలు బెదిరిస్తూనే ఉన్నాయి కనుక. ఆ గ్రామంలోని ఏ ఇంటి గోడలైనా సరే, ఇప్పటికీ బుల్లెట్ సాక్ష్యాలు చెపుతాయి. కుటుంబాలకు కుటుంబాలే చెల్లాచెదరైపోయి, చనిపోయిన వారిలో తమ బిడ్డల ఆనవాలే గుర్తించలేకపోయి అలమటించేవారు, ఎంత దారుణం? ఓ రకంగా దుఃఖాన్ని వ్యక్తీకరించడానికి కూడా అవకాశమీయని దుస్సాధ్యమైన నేల. ఇక కథ మామూలే. మీ మీ గ్రామాలకు వచ్చి, మీ నేల మీరు సాగు చేసుకోండంటూ ప్రపంచలోని అనేక దేశాలు, లంకలోని తమిళులు కోరుకుంటున్న రాజ్యాంగంలోని 13వ నిబంధనను అనుసరిస్తామంటూ చాటిచెప్పే రాజపక్సే.

చాలా చిత్రంగా 1950 నుంచి శ్రీలంక పౌర పోలీసులు స్టేషన్లకే పరిమితం అవుతున్నారు. అంతా సైన్యమే చూసుకుంటుంది. తమిళుల జాతీయ పోరాటం మొదలు నుంచీ సైన్యానిదే హవా. ముల్లైత్తీవు తీరం చేపల వేటకు ఒకప్పుడు ప్రసిద్ధం. కానీ, ఇప్పుడది భంగపడిన ప్రాంతం. 1983 నుంచే తమిళ జాతి వ్యతిరేక హననకాండ ఆరంభం. అంతకు ముందు అక్కడ మత్స్యకార కుటుంబాలన్నీ తమిళులవే. చిత్రంగా 1983 తర్వాత అక్కడకు సింహళ మత్స్యకార కుటుంబాలు వచ్చినాయి. సింహళీయుల అక్రమ చొరబాట్లు, వాళ్ల చేతుల్లోకి మరపడవలు రావడం, తమిళులపై ఆధిపత్యం షరా మామూలైంది. ఇక వేటపై వారిదే పెత్తనం. ఎల్‌టిటిఈ అండ ఉన్నప్పుడు ధోకాలేని తమిళుల జీవనం ఆ తర్వాత ఒడ్డున పడ్డ చేపపిల్ల సామెతే అయ్యింది. 2012, మార్చిలో కొలంబో స్థానిక ఎన్‌జిఒ ఒకటి ఈ వాస్తవాలపై అప్పట్లో నివేదిక కూడా వెల్లడించింది. యుద్ధానికి ముందు జాఫ్నా పరిసర ప్రాంతాల్లోని అధికశాతం మంది ప్రజల బతుకుకు వనరు చేపల వేటే. తద్వారా ఉపకరించే చేపల పరిశ్రమలే. శ్రీలంకలోని చేపల ఉత్పత్తికి ప్రధాన వనరు జాఫ్నా తీరప్రాంతమే. 1983 నుంచి ప్రతియేటా 48 వేల మెట్రిక్ టన్నుల చేపలు ఎగుమతి అయ్యేవి. జాతీయ ఆదాయంలో 4వ వంతు ఈ ఎగుమతులే భర్తీ చేసేవి. ఇక ఈలంపై మూడోసారి యుద్ధం మొదలుపెట్టినాక అది కేవలం 6 శాతానికి చేరుకుంది. తమిళజాతి మత్స్యకార కుటుంబాల మీద అక్రమ కేసులు. లెక్కలేని నిబంధనలు వారి బతుకులను అపహాస్యం చేయడం మొదలయ్యింది. ఏకంగా రక్షణ శాఖ నుంచే అనుమతి తీసుకుని నిరాటంకంగా వేట చేసుకునే అవకాశం అక్కడి సింహళీయులకు ప్రభుత్వం కట్టబెట్టింది. పశ్చిమాన ట్రింకోమలై ప్రాంతమంతా విస్తరించిన ఎల్‌టిటిఈని చంపేస్తూ శ్రీలంక సైన్యం 2006 నాటికి దానిని పర్యాటక ప్రదేశంగా మార్చి విదేశీ టూరిస్టుల ఆవాస కేంద్రంగా మార్చింది. ట్రింకోమలైలోని ప్రతి వీధిలో గుంపులు గుంపులుగా సైన్యం గద్దల్లా కనిపిస్తూనే ఉంటారు. ఆ వీధుల్లో ప్రతి వీధిలో వచ్చే పోయే బస్సులు డేగకళ్ల ఎక్స్‌రేలను తప్పించుకోలేవు. బస్సెక్కిన ప్రతి ప్రయాణీకుడూ విధిగా బస్సుల్లో ఏర్పాటు చేసిన రిజిస్టర్‌లో తన సెల్ నంబరు నమోదు చేయాలి. ఎందుకొచ్చారో, పనేమిటో కూడా పేర్కొనాలి. ఇక సైన్యం తనిఖీలు సరేసరి.

2012, ఎకనామిక్ పొలిటికల్ వీక్లీ సర్వే ప్రకారం అక్కడ ప్రతి ఐదుగురు పౌరులకీ ఒక సైనికుడు చొప్పున ఉంటారట. ప్రతి రోజూ 4 సార్లు తనిఖీలు. ఓ రకంగా ఇది ఆఫ్ఘనిస్థాన్ యుద్ధ వాతావరణాన్ని తలపించే దృశ్యం. ఆరు వేల మంది ఆర్మీ జవాన్లు ట్రింకోమలై చేరుకునే ప్రతి బస్సును తనిఖీ చేస్తుంటారు. శ్రీలంక సైన్యం అధికార ప్రతినిధి బ్రిగేడియర్ రువానే వన్నీగసూర్య ఈ విషయాన్ని స్వయంగా ప్రకటించాడు. 'ఒక వేళ ఎల్‌టిటిఈ మాజీ కార్యకర్తలెవరైనా ఆయుధాలతో దొరుకుతారని' ఆయన జవాబు.

ట్రింకోమలైలో ఒక ప్రాచీన తమిళ గ్రామం తెన్నవాన్‌మరప్పుడి. ఒకప్పుడు అక్కడ తమిళులు - సింహళీయులు సోదర సంబంధంతో శాంతిసహజీవనంతో గడిపేవారని చరిత్ర చెబుతుంది. 9వ శతాబ్దిలో పాండ్యరాజు ఆ ప్రాంతాన్ని జయించాడని, ఆ తర్వాత పాండ్యరాజ్యం స్థాపించాడని, ఈ క్రమంలో ఉత్తర శ్రీలంక వరకు, ఆ తర్వాత ఇండియాలోని తమిళ ప్రాంతం వరకూ తన సామ్రాజ్యాన్ని విస్తరింపజేశాడని చరిత్ర వెల్లడిస్తున్నది. కానీ, విచిత్రంగా 1980 నాటికి అది ఎల్‌టిటిఈకి శ్రీలంక ప్రభుత్వానికీ మధ్య యుద్ధరంగమయ్యింది. చివరికి, అక్కడి తమిళ పౌరులు శరణార్థులైపోయారు. ఎందరో తమిళ రైతులు వారి పొలాలను కోల్పోయారు. స్థానిక ప్రభుత్వాలు పెట్టే చిక్కుల్లో ఎందరో తమిళులు నివాసాలు కూడా దిక్కులేనివారయ్యారు. చివరికి 2011నాటికి ఐక్యరాజ్యసమితి హక్కుల కమిటీ ఏర్పాటు చేసిన శరణార్థి శిబిరాల్లో వాళ్లు బిక్కుబిక్కుమంటూ బతుకును వెళ్లదీసే దయనీయ స్థితికి చేరుకున్నారు. వారి నివాసాల్లో, పంట భూముల్లో సింహళీయులు దర్జాగా కొలువుదీరారు. ఇక తమిళ పౌరులు పోలీసు స్టేషన్లను ఆశ్రయించినా పరాచికాలెదురవుతున్నాయి. సింహళీయులు నేరుగా రాజపక్సే కార్యాలయ సిబ్బందితో మాట్లాడగలరు. ఇళ్లు, పశువులు కొల్లగొట్టబడిన తమిళ కూలిజనం, భూములు కోల్పోయిన తమిళ పేద రైతులు, దారీతెన్నూ లేని కుటుంబాలు, వలస గోసలు, హృదయ విదారక వాస్తవాలు.

బుద్ధుడి పేరుతో హింస ఇక్కడి మరో చిత్రం

ఇక శ్రీలంకలోనే సింహళ - బుద్ధిస్టులు మెజారిటీ వర్గం. ఆ దేశ జనాభాలో వీరు 75 శాతం. కానీ తమిళులు కేవలం 32 లక్షల మంది. అంటే 11శాతం. ఇంకోవైపు కొత్తగా బోదు బాలసేన(బిబిఎస్) పేరుతో సింహళ బుద్ధిస్టు గురువులు నయా - ఫాసిస్టు ధోరణులతో బుద్ధిజాన్ని రక్షించే పేరుతో మైనారిటీ ముస్లింలపై, క్రైస్తవులపై , తమిళులపై హింసకు తెగబడుతున్నారు. తమను తాము వారు ఇండియాలోని శివసేనతో పోల్చుకుంటూ చేస్తున్న ఈ హింసోన్మాదాన్ని రాజ్యం పెంచి పోషిస్తోంది. దీనికి సింహళ జాతి చైతన్యం అనే కొత్త లేబిల్‌ను అంటిస్తున్నారు. తాము తప్ప మిగిలినవారంతా ద్వితీయ శ్రేణీ పౌరులేనంటూ వారు వాదిస్తున్నారు. ఈలంపై పట్టు సాధించిన ఈ నాలుగేళ్లలో అక్కడ

మతోన్మాద హింసను ప్రేరేపించే సంస్థగా బిబిఎస్ ఎదిగింది. నిజానికి ఈలం తమిళ జాతి అస్తిత్వం కోసం చేస్తున్న పోరాటానికి తమిళ ప్రజల నుంచి పెద్ద ఎత్తున మద్దతు ఉంటోంది. 1980 వరకూ తమిళులు – సింహళీయుల మధ్య సామరస్యంగా సహజీవనం కొనసాగింది. 1960 ప్రాంతంలో కొందరు విద్యావంతులు ఆల్‌సిలోన్ కాంగ్రెస్‌ను ఏర్పాటు చేసి పరస్పర సహకారానికి తోడ్పాటునిచ్చారు కూడా. కానీ, 1976 నుంచి ప్రత్యేక తమిళవాదం బలంగా వెల్లువెత్తింది. దీంతో 1956 నాటి సింహళ చట్టమూ ముందుకొచ్చింది. భూమి హక్కులు, చేపలు పట్టుకునే హక్కు, ప్రభుత్వ ఉద్యోగాల్లో సింహళీయులకు ప్రాధాన్యం పెరగడం ప్రారంభమైంది. ఉద్యోగాల భర్తీ సమయంలో సింహళీయుల కంటే తమిళులు విశ్వవిద్యాలయ స్థాయిలో 15 శాతం అదనంగా మార్కులు సాధిస్తేనే తీసుకునే నిబంధన ఆరంభమైంది. దీనిని నిర్బంధంగా అమలు చేయాలంటూ 1970లో మరో చట్టం తెచ్చారు. ఈ అన్నిరకాల అణచివేతలను నిరసిస్తూ ఎల్‌టిటిఈ ప్రారంభమయింది. సింహళీయులు, సింహళ బుద్ధిస్టుల కంటే తాము రెండో తరగతి శ్రేణి పౌరులుగా దిగజార్చడాన్ని సైద్ధాంతికంగా ఎదుర్కొనడం ఆరంభించింది. అయితే, శ్రీలంక రాజకీయాల్లో జోక్యం చేసుకుని పార్లమెంట్‌లో మెజారిటీ సాధించడం ద్వారా తమిళుల మనుగడను కాపాడుకోవాలి అనుకునే కొందరు రాజకీయనేతలు ఉంటుండగానే ప్రభాకరన్ ఎల్‌టిటిఈ ద్వారా తమిళ జాతి భావనను మరో మలుపు తిప్పారు. తమిళజాతి సమాఖ్య (టిఎన్‌ఎ) ద్వారా లంకలో అన్ని తమిళ రాజకీయ పక్షాలను ఏకం చేసి శ్రీలంక ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావడం ద్వారా రాజ్యాంగ పరిష్కారం సాధించవచ్చుననేది సంప్రదాయ తమిళ రాజకీయ నేతల పంథా. కానీ, దీనికి భిన్నంగా ఈలం ప్రత్యేక పంథా తీసుకుంది. నిజానికి దారుణంగా అణచివేయబడుతున్న తమిళజాతి అస్తిత్వాన్ని గురించి ఇంటా బయటా పెద్ద ఎత్తున చర్చను రేకెత్తించడం ద్వారా తమిళ పౌరుల ప్రాథమిక హక్కులనైనా కాపాడుకోవాలనేది టిఎన్‌ఎ వంటి రాజకీయ పక్షాల లక్ష్యం. కానీ, విచిత్రంగా సింహళీయుల ఆధిపత్య భావన మీదుమిక్కిలి పెచ్చరిల్లింది.

బ్రిటిష్ వారి కాలం నుంచే అండర్ కరెంట్ లాగా సింహళ ఆధిపత్య సంస్కృతి విస్తరించింది. దీనిని గమనించిన బ్రిటిషు అధికారులు కొందరు అప్పట్లో తమిళ జాతి వీరులను వీరికెదురు నిలబెట్టారు. తద్వారా విభజించి పాలించే కుట్రను అమలు చేసుకున్నారు. ఈ క్రమంలోనే కొందరు తమిళులు అప్పట్లోనే మంచి విద్యావంతులైన వారు కూడా ఉన్నారు. పలువురు తమిళులు విదేశాల్లో డిగ్రీలు కూడా సంపాదించారు. వలస పాలనా కాలంలో ఉన్నతాధికారులుగా కూడా హవా చెలాయించారు. కొందరు కొలంబో లాంటి చోట్ల పెద్ద ఎత్తున ఆస్తులు కూడా సంపాదించారు. ఇటువంటి వారిలో రాజీవ్ విజయసిన్హ లాంటి తమిళ జాతి నాయకులు కొందరు లిబరల్ పార్టీల వంటివి స్థాపించి లంక అధికార పార్టీల ఎజెండాతో మిలాఖత్ కూడా అయిన చరిత్ర ఉంది. కాగా 1950 శ్రీలంక చట్టం నుంచి అక్కడి రాజకీయాల్లో వివక్షా వాతావరణం బలంగా ఆవరించి, విస్తరించింది. వలస పాలన అంతం కాగానే ఇంగ్లిష్ స్థానంలోకి చిత్రంగా సింహళ భాష ప్రవేశించి అది అధికార భాష అయ్యింది. సింహళీయుల ఆధిపత్య ధోరణి అన్ని రంగాలలో పెచ్చరిల్లింది. 1987లో తమిళభాషను కూడా అధికార భాషగా ప్రకటించాలనే డిమాండ్‌తో ఉద్యమం మొదలైంది. అయితే, అప్పటికే గెరిల్లా యుద్ధతంత్రంతో తమిళజాతి విముక్తి లక్ష్యంగా తమిళుల ఆగ్రహం రూపంగా ఎల్‌టిటిఈ తన కార్యరంగాన్ని ప్రారంభించింది కూడా. ఇదే అదనుగా లంక సైన్యం అరాచకాలు ప్రబలిపోయాయి. ఇలా అవమానాలతో చనిపోవడం కంటే, ఆత్మగౌరవంతో బతకాలనే వేలాది మంది తమిళ పౌరులు, స్త్రీలు నిస్తేజంగా బతుకులీడ్వటం ఇష్టం లేక ఈలంలోకి పరుగులు తీశారు. ఇక ఎల్‌టిటిఈపై సైన్యం యుద్ధం ప్రారంభించాక తమిళజాతిపై హనన రూపాలు చెప్పనవసరం లేదు. తమిళ జాతి స్త్రీల భర్తలను చంపి, రెగ్యులర్‌గా ఆ స్త్రీలను సామూహిక అత్యాచారాలు చేయటం నిత్యకృత్యంగా మారిపోయింది. గత్యంతరం లేని స్థితిలో ఈలంలో చేరిన వారి సంఖ్య లెక్కలేదు. అవమానపడే వాళ్లు, నిత్య అత్యాచారాలకు గురయ్యే వాళ్లు, ఇల్లూ, వాకిళ్లూ లేక దిక్కులేని వారందరికీ ప్రభాకరన్ పెద్దదిక్కుగా కనిపించేవారు. ఇక కథ మామూలే.

ఇప్పుడు యుద్ధం ముగిసిపోయాక, ఆర్మీ గెలిచాక, మిగిలిపోయిన, లొంగిపోయిన మాజీ ఎల్‌టిటిఈ కార్యకర్తలకూ, కొరియర్లకూ మునుపటి వేధింపులు తప్పడం లేదు. ఇక ఇలాంటి కుటుంబాల స్త్రీల పరిస్థితి చెప్పనవసరం లేదు. సింహళ యువకులు వారిని బహిరంగంగా వేధింపులకు, అత్యాచారాలకు పాల్పడినా పోలీసు కేసులు ఉండడం లేదు. వారి బతుకులు బసివినిలుగా మారిపోతున్నాయి. 'ఇక్కడెక్కడైనా తమిళులకు భద్రజీవనం కొసరే చారెడు నేల ఉంటే చూపించండి' అనే వారక్కడ కోకొల్లలు. ఆర్మీ వారి టార్చర్ రూపాలు కూడా కోకొల్లలే. అవి అంతూపొంతూ లేని భీభత్స కథలు. కనీస మానవీయత అనే పదం పొలిపోయిన గాథలు, మానవ హక్కులనే మాట వినపడని కథలు. ఈలంపై ముప్పై ఏళ్ల యుద్ధంలో ఆ దేశంలో ఈ పదాలు వినడానికి అనర్హమైపోయాయి. అందుకే గెరిల్లా యుద్ధ వీరులు సైన్యానికి దొరగ్గానే సైనేడ్ గుళికలు మింగి చనిపోడానికి కారణం. కనీస మనుగడ కోసం పోరాటం అసలు చరిత్రే కాకుండా పోయింది. గత యుద్ధ సమయంలో ఆరు నెలల్లోనే 40000ల మంది తమిళ పౌరులను చంపినట్టు 2009లో అధికారికంగానే ఆర్మీ బాహాటంగా ప్రకటించడం అక్కడి అధికార ప్రభుత్వ పొగరుబోతు తనానికి నిదర్శనం.

ఐక్యరాజ్యసమితి, అమెరికాలతో పాటు ఇండియా కూడా రాజపక్సే నియంతృత్వ పోకడలకు కలవరపడ్డాయి. లంకలో జరుగుతోన్న తమిళుల ఊచకోతలపై ప్రపంచంలోని అనేక దేశాలు హెచ్చరికలు జారీచేశాయి. ఏకంగా ఐరాస ప్రతినిధి బృందమే శ్రీలంకలో పర్యటించి పరిశీలనలు జరిపింది. ఈ క్రమంలో ఐరాస సెక్రటరీ జనరల్ కూడా 2008 సెప్టెంబర్‌లో ఒక నివేదిక వెల్లడి చేశారు. 2008 సెప్టెంబర్, 2009 మే నెల మధ్యలో ఆర్మీ చేసిన అరాచకాలకు అంతూపొంతూ లేకుండా పోయిందని ,పెద్ద ఎత్తున తమిళపౌరులు చంపివేయబడ్డారని' నివేదిక వెల్లడించింది. నో ఫైర్‌జోన్‌లపై సైతం తెగబడి సైన్యం సృష్టించిన భీభత్సాన్ని వివరించింది. చివరికి పసిపిల్లలు చదువుకునే స్కూళ్లపై కూడా బాంబులు వేసి భయోత్పాతం సృష్టించిందని పేర్కొన్నది. చివరికి ఐరాస పెట్టిన ఆస్పత్రులు తప్ప, శరణార్థి శిబిరాలు తప్ప తమిళ పౌరులకు చుట్టు గుడిసెలు కూడా లేని అత్యంత దయనీయ దుస్థితి ఏర్పడింది. ఈ నివేదికను రాజపక్సేకి ఇచ్చి చేతులు దులుపుకుంది ఐరాస. తన

దేశంలో అంతా క్షేమమేనని, తమిళుల జీవితానికీ ఇబ్బంది లేదని రాజపక్సే మీడియా ముందు వెల్లడించడం ఏ రాజకీయాలకు పరాకాష్టో చెప్పనవసరం లేదు.

తమిళుల చర్చ్‌పైనా, మీడియాపైనా దాడులే

2011లో ప్రభుత్వమే వెల్లడించిన ఒక నివేదిక ప్రకారం ఎల్‌టిటిఈపై జరిపిన యుద్ధంలో 5,556 మంది సైన్యం చనిపోయారు. 28,414 మంది గాయపడ్డారు. అదేవిధంగా 22,2147 మంది ఈలం క్యాడర్ చనిపోయిందని ప్రకటించారు. యుద్ధం వలన ఇరుపక్షాలూ నష్టపోయాయని, అంటూ బోస్నియా యుద్ధంతో పోల్చుకున్నారుకానీ, తమిళులపై జరిపిన, జరుపుతున్న మారణ హననాన్ని పేరుకు కూడా ప్రస్తావించలేదు. యుద్ధంలో చనిపోయిన వారి సంగతి సరే, ప్రభుత్వ లెక్కల ప్రకారమే, యుద్ధం తర్వాత ఆ సంఖ్యతో సమానంగా తమిళులు ఆచూకీ దొరకడం లేదు. నార్తరన్ ప్రావిన్సుల్లోని రెండు జిల్లాల్లో 146679 మంది తమిళులు యుద్ధంలో చనిపోయారని స్థానిక పత్రికలు ప్రకటించాయి. 2008-09లలో ఆ రెండు జిల్లాల్లో 4156 మంది కనిపించకుండా పోయారు. పిల్లల కోసం వెతికే తల్లులు, తల్లుల కోసం వెతికే పిల్లలు, శరణార్థి శిబిరాల్లో వెతుకులాటలు, కన్నవాళ్ల కోసం వాకిళ్లలో నిరీక్షణలు, పిచ్చి చూపులు చూసే జనాలు. చివరికి అక్కడ క్యాథలిక్ చర్చి కూడా చీలిపోయింది. తమిళ క్యాథకల్‌లు, సింహళ క్యాథలిక్‌లు. మీడియాపై కూడా ఆర్మీ దాడులు జరుగుతూనే ఉంటాయి.

'ఉదయిని' అనే తమిళ పత్రిక సిబ్బంది మీద క్రికెట్ మాస్కులు ధరించిన బృందాలు 17 సార్లకు పైగా దాడులు చేశాయి. తమిళ ఎంపిల ఇళ్లపై కూడా దాడులే. గుంపులు గుంపులుగా సింహళ యువకులు ఆర్మీ సాయంతో తమిళుల ఇళ్లపై, కార్యాలయాలపై, మీడియా ఆఫీసులపై దాడులకు పాల్పడడం నిత్యకృత్యమైంది. అయితే, తమిళజాతి సమస్యకు రాజకీయ పరిష్కారం సాధించడం అవసరమనే సింహళీయులూ లేకపోలేదు. అధికార కుర్చీలలోని కొన్ని దుష్ట శక్తులు ఈ ప్రజాస్వామిక భావనను అడుసులో తొక్కేస్తున్నాయి. అయితే, ఈలం శకం ముగిశాక, మరింతగా దాడులు పెరిగిపోయాయి. 1980-90ల మధ్య లక్ష్యంలోని ప్రతి తమిళుడూ అనివార్యంగా ఈలంకు మద్దతుదారుడిగా ఉండే పరిస్థితిని కల్పించాయి.

ఒక సామూహిక అన్యాయానికి వేదికగా శ్రీలంక వర్ధిల్లుతోంది. ఇక్కడి యుద్ధరంగంలో మలిగిపోయిన ప్రేమకథలను చరిత్ర చెప్పుకోలేదు. ఇప్పుడు ప్రభుత్వం యుద్ధ నేరాలను చెరిపేసే పనిలో క్రియాశీలకంగా నిమగ్నమై ఉంది. 3 లక్షలకు పైగా శరణార్థి శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. అక్కడ ఓ సముద్ర దుఃఖం ఉప్పొంగుతోంది. ఇప్పుడు ప్రభాకరన్ ఆశించిన హక్కుల కల అక్కడే ధ్వంసమైపోయింది. ఎల్‌టిటిఈ కార్యక్షేత్రమైన కిలీనొచ్చిలోని తిరునీలకందన్ గ్రామంలో మినుకుమినుకుమనే లాంతరు దీపాల వెలుగులు కొత్త ఆశలను మోసుకొస్తున్నాయి. యుద్ధానంతరం ఉత్తరాది ప్రావిన్సు కౌన్సిల్‌లో పరిపాలనా స్వేచ్ఛను కల్పిస్తున్నట్టు రాజపక్సే ప్రకటించినా, అది ఆచరణకు నోచుకోలేదు. యుద్ధ విజేతగా రాజపక్సే ప్రపంచం ముందు నిలబడినప్పుడు, 2013, ఫిబ్రవరి 4న శ్రీలంక స్వాతంత్ర వేడుకల్లో 'శ్రీలంకలో జాతి వివక్ష కానీ, మత వివక్ష కానీ ఉండదు' అంటూ ఆయన చేసిన గంభీర ఉపన్యాసం మెజారిటీ తమిళుల ప్రావిన్సుల్లో కూడా వారి మనుగడను కించపరుస్తోంది. నిజంగా శ్రీలంకలోని తమిళులకు దేశమేలేని జాతిగా కించబడుతూనే ఉన్నారు. ఎలాగంటే గాజాలోని పాలస్తీనియన్లులాగా.

అయితే, తమిళ ప్రజా ప్రతినిధులు, ప్రజలు, విద్యావంతులు, విముక్తి కార్యకర్తలు తమ జాతిపై జరిగిన, జరుగుతున్న రక్తసిక్త చరిత్రను ప్రపంచానికి నిబ్బరంగా చాటి చెపుతున్నారు. ఎక్కడెక్కడ స్థిరపడిన శ్రీలంకలోని తమిళులంతా ఏకస్వరాన్ని వినిపిస్తున్నారు. యూరప్, ఆస్ట్రేలియా, ఉత్తర అమెరికాలలోని తమిళులు సమీకరించబడుతున్నారు. వీళ్లంతా తమ జాతి కోల్పోయిన మనో నిబ్బరాన్ని కూడకడుతున్నారు. మనుగడ ప్రశ్నార్థకమైన విపత్తును సృష్టిస్తున్న నియంత నేలగా అంతర్జాతీయ యవనిక మీద లంకను నిలబెడుతున్నారు. 2002లో ఐరాస తోడ్పాటుతో ఇండోనేషియా నుంచి విడివడిన తూర్పు తిమోర్‌లాగా లంక విడివడే నవీన తమిళ దేశాన్ని ఏర్పాటు చేసుకోవాలని భావిస్తున్నారు. 1999 నుంచి 2012 దాకా జరిగిన పోరాటాన్ని, హింసా చరిత్రకు చరమగీతం పాడాలని, భగ్నమైపోయిన ఆశలకు పాదులు పోయాలని, వివరించి ఐరాస ప్రతినిధి బృందం లంకలో పర్యటించేలా చేయడమే కాదు, అంతర్జాతీయ బోనులో రాజపక్సేను నిలబెట్టారు. ఇంకోవైపు ఇప్పటికే ఇండియా, పాకిస్థాన్, చైనా దేశాలకు చెందిన కొందరు ఎంపిలు శ్రీలంకలో పర్యటించారు. గెరిల్లా యుద్ధమొక్కటే ఆశలు నెరవేర్చలేదని, శ్రీలంకలోని 22 లక్షల మంది తమిళుల ఆశయం ఒక్కటేనని, అది ప్రత్యేక తమిళ దేశమని పునరుద్ఘాటిస్తున్నారు. ఇంకోవైపు ప్రపంచంలోని వేర్వేరు దేశాల్లోకి వలసపోయిన 10 లక్షల మంది తమిళజాతి జనాన్ని ఒక్కచోటికి చేర్చాలని తపనపడుతున్నారు. ఈ క్రమంలో దేశమే లేని జాతుల హృదయాల్లోకి ఓ బలమైన ఆశయాన్ని పంపిస్తున్నారు. ఇప్పుడు మళ్లీ టిఎన్ఎ వాడిపోయిన కలలను చిగురింపజేస్తున్నది. బహుశా ప్రభాకరన్ కోరుకున్న ఆశయాన్ని టిఎన్ఎ సాధించకపోయినా, లంకలోని తమిళజాతి జనం మాత్రం స్వయం ప్రతిపత్తి కోసం పోరాడుతూనే ఉంటారు.

(రచయిత లెక్చరర్, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్) వీ

రాబోయే సంచికలలో...

- సహకార సంఘాలు - ప్రకాష్ బక్షి కమిటీ - ముప్పాళ్ల భార్గవశ్రీ
- భారతీయ సహనం ఇంకెన్నాళ్లు? - వాసిరెడ్డి భాస్కర రావు
- నేర స్వభావాల మూలాలు - ఎన్. భగవాన్‌రెడ్డి
- ఆదివాసుల స్వయం పాలన - దాసరి నివాస్

దారిద్ర్య నిర్మూలన పథకాలు

***ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ఎన్నో ప్రజాకర్షక పథకాలను ప్రకటించిందనీ, అవి అమలు పరచడంలో అనేక అవకతవకలు జరిగి ప్రజలకు చేరలేకపోతున్నాయనీ అంటున్నారు* డా. ఇమ్మానేని సత్యసుందరం**

దారిద్ర్య నిర్మూలన కార్యక్రమాలను అమలు చేయడంలో దేశానికి మంచి అనుభవం ఉంది. 1972 నుండి అనేక కార్యక్రమాలను అమలు చేశారు. కోట్ల రూపాయలు వీటిపై ఖర్చు చేస్తే ఇప్పటికీ దారిద్ర్య నిర్మూలన పూర్తిగా జరగలేదు. పథకాలు సమర్థవంతంగా అమలు చేస్తే 1990 నాటికే దారిద్ర్య నిర్మూలన జరిగి ఉండేది. అసలు దేశంలో ఎంత మంది దారిద్ర్యరేఖకు దిగువనున్నారు అనే దానిపై అనేక అంచనాలు మన ముందున్నాయి. ఇటీవల ప్రణాళికా సంఘం దారిద్ర్యరేఖకు దిగువనున్న వారి శాతం 2004-05లో 37.2 ఉంటే, 2011-12లో అది 21.92కి పడిపోయిందని చెప్పారు. గత సంవత్సరం టెండూల్కర్ కమిటీ ఫార్ములాను అంగీకరించని ప్రణాళికా సంఘం దాన్ని ఇప్పుడు సమర్థించింది. ఒక వక్తి గ్రామీణ ప్రాంతాలలో రోజుకి రు. 27.20, పట్టణ ప్రాంతాలలో రు. 33.33 ఖర్చు చేస్తే అతను దారిద్ర్యరేఖను దాటినట్లే. ఆంధ్రప్రదేశ్‌లో కేవలం 9.2 శాతం ప్రజలే దారిద్ర్యంలో ఉన్నట్లు చెప్పింది. నిరుద్యోగిత తీవ్రంగా ఉండి, అత్యవసర వస్తువుల ధరలు పెరుగుతున్నప్పుడు దారిద్ర్యం ఈ స్థాయిలో తగ్గే అవకాశం లేదని ఆర్థికవేత్తలు వాదించారు. ప్రభుత్వం తప్పుడు లెక్కలను గుర్తించి ప్రస్తుతం 65 శాతం ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువ ఉన్నట్లు ఒప్పుకుంది. టెండూల్కర్ కమిటీ ఫార్ములాను అంగీకరించలేదు. అభివృద్ధి ఫలాలు పేదలకు అందవు కాబట్టి వీరికి ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేయాలని ప్రపంచ బ్యాంకు సూచించింది. మన దేశం కూడా వీటిని అమలు చేస్తోంది.

దారిద్ర్య నిర్మూలన కార్యక్రమాలు రెండు రకాలుగా ఉన్నాయి. వేతన ఉపాధి కార్యక్రమాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలు. ప్రభుత్వం ఈ రెండు రకాల కార్యక్రమాలను అమలు చేస్తోంది. అయితే, వీటి ప్రాధాన్యం మారుతూ వస్తుంది. ఒకప్పుడు స్వయం ఉపాధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఉండేది. ఉదాహరణకు, సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం (ఐఆర్‌డిపి) ప్రస్తుతం వేతన ఉపాధి కార్యక్రమాలకు ప్రాధాన్యం పెరిగింది. ఉదాహరణకు, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై ప్రభుత్వం ఏడాదికి రు. 30000 కోట్లు ఖర్చు చేస్తోంది.

వేతన ఉపాధి కార్యక్రమాలలో అనేక లోపాలను అనేక నివేదికలు వెలుగులోకి తెచ్చాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సౌకర్యాలు పెంచడం వీటి లక్ష్యం. అయితే, కార్యక్రమాలను ఎన్నుకోవడంలో ఏమాత్రం శ్రద్ధ చూపలేదు. వేతన ఉపాధి కింద అనేక కార్యక్రమాలు (ఉదాహరణకు, లఘు నీటిపారుదల) చేపట్టవచ్చు. అయితే, రోడ్ల నిర్మాణానికే ప్రాధాన్యం ఇవ్వబడింది. అవి కూడా పటిష్ఠంగా లేవు. వర్షాలకు కొట్టుకు పోయేవిగా ఉండేవి. ప్రభుత్వం అమలు చేసిన స్వయం ఉపాధి కార్యక్రమాలు కూడా అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నాయి. ఈ కార్యక్రమాల కింద లబ్ధిదారులకు కొన్ని ఆస్తులను (పాలిచ్చే గేదెలు) సమకూర్చడం జరిగింది. వీటివలన వచ్చే ఆదాయంతో లబ్ధిదారులు దారిద్ర్యరేఖను దాటవచ్చని ప్రభుత్వం అభిప్రాయం. అయితే, ఈ కార్యక్రమాలు కూడా సక్రమంగా అమలు పరచబడం లేదు. అనేక రకాల ఆస్తులను ఇవ్వడానికి వీలున్నా ప్రభుత్వం పాలిచ్చే గేదెలనే ఎక్కువగా సమకూర్చింది. ఇవి ఎంతవరకు లాభదాయకమో పరిశీలించలేదు. ఒక వ్యక్తి వేరే వ్యక్తి గేదెను తెచ్చి దానిని తాను కొన్నట్లు (కొనక పోయినా) చూపించడం జరిగింది. చాలా చోట్ల పశుగ్రాసం లభించలేదు. గేదెలకు వైద్య సౌకర్యాలు లేవు. పాలు మార్కెటింగ్ చేసుకునే వీలు లేదు. ఈ విధంగా లబ్ధిదారులు దారిద్ర్యరేఖను దాటలేకపోగా అప్పుల పాలయ్యారు.

ప్రస్తుతం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోంది. అయితే పథకం అమలులో అనేక అవకతవకలు గుర్తించడం జరిగింది. 'కాగ్' నివేదికే దీనికి సాక్ష్యం. జాబ్ కార్డులను జారీచేయడంలో జాప్యం, వేతనాలు ఇవ్వక పోవడం, ఇచ్చినా ఆలస్యంగా ఇవ్వడం, కొన్ని పనులను మధ్యలోనే ఆపేయడం, కావలసినదానికంటే ఎక్కువ నిధులు విడుదల చేయడం, సంవత్సరానికి వ్యక్తికి కనీసం 100 పని దినాలు కల్పించలేక పోవడం, పనికి వెళ్లినా వారు ఎనిమిది గంటలు పనిచేయకపోయినా పనిచేసినట్లు అధికారులు లెక్కలు చూపుతున్నారు. లబ్ధిదారుల నైపుణ్యం పెంచే కార్యక్రమాలను కూడా ప్రభుత్వం అమలు పరిచింది. ఈ పథకాల విషయంలో కూడా సరైన ప్రణాళిక లేదు. కుట్టు మిషన్లపై ఎక్కువగా ఆధారపడడం జరిగింది. అయితే, గ్రామీణ ప్రాంతాలలో ఎంత మంది టైలర్లకి డిమాండ్ ఉంటుందో పరిశీలించ లేదు. అందువల్ల దర్జీగా శిక్షణ పొందిన వారు దారిద్ర్య రేఖను దాటలేక పోయారు.

కేంద్ర ప్రభుత్వం ఇటీవల దారిద్ర్య నిర్మూలన పథకాల సంఖ్యను 147 నుండి 66కు తగ్గించింది. కొన్ని పథకాలను మరికొన్ని పథకాలతో విలీనం చేయడం జరిగింది. ఇది సరైన చర్యే. పథకాల సంఖ్య పెరిగినా కొద్ది వీటి మధ్య సమన్వయం లోపిస్తుంది. ఉదాహరణకు, బ్యాంకులకు, ప్రభుత్వశాఖలకు మధ్య సమన్వయం లేక పథకాల అమలులో జాప్యం జరుగుతుంది. ఉదాహరణకు, ప్రభుత్వం సబ్సిడి ఇచ్చినా, తగు సమయంలో లబ్ధిదారులు బ్యాంకుల నుండి రుణాలు పొందలేక పోతున్నారు. పేదలకు ప్రత్యేక కార్యక్రమాలు తాత్కాలికమేనని, వీటి

అణ్వాయుధాల పోటీతో ప్రజల ఆకలి తీరదు

దేశంలో మెజారిటీ ప్రజలు అర్ధాకలితో బాధపడుతుంటే పాలకులు అభివృద్ధి, రక్షణ పేరుతో అణ్వాయుధాల పోటీలో పరుగెత్తుతూ ఆధిపత్యం కోసం అణు యుద్ధాలతో మానవ హననానికి పాల్పడుతున్నారని అంటున్నారు **విశ్వం**

ప్రపంచ గుత్తాధిపత్యానికై సామ్రాజ్యవాద దేశాలు అణ్వాయుధాలను ఒక ఆయుధంగానే ఉపయోగిస్తున్నాయి. అమెరికా లాంటి సామ్రాజ్యవాద దేశాలయితే అణ్వాయుధాల భయం చూపి ప్రపంచ దేశాలలోని మొత్తం వనరులన్నింటిని దోచుకుపోతున్నాయి. అణ్వాయుధాలు తన దగ్గర తప్ప మిగతా వారెవరి వద్ద ఉండొద్దు అనే లాఠీ పెత్తనాన్ని అమెరికా చలాయిస్తోంది. అణ్వాయుధాలు ఉన్నాయనే నేపంతో ఇరాక్‌పై దాడి చేసి, సద్దాం హుస్సేన్‌ను పట్టుకొని ఉరి తీసిన అమెరికా, దాని మిత్ర దేశాలు, ఇప్పుడు ఇరాన్ అణ్వాయుధాల తయారీకి పూనుకొంటుందని పెద్దఎత్తున ప్రచారం చేస్తూ, దాని చుట్టూ ఆర్థిక దిగ్బంధాన్ని విధించాయి. నిజానికి అణ్వాయుధాలను తయారు చేసుకునే అధికారం అన్ని దేశాలకు ఉంది. అవి ఏ ఒక్క దేశానికో సొంతంకావు. అలా అని ప్రతి దేశం అణ్వాయుధాల తయారీ పేరుతో కోట్ల కొద్ది రూపాయల ప్రజా ధనాన్ని వాటిపై తగలేయడం సరైనది కాదు. అణ్వాయుధాలు అనేవి ఆ దేశ ప్రజలకు కాస్తంత తిండి పెట్టవు సరిగదా, అణు విధ్వంసంలో మాత్రం వారి శవాలను గుట్టలుగా మార్చివేస్తాయనేది మాత్రం ఖాయం. అణ్వాయుధాల విధ్వంసక శక్తి ఊహించ వీలులేనిది.

ఇప్పుడు అణుబాంబుల కంటె హైడ్రోజన్ బాంబులు తయారు కావడంతో వాటి విధ్వంసక శక్తి ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయింది. అణుబాంబు కంటె హైడ్రోజన్ బాంబు వెయ్యి రెట్లు అధికంగా శక్తిగలది. అణ్వస్త్ర శాస్త్ర పరిజ్ఞానానికి పరాకాష్టగా హైడ్రోజన్ బాంబును చెప్పుకుంటారు.

అణు విచ్ఛిత్తి మీద ఆధారపడినది అణుబాంబు అయితే, అణు సంయోగం మీద ఆధారపడేది హైడ్రోజన్ బాంబు. ఇంతవరకు అమెరికా, రష్యా, ఫ్రాన్స్, బ్రిటన్, చైనాలు మాత్రమే హైడ్రోజన్ బాంబును తయారు చేశాయి. 1961లో రష్యా పరీక్షించిన హైడ్రోజన్ బాంబుశక్తి 50 మెగా టన్నుల టిఎన్‌టి(ట్రై నైట్రో టోలీన్) కి సమానం. ఒక మెగా టన్ను అంటే పది లక్షల టన్నుల టిఎన్‌టి పేలుడు శక్తి. అది రెండవ ప్రపంచ యుద్ధంలో అమెరికా, జపాన్‌లోని హిరోషిమాలో వేసిన బాంబు కంటె 3300 రేట్లు అధికంగా శక్తివంతమైనది. మొత్తం ప్రపంచాన్ని బూడిద గావించడానికి, ఎన్నటికీ ఈ భూమ్మీద పచ్చగడ్డి కూడా మొలవకుండా చేయడానికి ఇలాంటి బాంబులు పది సరిపోతాయి. ఇప్పటికి సరిపోక ఇప్పుడు మరిన్ని పరమాణు పదార్థాలను కనుగొనడానికి గాను విస్తృతంగా పరిశోధనలు జరుగుతున్నాయి. అలాంటి పదార్థాలను కనుగొని వాటితో మరింత శక్తివంతమైన బాంబులు తయారు చేయాలనే ప్రయత్నాలు జోరందుకున్నాయి.

2013 ఫిబ్రవరిలో మూడొవసారి ఉత్తరకొరియా జరిపిన అణు పరీక్షతో ఆగ్రహం చెందిన అమెరికా, తానుమాత్రం ఇప్పటికే వందలాది అణుపరీక్షలను పూర్తి చేసుకుంది. 1945 మొదలు 1996 వరకు అమెరికా మొత్తం 179 మార్లు అణు పరీక్షలను నిర్వహించింది. అందులో 38 భూగర్భంలో నిర్వహిస్తే 141 సార్లు భూమ్మీద బహిరంగ ప్రదేశాల్లోనే చేసింది. అలాగే రష్యా 38 భూగర్భ, 247 బహిరంగ ప్రదేశాల్లో, మొత్తంగా 285, బ్రిటన్ అదే క్రమంలో 0.9+8=8.9, ఫ్రాన్స్ 4+10=14, చైనా 1.5+21.9=23.4 మార్లు అణు పరీక్షలు జరిపి అణుశక్తిని కూడగట్టుకున్నాయి. అణ్వస్త్ర పరీక్షలపై నిషేధం ఉండాలని ఈ ఐదు దేశాలు, ఇరత దేశాలకు నిత్యం ఉద్బోధ చేస్తాయేగానీ, తాము మాత్రం ఈ నిషేధాలను ఏ మాత్రం ఖాతరు చేయకుండా, తమకు ఇవేవి వర్తించవు అంటూ ప్రవర్తిస్తాయి.

1945లో రెండవ ప్రపంచ యుద్ధం ముగిసే సమయానికి, జపాన్ దేశమే మొదటగా అణు విధ్వంసాన్ని చవి చూసింది. అమెరికా జరిపిన ఈ అణుబాంబు దాడిలో హిరోషిమా, నాగసాకి నగరాల్లో మూడు లక్షలకు

ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థ పటిష్ఠ పడ్డాక వీటిని ఎత్తి వేయాలని ప్రపంచ బ్యాంకు సూచించింది. దీనిని, మన దేశం లెక్కచేయ లేదు. పథకాలను శాశ్వత ప్రాతిపదికపై అమలు చేస్తున్నది. కారణం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠం కాలేదు. గ్రామాలకు కావలసిన మౌలిక సౌకర్యాలు ఏర్పడలేదు. పరిస్థితి మారాలంటే గ్రామస్థాయి (బ్లాక్ స్థాయి) ప్రణాళికలు రూపొందించి వాటిలో భాగంగా దారిద్ర్య నిర్మూలన కార్యక్రమాలను అమలు చేయాలి. అప్పుడే నిజమైన గ్రామీణాభివృద్ధి, పేదరిక నిర్మూలన జరుగుతాయి.

ప్రస్తుతం ఆర్థిక ప్రాధాన్యాలు కూడా సరిగ్గా లేవు. ఒక ప్రాంతానికి పరపతి సౌకర్యాలు పెంచవచ్చు. అయితే, అభివృద్ధి అవకాశాలు లేనప్పుడు కేవలం పరపతి ద్వారా సాధించిందేమిటి? పథకాల ప్రగతిని ఎప్పటికప్పుడు సమీక్ష చేయాలి. సిబ్బంది కొరతను తొలగించాలి. లబ్ధిదారులలో పథకాల అవగాహన పెంచాలి. వేతనాలు పెంచడంలో తప్పు లేదు. అయితే, దీనితోపాటు ఉత్పాదకత కూడా పెంచాలి. మన దేశంలో వైవిధ్యత ఉంది. ఒకేరకమైన వ్యూహం అన్ని ప్రాంతాలకు సరిపోదు. పథకాల అమలులో పంచాయితీరాజ్ వ్యవస్థ, ముఖ్యంగా గ్రామసభ కీలక పాత్ర పోషించాలి. లబ్ధిదారుల ఎన్నికలో తప్పులు జరుగుతున్నాయి. పారదర్శకత జవాబుదారీతనం పెంచాలి. పథకాల అమలును పంచాయతీరాజ్ సంస్థలకు అప్పగించాలి.

(రచయిత ఆర్థిక శాస్త్రవేత్త) వీ

పైగా ప్రజలు చనిపోయారు. లెక్కలేనంత మంది రేడియేషన్ బారినపడి నేటికి నరకాన్ని అనుభవిస్తున్నారు. జపాన్‌పై అణుబాంబు దాడితో అమెరికా తన బలమేందో ప్రపంచానికి చాటి చెప్పింది. ఆ అణుబాంబు దాడి అప్పటి సోషలిస్టు దేశమైన సోవియట్ యూనియన్‌ను, విముక్తికై ఉరకలు వేస్తున్న చైనాను బెదిరించడానికి ఇచ్చిన సందేశమని కూడ అందరికి అర్థమైంది.

అమెరికా బెదిరింపులకు ఏ మాత్రం లొంగని ఉత్తరకొరియా తన మూడవ అణుపరీక్షను ఇదే సంవత్సరం మొదట్లో నిర్వహించింది. అది తన మొదటి టాక్టికల్ మిస్సైల్‌ను 1969లో రష్యాతో సంపాదించి, ఆపై 1976లో మొదటి సాకడ్ (అధిక వేగం) మిస్సైల్ టెక్నాలజీని మిశ్ర్ ద్వారా పొంది, తన మిస్సైల్ అభివృద్ధి ప్రక్రియను మొదలుపెట్టింది. తాను స్వంతంగా అభివృద్ధి పరిచిన నోడాంగ్ మిస్సైల్, పరమాణు బాంబును మోసుకు వెళ్లే క్షమత కలిగింది. దీని రేంజి 1300 కిలో మీటర్లు. ఉత్తర కొరియా టిపోడాంగ్ లాంగ్‌రేంజి మిస్సైల్స్ సిరీస్ 1,2,3ల పరీక్షలను 1998 మొదలు 2013 వరకు వరుసగా నిర్వహించింది. టిపోడాంగ్ – 1 రేంజి 5000 కిలో మీటర్లు. దీంతో అమెరికాలోని అలస్కా ప్రాంతం దీని రేంజిలోకి వస్తుంది. టిపోడాంగ్ –2 లాంగ్‌రేంజి మిస్సైల్. దీని రేంజిని 15000 కిలో మీటర్ల వరకు పెంచవచ్చు అంటున్నారు. దీన్ని సమర్థవంతంగా ప్రయోగిస్తే అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియాలు దీని రేంజిలోకి వస్తాయి. ఇప్పుడు మరో 15000 కిలోమీటర్ల రేంజి సామర్థ్యంగల టిపోడాంగ్ – 3ని అభివృద్ధి పరుస్తోంది. ఉత్తరకొరియా నూతనతరం అధ్యక్షుడు ఓ సైనిక సమావేశంలో మాట్లాడుతూ, 'మాదగ్గర అణుబాంబులు ఉండబట్టే, ఇరాక్‌పై దాడిచేసిన విధంగా, అమెరికా, పశ్చిమ దేశాలు, మా దేశంపై దాడి చేయడానికి భయపడి వెనక్కి తగ్గాయనే' తన ధీమాను వ్యక్తం చేశాడు.

ఉత్తర కొరియా నుండి ఎదురవుతున్న మిస్సైల్ దాడిని దృష్టిలో ఉంచుకొని, అమెరికా 2010లో ఆపివేసిన మిస్సైల్ రక్షిత ప్రాజెక్టును మళ్లీ మొదలుపెట్టింది. ఇప్పుడది యూరప్ రక్షిత ప్రాజెక్టును ప్రక్కన బెట్టి, తన రక్షణకే మొదటి ప్రాముఖ్యత నిస్తున్నది. అణ్వాయుధాల ప్రమాదపు భయం అందరికంటె ఎక్కువగా అమెరికానే పట్టి పీడిస్తున్నది. అణుయుద్ధపు చిచ్చును రాజేసిన అమెరికా ఇప్పుడు తన ఆత్మరక్షణ కోసమే వెంపర్లాడుతున్నది. ఉత్తరకొరియా పరమాణు బాంబు దాడి బెదిరింపును దృష్టిలో ఉంచుకొని అలస్కా ప్రాంతంలోని ఫోర్ట్‌గ్రీలీలో మరో 14 కొత్త మిస్సైల్ నిరోధక ఇంటర్ సెప్టర్‌లను ఏర్పాటు చేస్తున్నది. ఇక్కడ ఇప్పటికే 26 ఇంటర్ సెప్టర్‌ల ఏర్పాటు చేయబడి ఉన్నాయి. ఇవి ఉత్తరకొరియా నుండి వచ్చే మిస్సైల్‌ను ఆపడంలో సఫలం అవుతాయి. కాలిఫోర్నియాలోని వెండెన్‌బర్గ్ ఎయిర్ ఫోర్స్ బేసుపై కూడా నాలుగు ఇంటర్ సెప్టర్‌లు ఉన్నాయి. 30 ఇంటర్ సెప్టర్‌ల విలువ సుమారు 1.90 లక్షల కోట్ల రూపాయల వరకు ఉంటుంది. అయితే ఇంత పెద్ద మొత్తంలో ఖర్చుపెట్టి ఏర్పాటు చేసిన ఈ ఇంటర్ సెప్టర్‌లు 2013 జూలైలో ఫసిపిక్ మహా సముద్రంలోని మార్షల్ ద్వీప సమూహ క్వాజ్‌లిన్ ప్రాంతంలో నిర్వహించిన మిస్సైల్ నిరోధక పరీక్ష ఘోరంగా విఫలమైనట్టు వార్త కథనాలు వెలువడ్డాయి. అణు పాటవంతో సామ్రాజ్యవాద దేశాలు ప్రదర్శిస్తున్న బలమంత ఉత్త మేకపోతు గాంభీర్యమనే అర్థమవుతున్నది.

ప్రచ్ఛన్న యుద్ధ ప్రభావం ప్రపంచంపై నుండి తొలగిపోయినప్పటికీ, అణు యుద్ధ ప్రమాదపు భయం మాత్రం ప్రపంచాన్ని ఇంకా వీడలేదు. అన్ని దేశాలు అణ్వాయుధాలను తయారు చేసుకుంటే పరస్పర హనన భయంతో పరోక్షంగా శాంతికి దారి తీస్తుందని శాస్త్రవేత్తలు, మేధావులు ప్రచారం చేస్తున్నారు. వారు ఆశించిన దాన్ని స్వాగతించవచ్చు గానీ, సామ్రాజ్యవాద యుగంలో ఇది సాధ్యమేనా అనేది కూడా ఆలోచించాల్సిన విషయం. వెనుకబడిన దేశాలను తమ కాలనీలుగా చూసే అమెరికా లాంటి అగ్రరాజ్య దురహంకారం, ఏ దేశానికి కూడా అణ్వాయుధాలను తయారు చేసుకునే అవకాశాల నివ్వదు.

భారత్, పాకిస్థాన్‌లు కూడా 1974, 1998 లలో అణ్వాయుధాలు తయారు చేసుకునే వరసలో చేరాయి. భారత్ రాజస్థాన్‌లోని ఫోఖ్రాన్‌లో 1974లో భూగర్భ అణు పరీక్షను మొదటగా నిర్వహించింది. అదే ఫోఖ్రాన్‌లో 1998లో రెండోసారి హైడ్రోజన్ బాంబును పరీక్షించింది. భారత్ లాగానే పాకిస్థాన్ వద్ద కూడా 120 – 130 వరకు అణ్వాయుధాలు ఉన్నాయని పాకిస్థాన్ రక్షణ విశేషజ్ఞుడు, పరమాణు, భౌతిక శాస్త్రజ్ఞుడు అయిన పర్వేజ్ హూడ్‌బోయి పత్రికల్లో ఈ విషయాన్ని వెల్లడించాడు. ఈ మొత్తం అణ్వాయుధాలు భారత్, పాకిస్థాన్‌లను నాలుగైదు సార్లు బూడిద చేయడానికి సరిపోతాయి. భారత్, పాకిస్థాన్‌లు 1987, 1990, 1999 కార్గిల్ యుద్ధ సమయంలో, 2001లో పార్లమెంటుపై దాడి జరిగిన సందర్భంగా, 2008 ముంబైపై దాడితో ఐదుసార్లు అణుయుద్ధపు అంచువరకు వెళ్లాయంటున్నారు. ఈ రెండు దేశాలకంటె అధికంగా అణ్వాయుధాలు చైనా దగ్గరున్నాయి. భారత్ ఇప్పుడు తన రక్షణ వ్యవస్థను పెంచేందుకు ఆత్మరక్షణ మిస్సైల్‌పై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నది. అందుకని మిస్సైల్ రంగానికి పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేస్తున్నది. నేలపై నుండి గగన తలానికి, ఆకాశం నుండి నేలపైకి, నేలపై నుండి నేలకి చేదించే అనేక రకాల మిస్సైల్స్ తయారీ చేసి చండీపూర్ కేంద్రం నుండి రోజుకో ప్రయోగం చేస్తూ పరీక్షలను నిర్వహిస్తున్నది. పృథ్వి, త్రిశూల్, ఆకాశ్, ప్రహర్, నాగ్, బ్రహ్మోస్, అగ్ని 1,2,3,4,5 మిస్సైల్స్‌ను పదుల సంఖ్యలో పరీక్షించింది. పృథ్వి , ప్రహర్, బ్రహ్మోస్, అగ్ని లాంటి మిస్సైల్స్ అణు బాంబులను మోసుకెళ్లె సామర్థ్యం కలిగినవి. పృథ్వి మిస్సైల్ వెయ్యి కిలోల వార్‌హెడ్‌ను మోసుకెళ్లె, 250 కిలోమీటర్ల వరకు రేంజి గల టార్గెట్లను దెబ్బతీసే సామర్థ్యం గలది. ఇప్పటికి 16 సార్లు పరిక్షించబడి సైన్యానికి అప్పగించబడింది. ఈ ఒక్కో మిస్సైల్ ఖరీదు మూడు కోట్ల రూపాయల వరకు ఉంటుంది. భారత్, రష్యా సంయుక్తంగా నిర్మించిన సూపర్ సోనిక్ బ్రహ్మోస్ ఖరీదు నాలుగు కోట్లు. అగ్ని III మిడిల్ రేంజి మిస్సైల్ దీని రేంజి 3500 కిలో మీటర్లతో 1.5 టన్నుల వార్‌హెడ్‌ను తీసుకుని వెళ్లగలిగే క్షమత దీనికుంది. ఇప్పటికీ నాలుగుసార్లు పరీక్షలు జరిగినా ఇంకనూ అభివృద్ధి దశలోనే ఉంది. ఇవేగాక భారత్ అగ్ని V ఖండాంతర క్షిపణిని (ఐసిబిఎం – ఇంటర్ కాంటినెంటర్ బాలస్టిక్ మిస్సైల్) కూడా తయారు చేసింది. దీని అత్యధిక రేంజి 5500 కిలో మీటర్లు ఉండడంతో యూరప్‌తో సహా షాంఘై, జపాన్‌లు కూడా దీని పరిధిలోకి వస్తున్నాయి. ఇప్పుడు కొత్తగా మరో అగ్ని VI క్షిపణి (ఎంఐఆర్‌వి – మల్టీ టార్గెట్లను చేదిస్తుంది. ఈ ఒక్కో మిస్సైల్‌కి 20 –25 కోట్లు ఖర్చవుతుందని అంచనా. భారత్‌లాగే పాకిస్థాన్ కూడా తన ఘోరీలాంటి మిస్సైల్స్‌ని

సౌదీలో ఉమెన్ 2 డ్రైవ్ ఉద్యమం

రాచరిక వ్యవస్థ తీవ్ర నిర్బంధాల వల్ల అరబ్ దేశాలలో మహిళల స్వేచ్ఛా హక్కులు హరించి పోతున్నాయనీ, ఈ నేపథ్యంలో మహిళలు తమ హక్కుల కోసం తీవ్రంగా ఉద్యమిస్తున్నారనీ అంటున్నారు **ఎం.కె. కుమార్**

సౌదీ అరేబియాలో ప్రజాస్వామ్యం వెల్లివిరుస్తోందని అమెరికా పలుమార్లు ప్రకటించింది. సౌదీ ప్రభుత్వం కూడా తమది రాచరిక ప్రజాస్వామ్యమని పేర్కొంది. అయినా ఆ దేశంలో మహిళలు కారు నడపడం నిషేధం. సౌదీలో మహిళలపై తీవ్రమైన ఆంక్షలున్నాయి. వారి వ్యక్తిగత స్వేచ్ఛను అణచివేస్తూ, సంఘటితంగా పోరాడే హక్కును నిరాకరిస్తోంది. ప్రభుత్వ నిరంకుశ వైఖరిని నిరసిస్తున్న మహిళలపై ఉక్కుపాదం మోపుతోంది.

తాజాగా అక్టోబర్ 26న 'ఉమెన్ 2డ్రైవ్' అనే ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టి, సౌదీలో కొంతమంది మహిళలు కార్లను నడిపారు. మహిళలకు కారును నడిపే హక్కు ఇవ్వాలనే ఆ ప్రచార దినాన్ని దేశంలోని పలు స్వచ్ఛంద సంస్థలు ఆహ్వానించాయి. ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలను, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులను పోలీసులు పెద్ద ఎత్తున అరెస్టు చేశారు. గత రెండేళ్లుగా సౌదీ మహిళలు కారు నడిపే హక్కు కోసం ఉద్యమిస్తున్నారు. ప్రారంభించిన రోజే ఉద్యమాన్ని ప్రభుత్వం అణచివేయడంతో, తాత్కాలికంగా ఆందోళనలు కొంత సద్దుమణిగినా, అక్టోబర్‌లో నిరసనలు మళ్లీ విజృంభించాయి. సోషల్ నెట్‌వర్క్ వెబ్‌సైట్లను కూడా సౌదీ మహిళలు తమ ప్రచారానికి విస్తృతంగా వాడుకున్నారు. ఈ ఉద్యమానికి సౌదీలోని ఫ్రీడం హౌస్ అనే స్వచ్ఛంద సంస్థ మద్దతు ప్రకటించడం ఒకింత ప్రపంచదేశాలను ఆశ్చర్యచకితులను చేసింది. ఎందుకంటే ఇది అమెరికా ప్రభుత్వ నిధులతో సాక్షాత్తూ సిఐఎ ఆధ్వర్యంలో నడుస్తున్న సంస్థ. సిరియాను ఆర్థికంగా, సైనికంగా, రాజకీయంగా ఒంటరి చేయాలని భావిస్తున్న సౌదీ అరేబియాకు, తన మిత్రదేశం అమెరికా అనూహ్యంగా సిరియాపై దాడిని ఉపసంహరించు కుంటానని ప్రకటించి సౌదీని విస్మయానికి గురిచేసింది. మరో బద్ధ శత్రువు ఇరాన్‌తో కూడా అమెరికా స్నేహహస్తాన్ని అందించే కార్యక్రమాలను చేపట్టడం సౌదీరాజుకు ఆగ్రహం తెప్పించింది. దీంతో సౌదీ అమెరికాకు వ్యతిరేకంగా తన నిరసన స్వరాన్ని విప్పడం ప్రారంభించింది. ఇందులో భాగంగానే అమెరికా దేశ నిధులతో నడిచే పలు స్వచ్ఛంద సంస్థలు, సౌదీలో మహిళల ఉద్యమానికి మద్దతు ప్రకటించడం, సోషల్ నెట్ వర్కింగ్‌లలో ఆ ఉద్యమానికి విపరీత

సరిహద్దులో మోహరించింది. సరిహద్దులో భారత సైనికుడి తల నరికివేతతో ఇరుదేశాల నడుమ మొదలైన ఉద్రిక్తత, రోజు రోజు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తున్నారనే ఆరోపణలతో సరిహద్దులో ఇరుదేశాల నడుమ యుద్ధ వాతావరణం నెలకొంది. మన రాజకీయ నాయకుల రెచ్చగొట్టుడు ఉపన్యాసాలూ, మల్టీ మీడియాలూ, యుద్ధ భేరీలూ మోగిస్తూనే ఉన్నాయి.

భారతదేశం అణ్వాయుధాల అభివృద్ధికి, వాటి పరిశోధనలకై, వాటి తయారీకి ప్రతి ఏటా వేల కోట్ల రూపాయలను నీళ్లలా ఖర్చుపెడుతున్నది. ఇందుకొరకు 2013-14లో కేటాయింపులు ఐదు వేల కోట్లు మించి ఉండవచ్చు. అణ్వాయుధాలతో బూడిద తప్ప మరేమీ దొరకదు. రోజుకి ఇరవై రూపాయలతో జీవితం గడిపే మూడింట ఒక వంతు జనాభా గల ఈ దేశంలో, 82 కోట్ల మంది ప్రజలకు ఆహార భద్రత కరువైన ఈ దేశంలో అభివృద్ధి అనే తీరని ఆకలితో భారత్ అణ్వాయుధాల పరుగుల పోటీ అనే వరసలో నిలబడింది. 'మహన్ భారత్' అనే కీర్తి కాంక్షతో అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనాల సరసన నిలబడాలనే కల ఓ కల లాంటిదే. నిజంగానే అభివృద్ధి అనే పరుగులో మన 'మహన్ భారత్' పేదరికపు సూచికలో, మానవ ప్రగతి సూచికలో ఆఖరి లైనులో ఉందనేది మాత్రం వాస్తవం.రైతుల ఆత్మహత్యల్లో, శిశు మరణాల, మాతృ మరణాల మృత్యురేటులో మనం అగ్ర భాగాన ఉన్నాం. మనం నిర్మిస్తున్నది అణు భారత్ కాదు, ఆకలి భారత్. మహన్ భారత్ కాదు, వినాశ్ భారత్. అణు యుద్ధాలలో సంభవించేది మానవ, ఆస్తి విధ్వంసమే తప్ప మరేమి కాదు. ఒక అగ్ని-3 మిస్సైల్ ఖర్చుతో, ఐదు వేల మందికి ఏడాది పాటు ఉచిత భోజనం ఇవ్వవచ్చు.

చివరగా అనుకోని విధంగా అణు యుద్ధమే మొదలయితే అందులో ముందుగా బలికావలసింది సాధారణ ప్రజానీకమే. అణు యుద్ధపు ప్రకంపనలు ఇంకా ఆమడ దూరంలో ఉండగానే, ఆయా దేశాల శీర్ష రాజకీయ నేతలు, కార్పొరేటు కుటుంబాలు, ప్రజలను వారి మానాన వారిని వదిలేసి, అణు విధ్వంసానికి ప్రజలను అప్పగించి, తాము మాత్రం ప్రాణభీతితో, విదేశాల్లోని అతి సురక్షిత ప్రాంతాలకు పలాయనాలు చేసేందుకని మూట ముల్లె ముందే సర్దుకుంటాయి. ఇందుకు మన మహన్ భారత్‌లోని అరబ్‌పతులూ, ఉన్నతాధికారులూ, శీర్ష రాజకీయ నేతలు మినహాయింపేమి కాదు. వీరి కోసమని ఇప్పటికే భారత రక్షణ అభివృద్ధి - పరిశోధన సంస్థ (డిఆర్‌డిఓ) వందల కోట్ల రూపాయల ఖర్చుతో ఒక అజ్ఞాత 'శరణు' స్థలాన్ని అభివృద్ధి పరిచి దాన్ని మన దేశ సైనిక నాయకత్వానికి అందించింది. ఈ 'శరణ' (షెల్టర్ - ఎన్‌బిసి కలెక్టివ్ సిస్టమ్) స్థలంలో ముప్పై మంది 36 గంటల పాటు పరమాణు బాంబు దాడి జరిగిన సమయంలో కూడా సురక్షితంగా ఉండవచ్చు. ఇవ్వబడుతుంది. మన నాయకులంతా ఈ 'శరణు' షెల్టర్‌లో దాక్కుంటే ఆఖరుకి అణు విధ్వంసానికి బలి కావల్సింది మనమే.

(రచయిత సామాజిక కార్యకర్త) వీ

ప్రచారాన్ని చేసిపెట్టడం చేశాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

సౌదీలో చట్టానికన్నా, మతానికి ఎక్కువ గౌరవం ఇవ్వాలని సౌదీరాజుగారి ఉవాచ. అందుకే మతంలో అనాదిగా వస్తున్న కొన్ని మూఢాచారాలను కూడా మహిళలపై బలవంతంగా రుద్దడంతో, విద్యావంతులైన మహిళలు తమ నిరసన గళాన్ని విప్పుతున్నారు. మత గురువుల మాటలను చట్టాలుగా రూపొందించడం సౌదీలో కొత్తకాదు. మహిళలు వాహనాలను నడపడంపై మతపరంగా నిషేధాజ్ఞలు ఉన్నా, దానికి 1990లో చట్టరూపాన్ని ప్రభుత్వం కల్పించింది. గతంలో ధనిక వర్గానికి చెందిన మహిళలు అడపాదడపా సౌదీలో కారును తోలేవారు. సున్నీ మత పెద్ద గ్రాండ్ ముఫ్తి ఫత్వాను జారీ చేస్తూ, మహిళలు కారు తోలకూడదని, వారు కార్లని నడిపి రెచ్చగొట్టే వాతావరణాన్ని సృష్టిస్తున్నారని, దీనివల్ల సమాజంలో అరాచకం ఏర్పడే పరిస్థితి ఉంటుందని పేర్కొన్నాడు. దీని ఆధారంగా సౌదీ హోం మంత్రి ప్రిన్స్ నయేఫ్ బిన్ అబ్దులాజీజ్ మహిళలు కారు నడపడాన్ని డిక్రీ ద్వారా నిషేధించాడు. అప్పట్లోనే 47 మంది మహిళలు ప్రభుత్వ చట్టాన్ని వ్యతిరేకిస్తూ, కార్లను నడిపి తమ నిరసనను వ్యక్తం చేశారు. ప్రభుత్వం వారిని అరెస్టు చేయడంతో పాటు, ఉద్యోగాలనుండి తొలగించి తన అసహనాన్ని చాటుకుంది. 2005లో రాజు అబ్దుల్లా మహిళలు కార్లు నడపడాన్ని తాము స్వాగతిస్తున్నట్టు ప్రకటించాడు. సౌదీలోని అమెరికన్ మహిళా సైనికులు కార్లు నడుపుతున్నా చూస్తూ ఉన్న ప్రభుత్వం తమ దేశ మహిళలు కార్లు నడపకూడదని హుకుం జారీ చేయడాన్ని సౌదీ ప్రజలను చాలా బాధించింది.

2011లో ఇంటర్నెట్ చోదకశక్తిగా ఉమెన్ 2డ్రైవ్ ప్రచారోద్యమం ఊపందుకుంది. మదేహ ఆల్ అజ్రాష్ అనే మహిళను అరెస్టు చేయడం, తర్వాత ఆమె కనిపించకుండా పోవడం మహిళలను కోపాద్రిక్తులను చేసింది. రాజు అబ్దుల్లా మహిళలు కారు తోలడాన్ని బహిరంగంగా ప్రోత్సహిస్తూ, కారు తోలే మహిళలను మరోవైపు అరెస్టులు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. హోం మంత్రి మన్సూర్ ఆల్‌టర్కీ చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని ప్రకటించాడు. ఆశ్చర్యకరంగా సౌదీలోని చాలామంది మహిళలు, మహిళలు కారు తోలడాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఇది ప్రభుత్వానికి కొంత బలాన్ని చేకూర్చినట్లయింది. ధనికవర్గానికి చెందిన మహిళ, విద్యావంతులైన యువత ఈ ఉద్యమాన్ని చేపట్టిందని, ముస్లిం మత విలువలను గౌరవించకుండా పాశ్చాత్య విలువల్ని వారు ఒంటబట్టించుకుని, చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారని మతపెద్దలు పేర్కొంటున్నారు. సున్నీ మత పెద్ద ఆల్ లొహేదాన్ మహిళలు కారు తోలడం వల్ల వారి అండాశయం పాడవుతుందని, అంగవైకల్యం గల పిల్లలు పుట్టే అవకాశం ఎక్కువగా ఉందని తన మత మౌఢ్యాన్ని చాటాడు.

ఒకప్పుడు అమెరికాకు సానుకూలంగా ఉన్న సౌదీ రాజు అబ్దుల్లా, ఈజిప్టులోని ముస్లిం బ్రదర్ హుడ్ ప్రభుత్వాన్ని కూల్చడానికి తన వంతు సహాయం చేశాడు. సిరియాలో తిరుగుబాటుకు, ఇరాన్‌కు మద్దతుగా ఉన్న అస్సాద్ ప్రభుత్వాన్ని కూల్చడానికి ఆర్థిక సహాయాన్ని కూడా సౌదీ అందించింది. కాని ఇరాన్‌తో అమెరికా చెలిమిచేస్తుండడం నచ్చని అబ్దుల్లా, అమెరికాతో సంబంధాలను తిరిగి పరిశీలిస్తామని మీడియాకు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు. సౌదీ రాజు తీసుకున్న యూటర్న్‌ను అమెరికా గమనించిందని అందుకే సౌదీలో తమ నిధులతో నడిచే స్వచ్ఛంద సంస్థలలో పనిచేసే మహిళలను ఈ ఉద్యమానికి నాయకత్వం వహించాల్సిందిగా ఆదేశించిందని సౌదీ మీడియా పేర్కొంటోంది. తనకు ఎదురు తిరిగిన దేశాలలో ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉద్యమాలను రేకెత్తించడంలో సిద్ధహస్తురాలైన అమెరికా నయానో, భయానో సౌదీని దారికి తెచ్చుకునే ప్రయత్నంలో పడింది.

పశ్చిమాసియాలో అరబ్బు దేశాలలో సౌదీ అరేబియా రాజ్యం అతి పెద్దది. 1932లో అబ్దుల్లా సౌదీ అరేబియాలోని చాలా ప్రాంతాలను తన ఏలుబడిలోకి తెచ్చుకున్నాడు. 1902లోనే ఇతని పూర్వీకులు రియాద్‌ను స్వాధీనపర్చుకున్నారు. మొదటి నుండి అక్కడ అధికారం రాజు చేతిలోనే ఉండేది. మక్కా, మదీనాలలో రెండు పవిత్రమైన మసీదులను కలిగి ఉండటం వల్ల ముస్లింలకు ప్రముఖ యాత్ర స్థలంగా సౌదీ గుర్తింపు పొందింది. ఇస్లామిక్ మత ఆచారాలను చట్టాలుగా కలిగి ఉండి, వహబిజం ప్రభావాన్ని ఎక్కువగా కలిగి ఉన్న రాజ్యంగా సౌదీని పేర్కొనవచ్చు. చమురు నిల్వలను కలిగి ఉన్న దేశాలలో సౌదీ ప్రపంచంలో రెండవ స్థానంలోను, ఎక్కువ సహజవనరులను కల్గిఉన్న దేశాలలో ప్రపంచంలో 6వ స్థానంలోను ఉంది. 95 శాతం చమురును విదేశాలకు ఎగుమతి చేస్తూ, 70 శాతం ఆదాయాన్ని దాన్నుండే పొందుతోంది. చమురే ఎడారి దేశాన్ని ప్రపంచంలోనే అత్యధిక ధనిక దేశాల సరసన నిలిపింది.

మక్కా, మదీనాలకు తరలి వచ్చే యాత్రికులకు సౌకర్యాలు కల్పిస్తూ అరేబియన్ ద్వీపకల్పంలో ఉన్న విభిన్న తెగలు తమ జీవనోపాధిని సాగించేవారు. 7వ శతాబ్దంలో ఇస్లాం మత ప్రవక్త మహమ్మద్ క్రీ.శ. 571లో సౌదీ ప్రాంతంలో పుట్టాడు. ఇతనే విభిన్న తెగలున్న ద్వీపకల్పాన్ని ఇస్లామిక్ మత ఆచారాల కిందకు తీసుకొచ్చాడు. క్రీ.శ.632 లో అతను చనిపోయిన తర్వాత అతని అనుయావులు ఇస్లాం మతాన్ని ప్రపంచమంతా విస్తరించారు. 1938కి ముందర ప్రపంచంలోనే అతి పేద దేశంగా సౌదీ ఉన్నది. అప్పటివరకు కొద్దిపాటి వ్యవసాయం, తీర్థ యాత్రలకు వచ్చిన యాత్రికుల నుండి వచ్చే ఆదాయంతోనే ప్రజల జీవనం సాగేది. 1941లో అరేబియన్ అమెరికన్ ఆయిల్ కంపెనీ సౌదీలో చమురు నిల్వలను గుర్తించిన తర్వాత దేశ దశ మారిపోయింది. 1972లో దేశంలోని చమురు నిల్వలపై వచ్చే ఆదాయంలో 20 శాతం మాత్రమే ప్రభుత్వం తీసుకునేది, క్రమంగా దేశ చమురు నిల్వలపై అమెరికా పెత్తనాన్ని తగ్గిస్తూ వచ్చింది. ఒక దశలో పాశ్చాత్య దేశాలకు చమురును సరఫరా చేయడం ఆపివేసింది. తిరిగి 1979 నుండి అమెరికాతో స్నేహాన్ని పెంచింది. అదే సంవత్సరం దేశంలో ఇరానియన్ ఇస్లామిక్ విప్లవం వచ్చింది. షితే తెగ మైనారిటీలు తూర్పు ప్రావెన్సీలలో ఇరానియన్ మతస్తులతో కలిసి ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాలను నడిపారు. వీరిని అణచడానికి రాచరిక ప్రభుత్వం కొన్ని కఠిన చర్యలను అవలంబించింది.

మరో సంఘటనలో మక్కాలోని గ్రాండ్ మసీదును ఇస్లామిక్ తీవ్రవాదులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఈ రెండు సంఘటనలు సౌదీలో ఇస్లామిక్ తరహా చట్టాలను కఠినతరం చేశాయి. దేశంలో సినిమాలను, అభ్యుదయ నాటకాలను నిషేధించే స్థాయికి ఈ ఛాందస్తం వెళ్లింది. ప్రభుత్వంలో మత పెద్ద ఉలేమాకు అధిక ప్రాధాన్యం

ఇవ్వబడింది. తదనంతర దశలో ఇస్లామిజం మరింత బలపడింది. ఇరాన్ – ఇరాక్ యుద్ధంలో సద్దాం హుస్సేన్‌కు సౌదీ మద్దతు ప్రకటించి 25 బిలియన్ డాలర్లను ఖర్చుపెట్టింది. అయినా 1990లో కువైట్‌పై ఇరాక్ దండయాత్రను ఖండించింది. ఇరాక్‌కు మద్దతు ప్రకటించిన యెమన్, జోర్డాన్ ప్రజలను సౌదీ వదిలి పారిపోవాలని ఆదేశించింది. సౌదీ ఈ చర్యలన్నింటిని అమెరికా ప్రాభవితంతోనే చేసింది. అంతే కాకుండా అరబ్బు దేశాలలో షియా తెగలకు చెందిన వ్యక్తులకు రాజ్యాధికారం దక్కకూడదని సౌదీలోని మెజారిటీ సున్నీ మతస్తులు విశ్వసిస్తున్నారు. సౌదీలో1991లో కువైట్‌కు మద్దతుగా ఇరాక్‌పై బాంబులను కూడా వేసింది.

సౌదీకి పాశ్చాత్య దేశాలతో ఉన్న సంబంధాల వల్లే సౌదీలో తీవ్రవాదాన్ని పాశ్చాత్య దేశాలు పెంచిపోషించాయని పరిశీలకులు భావిస్తున్నారు. పాశ్చాత్య దేశాలలో సౌదీ జాతీయులే ఎక్కువగా ఉగ్రవాదానికి పాల్పడుతున్నారని పాశ్చాత్య దేశాలు ఆరోపిస్తుంటాయి. బిన్‌లాడెన్ సౌదీ దేశస్తుడు కావడాన్ని, న్యూయార్క్‌లోని 9/11 దాడులలో పాల్గొన్న 19 మందిలో 15 మంది సౌదీ దేశస్తులు కావడాన్ని కారణాలుగా చూపెడుతుంటాయి. అయినప్పటికీ అమెరికా సౌదీతో చమురు నిల్వల కోసం చెలిమి చేస్తూనే ఉంది. సౌదీలో ఉగ్రవాదానికి అమెరికానే ప్రధాన కారణంగా ఉందని సౌదీలోని హక్కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. బిన్‌లాడెన్‌ను అమెరికానే తయారు చేసిందన్న విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు. దేశంలో నిరుద్యోగం పెరగడం, నిరంకుశ రాచరిక పరిపాలన, అమెరికాతో అంటకాగుతున్న విధానం, మత ప్రవక్తల పెత్తనం వల్ల ప్రజలు విసిగి, బాహాటంగానే రాజు పాలనను విమర్శించారు. దీంతో 1992లో రాజుకు ఉండవలసిన విధులు, బాధ్యతల గురించి ఒక చట్టాన్ని రాజు ఫాద్ రూపొందించాడు. 60 మందితో కూడిన కౌన్సిల్‌ను ఏర్పాటు చేసినప్పటికీ దానికి ఛైర్మన్‌గా రాజు ఫాద్ వ్యవహరించడం వల్ల నిరసనలు చల్లారలేదు.

ఫాద్ అనారోగ్యం వల్ల అబుల్లా తాత్కాలిక రాజు స్థానంలోకి వచ్చినా, 2004లో జరిగిన బాంబు పేలుళ్ల వల్ల 2004లో మొట్టమొదటి సారిగా దేశంలో మున్సిపల్ ఎన్నికలు జరిగాయి. ఇందులో మహిళలకు ఓటింగ్ నిరాకరించారు. 2005లో ఫాద్ మరణం తర్వాత అబ్దుల్లా పూర్తిస్థాయి రాజుగా చెలామణి అయ్యాడు. ఇతను దేశంలో సంస్కరణలు ప్రవేశపెట్టి, ప్రైవేటీకరణకు అధిక ప్రాధాన్యతను కల్పించాడు. 2009లో మొదటిసారిగా ఒక మహిళను ఉపమంత్రిని చేశాడు. దేశంలో నూతన సంస్కరణల వల్ల పేదరికం పెరగడం, యువతకు ఉపాధి కరువవడం వల్ల పెరిగిన అసమ్మతిని తగ్గించేందుకే అబ్దుల్లా మహిళలను మాయచేసేదానికే మంత్రి పదవిని ఎరవేశాడనే విమర్శలు వచ్చాయి. అసమ్మతిని ఎదుర్కొనేందుకు అబ్దుల్లా 2011లో 93 బిలియన్ డాలర్లతో 5 లక్షల గృహాలను ప్రజలకు వాగ్దానం చేస్తూ, 60 వేల ఉద్యోగాలను కల్పిస్తానని ప్రకటించాడు.

1992లో రాజు డిక్రీ ద్వారా ఇస్లామిక్ నిబంధనలను చట్టబద్ధం చేసి ఇస్లాం మతం పట్ల తన విశ్వాసాన్ని ప్రకటించాడు. ఖురాన్‌కు లోబడే అక్కడి న్యాయ వ్యవస్థ పని చేస్తుంది. మహమ్మద్ ఆచారాలు, ఖురాన్‌లే దేశ రాజ్యాంగాలుగా గుర్తించబడ్డాయి. అరబ్ రాజ్యమైనప్పటికీ ఇంతవరకు అక్కడ జాతీయ ఎన్నికలు జరిగిన పాపాన పోలేదు. నూతన రాజ్యాంగాన్ని ఇప్పటివరకు రూపొందించలేదు. రాజకీయ పార్టీల స్థాపనకు అక్కడ అనుమతి ఉండదు. రాజ కుటుంబంలోని కుటుంబ సభ్యుల మధ్యే గాకుండా, రాజ కుటుంబానికి, సౌదీలోని సంపన్న వర్గాలకి మధ్య వైరుధ్యాలున్నాయి. రాజ కుటుంబం ఉలేమాను, గిరిజన తెగల నాయకులను సంప్రదించకుండా ఎటువంటి నిర్ణయాలు తీసుకోలేరు. వీరంతా కరుడుగట్టిన ఇస్లామిక్ ఛాందసవాదులే. గిరిజన నాయకులు పరిపాలనా అంశాలలో చాలామేరకు రాజ కుటుంబాన్ని ప్రభావితం చేయగలరు. రాజ కుటుంబానికి ప్రధాన రాజకీయ ప్రత్యర్థులుగా సున్నీ ఇస్లామీలు, ఉదారవాద విమర్శకులు, షితే మైనారిటీలు ఉన్నారు. అందువల్లే సౌదీలో ఉగ్రవాదదాడులు ఎక్కువగా ఉంటాయి. అయివప్పటికీ బహిరంగ శాంతియుత నిరసన ప్రదర్శనలు దేశంలో నిషేదించబడ్డాయి.

2011లో మహిళలు ఎన్నికల్లో ఓటు వేయవచ్చుని, అభ్యర్థులుగా నిలబడవచ్చని అబ్దుల్లా ప్రకటించాడు. కాని ఇది ఆచరణలో సాధ్యం అవుతుందో లేదో వేచి చూడాలి. మానవహక్కుల ఒప్పంద ప్రకటనను అమలుచేయని దేశాల్లో సౌదీ కూడా ఒకటి. సౌదీలోని జనాభాలో 97 శాతం ముస్లింలే. సున్నీలు 85 శాతంగా ఉంటే, షియాలు 15 శాతంగా ఉన్నారు. సున్నీ మతస్తుల ఆధిపత్య ధోరణిని వహబిజంగా పిలుస్తారు. షియాలు ఉపాధిపరంగా వెనుకబడి ఉండి, మెజారిటీ పేదరికాన్ని అనుభవిస్తున్నారు. వేరే మతాన్ని పాటించడం, ఆచరించడం అక్కడ నిషేధించబడింది. దేశంలో చర్చీలుగాని, ఇతర మతస్తుల ఆలయాలు కాని ఉండవు. ఇస్లాం నుండి అన్య మతంలోకి మారినవారికి మరణదండన ఉంటుంది.

లింగవివక్ష, మహిళలపై లైంగిక హింస దేశంలో ఎక్కువగా ఉంది. ప్రతి మహిళ తన గార్డియన్‌గా ఒక పురుషుడ్ని అన్ని దైనందిన కార్యక్రమాలలో చూపించాలి. విద్య, ప్రయాణం, పని అన్ని విషయాలలో మహిళలకు పురుష గార్డియన్ తప్పని సరి. ఆ గార్డియన్ ఆమెపై సర్వాధికారాలను కలిగి ఉంటాడు. పురుషులు అనేకమంది భార్యలను కలిగి ఉండవచ్చు, అంతే కాకుండా ఏ క్షణమైనా కారణం లేకుండా భార్యతో విడాకులు పొందవచ్చు. భర్త అనుమతి లేకుండా భార్య విడాకులు తీసుకునే హక్కులేదు. ఆస్తి పంపకాలలో స్త్రీలకు 50 శాతం మాత్రమే హక్కులుంటాయి. సౌదీ మహిళ 25 సంవత్సరాలు దాటిన తర్వాత పెళ్లి చేసుకోవచ్చు. బాల్య వివాహాలు సౌదీలో ఎక్కువగానే ఉంటాయి. ఒక్క 2006వ సంవత్సరంలోనే మహిళలు విశ్వవిద్యాలయాల నుండి 60 శాతం చదువుకు స్వస్తి చెప్పారు. మహిళల అక్షరాస్యత 81 శాతంగా ఉంది. మహిళలు తప్పనిసరిగా బురఖా ధరించాలనే నిబంధన అమలులో ఉంది. దీని అమలు కోసం ఒక ప్రత్యేకమైన పోలీసు విభాగాన్ని ఏర్పాటు చేశారు. సౌదీమహిళల్లో అక్షరాస్యత ఎక్కువ ఉన్నప్పటికీ చాలా మంది ఇస్లామిక్ సంప్రదాయాల్లోని మూఢ ఆచారాలకు వ్యతిరేకంగా తమ నిరసనను తెలుపలేకపోతున్నారు. ఇప్పుడిప్పుడే మహిళలు తమ హక్కుల కోసం సౌదీలో ఉద్యమిస్తున్నారు. మహిళలు కార్లు నడిపే హక్కు కోసం చేస్తున్న ఆందోళన కార్యక్రమాలకు ప్రపంచవ్యాప్తంగా మద్దతు ఎక్కువవుతోంది. అరబ్ వసంతంలో భాగంగా రాచరిక ప్రభుత్వాలు కూలిన నేపథ్యంలో సౌదీలో కూడా త్వరలో జాతీయ ఎన్నికలు జరిగి ప్రజాస్వామ్యం పేరుకైనా కొనసాగుతుందని వేచిచూడటం దురాశ అవబోదు.

(రచయిత పౌరహక్కుల సంఘం కార్యకర్త) వీ

ఆంధ్రలో తొలి మహిళా సమాజం

***మద్రాసు రాష్ట్ర తెలుగు ప్రాంతంలో మహిళా చైతన్యానికి ప్రారంభకురాలైన బండారు అచ్చమాంబ చరిత్రలో దాగిన విషయాలను తెలియజేస్తున్నారు* షేక్ మహబూబ్ బాషా**

వలసాంధ్రలో మహిళా ఉద్యమాన్ని నిర్మించిన క్రియాశీలక మహిళా మేధావుల్లో ఒకరైన భండారు అచ్చమాంబ 'అబూ సచ్చరిత్ర రత్నమాల' వంటి గొప్ప రచనలు చేసి తను జీవించిన కాలంలోనే విద్వాంసురాలిగా, మేధావిగా ప్రఖ్యాతి చెంది అనేక మంది స్త్రీలు తనని ఆదర్శంగా తీసుకొనే స్థాయికెదిగింది. కేవలం ముప్పై సంవత్సరాలు మాత్రమే జీవించి ఆశ్చర్యం గొలిపే విధంగా క్రియాశీల సాహితీ జీవితాన్ని గడిపిన అచ్చమాంబకు తెలుగులో 'తొలి' కథా రచయితగా ఇప్పుడు గుర్తింపు లభించింది. పలు 'తొలు'లతో శ్లాఘించుతున్న భండారు అచ్చమాంబ చరిత్రలోని ఒక చారిత్రక అవాస్తవాన్ని సరి చేయడం, ఆమెకు సంబంధించి మరుగున పడిపోయి ఉన్న ఒక వాస్తవాన్ని వెలుగులోకి తేవడం ఈ వ్యాసం ఉద్దేశాలు. రెండో విషయంతో మొదలుపెడ్దాం.

ఆంధ్ర ప్రాంతం నుండి దూరంగా ఉండడం కారణంగా (భర్త భండారు మాధవరావుతో కలిసి ఉద్యోగ రీత్యా మధ్య పరగణాల్లోని పలు పట్టణాల్లో జీవించిందామె) తొలి తెలుగు పత్రికా సంపాదకురాలు అయ్యే అవకాశం తన తలుపు తట్టినా ఆమె సున్నితంగా తిరస్కరించిందనే వాస్తవం మరుగునపడిపోయింది[1]. స్త్రీల ఉపయోగార్థము 'హిందూ సుందరి' మాస పత్రికను 1902 ఏప్రిల్ లో ప్రారంభించిన సత్తిరాజు సీతారామయ్య పత్రికను ప్రారంభించినప్పటి నుంచీ ఎవరైనా స్త్రీని సంపాదకురాలిగా ఏర్పర్చాలనుకుంటూ కొంతమంది స్త్రీలను సంప్రదించారు[2]. వారిలో భండారు అచ్చమాంబ ఒకరు. ఆంధ్ర ప్రాంతం నుండి దూరంగా ఉండడం కారణంగా హిందూ సుందరి సంపాదకత్వ బాధ్యతను స్వీకరించలేనంటూ 1903 డిసెంబర్ 23 దుర్గ నుండి అచ్చమాంబ రాసిన లేఖను తన 'స్వీయచరిత్ర'లో ప్రచురించారు సీతారామయ్య[3]. ఆ లేఖలోని కొంత భాగం ' అన్నయ్య... అత్యంత హీనస్థితియందున్న మమ్ములనున్నత స్థితికి దీసుకొని వచ్చుటకై యత్నింపుచున్న మీయందు మేమందరమును (స్త్రీలము) మిక్కిలి కృతజ్ఞులమై ఉండవలెను.... మా బాగునకై మీరు మాకు చెప్పిన పనిని (పత్రికా సంపాదకత్వ నిర్వహణ) కొంచెము సామర్థ్యం కలిగియున్నను మేము చేసి మీకానందం కలిగింపవలెను. ఇందువలన మీయనుజ్ఞ ప్రకారం నేను సామర్థ్యము లేని దాననైనను సుందరినికొనుటకు సిద్ధముగానున్నాను గానీ ఇంత దూర దేశం నుండి నేను దానిని నడుపుటకు అనేక చిక్కులు కలుగును గాన పేరు నాదైనను భారతమంతయు మీపైనే ఉండును. అట్లు మీపై భారముంచుట నాకెంతమాత్రము సమ్మతిగాలేక వెనుక నేను సమ్మతింపనైతిని. ఈ సంగతి మీకు తెలియనిది కాదు.....' తనకొచ్చిన అవకాశాన్ని అచ్చమాంబ వినమ్రంగా వదులుకొన్నదనే విషయం దీని ద్వారా స్పష్టమవుతుంది. తర్వాత మొసలిగంటి రమాబాయమ్మ, వెంపల శాంతా బాయమ్మలు 1903 డిసెంబర్ నుండి 'హిందూసుందరి' సంపాదకత్వ బాధ్యతని స్వీకరించి తొలి తెలుగు (హిందూ) స్త్రీ సంపాదకులయ్యారు.

ఆంధ్రలో 'తొలి' స్త్రీల సమాజాన్ని ఏర్పర్చింది అచ్చమాంబేననీ, ఆమె స్థాపించింది అనుకొంటున్న 'బృందావనపుర స్త్రీ సమాజం' యావదాంధ్రలోనే మొట్టమొదటి స్త్రీల సమాజమనీ ఒక చారిత్రక అవాస్తవం చలామణిలో ఉంది. కొండవీటి సత్యవతి 'తొలి కథ రాసిన అచ్చమాంబే తొలి స్త్రీల సమాజం కూడా స్థాపించింది. తెలుగుదేశంలో అప్పటి వరకు స్త్రీల కోసం ఒక సమాజం స్థాపించడం అనే ఆలోచన కూడా లేదు. అలాంటి చోట అచ్చమాంబ చొరవతో మొట్టమొదటి స్త్రీ సమాజం 'బందరు స్త్రీ సమాజం' ఏర్పాటయింది అని స్త్రీ సమాజ స్థాపన విషయంలో కూడా అచ్చమాంబను తొలిగా నిలబెట్టే ప్రయత్నం చేశారు[4]. ముదిగంటి సుజాతారెడ్డి ఇంకొంచెం ముందుకెళ్లి బృందావనపుర స్త్రీ సమాజాన్నే కాకుండా కాకినాడలోని శ్రీ విద్యార్థినీ సమాజాన్ని కూడా అచ్చమాంబే స్థాపించిందన్నారు[5]. అచ్చమాంబకు బృందావనపుర స్త్రీ సమాజంతో ఉన్న సంబంధమెలాంటిదనే విషయాన్ని పరిశీలించే ముందు అసలు ఈ సమాజం తొలి సమాజామా కాదా అన్న విషయాన్ని చారిత్రకాధారాలతో చర్చించుకుంటూ పోదాం. దానికన్నా ముందు 'తెలుగుదేశంలో అప్పటి వరకు స్త్రీల కోసం ఒక సమాజం స్థాపించడం అనే ఆలోచన కూడ లేదు' అనే అపోహను తొలగించుకొందాం.

ఆంగ్లేయ వలసవాద సంస్కృతితో ప్రభావితులైన సంఘ సంస్కరణ పక్షం వహించిన కొందరు పురుషులు తమ కుటుంబంలోని స్త్రీలని, మరీ ముఖ్యంగా తమ భార్యల్ని సభలూ, సమావేశాలకు తీసుకెళ్లాలనుకునే వాళ్లు. కుటుంబ ఒత్తిళ్లనీ, సంఘం ఛీత్కారాలనీ లెక్కచేయలేదు. వీళ్లు 1897 జూన్ 9న ఏలూరులో జరిగిన గోదావరి జిల్లా సాంఘిక సభకు 'ఆవరకెప్పుడును... పురుషుల సభలకు రాని స్త్రీలు హాజరవడాన్ని 'విశేషము'గా చెప్పాడు వీరేశలింగం. ఆ రోజే 'బహిష్ఠ' అయినప్పటికీ తన భార్యను తీసుకొచ్చాడు దాసు శ్రీరాములు పంతులు. 'సంబంధమును వదలుకొనెదమని అన్నలు బెదిరించినను లక్ష్యం చేయక' తన భార్యని తీసుకొచ్చారు సత్తిరాజు కామ్మేశ్వరరావు.6 తన 'తల్లికి సమ్మతముగా లేక పోయినప్పటికీ తన భార్య రాయసం రత్నమ్మను తీసుకెళ్లారు రాయసం వేంకటశివుడు. కందుకూరు రాజ్యలక్ష్మమ్మగారును సభకే తెంచిరి. ఇంకొందరు స్త్రీలు కూడా సభకు వచ్చి, స్త్రీల కొరకు ప్రత్యేకించిన

ప్రదేశమున నాసీనలయిరి. ఈ విధంగా మొట్టమొదట బహిరంగ సమావేశాలకు –మిక్స్‌డ్ సోషల్ గేదరింగ్స్ ఫర్ సోషల్ కాజెస్– పురుషుల ప్రోద్భలంతో హాజరయ్యారు ప్రధానంగా బ్రహ్మణ కులాలకు చెందిన ఆంధ్ర స్త్రీలు.

ఇప్పటికి దాకా నాకు లభించిన ఆధారాలను బట్టి స్త్రీ ప్రయత్నంతో, చొరవతో స్త్రీలను సమీకరించే పని మొట్టమొదట చేసింది కందుకూరి రాజ్యలక్ష్మమ్మ. స్త్రీల కోసం ప్రత్యేకంగా స్త్రీ ప్రార్థనా సమాజాన్ని నడిపిందామె. ఈ సమాజాన్ని ఏ తేదీన ప్రారంభించారో నిర్దిష్టమైన సమాచారం లభించడం లేదు. వీరేశలింగం ప్రారంభించింది మాత్రం 1878లో తన ఇంట్లో. 1897కు ముందే స్త్రీ ప్రార్థనా సమాజం ఉనికిలోకొచ్చి బాగా పని చేసిందనడానికి మాత్రం నిర్దష్టమైన రుజువులున్నాయి. 'ఆమె (కందుకూరి రాజ్యలక్ష్మమ్మ) చుట్టు పక్కల ఉండే స్త్రీలను వారానికొకసారి మధ్యాహ్నం మా ఇంట గుమ్మిగూర్చి యేకేశ్వరోపసనముకు పురికొల్పి స్త్రీ ప్రార్థన సమాజమున స్థాపించుటయు...' అనీ '.... రాజమహేంద్రవరంలో నా భార్యచేత స్థాపించబడిన స్త్రీ ప్రార్థన సమాజమున మేము చెన్నపట్టణములో నున్న కాలములో చి॥ సీతమ్మయే (కొటికలపూడి సీతమ్మ) జరుపుచువచ్చెను' అనీ వీరేశలింగం తన స్వీయచరిత్రలో ప్రస్తావించారు. భార్యతో కలిసి మద్రాసులో ఆయనున్న కాలం 1897–1905 కాబట్టి స్త్రీ ప్రార్థన సమాజం 1890లోనో లేక అంతకన్నా ముందో ప్రారంభం అయి ఉండాలి. దీన్ని బట్టి స్త్రీల ప్రయత్నంతో ప్రారంభమైన మొట్టమొదటి స్త్రీల సమాజం రాజ్యలక్ష్మమ్మ స్థాపించి నిర్వహించిన స్త్రీ ప్రార్థనా సమాజమే అవ్వాలి. 'ఇది ప్రార్థనల సమాజమే కానీ స్త్రీల సెక్యులర్ విషయాల చర్చకు సంబంధించింది కాదు కదా' అని అభ్యంతరం లేవదీసి దీన్ని మొట్టమొదటి స్త్రీ సమాజంగా ఎవరైనా గుర్తించ నిరాకరించినప్పటికీ బృందావనపుర స్త్రీ సమాజానికి తొలి స్త్రీ సమాజమనే గౌరవం దక్కదు. ఎందుకంటే సెక్యులర్ విషయాలను చర్చించిన ఒక స్త్రీ సమాజం ఒకటి ముందే ఏర్పడి ఉంది.

'తొలి' స్త్రీ సమాజమనుకుంటున్న బృందావనపుర స్త్రీల సమాజం నవంబర్ 1902లో మచిలీపట్నం (బందరు) లో ఏర్పాటైంది. దానికి సుమారు రెండు నెలల ముందే ప్రస్తుతం ఒడిశాలో ఉన్న గంజాం జిల్లా (అప్పుడు ఉత్తర సర్కారుల్లోని నార్దర్న్‌మోస్ట్ జిల్లా) అస్కా అసికాలో 18 సెప్టెంబర్ 1902లో 'అసికా స్త్రీ సమాజం' స్థాపించబడింది. ఈ సమాజానికి బుడ్డా బుచ్చిబంగారమ్మ అనే ఒక క్రియాశీలక మహిళా మేధావి కార్యదర్శిగా పని చేసింది. స్త్రీల పత్రికలయిన తెలుగు జనానా హిందూ సుందరి, సావిత్రిలలో ఈ సమాజ కార్యకలాపాలకు సంబంధించిన అనేక వివరాలున్నాయి[6]. ప్రారంభం మొదలు మాసమునకొకతూరి సభలు' జరిపిన ఈ సమాజం స్త్రీ విద్యాభివృద్ధికై బాగా పనిచేసింది. బాలికలు పాఠశాలకెళ్లి రావడానికి సమాజ స్త్రీల ద్వారా చందాల మూలంగా డబ్బులు సేకరించి ఒక బండినేర్పాటు చేసింది. 1903 సెప్టెంబర్ 18న మొదటి వార్షికోత్సవం జరిగే నాటికి 13 సభలు, రెండోవార్షికోత్సవం నాటికి 36 సభలు జరిపిందీ సమాజం. ప్రతి సభకు సగటున 22 మంది స్త్రీలు వచ్చిరి. ఒక్కొక్కప్పుడు 50 మంది సభ్యుల వరకు కూడ వచ్చిరి. హిందూ స్త్రీల స్థితి, స్త్రీ విద్యావశ్యకత, స్త్రీలలో ఐక్యమత్యం, స్త్రీ సంఘాల అవసరం, పతిభక్తి, రాజభక్తి, గృహ నిర్వాహణ, స్త్రీలకు ఇంగ్లిష్ విద్యావశ్యకత మొదలైన విషయాలపై చర్చించడం, ఉపన్యాసాలివ్వడం చేసేవారు ఈ సమాజ స్త్రీలు. మొదటి వార్షికోత్సవానికి విశాఖపట్నం డిప్యూటీ కలెక్టర్ భార్య అయిన బుద్ధవరపు వీరలక్ష్మమ్మ అధ్యక్షత వహించింది. ప్రథమ వార్షికోత్సవానికి ఎంత పెద్ద ఎత్తున స్త్రీలు వచ్చినారంటే ఈ టౌన్ హాలును ప్రజలకు మించి దొరవారు ఇచ్చినది లగాయతు, ఇట్టి సభ ఎన్నడును జరగకుండెను. టౌన్ హాలు పెద్దదై ఉండిన చాలకపోయెను. ఇట్టి శుభ కార్యముల కాటపట్టై ఈ అసికా గ్రామమెంత శోభిల్లుచున్నదో చదువరులారా చూదురు. ఇట్లవలంబిచురు అని ప్రథమ వార్షికోత్సవ వివరాలను రిపోర్టు చేసిన ఒక 'స్త్రీ విద్యాభిమాని' ఆనందంతో అన్నారు. ద్వితీయ వార్షికోత్సవానికి పులుగుర్ల లక్ష్మి నరసమాంబ అధ్యక్షత వహించింది. మోచర్ల లక్ష్మి నరసమ్మ, న్యాపతి రాముడమ్మ, ఎ. గిరిజాయమ్మ, రా.లక్ష్మీబాయమ్మ, త్రి. లక్ష్మీ నరసమ్మ, వల్లూరి జోగమ్మ, వల్లూరి మాణిక్యాంబ, గాదె చూడికుడుతమ్మ మొదలైన అనేక మంది స్త్రీలు ఈ సమాజాభివృద్ధికి కృషి చేశారు. కొంతమంది ఆంగ్లేయ స్త్రీలు కూడా తమవంతు తోడ్పాటునందించారు. కొన్ని సాధారణ సభలకు 'బాలికా పాఠశాలలకధికారిణియగు మిస్. గౌ దొరసానిగారు' అధ్యక్షత కూడా వహించారు. 'ఈ సమాజమునకు విద్యావతులును, స్వజాత్యభివృద్ధిగోరువారును, ధనికులునునగు స్త్రీలు సమాజకురాండ్రుగనుండుట వలన సమాజాభివృద్ధి కొఱకు గావలసిన వసతులకు లోపమేది యులేదని చెప్పుటకటి సంతోషముగానున్నది' అని కార్యదర్శి బుఱ్ఱాబుచ్చి బంగారమ్మ ప్రకటించింది. 'ఈ సమాజము స్థాపించిన ప్రప్రథమున సమాజోద్దేశములను దెలియజాలని కొందరు స్త్రీలు సభా భవనమునకు వచ్చుటకు జంకినను స్త్రీలయజ్ఞానాంధ కారమును దూరీకృతముగాఁజేయు జ్ఞాన సూర్యుని వంటిదీ సభయని తెలిసిన పిమ్మట నీ సభ సర్వజనాదరణీయమై క్రమక్రమమున నిన్నటికన్న నీదినమునను నిరుటికంటె నీ సంవత్సరమునను వృద్ధి వర్ధించున్నయది (మూలంలో: 'వధిలుచున్నయది' అని ఉంది) అని సమాజాభివృద్ధి జరుగుతున్న తీరును వివరించింది[7].

బృందావనపుర స్త్రీ సమాజమేర్పడే నాటికే ఈ సమాజమూ, ఇంకా ఒకటీ రెండూ స్త్రీ సమాజాలూ[8] పని చేస్తుండినాయన్న అవగాహన సమకాలీన మహిళా మేధావులకు ముఖ్యంగా భండారు అచ్చమాంబకూ పులుగుర్త లక్ష్మినరసమాంబకూ ఉంది. 1902 డిసెంబర్ 24న 'మచిలీ బందరులో.... జరిగిన స్త్రీల సభలలో మిస్. హానా కృష్ణమ్మ ఎం.ఎ.గారు అగ్రాసనాసీనురాలుగానుండ' భండారు అచ్చమాంబ ఉపన్యాసిస్తూ '... అయితే స్వదేశమునందుండి (ఆంధ్రలో) యచటి స్త్రీ సమాజములకు సాయపడు భాగ్యము నాకు లభింపకుండినను నీ మధ్య తెలుగుదేశ మునందొకటి రెండు స్త్రీ సమాజములేర్పడి పని చేయుచున్నటుల విని సంతసింపుచుండెడి దానను...' అనడాన్ని బట్టి ఆమెకు అసికా స్త్రీ సమాజం గూర్చి తప్పకుండా తెలిసుండి ఉంటుందని భావించవచ్చు. పులుగుర్త లక్ష్మి నరసమాంబకు బుచ్చిబంగారమ్మ స్థాపించిన అసికా స్త్రీ సమాజం గూర్చి స్పష్టంగా తెలుసు. 1903 జనవరి 30న తను కాకినాడలో స్థాపించిన విద్యార్థినీ సమాజ ప్రథమ వార్షికోత్సవ వివరాలనూ, విద్యార్థినీ సమాజ స్థాపనా చరిత్రనూ వివరిస్తూ 'మన సోదరీమణియు, గుణమణియు, విదుషీమనియు... నగు శ్రీమతి బుఱ్ఱా బుచ్చి బంగారమ్మ గారిచే 'అస్కా' అను గ్రామమునందు స్థాపింపబడిన స్త్రీ సంఘమునందలి సామాజికురాండ్రు కొంత ధనమును జందాచేసి

యచ్చుటి గరల్సు స్కూలునకు పోవు బాలికలకు బండి మొదలగు సదుపాయాలు చేయుచు... ఖానతినొందుచుంట మీరందరెరింగియే ఉందురు' అనడాన్ని బట్టి అప్పటికే అసికా స్త్రీ సమాజం గూర్చి బాగా తెలిసే ఉండిందని స్పష్టమవుతుంది.

స్పష్టమైన ఆధారాలు లభిస్తున్నంత వరకూ వలసాంధ్రలో స్త్రీల సెక్యులర్ విషయాలను చర్చించిన మొట్ట మొదటి స్త్రీ సమాజమైన 'అసికా స్త్రీ సమాజ' నిర్మాత కార్యదర్శి అయిన బుఱ్ఱా బుచ్చి బంగారమ్మ గూర్చి కొంత తెలుసుకుందాం. విశాఖపట్నం వాస్తవ్యులూ పెన్షన్డ్ డిప్యూటీ కలెక్టర్ అయిన దివాన్ బహదూర్ బుద్ధవరపు నారాయణమూర్తి పంతులు బుచ్చి బంగారమ్మ తండ్రి. వలసాంధ్రలోని వివిధ ప్రాంతాల్లో డిస్ట్రిక్ట్ మునసబుగా పని చేసిన బుర్రా వెంకటేశ్వర రావు పంతులు, బంగారమ్మ భర్త. సరైన పాఠశాల విద్యకు నోచుకొని బంగారమ్మ ఇంటివారి సహకారంతోనూ స్వయంకృషితోనూ ఇంగ్లిష్ భాష సహా వివిధ విషయాల్లో మంచి జ్ఞానాన్నార్జించింది. వలసాంధ్రలో మహిళోద్యమాన్ని నిర్మించిన అగ్రగణ్యుల్లో ఒకరైన బంగారమ్మ భర్త ఉద్యోగరీత్యా ఏ ఊరికి బదిలీ అయితే ఆ ఊర్లో స్త్రీలను సమీకరించి మహిళా సంఘాలను ఏర్పర్చేది. 1904లో విశాఖపట్నంలో 'భారతీ సమాజం'ను '1910 కర్నూల్‌లో' హిందూ స్త్రీ విద్యాభివృద్ధినీ సమాజమును'ను స్థాపించింది బంగారమ్మ. 1912 మే 23, 24 తేదీలలో నిడుదవోలులో జరిగిన మూడవ ఆంధ్ర మహిళా మహా సభకు అధ్యక్షత వహించింది. మహిళోద్యమం పట్ల ఈమెకు ఎంతగా అంకితభావం ఉండిందంటే నిరదవోలు సభకు కేవలం ఒకరోజు ముందే తన తల్లికి శస్త్రచికిత్స జరిగినా ఉద్యమానికే అధిక ప్రాధాన్యతనిచ్చి అక్కడికి చేరుకుంది. ఈ విధంగా ఆంధ్ర, రాయలసీమల్లో స్త్రీ సంఘాల స్థాపన ద్వారా బాలికా పాఠశాలల స్థాపన ద్వారా సోదరీతత్త్వ భావాల పరిమళాన్ని గుబాలింప జేసిన బుఱ్ఱాబుచ్చి బంగారమ్మకే మొట్టమొదటి సెక్యులర్ మహిళా సమాజ నిర్మాతగా గౌరవం దక్కాలి. ఆమెను గూర్చి చెప్పుకోవాల్సిన ముఖ్యవిషయం, క్రైస్తవ స్త్రీలతో ఆమె చాలా స్నేహంగా ఉండడం.

ఇక అచ్చమాంబకు బృందావనపుర స్త్రీ సమాజంతో ఉన్న సంబంధాన్ని పరిశీలిద్దాం. నిరదవోలు వెంకట్రావు అముద్రిత రచన 'భండారు అచ్చమాంబ జీవితం' ఆధారంగా కొండవీటి సత్యవతి ఈ సమాజాన్ని స్థాపించింది అచ్చమాంబ అంటున్నారు. ఈ సమాజ స్థాపన విషయాన్ని ప్రస్తావిస్తూ క్రెడిటంతా పురుషులకే వచ్చే విధంగా రాసుకున్నారు అయ్యాదేవర కాళేశ్వరరావు నవ్యాంధ్రము: నా జీవిత కథలో![9] అచ్చమాంబ సమకాలికుల్లో కూడా బందరు స్త్రీ సమాజ ప్రారంభకత్వ విషయానికి సంబంధించి గందరగోళం ఉంది. కొన్ని ఆధారల ప్రకారం ఓరుగంటి సుందరీ రత్నాంబ స్థాపకురాలైతే కొన్ని ఆధారాలు రత్నాంబ, అచ్చమాంబలిద్దర్నీ ప్రారంభకులుగా ఇచ్చాయి. సమాజ కార్యదర్శి అయిన మోటుపల్లి రాజాబాయమ్మ 1905-1906 సంవత్సరానికి గాను కార్యదర్శి నివేదికను సమర్పిస్తూ 'సమాజ పుట్టుక' గూర్చి ఇలా రాసింది. 'ఈ బృందవనపుర సమాజం అబలాసచ్చరిత్ర రత్నమాల గ్రంథకర్తయగు గతించిన శ్రీమతి బండారు అచ్చమాంబగారి వలనను శ్రీమతి ఓరుగంటి సుందరీ రత్నమాంబ ఎం.ఎ. గారి వలనను1902 నవంబర్ నెలలో స్థాపించబడినది. రెండుసభలు మాత్రమే జరిగినవి. అదేమి దురదృష్టమోగాని అంతటతోనే అంతరించెను.

ఆ విధంగా అంతరించిన స్త్రీ సమాజాన్ని ప్రభల సత్యవతమ్మ, నాధావఝ్ఝల సరస్వతమ్మ, వల్లూరు పార్వతమ్మ, టి. సింగమ్మ, సి. పంకజమ్మ తదితరులు 'విశేష శ్రమ చేసి కష్టనిష్ఠూరములకోర్చి' 1904 సెప్టెంబర్ 17న పునరుద్ధరించారు. తొలుత కార్యదర్శులుగా పనిచేసిన సింగమ్మ, సరస్వతమ్మలు మద్రాసు వెళ్లి పోవడంతో రాజాబాయమ్మే సెక్రటరీ, ట్రెజరరు, లైబ్రేరియన్‌గా పని చేయాల్సొచ్చింది. 1905 సెప్టెంబర్ 17న 'సమాజంను బాలికామణికి ప్రథమ సంవత్సరీకోత్సవం' చేయడం, 1906 సెప్టెంబర్ 17న 'ద్వితీయ సంవత్సర మహోత్సవం' చేయడాన్ని బట్టి టెక్నికల్‌గా 1902 నవంబరును సమాజ ప్రారంభ సమయంగా తీసుకొన్నప్పటికీ వాస్తవంగా (ప్రాక్టికల్‌గా) పునరుద్ధరించిన 1904 సెప్టెంబర్ 17నే ఈ సమాజ పుట్టినరోజుగా సమకాలీన మహిళలు భావించారని స్పష్టమవుతుంది. ద్వితీయ వార్షికోత్సవ సందర్భంగా ప్రసంగించిన ద్రోణంరాజు దుర్గమ్మ ఓరుగంటి సుందరీ రత్నమాంబనే ఈ సమాజపు తల్లిగా వర్ణించింది. ఆమె మాటల్లో 'ఈ బృందావన స్త్రీ సమాజమను బాలికకు కన్నతల్లిగారగు ఓరుగుంటి సుందరీ రత్నమాంబగారు 1902వ సంవత్సరంలో గర్భవతి అయి నవంబర్ నెలలో ఈ సమాజమను శిశురత్నంను ప్రసవించెననియు ఆ శిశువును పెంచుటకు ఆమెకు వీలుపడనందున నలుగురిని పోషకులుగా (పెంపుడు తల్లులు) నేర్పరచిరనియు వారు పుత్రికా వాత్సల్యంతో ఆమెను పెంచుచు 1904వ సంవత్సరం సెప్టెంబర్ నెలలో నామకరణం చేసిరనియు తెలియుచున్నది. దీనిని బట్టి ఓరుగంటి సుందరీ రత్నమాంబే ఈ సమాజపు స్థాపకురాలు. 1909 ఫిబ్రవరి 7 నాటి కృష్ణాపత్రిక ఆధారంగా భండారు అచ్చమాంబ, ఓరుగంటి సుందరీ రత్నమాంబలనిద్దరినీ స్థాపకులుగా చెప్పినారు ప్రముఖ చరిత్రకారైన వకుళాభరణం రామకృష్ణ.

కానీ వాస్తవంగా ఓరుగంటి సుందరీ రత్నమాంబనే బృందావనపుర స్త్రీ సమాజ సంస్థాపకురాలిగా తీసుకోవాలి. 1902 డిసెంబర్ 24న బృందావనపురం (బందరు/మచిలీపట్నం) లో జరిగిన స్త్రీల సభలో భండారు అచ్చమాంబ మాట్లాడినదాన్ని బట్టి మనమీ నిర్ధారణకొస్తున్నాం. ఆమె మాటల్లో 'నేనిట్లు మీ ముందు మాటలాడ సాహసించుటకంతయు నీయూరగల కొందరు సోదరుల ప్రోత్సాహమును నాకు గల స్త్రీ జనాభిమానమును గారణము... నేనీ గ్రామమునకు వచ్చిన పిదప విద్యా విశారదయగు మిస్ హ్యన్నారత్నముగారీ యూర సతీసమాజమునొక దాని నేర్పరుచుటకై యత్నింపుతున్నారని నాకు దెలిపె ఆమెకు ఆమెగారి తదితరుల అనుగ్రహము వలన నేడిట్లు మనమందరము కలిసికొని మాటలాడు భాగ్యము కలిగెను...' తర్వాత స్త్రీ సమాజాల ప్రాముఖ్యతను వివరిస్తూ అమెరికా ఉన్నత స్థానంలో ఉండడానికి స్త్రీ సమాజమే ముఖ్యకారణమనీ, స్త్రీ సమాజాలు ఐకమత్యాన్ని పెంచుతాయనీ దాంతో కొద్దిపాటి శ్రమతోనే దేశహిత కార్యక్రమాలు చేయవచ్చనీ చెపుతూ అలాంటి అవకాశాన్ని ఓరుగంటి రత్నమ్మ ఈ సమాజ ఏర్పాటు ద్వారా కలుగచేసిందని స్ఫురించేటట్లుగా 'దీనకంతకు ముఖ్యురాలై ఉండి మనకందరకు మిక్కిలి శ్రేయోదాయకమగు నీ సమాజం నేర్పరుప నుత్సహించిన మిస్ రత్నం యెడల మనం కృతజ్ఞులమై ఉండవలెను' అని సమాజ సంస్థాపనా కర్తృత్వాన్ని ఓరుగంటి సుందరీ రత్నమాంబకిచ్చేసింది. అచ్చమాంబ దీన్ని బట్టి బృందవనపుర స్త్రీ సమాజ స్థాపకురాలు ఓరుగంటి సుందరీ రత్నమాంబేననీ, అచ్చమాంబ రాకతో

అది ప్రారంభమవ్వడం ఒక సందర్భం మాత్రమేననీ, స్త్రీ సమాజాన్ని స్థాపించాలనే ఆలోచన అచ్చమాంబ కలుగజేయకముందే కొందరు ఆంధ్ర స్త్రీలకుండిందనీ విస్పష్టమవుతోంది.

మిస్ హ్యాన్నారత్నం ఉరఫ్ ఓరుగంటి సుందరీ రత్నాంబ అనే దేశీయ క్రైస్తవ స్త్రీ బృందావన స్త్రీ సమాజ స్థాపకురాలు. మధురైలో బారిస్టరుగా పనిచేసిన మిస్టర్ హెన్స్‌మన్ ఆమె భర్త. భర్త మరణానంతరమీమె బెంగుళూరులోని వాణీ విలాస స్త్రీల కళాశాలకు ప్రిన్సిపాల్‌గా పనిచేసింది. ఇండియన్ లేడీస్ మేగజైన్ సంపాదకురాలైన కమలాబాయి సత్యనాథన్ ఈమె సహోదరి. వీరి తండ్రి ఓరుగంటి శివరామకృష్ణమ్మ.

ఇంతదాకా మనం వివరించుకుంటూ వచ్చిన విషయాలు బృందావనపుర స్త్రీ సమాజాన్ని అచ్చమాంబ స్థాపించలేదనీ, అసలా సమాజం ఆంధ్రలో ఏర్పాటైన మొట్టమొదటి సమాజం కానేకాదనీ, తొలుదొల్త ఏర్పాటైన కొన్ని సమాజాల్లో అది కూడా ఒకటనీ అచ్చమాంబ రాక ఒక సందర్భం కలుగచేసిందనీ స్పష్టం చేస్తాయి. కేవలం ప్రోత్సాహకురాలిగానే తీసుకోవడం వల్ల 30 సంవత్సరాల్లోనే ఒక నిండు జీవితానికి సరిపడా కార్యాన్ని చేసి మనముందో నిలువెత్తు ఆదర్శాన్ని నెలకొల్పిపోయిన అచ్చమాంబ ఖ్యాతికొచ్చే ధోకా ఏమీలేదు.

అంత్య సూచికలు

1. ఇటీవల భండారు అచ్చమాంబ కథల్ని సంపాదించి ప్రచురించిన సంగిసెట్టి శ్రీనివాస్ కానీ, అచ్చమాంబ చరిత్రను రాసిన కొండవీటి సత్యవతికానీ ఈ విషయాన్ని ప్రస్తావించలేదు.

2. అలా ఆయన సంప్రదించిన వారిలో పులుగుర్త లక్ష్మీనరసమాంబ కూడా ఒకరు. నిజంగానే అతడు ఒక స్త్రీని సంపాదకురాలిగా ఏర్పర్చాలనుకున్నాడా లేక త్వరలో నరసమాంబ స్థాపించబోతూండిన సావిత్రి వల్లనూ తెలుగు జనానాకు సంపాదకత్వం వహించబోతూండిన వీరేశలింగం వల్లనూ హిందూ సుందరి ఎక్కడ వెనుక పడిపోతుందోననే భయం వల్లనా అని చూస్తే రెండో విషయమే ఎక్కువ ప్రభావం చూపిందని తెలుస్తుంది. ఆయన స్వీయచరిత్రలో వ్యక్తమైన ఆందోళన చూస్తే. తొలి సంపాదకురాలి నాయకత్వంలోని పత్రిక అన్పించేదాని కోసమై హిందూ సుందరి, సావిత్రి పత్రికల మధ్య అనారోగ్యకరమైన పోటీనడిచింది. ఈ విషయాన్ని ఇంకో వ్యాసంలో చర్చించుకుందాం. ఏది ఏమైనా జనవరి ఒకటి 1904లో లక్ష్మీనరసమాంబ సంపాదకత్వంలో సావిత్రి ప్రచురించడానికి కేవలం పది రోజుల ముందు 20 డిసెంబర్ 1903లో మొసలిగంటి రమాబాయమ్మ, వెంపల శాంతాబాయమ్మలను సంపాదకులుగా ఏర్పాటు చేసి స్త్రీల సంపాదకత్వంలో వెలువడ్డ మొట్టమొదటి స్త్రీల పత్రిక హిందూసుందరి అన్పించేశాడు సత్తిరాజు సీతారామయ్య.

3. పు.81-82. 20వ శతాబ్ది తొలిదశకంలో మహిళోద్యమాన్ని, ముఖ్యంగా స్త్రీల పత్రికల చరిత్రని అర్థం చేసుకొనేదానికి ప్రత్యేకంగా ఉపయోగపడే ఈ విలువైన స్వీయ చరిత్రని సీతారామయ్య మనువడైన సత్తిరాజు హనుమంతరావు ప్రచురించారు. వీరి అల్లుడైన డా.కె.వి.ఎస్.ఎస్. నరసింహం ద్వారా మా గురువు కొప్పర్తి వేంకటరమణమూర్తి, నాకందేలా చూశారీ ఈ పుస్తకాన్ని. వారిద్దరికీ కృతజ్ఞతలు.

4. కొండవీటి సత్యవతి, భండారు అచ్చమాంబ సచ్చిరిత్ర, హైదరాబాద్ బుక్ ట్రస్టు, హైదరాబాద్, 2012, పు. 36. ఈ పుస్తకం రాసి ఆధునికాంధ్ర చరిత్రకే కాకుండా ఆధునిక భారతదేశ మహిళోద్యమ చరిత్రకు గొప్పమేలు చేశారామె.

5. ముదిగంటి సుజాతారెడ్డి, 'తెలంగాణ అందించిన తెలుగు తొలి కథలు'- సంగిసెట్టి శ్రీనివాస్ (సంపాదకులు), భండారు అచ్చమాంబ తొలి తెలుగు కథలు, కవిలె: తెలంగాణ రీసెర్చ్ అండ్ రెఫరాల్ సెంటర్, హైదరాబాద్, 2010 పు. VIII ఇది అవాస్తవం. శ్రీ/స్త్రీ విద్యార్థిని సమాజాన్ని స్థాపించింది పులుగుర్త లక్ష్మీనరసమాంబ: అచ్చమాంబ కాదు. ఈ విషయాన్ని లక్ష్మీనరసమాంబ మాటల్లోనే తెలుసుకుందాం. 'నేనించుక విద్యారుచి నెఱింగినది మొదలు (అనగా అయిదారు సంవత్సరాల నుండి) సోదరీ బృందమగు మనమందరం ఒక సమాజంగా కూడి... విద్యాభివృద్ధిని జ్ఞానాభివృద్ధిని కలుగుచేయు సదంశముల ముచ్చటించుకొనుచు జన్మ సార్థకతను పొందుదమను నుద్దేశము కలిగి ఉండెడిదానను.. ఇట్టి సంఘం నేర్పరచికొని సోదరీమణులందరితో జ్ఞాన విద్యా ధనముల సంపాదించుకోనుదమను అభిలాష గల దానినై, మన సఖీమణియగు శ్రీమతి భండారు అచ్చమాంబగారు మనకు దర్శనం పొసంగుట కీయూరు వేంచేసిన సుదినంబునకు మరుసటి దినంబున (అనగా 1903 జనవరి 30వ తేదీ) నా సతీమణి సదాగమనం సదా మన హృదయములయందు జ్ఞప్తి యుంచు కొనునట్లుగా న్యాయముతో కూడి ఇచ్చటి సఖులనెల్లర పిలుచుకొనివచ్చి మా ఇంటనొక సభ జరిగించితిని. శ్రీమతి అచ్చమాంబ యాగమన దినంబును మన శ్రీ, విద్యార్థినీ సమాజ జన్మదినంబునునొకటిగా నానందింపుచుండకలుగును. చూడండి: శ్రీ, కాకినాడ విద్యార్థినీ సంఘము ప్రప్రథమ చర్యా విషయజ్ఞాపనం' సావిత్రి, మార్చ్ 1904, పు. 1-7; ఈ ఉపపత్తుకై పు. 1, 4-5. కొండవీటి సత్యవతి తదితరులు అచ్చమాంబని తొలి స్త్రీ సమాజ స్థాపకురాలంటుంటే, జనవరి 1950 నాటి ఆంధ్రమహిళ (దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ సంపాదకత్వంతో వెలువడింది) పులుగుర్త లక్ష్మీనరసమాంబ గూర్చి రాస్తూ 'ఆంధ్రదేశంలో మొట్టమొదట స్త్రీ సమాజంను స్థాపించినదీమెయే అని అంది! పు. 43.

6. ఈ సమాజ తొలి వార్షికోత్సవాన్ని రిపోర్టు చేసిన ఒక 'స్త్రీ విద్యాభిమాని' బుర్రా బచ్చి బంగారమ్మ ఈ సమాజ స్థాపకురాలని ఒక్కరికే క్రెడిట్ ఇవ్వకుండా అసికా పట్టణంలో కొందరు స్త్రీలు దీనిని స్థాపించినారని చెప్పి స్త్రీల ఉమ్మడి ప్రయత్నాన్ని స్ఫురింపజేశారు. 'అసికా స్త్రీ సమాజపు సంవత్సరోత్సవం', (తెలుగు జనానా పత్రిక , అక్టోబర్ 1903, పు. 115-17. కాని వార్షికోత్సవంలో మాట్లాడిన శ్రీమతి సుబ్బమ్మ సమాజావిర్భావానికి ప్రధాన కారకురాలు బంగారమ్మేనని నొక్కి చెప్పింది. పు. 116.

7. 'ద్వితీయ సంవత్సర జ్ఞాపనము' పు. 3-4. ఈ సమాజం నిర్వహించిన జమా లెక్కల పద్దు ఎంతో ముచ్చటగా అనిపిస్తుంది. ప్రతి విషయంలోనూ ఎంతో ట్రాన్సరెన్సీ కన్పిస్తుంది. ఇవాళ్టి ఎన్నో మహిళా ఆర్ఎస్. జి. వోల్లా కాకుండా!

8. మొసలిగంటి రమాబాయమ్మ రాజాం, చోడవరం మొదలైన ప్రాంతాల్లో స్త్రీ సమాజాన్ని స్థాపించి మహిళాభివృద్ధికి పాటుపడ్డట్టుగా స్త్రీల పత్రికల్లో సమాచారం లభిస్తున్నప్పటికీ సదరు సమాజాల స్థాపనా కాలానికి సంబంధించి నిర్దుష్టంగా తెలియకపోవడంతో వాటిని ఈ వ్యాసంలో చర్చించలేదు.

9. '.. బందారు అచ్చమాంబగారు ఆమె భర్త కూడా బందరుకు మా ఇంటికి వచ్చి 4, 5 రోజులుండిరి. అవుటపల్లి నారాయణరావు (కృష్ణాపత్రిక ఉపసంపాదకులు) నాకు గొప్ప స్నేహితులు. ఆయనతో సంప్రదించి బందరుకు అచ్చమాంబ వచ్చిన అవకాశమును తీసుకొని యొక స్త్రీ సమాజమును స్థాపించవలయునని తలచి ఒక ఆహ్వానమును పంపగా బందరులోని లాయర్లు, ఉపాధ్యాయులు మొదలైన వారంతా తమ తమ స్త్రీలను ఆ సభకు పంపినారు'. పు. 63.

(రచయిత అసిస్టెంట్ ప్రొఫెసర్, బాబాసాహెబ్ అంబేద్కర్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, లక్నో)

వీ

స్పెయిన్‌లో కమ్యూనిస్టు నమూనా గ్రామం

***సామ్రాజ్యవాదం ప్రపంచ దేశాలను ఆర్థిక సంక్షోభానికి నెడుతున్న ఈ కాలంలో కూడా కమ్యూనిస్టు విధానాలతో గ్రామాలను ఎలా అభివృద్ధి చేసుకోవచ్చో స్పెయిన్‌లోని మరినలెదా గ్రామం నమూనాను చూపిస్తున్నారు* డ్యాన్ హన్‌కాక్స్**

అది 1970 దశకం. స్పెయిన్ దేశ పాలక వర్గాల ప్రతినిధి జనరల్ ఫ్రాంకో అనే మిలిటరీ జనరల్ అత్యంత క్రూరంగా పరిపాలిస్తున్న రోజులు. అందలూసియా అనే రాష్ట్రంలో మరినలెదా అనే గ్రామం ఉంది. ఆ ఊరిలో 60 శాతం పైగా జనాభా నిరుద్యోగంతో సతమతమవుతున్నారు. అత్యంత పేదరికం, చాలా తరుచుగా పస్తులుండడం, ఇదీ వారి జీవితం. వ్యవసాయంపై ఆధారపడినప్పటికీ, ఊరి ప్రజలందరూ భూమిలేని నిరుపేద వ్యవసాయ కూలీలు. కూలి దొరికితేనే తిండి, లేకుంటే పస్తులు ఇలాంటి దుర్భర, దారిద్ర పరిస్థితులలో మరినలెదా గ్రామప్రజలు నిరుద్యోగం, ఆకలి, పేదరికం, కష్టాలు, కన్నీళ్లు, దోపిడిలేని వ్యవస్థలోనే తమ బాధలు పోతాయని, ఆ వ్యవస్థే కమ్యూనిస్టు వ్యవస్థ అని, ఆ వ్యవస్థ కొరకు కలలు కన్నారు. కలలు కనడమే కాదు, కమ్యూనిస్టు వ్యవస్థ స్థాపన కొరకు పోరాటం మొదలు పెట్టారు.

1970 దశకం నుండి 2010 దశకంలోకి వద్దాం. మరినలెదా గ్రామం పరిస్థితి గురించి తెలుసుకునే ముందు స్పెయిన్ దేశ పరిస్థితి ఎలా ఉందో తెలుసుకుందాం. అత్యంత సంపన్న దేశాల్లో ఒకటిగా పేరున్న స్పెయిన్ దేశంలో మరీ ముఖ్యంగా అందలూసియా రాష్ట్ర జనాభాలో 55 శాతం పైగా నిరుద్యోగులు. 2000 దశకంలో రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం ఉధ్రుతలూగాయి. పదవ తరగతి అయిపోతూనే ఎంతో ఆకర్షణీయమైన జీతాలతో ఉద్యోగాలు దొరికేవి. ఇప్పుడు అదంతా మాయ అన్నట్టుగా గాలిబుడగలా పేలిపోయింది. ఎటు చూసినా నిరుద్యోగం, కంపెనీల మూసివేత, ఉద్యోగుల తీసివేత వార్తలే. నిర్మాణ రంగం కుప్పకూలిపోయింది. కొనగలిగే శక్తి ఉన్న వినియోగదారులు లేక రియల్‌ఎస్టేట్ పతనమయింది. పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే, గృహ రుణాలు తీసుకొని కట్టలేకపోతున్న నాలుగు లక్షల కుటుంబాలను వారు కొన్న ఇంటి నుండి గెంటివేశారు. ఒక్క అందలూసియా రాష్ట్రంలోనే రోజుకు నలభై కుటుంబాలను ఖాళీ చేయించి, బ్యాంకులు ఆ ఇంటిని జప్తు చేసుకుంటున్నాయి. వారి బాధలు అంతటితో ఆగిపోలేదు. బ్యాంకు వారు ఇళ్లను ఖాళీ చేయించి, తమ పరం చేసుకున్నా, చట్ట ప్రకారం బ్యాంకు డబ్బులు నెలవారి కట్టవలసిందే. లేకపోతే వారికి జైలు శిక్ష ఉంటుంది. ఒకవైపు నిరుద్యోగం, ఇంకోవైపు ఇంటిని బ్యాంకు వాళ్లు జప్తు చేసుకోవడం, మరో వైపు బ్యాంకుకు కట్టాల్సిన నెలవారి డబ్బులు కట్టనందుకు అరెస్టు వారెంట్. ఈ ఒత్తిడి తట్టుకోలేక ఎందరో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇది నిత్యకృత్యమైంది.

రాజకీయ నాయకులూ, అధికారులూ, పెట్టుబడిదారులూ కలిసి దేశ ప్రజలను ఇష్టారాజ్యంగా దొచుకొని, దేశాన్ని కొల్లగొట్టి, దివాళా తీయించారు. 70 శాతం దేశ ప్రజలు తమ 'ప్రజాస్వామ్య' వ్యవస్థ పట్ల అపనమ్మకాన్ని వెలిబుచ్చారు. 2011 సంవత్సరంలో కేవలం నాలుగు నెలల్లో 80 లక్షల ప్రజలు వీధుల్లోకి వచ్చి ఉద్యమాలు చేశారు.

నాలుగు కోట్ల డెభై లక్షల స్పెయిన్ దేశ జనాభా ఇలాంటి పరిస్థితులు ఎదుర్కొంటుంటే, 2700 జనాభా కలిగిన అదే దేశంలోని మరినలెదా గ్రామంలో మాత్రం ఇప్పుడు నిరుద్యోగం, ఆకలి, పేదరికం, అప్పులు, ఆత్మహత్యలు లేవు. ఒకవైపు స్పెయిన్ దేశమంతా అత్యంత నిరుద్యోగం, అప్పులు, ఆత్మహత్యలతో నిండిపోతే, ఒక చిన్న గ్రామంలో ఒక్కరు కూడా నిరుద్యోగి లేకపోవడం, పేదరికం, అప్పులు లేకపోవడం ఎలా సాధ్యం? జ్ఞాపకముందా, 1970 దశకంలో మరినలెదా గ్రామ ప్రజలు కమ్యూనిస్టు వ్యవస్థ నిర్మాణానికై పోరాటం మొదలు పెట్టారని? ఈ రోజు వారి సుఖవంతమైన జీవితం వెనుక ఆ పోరాట చరిత్ర ఉంది. అదేంటో చూద్దాం.

ముప్పై సంవత్సరాల కమ్యూనిస్టు భావాలు గల సాంచెజ్ గోర్దిల్లో అనే యువకుడిని మరినలెదా గ్రామ ప్రజలు తమ మేయర్‌గా ఎన్నుకున్నారు. అది 1979వ సంవత్సరం. గ్రామ ప్రజలందరిలాగే సాంచెజ్ కూడా పేదరికంతో, తరుచుగా పస్తులుంటూ బతుకుతున్న భూమిలేని వ్యవసాయ కూలీ ఈ గడ్డు పరిస్థితి నుండి బయటపడాలంటే పోరాటం తప్ప వేరే మార్గం లేదని, సాంచెజ్ నాయకత్వంలో గ్రామస్తులంతా తమ పస్తుల జీవితంతోనే 1979లో మిలిటెంట్ ఉద్యమం మొదలు పెట్టారు. 1200 హెక్టార్ల ప్రభుత్వ, రాచరిక భూమిని గ్రామస్తుల పరం చేయాలని మొదలైన భూ పోరాటం 1991లో విజయవంతమైంది. 1200 హెక్టార్ల భూమినంతా గ్రామ ప్రజలు ఏర్పరుచుకున్న కో-ఆపరేటివ్ ఆధ్వర్యంలో దున్నడం మొదలు పెట్టారు. అందరికి ఉపాధి కల్పించడం కొరకు, మానవ శ్రమ బాగా అవసరమయ్యే పంటలు మాత్రమే వేస్తున్నారు. పండిన పంటల నుండి వివిధ రకాల పదార్థాలు తయారు చేసే చిన్నపాటి కుటీర పరిశ్రమలను కూడా తామే స్థాపించుకొని, ఉపాధి కల్పించుకుంటున్నారు. 'దున్నేవానికే భూమి' అనే నినాదంతో మొదలైన వీరి పోరాటం, భూమి తమ ఆధీనంలోకి తీసుకొని, గ్రామస్తులందరి సమష్టి ఆస్తిగా చేసి, అందరి కష్టంతో అభివృద్ధి చెందుతూ ఉండడం దేశ, విదేశాల్లో ఆసక్తిని రేపింది. కొందరు ఇతర దేశాల వారు కూడా ఆ గ్రామానికి వచ్చి స్థిరపడిపోయి, ఆ సమష్టి జీవన సౌందర్యాన్ని తాము కూడా ఆస్వాదిస్తూ జీవిస్తున్నారు. ఈ గ్రామ కో - ఆపరేటివ్ సంపాదించే లాభాలను అందరికి పంచరు. లాభాన్ని మరిన్ని ఉద్యోగాల కల్పనకొరకు కొ- ఆపరేటివ్‌లోనే పెట్టుబడిగా

పెడుతారు. 1979 నుండి ఇప్పటి వరకు వరుసగా మేయరుగా ఎన్నుకోబడుతున్న సాంచెజ్‌తో సహా ప్రతి ఒక్కరికి సమానంగా ఒకే దినసరి వేతనం ఉంటుంది. ఆరున్నర గంటల దినసరి పనికి 47 యూరోలు (దాదాపు 3000 రుపాయలు). స్పానిష్ ప్రభుత్వం దినసరి కనీస వేతనంగా ప్రకటించిన దానికి ఇది రెండింతలు. ఒకప్పుడు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా తొక్కివేయబడ్డ గ్రామ ప్రజలు, ఈ రోజు తమ కమ్యూన్‌లో తామే నిర్ణయాలు తీసుకొని, అమలు పరుస్తూ అద్భుత విజయాలు సాధిస్తున్నారు. తమ గ్రామంలో బహుళ జాతి సంస్థలకు ఎట్టి పరిస్థితులలో ప్రవేశం లేదని నిర్ద్వంద్వంగా చెపుతున్నారు. మరినలెదా గ్రామ ప్రజల కమ్యూనిస్టు వ్యవస్థ నమూనాను చూసి ఉత్తేజితులైన ఇంకో గ్రామ ప్రజలు 2012లో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని తాము కూడా కమ్యూన్ వ్యవసాయ క్షేత్రాన్ని నెలకొల్పుకున్నారు. ఒకవైపు 55 శాతం పైగా నిరుద్యోగంతో సతమతమవుతున్న స్పెయిన్‌కి ఉపాధి కొరత ఉంటే, సోమోన్టే గ్రామ కమ్యూన్‌కి ప్రజల కొరత ఉంది. దాదాపు 400 హెక్టార్లు పనిచేసే వారు లేక ఖాళీగా ఉంది. వారు తమ గ్రామంలోని గోడపై 'ఈ భూమి మీది, మీ పరం చేసుకోండి' అని రాసి ఆహ్వానిస్తున్నారు.

2012లో సాంచెజ్ నాయకత్వాన మరినలెదా గ్రామ ప్రజలు చుట్టు పక్కల పట్టణాలలో ఉన్న సూపర్ మార్కెట్లపై కరువు దాడులు చేసి, ఆహార పదార్థాలను లాక్కొని నిరుద్యోగంతో, ఆకలితో బాధపడుతున్న ప్రజలకు (తమ గ్రామం కాదు) పంచిపెట్టారు. ప్రజలు పన్నులు కట్టవద్దని పిలుపునిచ్చారు.

మరినలెదా, సోమోన్టే గ్రామాల ప్రజలంత మిలిటెంట్‌గా, కలిసికట్టుగా కాకున్నా, స్పెయిన్ దేశ ఇతర ప్రాంతాల్లో పెట్టుబడిదారీ వ్యతిరేక పోరాటాలు జరుగుతున్నాయి. సమ్మెలు, ఉద్యమాలే కాదు, బ్యాంకులు స్వాధీనం చేసుకున్న ఇళ్లను తిరిగి ఆక్రమించుకోవడం లాంటి చర్యలు కూడా జరుగుతున్నాయి.

మరినలెదా గ్రామానికి, మిగితా స్పెయిన్ దేశంలో ఉన్న వ్యవస్థకు తేడా అర్థమైతే ఏ వ్యవస్థ ప్రజలందరికి నిజమైన అభివృద్ధిని (నిరుద్యోగం, పేదరికం, ఆకలి, బాధలు, నేరాలు లేని ఒక మానవీయ అభివృద్ధికర సమాజం) కల్పిస్తుందనేది అర్థమవుతుంది.

మరినలెదా గ్రామంలో ఉన్న భూమి అంతా ఆ గ్రామ ప్రజలందరికి చెందుతుంది. అందరూ సమానంగా పని చేయాలి. హెచ్చు, తగ్గులు లేకుండా అందరికి ఒకే ఆదాయం. ఇది పూర్తి స్థాయి కమ్యూనిస్టు వ్యవస్థ కాకపోయినా, దాన్ని పోలిన వ్యవస్థ. ఈ గ్రామ ఆధ్వర్యంలో ఉన్న కమ్యూన్ వ్యవసాయ క్షేత్రం, కుటీర పరిశ్రమలపై వచ్చే లాభమంతా తిరిగి తమ కో – ఆపరేటివ్ అభివృద్ధికే వినియోగిస్తున్నారు. ఇకపోతే, స్పెయిన్ దేశంలో ఉన్న వ్యవస్థ పెట్టుబడిదారీ వ్యవస్థ. అంటే 95 శాతం పైగా ఉన్న పేద, మధ్యతరగతి శ్రమను దోపిడి చేస్తూ కేవలం ఒక శాతం కూడా లేని పెట్టుబడిదారులు ఇంకా ఇంకా కోటీశ్వరులు అవుతున్నారు. పెట్టుబడిదారులు ఎంతగా తమ ఆస్తులు పెంచుకుంటుంటారో అంతగా 95 శాతం పైగా దేశ జనాభా పేదరికం, నిరుద్యోగం, అప్పుల ఊబిలోకి కూరుకు పోతారు. ఎందుకంటే కార్మిక వర్గాన్ని దోచుకుంటేనే, పెట్టుబడిదారీ వర్గానికి ఆస్తులు సమకూరేది. కాబట్టి, పెట్టుబడిదారీ వ్యవస్థను అలాగే ఉంచి, నిరుద్యోగం, పేదరికం, ఆకలి, అప్పులు, ఆత్మహత్యలు, నేరాలు లాంటి సమస్యలను తీర్చవచ్చు అని ఎవరైనా అనుకుంటే, అలా అంటే అది అవగాహనారాహిత్యం అవుతుంది. ఈ సమస్యలు ఉండకూడదనుకుంటే, 'దున్నేవానిదే భూమి, పని చేసే వాడిదే పరిశ్రమ' అనే నినాదంతో, పరిశ్రమ కమ్యూన్‌లు, వ్యవసాయ కమ్యూన్‌లు ఏర్పరుచుకొని, దేశ వనరులన్ని ఆ దేశంలో ఉన్న ప్రజలందరి సమాన, సమష్టి అభివృద్ధి కొరకు వాడే అవకాశాన్ని శ్రామిక వర్గానికి కల్పించే సోషలిజం, కమ్యూనిజం తప్ప వేరే మార్గమేది లేదు. ఇది కేవలం పోరాటాల ద్వారా మాత్రమే సాధ్యం. మరినలెదా గ్రామ ప్రజల విజయం వెనుక అనుభవం కూడా అదే.

(డ్యాన్ హన్‌కాక్స్ అనే రచయిత రాసిన 'ది విలేజ్ అగెనెస్ట్ ద వరల్డ్' అనే పుస్తకంలో నుండి ఎడిట్ చేసిన ఒక బాగాన్ని 'ది గార్డియన్' అనే యుకె దేశ పత్రిక ఒక వ్యాసంగా ప్రచురించింది. ఈ వ్యాసం దానికి స్వేచ్ఛానువాదం. ఈ వ్యాసం టైటిల్ 'ది గార్డియన్' పత్రిక వాడినదే. కార్ల్‌మార్క్స్ కమ్యూనిజం సిద్ధాంతం ప్రకారం చూస్తే కమ్యూనిస్ట్ వ్యవస్థలో వేతన పద్ధతి ఉండదు. పనిచేయడం, తమకు అవసరమైనంత తీసుకోవడం అనే పద్ధతిలోకి వెలుతుంది. మరినలెదా గ్రామంలో వ్యవసాయ భూమి, కుటీర పరిశ్రమలు మాత్రమే సమష్టి ఆస్తి, వారి ఇళ్లు మాత్రం వ్యక్తిగత ఆస్తి. కమ్యూనిస్ట్ వ్యవస్థలో వ్యక్తిగత ఆస్తి ఉండదు. ఇలాంటి కొన్ని సైద్ధాంతిక సమస్యలు ఉన్నప్పటికీ, 'ది గార్డియన్' పత్రిక వారు వాడిన టైటిల్‌ను యథాతథంగా అనువాదించాం. తమ గ్రామంలో 'కమ్యూనిస్ట్' నమూనా గ్రామాన్ని నిర్మించుకున్నప్పటికీ, వారు తమ గ్రామం బయట ఉన్న పెట్టుబడిదారీ వ్యవస్థ మధ్యనే బతకవలసిన దుస్థితి ఉంది. ఒకవేళ దేశంలో ఉండే పీడిత, తాడిత ప్రజలందరు సోషలిస్ట్ వ్యవస్థను నిర్మించుకోవడానికి నడుముకడితే, ఆ దేశ పాలకవర్గాల్ని (స్పెయిన్ దేశంలోనైతే, ఆ దేశంలో ఉన్న పెట్టుబడిదారీ వ్యవస్థను) కూల్చకుండా, పాలకవర్గాల ఆస్తులను స్వాధీనం చేసుకొని ప్రజల పరం చేయకుండా సోషలిస్ట్ వ్యవస్థను నిర్మించడం సాధ్యం కాదు. పాలక వర్గం ప్రయోగించే తీవ్ర హింస, అణిచివేతలను ఎదుర్కొనే క్రమంలో సాయుధ సంఘర్షణ తప్పదు).

(స్వేచ్ఛానువాదం : ఎం. నర్సింహారెడ్డి)

రచయితలకు సూచన : తక్షణ, సమకాలీన అంశాలపై రచనలు చేసి ఆ సంచికలోనే రావాలనుకొనే రచయితలు 20వ తేదీ లోగా పంపగలిగితేనే మరుసటి నెల సంచిక కోసం పరిశీలించడం సాధ్యమవుతుంది. ఆ తరువాత వచ్చిన రచన, అంశం ఎంత ముఖ్యమైనదైనా పరిశీలించడం, ముద్రణకు సిద్ధం చేయడం అసాధ్యమవుతుంది. రచయితలు గుర్తించగలరు. – సం.

ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ పరిపాలన-21

భూమికీ, మనిషికీ సంబంధాన్ని నిర్దేశించే రెవెన్యూ పాలన ప్రారంభం, పూర్వపరాల చరిత్రను వివరిస్తున్నారు

ఎస్.సరళా వందనం

(గత సంచిక తరువాయి...)

భారత ప్రభుత్వం ప్రజల జీవన విధానంలో మెరుగుదలకోసం, నూటికి ఎనభై ఐదు మంది జీవనాధారమైన వ్యవసాయం ఫలవంతంగా ఉండడానికి నదులపై భారీ ఆనకట్టలు నిర్మించాలని నిర్ణయించింది. ఆనకట్టలు నిర్మించడానికి, భూవనరులను సక్రమంగా పంపిణీ చేయడానికి అయ్యే ఖర్చు రాష్ట్రాలు, కేంద్రం పంచుకోవాలని నిర్ణయించి భూమి శిస్తుని పెంచాలని, ఇందుకోసం ఆంధ్రప్రదేశ్ భూమి శిస్తు పెంపుదల చట్టం 1967ను చేశారు. దీనితో పాటుగా గిరిజన ప్రాంతాలలోని నీటి పారుదల ప్రాజెక్టుకు 30 లక్షల ఖర్చు దాటినా, మామూలు ప్రాంతాలకైతే 25 లక్షల రూపాయల ఖర్చును పరిగణనలోకి తీసుకొని కొత్తగా నీటి పారుదల కల్పించిన భూములకు, ఇప్పటికే నీటి పారుదల ఉన్న భూములకు, ఒక పంటకు ఖచ్చితమైన నీరు పారకం, రెండు పంటలకు నీరు పారకం ఉన్న ఆయా పొలాలకు, నిర్ణయించబడిన భూమి శిస్తు ప్రాతిపదికగా కొత్తగా ఒక ప్రత్యేక భూమి పన్నును వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం 'ఆంధ్రప్రదేశ్ నీటి పారుదల (ప్రాజెక్టుల ప్రత్యేక భూమి పన్ను) చట్టం 1976'ను రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చింది. జాగీరు రద్దు చట్టం, కౌలుదారుల హక్కుచట్టం, ఇనాం రద్దు చట్టం, ఎస్టేటు భూముల రద్దు చట్టంతో భూములు పొందిన వాస్తవ సాగుదారులతో పాటుగా ప్రభుత్వం జి.ఒ. ఎం.ఎస్.నెంబర్ 1407 రెవెన్యూ తేది 25.07.58 ఉత్తర్వు ద్వారా భూమిలేని వ్యవసాయ కూలీలకు ఎ 2.50 సెంట్లు మాగాణి భూమికాని, ఎ5.00 మెట్ట భూమిని పెద్ద ఎత్తున పంపిణీ చేసిన భూముల్లో సాగుచేస్తున్న వారు తమ ఆధీనంలోనూ, హక్కులద్వారాను పొందిన భూమికి పన్ను చెల్లించడం ద్వారా ప్రభుత్వం నుంచి డి ఫారం పట్టాలు లేదా లావుని పట్టాలు పొంది స్వంత దారులైనారు. ఈ ప్రత్యేక భూమి పన్నును వసూలు చేయడానికి మెట్ట ప్రాంతాలుగా నమోదయిన భూముల రకాలకు నిర్ధారించిన భూమి శిస్తును బట్టి, ఇప్పటికే మాగాణి భూములుగా నమోదయిన భూములకు వేరే విధంగా పన్నును నిర్ధారించారు.

2. నమోదు కాబడిన మాగాణి భూములు

ఈ ప్రత్యేక పన్నును కట్టని పక్షంలో సంవత్సరానికి 6 1/4 శాతం అపరాధ రుసుంను రైతు చెల్లించాల్సి ఉంటుంది. బేవార్సు ఆస్తి చట్టం 1974 (ఎచ్చీట్స్ అండ్ బోనావేకన్షియా చట్టం)

ఒక కుటుంబానికి లేదా ఒక వ్యక్తికి స్వంతానికి ఉండాల్సిన భూమికి పరిమితి విధించడం, జమీందారీ జాగీర్దారీ రద్దు చట్టాలు, ఇనాము భూముల రద్దు చట్టాలు, వీటితో పాటు పరోక్ష భూస్వాములకు (ఆబ్సెంటీ లాండ్ లార్డ్సుకు) సుదూర ప్రాంతాలలో భూములుండి, వారు వేరేచోట నివాసముండడం, ముఖ్యంగా పట్టాదారు పేరు ఉండి వాటికి హక్కుదారులు లేకపోవడం వందల వేల ఎకరాల భూములు కనుక్కోవడం జరిగింది. ఎవరూ తాము హక్కుదారులమని ప్రతి పాదించలేని భూములు నిరూపించలేని భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడానికి చట్టపరమైన అవసరం ఒకటి ఏర్పడింది. చట్టం లేని పక్షంలో ఇలాంటి భూములు సంఘ వ్యతిరేక శక్తులు, భూ కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లే అవకాశం ఉంటుందని భావించి ప్రభుత్వం 1974లో భేవార్సు ఆస్తి చట్టం చేసింది. ఈ చట్టం ద్వారా కలెక్టరుకు బేవార్సు ఆస్తిని గజిట్ ద్వారా ప్రకటించి స్వాధీనం చేసుకునే అధికారం ఉంటుంది. సెక్షన్ 8 ద్వారా భేవార్సు ఆస్తి ఇతరుల ఆధీనంలో ఉంటే ప్రభుత్వే సివిల్ కోర్టులో దావా వేసి ఆక్రమణ దారుల ఆధీనం నుండి స్వాధీనం చేసుకోవడానికి ఉత్తర్వులు పొంది, ఆ ఆస్తిని ప్రభుత్వ ఆస్తిగా చేసుకొనే హక్కు వస్తుంది. స్థిరాస్తులకు సంబంధించి బేవార్సు ఆస్తిగా ప్రకటించిన 12 సంవత్సరాల తర్వాత మాత్రమే ప్రభుత్వానికి, ఆ స్థిరాస్తిని అమ్మే హక్కు వస్తుంది.

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కమతాల గరిష్ట పరిమాణ చట్టం 1973

1948 నుంచి 1961 వరకు భూసంస్కరణల చట్టాల అమలు తీరులో వస్తున్న లోపాలను అధిగమించే నిబంధనలు ముందుగానే ఊహించి ప్రత్యామ్నాయ చట్టాలు, వాటి సక్రమ అమలు తీరుకు నిబంధనలు సకాలంలో చేయకపోవడంవలన రెవెన్యూ సిబ్బందికి చట్టాల నిజమైన స్ఫూర్తిని, వాటి ఫలాలను మెజారిటీ ప్రజలకు అందించడం కుదరలేదు. ఇందుకు తోడు గ్రామ రెవెన్యూ అధికారుల స్థాయి నుంచి రెవెన్యూ డివిజనల్ స్థాయి అధికారుల వరకు భూసంబంధ లావాదేవీలు, భూమి హక్కులకు సంబంధించి గోప్యత పాటించడం చాల చోట్ల

ఆంధ్రప్రదేశ్‌లో నీటిపారుదల ప్రాజెక్టుల కింద భూములకు శిస్తు, నీటిపారుదల పన్ను

శిస్తు (రు.లో)	మెట్ట పంటకు	ఒక పంటకు	2 పంటలకు
రు. 1 భూమి శిస్తు	170	250	350
రు. 1 నుండి 1.50 లోపు	200	300	450
రు. 1.50 నుండి 2 లోపు	230	350	525
రు. 2 నుండి 2.50 లోపు	260	400	600
రు. 2.50 నుండి 3.00 లోపు	300	450	675
రు. 3 పైన	330	500	750
నమోదుకాబడిన మాగాణి భూములు		100	150

జరిగింది. గ్రామస్థాయి రెవెన్యూ అధికారులు చాల చోట్ల వారే భూస్వాములుగా ఉండడం, దీనికితోడు రెవెన్యూ సిబ్బంది అంచెలంచెలుగా భూస్వాములకు, ధనికులకు మద్దతునివ్వడం మరీ ముఖ్యంగా గ్రామస్థాయి రెవెన్యూ అధికారులు వంశపారంపర్యంగా కొనసాగడంతో భూసంస్కరణల ఫలాలు దక్కడానికి ప్రజలు నిరంతరం ఒక అధికారి దగ్గరనుంచి ఇంకో అధికారి దగ్గరకు తిరుగుతూ ఉండాల్సొచ్చింది. చట్టాలు, నిబంధనల్లోని లొసుగులను ఆధారం చేసుకొని ధనికులు కోర్టులలో వ్యాజ్యాలలో గెలుపొందడం, అధికారులిచ్చిన ఉత్తర్వులపై నిలుపుదల ఉత్తర్వులు తెచ్చుకోవడం ద్వారా వందల ఎకరాలు వీరు తమ ఆధీనంలో ఉంచుకున్నారు.

ఇంకోవైపు సేవారంగం, పరిశ్రమల రంగం, పట్టణీకరణ వేగంగా వృద్ధికాకపోవడంతో 85 శాతం ప్రజల వృత్తి వ్యవసాయమే అయ్యి, వారు గ్రామీణ సముదాయిక భూములు (కమ్యూనల్ పోరంబోకు భూములు), అటవీ భూములు, ప్రభుత్వ భూములు, దేవాదాయ భూములు సాగు చేసుకోవడం మొదలుపెట్టినా వాటికి హక్కు పత్రాలు లభించే అవకాశం లేకపోయింది. వ్యవసాయ అభివృద్ధికి కొత్తగా నీటి పారుదల ప్రాజెక్టులు కట్టడంతో ఆర్థిక స్థోమత కలిగిన వారికి వ్యవసాయం లాభసాటిగా మారింది. దానిలో ధనికులు తమ చేతిలో ఎక్కువ భూమి ఉండే విధంగా ప్రయత్నించి సఫలం చెందారు. దీనికి మెజారిటీ రెవెన్యూ అధికారుల మద్దతు చాలచోట్ల లభించింది. ఈ అసమానతలను తొలగించడానికి కుటుంబానికి ఉండాల్సిన భూమిపై నిర్దిష్టమైన గరిష్ట పరిమితి విధిస్తేనే ప్రజలందరి అవసరాలకు మిగులు భూమి ఉంటుందని భావించి ప్రభుత్వం ఈ చట్టం చేసింది.

ఈ చట్టంలో వివిధ రకాలైన భూములకు ప్రామాణిక కమతాల విస్తీర్ణాన్ని నిర్ణయించడానికి మాగాణి/తరి/పల్లం భూములను 6 రకాలుగా, మెట్ట భూములను 5 రకాలుగా వర్గీకరించి తరి భూమి ఒక యూనిట్ అంటే అయిదుగురు కుటుంబ సభ్యులున్న కుటుంబానికి ఎ10 నుంచి ఎ27 మాగాణి భూమి; అదే మెట్ట భూమి అయితే ఒక యూనిట్‌కు 35 నుంచి 54 ఎకరాల వరకు ఉండవచ్చని నిర్ణయించారు.

ఈ సీలింగ్ చట్టాన్ని అమలు పరచడానికి రెవెన్యూ డివిజన్‌ల ప్రాతిపదికగా 69 ట్రిబ్యునల్‌లను ఏర్పాటు చేశారు. ఒక కుటుంబ యజమానికి, కుటుంబ సభ్యులకున్న భూ కమతాల స్టేట్‌మెంట్‌ను తెలపమని ప్రభుత్వం ప్రకటన జారీ చేసిన తరువాత, ప్రకటిత తేదీకి 30 దినముల లోపు కుటుంబ యజమానికి, కుటుంబ సభ్యులకు వివిధ గ్రామాల్లో, తాలూకాల్లో, జిల్లాల్లో, మొత్తం రాష్ట్రంలో వివిధ చోట్ల ఉన్న అన్ని భూ కమతాల స్టేట్‌మెంటును ట్రిబ్యునల్ ముందు వ్యక్తులు తమంతట తామే సమర్పిస్తారు. కాటట్టి డిక్లరేషన్ (రూఢి ప్రకటన) అంటారు. సమర్పించాల్సి ఉంటుంది. ట్రిబ్యునల్స్‌కు డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులను, వీరికి సహాయ పడడానికి ప్రత్యేక తహసీల్దార్లు, ఇతర సిబ్బందిని నియమించారు. జిల్లాకొక ప్రత్యేక భూసంస్కరణ అధికారిని కూడా నియమించారు. ఒక్కొక్క జిల్లాలోని భూ కమతాల స్టేట్‌మెంట్ (డిక్లరేషన్)ల సంఖ్యను, విస్తీర్ణాన్ని బట్టి 1977 జూన్‌లో అదనంగా 24 ట్రిబ్యునల్స్‌ను ఏర్పాటు చేశారు. జిల్లా స్థాయిలో నియమించినట్లుగానే రాష్ట్రస్థాయిలో కూడా భూసంస్కరణల ప్రత్యేక అధికారిని నియమించారు.

ఈ సీలింగ్ చట్టం అమలుకు ప్రామాణిక తేదీగా 1971 జనవరి 24ను నిర్ణయించి, ఆ తేదీ తరువాత గరిష్ట భూ పరిమితి కన్నా ఎక్కువగా భూమి ఉన్న యూనిట్‌దారులు జరిపిన విక్రయాలూ, దానాలూ, తాకట్టులూ, సెటిల్‌మెంటులూ, అప్పగింతలూ, ట్రస్టులకు బదిలీ చేయడం లాంటి మార్పులు చెల్లవని ప్రభుత్వం ఈ చట్టం ద్వారా నిర్దేశించింది. ఈ చట్టం చేయడం ద్వారా భూ యజమాన్యంలో అనేక మార్పులు సంభవించాయి. కాని ఈ మార్పులపై సమగ్ర విచారణ జరిపే విధానం వాటిని కనుగొనడంలో రెవెన్యూ యంత్రాంగం ఎవరికి తోచిన విధంగా వారు వ్యవహరించడంతో వీటిని అరికట్టలేక పోయారు. పట్టాదారులు దాఖలు చేసిన డిక్లరేషన్‌లను డిప్యూటీ తహసీల్దారుకు తనిఖీ చేసే అధికారం ఉంటుంది. పట్టాదారు తనకున్న మొత్తం భూమిలో తన స్వంతానికి ఏ భూమి ఉంచుకోవాలనే స్వేచ్ఛ ఉంటుంది. అలా అని సాగుకు పనికి రాని భూమిని మిగులు భూమిగా ఇవ్వడానికి అంగీకారం తెలుపకూడదు. వాస్తవంగా డిప్యూటీ తహసీల్దార్లు గ్రామాధికారుల మీద ఈ డిక్లరేషన్‌ల విచారణ కోసం ఆధారపడ్డారు. గ్రామాధికార్లు భూ యజమానులకు ఉన్న పనికి రాని బీడు భూములను ప్రభుత్వానికి అప్పగించి మంచి భూములను భూ యజమానులకు అప్పగించారు భూ యజమానులు పాత తేదీలతో తెల్ల కాగితాలపై తమకు దగ్గరగా ఉండే వాళ్ల పేరు మీద భూమి మార్పిడి చేసుకొన్న సందర్భాల్లో చాలా చోట్ల రెవెన్యూ అధికారులు వారు డిక్లరేషన్‌ల్లో భూములను చూపించక పోయినా వారికి సహకరించారు. చాలా మంది 1961 సంవత్సరంలో వచ్చిన భూ గరిష్ఠ పరిమితి చట్టంతోనే జాగ్రత్త పడడం మొదలుపెట్టి, తమ భూములను బినామీల రూపంలో దక్కించుకున్నారు. అందులోనూ కాలం చెల్లిన వాటిని లేదా సమయం ఉన్నా కూడా చాలా సందర్భాల్లో భూస్వాములు ఇతరుల భూములను తాము తనఖా పెట్టుకున్న వాటిని తమ డిక్లరేషన్‌ల్లో చూపించి తమ భూములను పదిలంగా కాపాడుకున్నారు. ప్రభుత్వం కూడా తమ విచారణ ద్వారా మిగులు భూమిగా నిర్ధారించిన వాటిని అవి సాగుకు పనికి వస్తాయా రావా అని నిర్ధారించుకోకుండా వాటి స్వాధీనాన్ని ప్రకటించారు. ఇంకా సంతానం లేని వారు దత్తత తీసుకున్న వారికి భూములు ఇవ్వొచ్చు అనే నిబంధనతో చాలా మంది తమ భూములను దక్కించుకున్నారు.

వీటికి తోడు పూర్వం నుంచి నిర్ధారించిన తరి భూమిని తప్ప, కొత్తగా వచ్చిన నీటి పారుదల ప్రాజెక్టుల కింద ఉన్న భూములను ఇంకా తరి భూమిగా మార్చని సందర్భంలో వాటిని కూడా మెట్ట భూములుగా చూపించి లాభం పొందారు. ఈ విషయంలో రెవెన్యూ యంత్రాంగం నీటి పారుదల శాఖతో సంప్రదించడం లేదా గ్రామ రెవెన్యూ అధికారులకు ఉత్తర్వులిచ్చి వాటిని పహాణి అడంగల్‌లో మార్పులు చేయించడం, వీటిని వ్యాజ్యాల్లో సమర్పించడం చేయక చాలా చోట్ల భూస్వాములు గెలుపొందారు. ట్రిబ్యునల్స్‌కు పునఃపరిశీలనకు అవకాశం ఉండడం వలన ఏదో ఒక రుజువు చూపించి మిగులు భూమిగా నిర్ధారించిన భూమిని భూ యజమానులు తిరిగి పొందారు. చట్టంలోని సెక్షన్ 8 (2) ద్వారా ప్రభుత్వం దృష్టికి వచ్చిన మిగులు భూములకు డిక్లరేషన్ ఇవ్వని సందర్భంలో భూ యజమానిని డిక్లరేషన్ సమర్పించమని నోటీసు ఇచ్చే అధికారాన్ని చాలా చోట్ల ప్రభుత్వ అధికారులు వినియోగించుకోలేదు. ప్రభుత్వం మిగులు భూమిగా ప్రకటించిన తరువాత ఈ భూమిలో ఏ రోజూ సాగు చేయని వాళ్లు తెల్ల కాగితం మీద రాసుకొన్న విక్రయాలను, అప్పగింతలను కోర్టులలో వ్యాజ్యాలు వేసి భూమిని ప్రభుత్వపరం కానీయలేదు.

ఇవన్నీ ఒక పద్ధతి ప్రకారం జరుగుతూ ఉంటే భూ గరిష్ఠ పరిమితి చట్టం కింద మిగులు భూమిగా తేలిన భూమిని పంపిణీ చేసే బాధ్యత

తహసీల్దార్లు, ఇతర సాధారణ రెవెన్యూ అధికార యంత్రాంగం కిందే ఉంది. ప్రభుత్వం మిగులు భూమిలో 50 శాతం భూమి షెడ్యూల్డ్ తెగల, షెడ్యూల్డ్ కులాల వారికి, మిగిలిన భూమిలో 2/3 వంతు వెనుకబడిన తరగతులకు పంపిణీ చేయాలని నిర్దిష్ట ఉత్తర్వులు ఇచ్చింది. మిగులు భూమిగా తేలిన భూమిని తహసీల్దారు / మండల రెవెన్యూ అధికారికి అప్పగించిన వెంటనే ఈ భూములను పై నిష్పత్తి ప్రకారం పంచారు. పేదలకు భూ పంపిణీ జరిపిన వెంటనే వారి పేరు మీద గ్రామ లెక్కల్లో మార్పులు చేయడం, వారికి సర్వే చేసి భూమిని అప్పగించడం చాలా నిదానంగా జరిగింది. కొన్ని చోట్ల గ్రామ రెవెన్యూ అధికారులు, ఇతర రెవెన్యూ సిబ్బంది భూ యజమాని కోర్టుల్లోనో లేదా అప్పిలేట్ ట్రిబ్యునల్‌లోనే కేసు వేసుకొని, నిలుపుదల ఉత్తర్వులు వచ్చిన దాకా భూమిని అప్పగించలేదు. ఇదే కాకుండా భూ యజమానులు కూడా గ్రామాల్లో పెత్తందారులు అయి ఉండడంతో పట్టాలు పొందిన వారు కూడా భూమి పైకి వ్యవసాయం చేసుకోవడానికి వెళ్లలేదు.

కొన్ని చోట్ల రెవెన్యూ అధికారులు సాగుకు పనికి రాని బరక భూములు, కొండలు, గుట్టలుగా ఉన్న భూములను డిక్లరెంట్‌ను వ్యతిరేకించి అతనికున్న మంచి భూమిని మిగులు భూమిగా ప్రకటించకుండా అవే మిగులు భూములుగా ఒప్పుకొని పేద ప్రజలకు వాటినే పంపిణి చేసి భూ యజమానులకు లాభం చేకూర్చారు. కోర్టులలో వ్యాజ్యాల్లో అప్పీలులో ప్రభుత్వం గెలిచిన తరువాత, ముందుగా భూమి పంపిణి చేసిన వారికి కాకుండా, వేరే వారికి తిరిగి అదే భూమిని పంపిణి చేసి పేద ప్రజలు తమలో తామే కొట్లాడుకోవడం లేదా భూమి కోసం కోర్టుకెళ్లడంతో భూ యజమానులు ఆ భూములను తమ ఆధీనంలోనే ఉంచుకొని (రెవెన్యూ అధికారుల స్వాధీనం కాగితాల మీదే ఉంటుంది) దానిపై పంటను పొందారు. ఒక కోర్టులో భూ యజమానులు గెలిచిన వెంటనే రెవెన్యూ అధికారులు అప్పీలు కెళ్లడంలో ఆలస్యం చేయడం, చాలా సార్లు భూ యజమానులు ఆ భూములను వేరే వారికి అమ్మడం జరిగింది. అప్పీలులో ప్రభుత్వం గెలిచినా కూడా కొత్తగా కొనుకున్న వారు వ్యాజ్యాలు నడుపుతూ రెవెన్యూ యంత్రాంగం రిజిస్ట్రేషన్ శాఖ వారికి క్రయవిక్రయ లావాదేవీలు జరగకూడదని లిఖిత పూర్వకంగా తెలపక పోవడం వలన ఈ యంత్రాంగం ఆలసత్వం వలన కొత్త వ్యాజ్యాల్లో భూములు ఇరుక్కొని పేద ప్రజలకు సాగు అనుకూలమైన భూమి లభించలేదు.

కౌలుదారీ చట్టాల కింద వచ్చే భూమి, ఇనాందారుల రద్దు చట్టం కింద ఉన్న భూములను భూ యజమానులు దఖలు పరిచిన డిక్లరేషన్‌ల్లో కనుక్కోవడంలో రెవెన్యూ యంత్రాంగం భూములు ఎవరి సాగులో ఉన్నాయో స్వయంగా పరిశీలిచంకుండా, కేవలం కాగితాల మీద రాసి ఉన్న భూకమతాల్లో భూ యజమానికి వచ్చే గరిష్ఠ పరిమితిని నిర్ధారించి, మిగిలిన ఇతర భూములను మిగులు భూమిగా చూపించింది. సాధారణ రెవెన్యూ యంత్రాంగమైన గ్రామ రెవెన్యూ అధికారులు, ఫిర్కా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ / గిర్‌దావర్‌లు వాస్తవ పరిస్థితులను తెలుపకుండా ఈ భూములపై సాగులో ఉన్న వాళ్లను విస్మరించి, తహసీల్దార్లు, రెవెన్యూ విభాగ అధికారుల ద్వారా జరిగే పేదలకు చేసే భూ పంపిణికీ సహకరించి, ఏళ్ల తరబడి ఆ భూముల్లో సాగుచేసుకొనే వారికి అన్యాయం చేశారు. కొత్త తరహ ఆటంకాలతో వాస్తవ సాగు దారులకు, భూపంపిణి ద్వారా పట్టాదక్కించుకున్న వారికి మధ్య వ్యాజ్యాలు మొదలై, కౌలుదారులు, సేవా ఇనాందారులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ, కోర్టుల చుట్టూ తిరగాల్సి వచ్చింది.

చాలా సార్లు మిగులు భూమిగా నిర్ధారించి ట్రిబ్యునల్ ఉత్తర్వులు జారీ చేసినా ఆ భూములను తహసీల్దారుకు అప్పగించడంలో చాలా జాప్యం జరిగింది. ఈ జాప్యాన్ని భూ యజమానులు తమకనుకూలంగా మార్చుకున్నారు. రెవెన్యూ అధికార యంత్రాంగంలో ఇన్ని లోపాలున్నా 1975లో సీలింగ్ చట్టం అమలుకు దాదాపు 16 లక్షల ఎకరాలకు డిక్లరేషన్‌లు వచ్చి, భూ గరిష్ఠ పరిమితి పెంచడంతో 8 లక్షల ఎకరాలకు తగ్గినా, 6.39 లక్షల ఎకరాల మిగులు భూములను స్వాధీనం చేసుకొని రెవెన్యూ యంత్రాంగం పేద ప్రజలకు 5.78 లక్షల ఎకరాలను పంపిణి చేయడం జరిగింది.

(ఇంకా ఉంది)

(రచయిత రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ అధికారి)
saralareddy007@gmail.com

వీ

(...4వ పేజీ తరువాయి)

కొన్ని అంశాలను పాఠకులతో పంచుకోదలిచాను. తద్వారా పాఠకులకు ఈ విషయంలో మరింత సమాచారం అందుతుంది.

మొట్టమొదట ఒక విషయం స్పష్టం చేయాలి. నేను అర్థశాస్త్రాన్నీ, మార్క్స్ మొత్తం రచనలనూ, ఇతర సోషలిస్టు రచయితలనూ ఇంగ్లిష్ లోనే చదివి ఆ భాషలోనే అర్థం చేసుకున్నాను. వేరువేరు నిర్దిష్టమైన పదాలను తెలుగులో వ్యక్తీకరించడానికి సరిపోయిన పదజాలం నాకు తెలియదు. శ్రమ, విలువ, మారకం, ధర వంటి భావనలను అభివృద్ధి చేసేటప్పుడు మార్క్స్ వాడిన విభిన్న పదాలను గతితార్కిక పద్ధతిలో అర్థం చేసుకోవలసి ఉంటుంది. శ్రమ గురించి వివరించేటప్పుడు మార్క్స్ శ్రమ, శ్రమశక్తి, సామాజికంగా అవసరమైన శ్రమ అనే మూడు పూర్తిగా భిన్నమైన అంశాలను మూడు పదాలు వాడాడు. మారకం గురించి వివరించేటప్పుడు శ్రమ విలువ, అదనపు శ్రమ ఉత్పత్తి, అదనపు విలువ ఉత్పత్తి, అసమాన మారకపు ప్రక్రియ అనే భావనలు అభివృద్ధి చేశాడు. ఈ అంశాన్ని రావిశాస్త్రి బల్లచెక్క కథ బాగా వివరించింది. అలాగే మార్క్స్ స్థిర శ్రమ, అస్థిర శ్రమ అనే మాటలు కూడ వాడాడు. ఉత్పాదక శ్రమ, అనుత్పాదక శ్రమ భావనలను వివరించడానికి ఎంతో కృషి చేశాడు. రాజకీయార్థిక శాస్త్ర విషయాలలో గణితశాస్త్ర సాధనాలను మార్క్సే మొట్టమొదటిసారి వాడాడు. ప్రస్తుతం అర్థశాస్త్రం అని పిలుస్తున్నదాన్ని పందొమ్మిదో శతాబ్దంలో రాజకీయార్థిక శాస్త్రం అనేవాళ్లు. అర్థశాస్త్రంలో గణితశాస్త్ర అన్వయాన్ని ప్రస్తుతం విశ్వవిద్యాలయాలలో ఎకనామెట్రిక్స్ అంటున్నారు.

అధికారిక వామపక్షాలకు బైట మార్క్స్ ను సాధారణ పాఠకులకు అందించడానికి రంగనాయకమ్మ చేస్తున్న కృషి ప్రశంసనీయమైనదే గాని, ఇప్పటికే ఉన్న గందరగోళాన్ని ఆమె తన సొంత వివరణలతో మరింత జటిలం చేయడం మానుకోవాలి. సమాన శ్రమశక్తికి సమాన వేతనంతోనే మారకం చేశానని పెట్టుబడిదారు ఎప్పుడైనా అంటాడు. ఆ మారకం అమ్మకందారు–కొనుగోలుదారు సంబంధం ద్వారానే జరుగుతుంది. లావాదేవీ సక్రమంగానే జరిగిందని పెట్టుబడిదారు అంటాడు. కాని ఆ సంబంధం, ఆ లావాదేవీ శూన్యంలో పనిచేయడం లేదు. అవి ఒక ప్రత్యేక సామాజిక నేపథ్యంలో, కొన్ని రకాల సామాజిక పరిస్థితులలో పనిచేస్తాయి. అవే ఆ సంబంధాన్ని నిర్ణయిస్తాయి. ఈ మారకంలో ఉన్న మొత్తం అన్యాయాన్ని నిరూపించడానికే మార్క్స్ తన యావజ్జీవితమూ వెచ్చించాడు.

మార్క్స్‌ను వ్యాఖ్యానించడం ఎప్పుడూ సమస్యే. ఆయన జర్మన్‌లో రాశాడు. ఆ రచనలు ఇంగ్లిష్‌లోకీ, ఇతర ప్రపంచ భాషలలోకి అనువాదమయ్యాయి. ఆయనకు ఇంగ్లిష్ అంత బాగా వచ్చేది కాదు, ఇంగ్లిష్ లో సొంతంగా దాదాపుగా రాయనేలేదనాలి. ఆయన రచనల్లో అత్యధికభాగం మరణానంతరమే అచ్చయ్యాయి. జీవితకాలంలో అచ్చయిన ప్రధాన రచన కాపిటల్ మొదటి సంపుటం మాత్రమే. తాను వాడుతున్న వేర్వేరు భావనలను అభివృద్ధి చేసే క్రమంలో తన సొంత వివరణ కోసం ఆయన రాసుకున్న నోట్స్, ఆయన ప్రధాన రచన గ్రండ్రిస్సె ఎంతో కాలం తర్వాత 1943లో అచ్చయింది. కాపిటల్ తర్వాతి సంపుటాలను 1890లో ఎంగెల్స్ పరిష్కరించి ప్రచురించాడు. మార్క్స్ చేతిరాత ఎంత కష్టమైనదంటే కొన్ని సందర్భాలలో ఏమి రాశాడో ఆయనే గుర్తించలేకపోయేవాడు.

–కె ఎం వి జి కృష్ణమూర్తి, రావులపాలెం
(ఇంగ్లిష్‌లో రాసిన ఉత్తరానికి అనువాదం)

వీ

మేం మళ్ళీ వస్తాం! - 4

సోవియట్ యూనియన్, చైనా పతనాలతో మార్క్సిజం అంతం కాలేదని విశ్వసిస్తూ, ఆ రెండు అనుభవాలను తన శైలిలో విశ్లేషించిన తోలేటి జగన్మోహనరావు 'మేం మళ్ళీ వస్తాం' పై రంగనాయకమ్మ సమీక్షావ్యాసం

(గత సంచిక తరువాయి...)

ఈ పుస్తకం ఇచ్చే సిద్ధాంతం: (203 పేజీ నించీ)

'ప్రకృతిలోనూ, సమాజంలోనూ, ఏదీ స్థిరంగా ఉండదు. ప్రతీదీ నిరంతర చలనంలో ఉంటుంది' (పే. 302).

అంటే, ప్రకృతినీ, సమాజాన్నీ, ప్రతీ ఒక్క విషయంలోనూ ఒకే రకంగా భావించడం ఇది. ఈ 'నెగేషన్' వంటి సూత్రాల్ని వివరించ డంలో, మార్క్స్ 'కేపిటల్' లో కొన్ని చోట్ల ప్రస్తావించాడు గానీ, ఆ నియమాల గురించి ఒక పుస్తకం లాంటిదేమీ రాయలేదు. వర్గభేదాలు లేని, వైరుధ్యాలు లేని, వర్గరహిత కమ్యూనిజం గురించే మార్క్స్ చెప్పాడు. 'వర్గరహితం' అయిన, వర్గాలు నిజంగా లేని దశనే మనం ఊహించాలి. అర కొర మార్పుల్ని కాదు, కమ్యూనిజం అనవలసింది. వర్గాలు నిజంగా లేని దశలో పెట్టుబడిదారీ విధానం ఎక్కడి నుంచి వస్తుంది? అది రావడానికి అవకాశం లేకుండా ప్రజలు విప్లవ జ్ఞానంతో చేసుకుంటే, అప్పుడు కమ్యూనిజమే స్థిరపడి కొనసాగదా? ప్రజలకు విప్లవ జ్ఞానం తోడైతే ఆ సమాజం మారవచ్చు గానీ, మనుషులు జ్ఞానంతో ఉంటే కమ్యూనిస్టు సంబంధాలు మారడం తప్పనిసరి ఎలా అవుతుంది?

'సోషలిజం' గురించి ఎంగెల్స్, అది మారుతూనే ఉంటుందని చెప్పినట్టు, ఈ రచయిత ఇచ్చిన కొటేషన్లు ఇలా ఉన్నాయి:

ఎంగెల్స్: '..... సోషలిస్టు సమాజం అని మనం అంటున్నది మార్పుకు అతీతం కాదు – అని నాకు అన్పిస్తున్నది. ఇతర సామాజిక వ్యవస్థల లాగానే ఈ వ్యవస్థని కూడా నిరంతర చలనంలోనూ, మార్పు లోనూ ఉండే వ్యవస్థగా మనం భావించాలి' (ఈ మాటలు ఎక్కడి నుంచి తీసినవో వివరాలు లేవు. పే. 303)

ఎంగెల్స్: 'చర్చలో పాల్గొన్న ప్రతి వారికీ, సోషలిస్టు వ్యవస్థ, అభివృద్ధి చెందే వ్యవస్థగా గాక, శాశ్వితంగా స్థిరంగా ఉండే వ్యవస్థగా కనిపించింది. ఆ కారణంగా, పంపిణీ విధానం కూడా స్థిరంగా ఉండాలి అన్నట్టు భావించారు' (పే. 303. బెర్లిన్‌లో ఉన్న స్కిమిడ్స్‌కి, ఎంగెల్స్ రాసిన 5-8-1890 నాటి ఉత్తరంలో. మొదటి కొటేషన్ ఇందులోది కాదు.)

'సోషలిజం అభివృద్ధి చెందుతూ ఉంటుంది' అని ఎంగెల్స్ చెపుతున్నాడు. అభివృద్ధి చెందడం అంటే, ఆ వ్యవస్థ ఒక రోజు నించీ, రాజ్యాధికారం తీసుకున్న నాటి నించీ, ఎలా ప్రారంభమైందో అలాగే ఉండడం కాకుండా, అది సోషలిజంగా ఉంటూనే దానిలో లోపాలు అంతరిస్తూ ఉంటాయనీ, ఆ రకంగా అభివృద్ధి చెందుతూ ఉంటుందనీ, చెప్పడం అది. పంపిణీ విషయాల చర్చ సంగతి కూడా అది. పంపిణీ విషయాలు కూడా, సోషలిజంలో, ప్రారంభంలో ఉన్నట్టుగాక, అభివృద్ధి చెందుతాయని చెప్పడం. జీతాల మధ్య తేడాలు తగ్గితే, పాత లోపం కొంత మారినట్టు. పాత శ్రమ విభజన కొంత మారుతూ ఉండడం, ఇంకో లోపం తగ్గడం. కొన్ని ఉచితాలు ఏర్పడి అమ్మడాలూ – కొనడాలూ తగ్గడం, అలా మంచి మార్పులు జరిగినప్పుడల్లా సోషలిజం అభివృద్ధి వేపు మారుతోందని అర్థం.

సోషలిజంలో మార్పు అంటే, అందులో ఉన్న లోపాలు పోతూ, అది అభివృద్ధి చెందుతూ ఉంటుందని అర్థమే గానీ, ఆ సోషలిజమే పూర్తిగా అంతరించి, మళ్ళీ పెట్టుబడిదారీ విధానమే వచ్చి, ఆ తర్వాత రెండో సోషలిజం వచ్చి, మళ్ళీ అది కూడా పోయి, మళ్ళీ మూడో సోషలిజం వచ్చి, అదీ పోయి, అలా, సోషలిజమూ, కేపిటలిజమూ, ఇటూ అటూ మారుతూ ఉంటాయని ఎంగెల్స్ చెప్పాడని అర్థం వస్తుందా? 'మార్పు' అన్నప్పుడు, 'ఏ విషయంలో?' అని చూడాలి. ఎంగెల్స్ చెప్పింది, సోషలిజంలో అభివృద్ధి గురించి. అక్కడ అలా జరగకపోతే, కమ్యూనిజం ఎలా ఏర్పడుతుంది? సోషలిజం తర్వాత కమ్యూనిజాన్ని ఊహిస్తే, అది కూడా పోతూ ఉంటే, దాన్ని మార్క్స్, 'వర్గరహిత (వర్గాలు లేని) సమాజం' గా చెప్పడంలో అర్థం ఏమిటి?

ఈ రచయిత, నెగేషన్ సూత్రం గురించి ఎలా చెపుతారో చూడండి:

'చివరికి భవిష్యత్తు మార్క్సిజానిదే.....' అని ఈ రచయిత (పే. 14) చెప్పిన వాక్యం ఒకటి వున్నా, ముందు మాటలో గానీ, తర్వాత చాప్టర్లలో గానీ, ఈయన వివరణ, మార్క్సిజం ప్రకారం ఎక్కడా సాగలేదు.

దీన్ని చూడండి: 'గతి తార్కిక భౌతిక వాదంలో, నెగేషన్ ఆఫ్ నెగేషన్ అన్న సూత్రం ఒకటుంది. ఉనికిలో ఉన్న ప్రతీదీ తిరస్కరించబడుతుంది. పాతది నశిస్తుంది. దాని స్థానంలో కొత్తది వస్తుంది. అదీ కొంత కాలానికి నశిస్తుంది. తిరస్కరణ, తిరస్కరించబడుతూ ఉంటుంది' (పే. 14).

'ఈ గతి తార్కిక సూత్రం వివరిస్తున్నట్టు. సోషలిస్టు వ్యవస్థ అని మనం భావిస్తున్నది, ఏ కారణాల వల్ల నైతేనేమి, తిరస్కరించబడి, మళ్ళీ పెట్టుబడిదారీ వ్యవస్థ ఒక నూతన రూపంలో వచ్చింది. అంటే, 1917 అక్టోబరు విప్లవంలో కేపిటలిజాన్ని తిరస్కరించిన సోషలిజం, తిరస్కరించబడింది. నెగేషన్ ఆఫ్ నెగేషన్, వాస్తవ చరిత్రలో జరిగింది. ఒక క్రమం అంతమై, అక్కడి నుంచి మళ్ళీ ఒక నూతన క్రమం ప్రారంభమయింది' (పే. 15).

ఈ రకంగా, 'ముందు మాట'లో చెప్పిందే, చిట్ట చివరి మాటలో కూడా సాగింది. దారి పొడుగునా ఇదే సాగింది.

ఈ రచయిత ఇంకా ఇచ్చే వివరాలు చూడండి:

కేపిటలిజం ఎంత స్థిరంగా కనిపించినా, అది ఒక్కటి మాత్రమే మారిపోతుందనీ, కమ్యూనిజం మాత్రం మారదనీ, కమ్యూనిస్టులు భావిస్తారట! అది తప్పు అనీ, రెండూ మారిపోతూనే ఉంటాయనీ, ఒక దాని తర్వాత ఒకటి వస్తూ పోతూ ఉంటాయనీ, ఈ రచయిత అంటారు (పే. 303).

సోవియట్ యూనియన్‌లో అసలు రివిజనిజం ఎలా ప్రవేశిం చిందో చెపుతున్నారు రచయిత: 'సోవియట్ యూనియన్‌లో, కార్మిక వర్గ నాయకత్వాన ఉత్పత్తి శక్తుల పురోగమనం జరిగింది. ప్రజలు దాన్ని 'కార్మిక స్వర్గం' అన్నారు. ప్రపంచమంతా ఆకర్షితురాలైంది. ఉత్పత్తి శక్తుల పురోగమన ఫలితంగా మానవ సంబంధాలలో మార్పులు వచ్చాయి. ఒక నూతన బూర్జువా వర్గం తలెత్తింది. ...... కార్మిక వర్గం ఆ వాస్తవాన్ని గుర్తించలేక పోయింది......' (పే. 304).

ఉత్పత్తి శక్తులు పెరిగిపోయి, అధికోత్పత్తి జరిగితే, ఎవరికీ స్వార్థం ఉండదని కొన్ని సార్లు చెప్పారు. ఇప్పుడు ఉత్పత్తి శక్తులు పెరగడం వల్లే బూర్జువా వర్గం వచ్చింది! ఆ సంగతి కార్మికులు గ్రహించలేకపోయారు. ఆ సంగతి కార్మికులు గ్రహిస్తే, ఏం జరిగేది? – బూర్జువా వర్గం తలెత్తకుండా

చేసేవారే కదా? అంటే కార్మికులు విప్లవ సిద్ధాంతం తెలియకుండా తెలివి తక్కువగా ఉంటేనే పెట్టుబడిదారీ విధానం తలెత్తిందనీ, అలా తలెత్తుతూ ఉంటుంది – అనీ, అర్థమే కదా? కార్మికులు సరైన విప్లవ దృక్పథంతో ఉంటే? అప్పుడు నెగేషన్ సూత్రం ఎలా పనిచేస్తుంది?

ఇంకా చూడండి: 'ఏ గతి తార్కిక సూత్రాలు సోషలిస్టు వ్యవస్థను ఉనికిలోకి తీసుకువచ్చాయో, అవే సూత్రాలు ఆ సోషలిస్టు వ్యవస్థని అంతం చేస్తాయి' (పే. 305).

'రష్యాలో, 1917 లో కేపిటలిజం తిరస్కరించబడింది. 1991 లో, మొదటి తిరస్కరణ మళ్లీ తిరస్కరించబడింది' (పే. 306). రష్యాలో సోషలిజం అంతరించడం, ఆ సూత్రం వల్లే జరిగినట్టూ, అది అలా జరగడమే సహజత్వం అన్నట్టూ, చెప్పడం! ఇక్కడ లెనిన్ కొటేషన్ ఒకటి ఏదో సందర్భంలోది తీసుకొచ్చి ఇచ్చారు. దాన్ని వివరంగా చూస్తే, అది ఒక దోపిడీ దశ పోయి ఇంకో దోపిడీ దశకి సంబంధించినదిగా ఉంటుంది. 'ప్రతీ దోపిడీ దశలోనూ పాత లక్షణాలూ ఉంటాయి. వాటితో పాటు అభివృద్ధీ ఉంటుంది' అని చెప్పింది లెనిన్ కొటేషన్.

ఈ పుస్తకం, చిట్ట చివరి దాకా, తేల్చి చెప్పిన విషయం ఇదీ: 'కాలం చెల్లిన సోషలిస్టు వ్యవస్థ ప్రపంచ వ్యాపితంగా పతనమై నందుకు కమ్యూనిస్టులు దుఃఖించరు. పాత వ్యవస్థని నాశనం చేసే ఒక నూతన వ్యవస్థ ఉనికిలోకి రావడం, అభివృద్ధి చెందడం, ... ఆ వ్యవస్థ కూడా కూలిపోవడం, దాని స్థానంలో మరో నూతన వ్యవస్థ రావడం, ఇదీ నిరంతర పరిణామమని గతి తార్కిక భౌతికవాదులుగా కమ్యూనిస్టులకు తెలుసు' (పే. 401). 'కాలం చెల్లిన సోషలిస్టు వ్యవస్థ....' అన్నారు! అంటే, 'సోషలిస్టు వ్యవస్థ'కి కాలం చెల్లడం జరుగుతుందని! అది తప్పదని! అది నెగేషన్ సూత్రం వల్ల అని! భలే ఉంది సూత్రం!

స్టాలిన్, మావోలు ఇద్దరూ
'నెగేషన్' సూత్రాన్ని వదిలేశారు:

స్టాలిన్, మావోలు ఇద్దరూ, గతి తర్క సూత్రాల గురించి రాశారనీ, కానీ ఆ ఇద్దరూ 'నెగేషన్' సూత్రాన్ని చెప్పకుండా వదిలేశారనీ, ఈ రచయిత ఇలా చెపుతారు: 'ఒక తిరస్కరణ, మరో తిరస్కరణకు దారి తీస్తుంది. ...... ఆసక్తి కలిగించే విషయం ఏమిటంటే, స్టాలిన్, మావోలు, ఈ సూత్రం పూర్తిగా వదిలేశారు' (పే. 282).

నెగేషన్ సూత్రాన్ని స్టాలిన్ ఎందుకు వదిలేసి ఉంటాడో, రచయిత ఇలా ఊహిస్తున్నారు: 'స్టాలిన్, గతి తార్కిక భౌతిక వాదం మీద రాసిన పుస్తకంలో, ఈ తిరస్కరణ .... పూర్తిగా వదిలేశాడు. స్టాలిన్ ఈ తిరస్కరణని ప్రస్తావించకపోవడానికి కారణం బహుశా, ఈ సూత్రాన్ని అంగీకరించినట్లయితే, సోషలిస్టు వ్యవస్థ కూడా తిరస్కరించ బడుతుంది – అన్న అర్థం వస్తుంది కనక కావచ్చు. లేదా .... ఆ కారణాలు తొలిగించి, తిరస్కరణను నివారించ వచ్చునన్న ఆలోచన కావచ్చు' (పే. 307).

ఈ రచయితకి, స్టాలిన్ అంటే చాలా భక్తి. అలాంటప్పుడు, నెగేషన్ సూత్రాన్ని స్టాలిన్ వదిలేశాడని తెలిసిన తర్వాత కూడా, ఈ రచయిత, స్టాలిన్ చేసిన పని మీద దృష్టి పెట్టలేదు. నెగేషన్ సూత్రాన్ని అంగీకరిస్తే, సోషలిజం కూడా పతనమవుతుంది – అనే అర్థంతో అంగీకరించక స్టాలిన్ ఆ సూత్రాన్ని వదిలేసి ఉంటాడని, ఈ రచయిత ఊహించారు. ఈ రచయిత దృష్టిలో, స్టాలిన్ గొప్ప విప్లవకారుడు. అంతటివాడు నెగేషన్ సూత్రాన్ని ఒప్పుకోలేదంటే, ఆ మేధావిని వ్యక్తి పూజతో సహా విశ్వసించే ఈ అనుచరుడు, ఆ సూత్రం గురించి తను కూడా ఆలోచించాలి కదా? కానీ ఈయన అలా చేయలేదు. స్టాలిన్ ఆలోచనకి విలువ ఇవ్వలేదు. నిజానికి, స్టాలిన్ మావోల మీద ఎవరికైనా, ఏ విషయం మీద ఎలాంటి విమర్శలు ఉన్నా, 'సోషలిజాలూ, కమ్యూనిజాలూ కూడా నిల బడవు' అనే అర్థానికి దారితీసే సూత్రాన్ని వాళ్ళు తీసి పారేశారంటే, ఈ విషయంలో ఆ ఇద్దర్నీ చాలా మెచ్చుకోవాలి.

నెగేషన్ సూత్రాన్ని సరిగా అర్థం చేసుకుంటే చేసుకోవాలి. లేకపోతే, దాన్ని మొత్తంగా వదిలెయ్యాలి. ఆ రెండో పని చేసిన స్టాలిన్ మావోలు ఆ సూత్రం విషయంలో తెలివిగా చేశారని నమ్మాలి. ఆ మాత్రం కూడా ఆలోచించని వాళ్ళ తెలివిని సందేహించాలి.

స్టాలిన్, ఇంకేదో అభిప్రాయంలో అలా చేసి ఉంటాడని రచయిత ఇంకో కారణం చెప్పడం ఇంకో వింత! 'ఆ సూత్రాన్ని లొంగదియ్యాలి' అనేదే స్టాలిన్ అభిప్రాయం అయితే, ఆ సూత్రాన్ని వదిలెయ్యకుండా ఇతర సూత్రాలతో పాటే దాన్ని కూడా చూపించి, 'దీన్ని పనిచేయనివ్వకూడదు సుమా! దీన్ని ఫలానా రకంగా నివారించాలి' అని చెప్పేవాడే కదా? స్టాలిన్ ఇంకేదో కారణంతో ఆ సూత్రాన్ని వదిలేసి ఉంటాడని ఈ రచయిత ఊహించిన కారణం మరీ అర్థం లేనిది. సూత్రం అంటే, తప్పనిసరిగా జరిగేదే సూత్రం అవుతుంది. సూత్రాన్ని పని చేయకుండా నివారించాలని స్టాలిన్ దాన్ని వదిలేశాడనడం! అదేదో కుట్టు మిషను అయినట్టూ, దాన్ని కాస్సేపు ఆపినట్టూ!

'మార్క్సిజం' గురించి ఈ రచయిత:

ఈ పుస్తకం, 'మార్క్సిజం' గురించీ, రష్యా చైనాల్లో సోషలిస్టు పాలనల గురించీ, చేసే వాదనలతోనే మొత్తం సాగుతుంది. అన్నీ చూడలేం గానీ, ముఖ్యంగా, 'మార్క్సిజం' గురించి చెప్పింది మాత్రం చూడవలసిందే. ఈ రచయిత, మార్క్సిజం గురించి చెప్పిన చోట ఎక్కడా, 'ఉత్పత్తి సంబంధాలు, సమానత్వ సంబంధాలుగా మారడం' గురించి లేదు. ఎంతసేపూ ఉత్పత్తిశక్తుల గురించి, అవసరాన్ని మించి! మార్క్సిజాన్ని, 'ఉత్పత్తి సంబంధాల సిద్ధాంతం'గా గాక, ఉత్పత్తి శక్తుల సిద్ధాంతంగానే చెప్పడానికి ఈయన ప్రయత్నించారు, ఈ విధంగా: 'మార్క్స్ చెప్పిన శాస్త్రీయ సోష లిజం, కమ్యూనిజం, ఉత్పత్తి శక్తుల అభివృద్ధి మీద ఆధారపడింది. ఉత్పత్తి శక్తులు బ్రహ్మాండంగా పెరిగి, ప్రజలకు అవసరమైన దానికన్నా ఎక్కువ ఉత్పత్తి చేసే స్థితిలో ఉన్నప్పుడే సోషలిజం, కమ్యూనిజం, సాధ్యమవుతుంది' (పే. 287).

అవసరాన్ని మించిన ఉత్పత్తి చేసుకుంటే, సమస్య ఉండదు, రివిజనిజం ఉండదు – అని! ఆ అధికోత్పత్తి అంతా చేసేది, కార్మికులే. డైరెక్టర్లు కాదు, అధికారులు కాదు. – దీని మీద చర్చ ఇంకా అనవసరం.

ఈ రచయిత మార్క్సిజాన్ని ఎలా అర్థం చేసుకున్నారో, ఈ మాటల వల్ల కొంతైనా తెలుస్తుంది:

'మార్క్సిజంలో మూడో అంశం, అదనపు విలువ సిద్ధాంతం' (పే. 282).

'(1) భౌతిక వాదం, (2) గతి తార్కికం, (3) అదనపు విలువ' (పే. 281).

భౌతిక వాదాలూ, గతి తర్కాలూ, ఏ సైన్సు విషయంలో అయినా ఉంటాయి. ఆ లక్షణాలు మార్క్సిజానికి కూడా ఉండొచ్చు. మార్క్సిజం ప్రత్యేకత, ఆ లక్షణాలు కాదు. మార్క్సిజం ఒక సిద్ధాం తంగా అవడానికి మౌలిక కారణం, 'శ్రామికవర్గ అదనపు విలువని' గ్రహించడమే. అదే, మొట్ట మొదటి విషయం. 'అదనపు విలువ' సంగతి తెలియడం వల్లే, 'శ్రమ దోపిడీని' అర్థం చేసుకోవడం సాధ్యమైంది. శ్రామిక వర్గం, దోపిడీ నుంచి విముక్తి చెందడానికే, దోపిడీ వర్గంతో పోరాటం అవసరమని తేలింది. మార్క్సిజానికి, 'అదనపు విలువని గ్రహించడమే' మొదటి విషయం – అని తెలుసు కోకపోతే, అసలు మార్క్సిజం గురించి తెలుసుకున్నట్టు కాదు.

ఈ రచయిత వివరించే ఇంకో అభిప్రాయం:

'మార్క్సిజం అనేది, పరిపూర్ణ సిద్ధాంతం కాదు. మార్క్సిజం, మతం లాగ, అంతిమ సత్యాన్ని ఆవిష్కరించదు' (పే. 286).

ఏ మతం అయినా, 'సృష్టికర్త' ని చెపుతుంది. అదే దాని అంతిమ సత్యం – అనుకుందాం. మార్క్సిజం చెప్పే అంతిమ సత్యం, 'శ్రమ దోపిడీ నుంచి విముక్తి'. అది జరిగినప్పుడు, అదే 'సమానత్వం' అవుతుంది. అదే 'కమ్యూనిజం' అవుతుంది.

మార్క్సిజం, పరిపూర్ణం కాదా? మార్క్సిజం, ఏం చెప్పింది అసలు?

అంత వరకూ మానవ సమాజం గ్రహించలేని సత్యాన్ని గ్రహించి చెప్పింది. మానవ సంబంధాలు వేలాది సంవత్సరాల నించీ ఎంత అన్యాయంగా సాగుతున్నాయో, ఆ అన్యాయానికి గురి అయ్యే వర్గం ఎలా విముక్తి చెందాలో, చెప్పింది. దోపిడీ వర్గాన్ని కూడా శ్రమ చేయడంలోకి దించినప్పుడు, అది సమ సమాజం అవుతుందని చెప్పింది. – మొత్తం మానవ సంబంధాల భూత – వర్తమాన – భవిష్యత్తులన్నీ చెపితే, అది పరిపూర్ణం కాదా?

తర్వాత, ఇంకా కావలసిన వివరాల్ని తర్వాత వాళ్ళు ఎలా తెలుసుకుంటారంటే, మొదట చెప్పిన విషయాల మీద ఆధారపడు తూనే తెలుసుకుంటారు. మొదటి విషయాలతో సంబంధం లేకుండా తర్వాత విషయాలు ఉండవు. కమ్యూనిజాన్ని నిర్మించ దానికి కావలసినదంతా 'అదనపు విలువ' ని గ్రహించడంలోనే ఉంది. అంత కన్నా తెలియవలసిందేమీ ఉండదు.

ఏ సైన్సు అయినా, ఏ విషయాన్ని కనిపెట్టిందో అది ఎప్పటికీ మారకపోతే, అది పరిపూర్ణ సత్యమే. ఆ సత్యానికి ఇతర వివరాలు చేరుతూ ఉంటే, అవన్నీ, మొదటి సత్యం మీద ఆధారపడే వివరాలు మాత్రమే. కొత్త వివరాలు తెలిసినా, మొదటి సత్యం అసంపూర్ణం అవదు.

ఈ రచయిత ఇంకా మార్క్సిజం గురించి, 'సమాజం, సోషలిజం దిశగా పయనిస్తోంది అన్నంత వరకే మార్క్స్ చెప్పాడు గానీ, అంత కన్నా వివరంగా సోషలిజం గురించి చెప్పలేదు' అంటారు (పే. 313).

మార్క్స్ చెప్పిందేమిటో తెలిసివున్న ఏ మనిషీ, ఆ మాటలు అనరు. దోపిడీ జరుగుతోందని గ్రహించి, దాన్ని తీసెయ్యాలనీ; మారకం విలువ సంబంధాలలో వున్న హేతు విరుద్ధతని గ్రహించి, ఆ సంబంధాల్ని తీసెయ్యాలనీ; ప్రతీ మనిషీ పనిచేయడమూ – ఉత్పత్తుల్ని అవసరాల్ని బట్టి వాడుకోవడమూ చేయగలిగే 'ఉపయోగపు విలువ సంబంధాలు' కొనసాగడమే హేతుబద్ధత గల సమానత్వం అనీ; – అలా, అన్నీ చెప్పాడు. మానవ సంబంధాల గురించి చెప్పడానికి ఇంకేమీ ఉండదు. 'సోషలిజాలూ, కమ్యూనిజాలూ నిలబడవు, పోతూ ఉంటాయి' అని మార్క్స్ చెప్పలేదు కాబట్టి, అంత గొప్ప విషయం చెప్పకపోవడం వల్ల మార్క్సిజం పరిపూర్ణం కాదని, అసంపూర్ణం అని, ఈ రచయిత విమర్శ!

ఏ పుస్తకం చదివినప్పుడైనా, అందులో ఏది తప్పో, ఏది ఒప్పో, గ్రహించగలిగితే, మన జ్ఞానం సరిగానే ఉందని అర్థం.

మీరు మళ్ళీ వచ్చి ఏం ప్రయోజనం?

'మేం మళ్ళీ వస్తాం' అన్న కేక చెవుల పడ్డందుకే ఈ పుస్తకం మీద నాకు మొదటి నించీ ఆసక్తి! కానీ, తీరా అంతా చూశాక, 'అయ్యో, మీరు మళ్ళీ వచ్చి మాత్రం ఏం ప్రయోజనం? మళ్ళీ మళ్ళీ పోయే సోషలిజం కోసం, ఎవరైనా సాహసాలు చేయడం ఎందుకు? అసలు మీరీ పుస్తకం చదవండి! మీ ఉత్సాహాలు మీరే వదిలేసుకుంటారు' అని ఆ విప్లవకారులకు చెప్పాలనిపించింది.

రష్యా చైనాల్లో సోషలిజాలు ఎందుకు పోయాయో అసలైన కారణం తను చెపుతానని ఈ రచయిత మొట్ట మొదట ముందు మాటలోనే వాగ్దానం చేశారు. కారణం చెప్పారు కూడా. ఆ కారణం ఏమిటో ఇప్పుడు మనకు తెలుసు. నెగేషన్ సూత్రం అలా చేసిందని! ఆ సూత్రం వల్ల, ఏ వ్యవస్థ అయినా పోవలసిందే కాబట్టి, ఆ సోషలిజాలు పోయాయి – అని! కారణం అదే అయితే, 'మేం మళ్ళీ వస్తాం!' అని విప్లవకారుల కేకలెందుకు?

కానీ, విప్లవోత్సాహాన్ని వదిలేసుకోవాలన్నా ఒకంతట అది వదలదు. అది నిజమే. అయితే, మొదట ఒకలా చెయ్యాలి. మార్క్స్ 'కాపిటల్' ని శ్రద్ధగా, చర్చలు చేసుకుంటూ, అర్థం చేసుకుంటూ, మళ్ళీ మళ్ళీ చదువుకోవాలి. ఎప్పుడైనా, మనం నేర్చుకున్నదే మనం చెప్పగలం. మన విప్లవ జ్ఞానంతోనే మనం విప్లవాలు చేయగలం. కార్మిక ప్రజలందరికీ, శ్రమ దోపిడీ జరగడం గురించీ, విలువ అంటే ఏమిటో, జీతాలంటే ఏమిటో, నిరుద్యోగాలంటే ఏమిటో, అన్నీ చెప్పాలి. నిజంగా జనాలందరికీ ఆ విషయాలు తెలిస్తే, దోపిడీ వర్గం మీద ఆగ్రహంతో ఊగిపోతారు. శ్రామికవర్గ జనం అలా నేర్చుకుంటే, రివిజనిజాల్ని ఎందుకు రానిస్తారు? ఏది ఏమిటో జనం గ్రహించకపోబట్టే కదా రివిజనిజాలకు చోటు దొరికేది? కాబట్టి, జనాలకు నేర్పే పని చెయ్యాలి మొదట.

అది చేసే ఉత్సాహం లేకపోతే, అప్పుడేం చేయగలం? 'మళ్ళీ వస్తాం' అని ఇప్పుడు వచ్చినా, 'మళ్ళీ పోతాం' అని వెళ్ళవలసిందే కదా? ఎందుకీ రానూ పోనూ తిరుగుళ్ళు? పెట్టుబడిదారుల దగ్గిరే పీసు వర్కులు చేసుకుంటూ, సంపాదన పెంచుకుంటూ, బైటికి పోయాక సిగరెట్లు కాల్చుకుంటూ, పేకాట లాడుకుంటూ, సారాయిలు తాగుకుంటూ, ఉన్న రోజున తిని, లేని రోజున మాని, అలా బతికెయ్యాలి! కమ్యూనిజాలే ఎగిరిపోతోంటే మన బతుకులు ఒక లెక్కా? బానిసలు ఎదురు తిరిగారంటే, వాళ్ళకి బానిసత్వం అన్నా పోయింది. ఇప్పుడు మనం ఎదురు తిరిగితే, మనకి వచ్చేదేముంది? సోషలిజం ఎలాగా నిలబడదు. దాన్ని ఎన్నిసార్లు తెచ్చినా, దాని పతనాలూ, నెగేషన్లూ, రివిజనిజాలూ, తప్పవు కదా?

పోనీ, స్టాలినూ మావోలు చేసినట్టు, నెగేషన్ సూత్రాన్ని మనం కూడా వదిలేద్దామా? దాన్ని వదిలేస్తే, 'సోషలిజం కూడా పోతుంది' అని భయపడక్కరలేదు. విప్లవకారుల సాహసాలతో సోషలిజం తప్పకుండా నిలబడుతుంది.

ఈ పుస్తకంలో చిట్ట చివర, విప్లవకారులు, 'మేం మళ్ళీ వస్తాం! కొత్త రక్తంతో కోట్ల మందిమై, మేం తిరిగి వస్తాం!' అని పాడుతున్నారు (పే. 411). ఇలాంటి పాటల్ని, ఈ రచయితే ఇంతకు ముందు విమర్శించారు. కానీ ఇప్పుడు ఆ పాటలే పాడించారు.

'కమ్యూనిజానికి గర్వించదగ్గ గతమే కాదు, ఉజ్వలమైన భవిష్యత్తు కూడా ఉంది' అని కూడా అంటున్నారు. (పే. 411)

కమ్యూనిజానికి, 'గతం' ఏమిటి? అది ఇంత వరకూ ఎప్పుడూ ఎక్కడా భూమి మీద లేదు. సోషలిజాలే పోతే, కమ్యూనిజం ఎప్పుడు వచ్చింది?

కమ్యూనిజానికి 'ఉజ్వలమైన భవిష్యత్తు' ఉంటే, కేపిటలిజానికి మాత్రం అదే రకం భవిష్యత్తు ఉండదా? నెగేషన్ సూత్రం ఏం చెప్పిందో ఈ రచయిత మరిచిపోయారా? ఆ రెండు ఇజాలూ ఒక దాని తర్వాత ఒకటి వస్తూనే ఉంటాయని ఈయనే చెప్పారు కదా? మరి, కమ్యూనిజానికి ఉజ్వలమైన భవిష్యత్తేమిటి?

ఈ రచయిత, ముందు మాటకి చివర్లో, 'చదవండి! చర్చించండి!' అనే మాటలు పెట్టి ముగించారు. ఇక్కడ చర్చించ వలసింది స్టాలిన్ మావోల గురించి కాదు. ఆ చర్చలు చేయడానికి సరిపోయే, నమ్మగలిగే, ఆధారాలు కనపడే సమాచారమేమీ లేదు ఇక్కడ. కాబట్టి, చర్చలు ఆ ఇద్దరి మీద కాదు. అంతా 'సోషలిజం' మీదే సాగాలి. రష్యా చైనాల్లో అది ఎందుకు పోయింది? విప్లవ పార్టీల తప్పుల వల్ల పోయిందా, నెగేషన్ సూత్రం వల్ల పోయిందా? – అది తేల్చుకోవాలి మనం.

పార్టీ తప్పుల వల్ల పోయినట్టు తేల్చుకుంటే, 'సరే, ఈసారి బాగా చేసుకుందాం' అనుకోవాలి. మార్క్సిజం బాగా నేర్చుకోవాలి. అలా గాక, నెగేషన్ సూత్రం వల్లే అలా జరిగింది అని ఆ సూత్రానికి అలాంటి అర్థమే చెప్పుకుంటే, ఇక సోషలిజం కోసం ప్రయత్నాలు దండగ. అది ఎలాగా పోతుంది. మళ్ళీ మళ్ళీ పిచ్చి పనులెందుకు? యజమానుల దగ్గిర సేవలు చేసుకుంటూ బతికేయాలి. మరి, తేల్చుకోవాలి ఏదో ఒకటి.

నెగేషన్ సూత్రానికీ, సోషలిజానికీ, ఎవ్వరూ ఇవ్వలేకపోయిన అర్థాలు ఈ రచయిత ఇచ్చారు! వాటితో ఏకీభవించాలా, స్టాలిన్ మావోలు చేసినట్టు, మనం కూడా ఆ అర్థాలు వదిలెయ్యాలా? అదీ చర్చించాలి!

(ముగిసింది)

(రచయిత బహు గ్రంథకర్త, మార్క్స్ 'పెట్టుబడి' పరిచయకర్త) వీ

బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు

తమిళనాడులోని తంజావూరు జిల్లా కుంభకోణం ప్రాంతంలోని బాణసంచా ఫ్యాక్టరీలో నవంబర్ 1న పేలుడు సంభవించి 9 మంది కార్మికులు చనిపోగా 14 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఫ్యాక్టరీలో కార్మికులు పనిచేస్తుండగా పెద్ద శబ్దం వచ్చి ఫ్యాక్టరీలో పెద్దఎత్తున మంటలు లేచాయి. ఈ ఘటనలో 9 మంది మరణించగా 14 మంది తీవ్రంగా గాయపడ్డారు.

'శ్రీవారి పాదాల చెంత' రాకెట్

అంగారక యాత్ర విజయవంతంగా సాగాలని పిఎస్ఎల్వి-సి25, ఉపగ్రహం నమూనాలతో ఇస్రో చైర్మన్ రాధాకృష్ణన్ బృందం నవంబర్ 4న స్వామివారి సుప్రభాత సేవకు హాజరైంది. వాటిని శ్రీవారి పాదాల చెంత ఉంచి అశీస్సులు పొందిన తర్వాత మీడియాతో మాట్లాడారు. తరువాత శ్రీకాళహస్తీశ్వరుడ్ని కూడా ఇస్రో బృందం దర్శించుకుంది. తర్వాత సుళ్లూరు పేటకు చేరుకుని అక్కడి గ్రామదేవత చెంగాళమ్మను దర్శించుకుంది. తిరుమలేశుని పాదాల ముందుంచి ఆశీస్సులు కోరడం మూఢనమ్మకమేనని భారతరత్న సిఎన్ఆర్ రావు బెంగళూరులో నవంబర్ 23 మీడియాతో మాట్లాడుతూ అన్నారు.

సోని సోడికి బెయిల్

మావోయిస్టులకు నిధులు సేకరించిందన్న ఆరోపణలతో అరెస్టైన చత్తీస్‌గడ్ గిరిజన ఉపాధ్యాయురాలు సోని సోడికి సుప్రీంకోర్టు నవంబర్ 11న బెయిల్ మంజూరు చేసింది. ఎస్ఆర్ కంపెనీ నుంచి తాను నిధులు సేకరించిన్నట్లు చేసిన ఆరోపణలు అసత్యమని, తనను అన్యాయంగా ఈ కేసులో ఇరికించారని అన్నారు. గత జూలైలో సోనీకి చత్తీస్‌గడ్ హైకోర్టు బెయిల్ నిరాకరించగా, ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించింది. తనపై పోలీసులు లైంగికదాడి జరపడమేకాక క్రూరంగా హింసించారని ఆమె అన్నారు.

బిఎస్ఎఫ్ జవాన్ల వాహనం పేల్చివేత

చత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు బిఎస్ఎఫ్ జవాన్లు ప్రయాణిస్తున్న వాహనాన్ని నవంబర్ 13న పేల్చివేశారు. ఈ ఘటనలో ఇద్దరు బిఎస్ఎఫ్ జవాన్లతో పాటు ఒక డ్రైవర్ మృతిచెందారు. ఇద్దరు గాయపడ్డారు. ఎన్నికల విధులు ముగించుకొని తిరిగి వస్తున్న బిఎస్ఎఫ్ జవాన్ల వాహనాన్ని మావోయిస్టులు పేల్చివేశారు.

కామన్‌వెల్త్‌కు హాజరుకాని ప్రధాని

శ్రీలంకలో నవంబర్ 15,16 తేదీల్లో జరిగిన కామన్‌వెల్త్ దేశాధినేతల సదస్సు (చోగమ్) కు ప్రధాని మన్‌మోహన్ సింగ్ హాజరు కాలేదు. తమిళ రాజకీయ పార్టీల ఒత్తిడి మేరకు ఆయన వెనక్కి తగ్గారన్నారు. ఎండిఎంకె అధినేత వైగో కామన్‌వెల్త్ కూటమి నుంచి శ్రీలంకను బహిష్కరించాలని డిమాండ్ చేశారు.

భారతరత్నలు

ప్రముఖ రసాయన శాస్త్రవేత్త, ప్రధాని శాస్త్రీయ సలహామండలి అధ్యక్షుడు చింతామణి నాగేశ రామచంద్రరావు (సిఎన్ఆర్ రావు, 79)తో పాటు క్రికెటర్ సచిన్ రమేష్ టెండూల్కర్ (40)కు భారత ప్రభుత్వం అత్యున్నత పురస్కారమైన 'భారత రత్న'ను నవంబర్ 16న ప్రకటించింది. సిఎన్ఆర్ రావు 1400కు పైగా పరిశోధన పత్రాలు ప్రచురించారు. 45 గ్రంథాలు రాశారు. ఆయన పద్మశ్రీ, పద్మవిభూషన్ సహా పలు జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నారు. రెండున్నర దశాబ్దాల్లో టెండూల్కర్ 200 టెస్టుల్లో 51 సెంచరీలతో 15,921 పరుగులు, 463 వన్డేల్లో 49 సెంచరీలతో 18,426 పరుగులు సాధించి అరుదైన రికార్డు సాధించాడు.

కర్ణాటకలో రోడ్డు ప్రమాదం

కర్ణాటక రాష్ట్రంలోని బెల్గాం – బాగల్‌కోట్ రహదారిలోని పైహాలకి వద్ద నవంబర్ 16న జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం జరిగి 22 మంది మరణించారు. 33 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను బెల్గాం అసుపత్రికి తరలించారు. యాద్గిల్ జిల్లా ఉప్పులదిన్ని, మావినగిడ, జుమాలపూర తండాలకు చెందిన 54 మంది కూలీలు టెంపోలో మహారాష్ట్రలోని సావంతవాడికి కూలిపనికి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది.

ఖైదీలు జైలు నుండి పోటీ చేయొచ్చు

వివిధ కేసుల్లో జైలు, పోలీసు కస్టడీలో ఉన్న వ్యక్తి ఎన్నికల్లో పోటీ చేయడానికి వీలుగా ప్రజా ప్రాతినిధ్య చట్టానికి(ఆర్‌పిఎ) చేసిన సవరణను సుప్రీంకోర్టు నవంబర్ 19న ఆమోదించింది. దీంతో ఇకపై క్రిమినల్ కేసుల్లో కస్టడీలో ఉండి విచారణ ఎదుర్కొంటున్న వ్యక్తులకు ఓటు హక్కు ఉందన్న ఆర్‌పిఎ చట్ట సవరణ వల్ల అలాంటి వారిని ఎన్నికల్లో పోటీకి సుప్రీం కోర్టు అనుమతించడంతో రాజకీయ పార్టీలకు చాలా ఉపశమనం కలిగింది.

కేంద్ర సమాచార కమిషనర్లు

కేంద్ర సమాచార కమిషనర్లుగా ప్రొఫెసర్ మాడభూషి శ్రీదర్, యశోవర్ధన్ అజాద్, షరత్ సబర్వాల్, ముంజుల పరావర్, ఎం.ఎ. ఖాన్ యూసుఫ్‌లతో ప్రధాన కమిషన్ దీపక్ సందు నవంబర్ 22న ఢిల్లీలోని సిఐసి కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేయించారు.

ప్రపంచ చెస్ విజేత కార్ల్‌సన్

భారత గ్రాండ్ మాస్టర్ విశ్వనాథ్‌ఆనంద్‌పై నార్వేకి చెందిన మాగ్నస్ కార్ల్‌సన్ ప్రపంచచెస్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నాడు. ట్రోఫితోపాటు రు. 9.90 కోట్ల నగదును ఇచ్చారు. నవంబర్ 25న జరిగిన బహుమతి ప్రధానోత్సవంలో తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత ఈ నగదును అందించారు. రన్నరప్‌గా నిలిచిన ఆనంద్‌కు రు. 6.03 కోట్లు నగదుతో పాటు, రజత పతకాన్ని అందించారు. ఈ చాంపియన్‌షిప్‌లో ఐదుసార్లు ఆనంద్‌ను 6.5, 3.5 తేడాతో కార్ల్‌సన్ ఓడించి విజయం సాధించారు.

ఐద్వా జాతీయ మహా సభలు

అఖిల భారత ప్రజాతంత్ర మహిళాసంఘం (ఐద్వా) 10వ జాతీయ మహాసభలు ఉత్తరప్రదేశ్‌లోని బుద్ధగయలో నవంబర్ 21 నుంచి 25 వరకు జరిగాయి. ఈసభలో ఐద్వా పరువు, కుల దురహంకార హత్యలను నేరాలను అరికట్టేందుకు సమగ్రమైన చట్టం తీసుకురావాలని డిమాండ్ చేసింది. ఐద్వా జాతీయ అధ్యక్షురాలిగా మాలిని భట్టాచార్య, ప్రధాన కార్యదర్శిగా జగమతి సంగ్వాన్ ఎన్నికయ్యారు. వీ

రష్యాలో విమాన ప్రమాదం

రష్యాలోని టాటాస్థాన్‌లోని కాజన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో నవంబర్ 18న విమాన ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 44 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది చనిపోయారు. విమానం అతి వేగంతో రన్‌వేను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని ఆ దేశ అత్యవసర మంత్రిత్వ శాఖ తెలిపింది.

మాల్దీవుల అధ్యక్షుడి ఎన్నిక

మాల్దీవుల దేశ నూతన అధ్యక్షుడిగా అబ్దుల్లా యామీన్ ఎన్నికయ్యారు. నవంబర్ 16న జరిగిన రౌండ్‌టేబుల్ ఎన్నికల్లో అబ్దుల్లా యామీన్, మాజీ అధ్యక్షుడు మొహమ్మద్ నషీద్‌పై పోటీచేసి 51.39 శాతం వోట్లు సాధించి విజయం పొందాడు. ఇతను మాజీ నియంత మొహమ్మద్ గయూమ్‌కు సోదరుడు. నషీద్‌కు 48.61 శాతం వోట్లు వచ్చాయి. ఈ ఎన్నికలు రెండు దశల్లో జరిగాయి.

సైనికులకు మరణశిక్ష

బంగ్లాదేశ్‌లోని ఢాకా మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు 152 మంది సైనికులకు మరణశిక్ష విధిస్తూ నవంబర్ 5న తీర్పునిచ్చింది. 2009లో సైనిక తిరుగుబాటులో జరిగిన హత్యకాండలో 74 మంది చనిపోయారు. ఈ హత్యకాండపై విచారణ చేపట్టిన బంగ్లాదేశ్ ప్రభుత్వం 846 మందిని నిందితులుగా గుర్తించి, వారిలో 271 మందిని నిర్దోషులుగా విడిచి పెట్టగా, 157 మందికి జీవిత ఖైదుగా, 152 మందికి మరణ శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చింది. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద క్రిమినల్ కేసుగా నమోదైంది.

అమెరికా రహస్య పత్రాలు

అమెరికా భద్రత సంస్థకు సంబంధించిన 2 లక్షల రహస్య పత్రాలను ఎడ్వర్డ్ స్నోడెన్ నవంబర్ 15న మీడియాకు లీక్ చేశాడని ఆ సంస్థ అధినేత జనరల్ కైతు అలెగ్జాండర్ తెలియజేశారు. స్నోడెన్ లీక్ చేసిన పత్రాల వలన అమెరికా ప్రతిష్టకు తీవ్ర నష్టం జరిగిందని ఆయన తెలిపారు. స్నోడెన్ లీక్ చేసిన రహస్య పత్రాల్లో జర్మనీ చాన్స్‌లర్ అన్‌జలా మెర్కెల్ సెల్ ఫోన్‌ను టాప్ చేయడం ఉండడం వలన ఆ దేశం తీవ్ర నిరసన తెలియజేసింది.

యుద్ధ నేరాలపై విచారణ

శ్రీలంక సైన్యం ఎల్‌టిటిఇతో పోరు చేసినప్పుడు మానవహక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డదని బ్రిటన్ ప్రధాని డేవిడ్ కామెరన్ నవంబర్ 16న జరిగిన కామన్వెల్త్ దేశాధినేతల సదస్సు సందర్భంగా మాట్లాడారు. శ్రీలంక ప్రభుత్వంపై యుద్ధ నేరాలకు సంబంధించిన విచారణ చేపట్టాలని, 2014 మార్చ్ నాటికి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. శ్రీలంక ప్రభుత్వం విచారణ చేపట్టకపోతే బ్రిటన్ ఐక్యరాజ్యసమితిలో ఉన్న హోదాను ఉపయోగించుకొని అంతర్జాతీయ స్వతంత్ర విచారణ జరిగేలా చూస్తుందన్నారు.

బాగ్దాద్‌లో బాంబు పేలుళ్లు

బాగ్దాద్ నగరంలోని మార్కెట్లలో, కేఫులలో, థియేటర్లలో వరుసగా జరిగిన బాంబు పేలుళ్లలో 34 మంది చనిపోయారు. 70 మందికి పైగా గాయపడ్డారు. చనిపోయిన వారిలో 12 మంది తీవ్రవాదులు కూడా ఉన్నారు.

ఇరాన్ అణు ఒప్పందం

ఇరాన్ అణు కార్యక్రమంపై స్వయం నియంత్రణ దిశగా ఐక్యరాజ్యసమితిలోని శ్వాశత సభ్య దేశాలైన అమెరికా, రష్యా, ఫ్రాన్స్, చైనా, ఇంగ్లండ్‌తో పాటు జర్మనీతో కూడా (పి 5+1) నవంబర్ 24న ఒక చారిత్రక ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం ప్రకారం ఐక్యరాజ్యసమితి ఇరాన్‌పై విధించిన ఆంక్షలు కొన్ని సడలిపోతాయి. ఈ ఒప్పందాన్ని భారత్‌తో సహా ఐక్యరాజ్యసమితిలోని మెజారిటీ సభ్య దేశాలు స్వాగతించాయి.

ఫిలిప్పైన్స్‌లో తుఫాన్

ఫిలిప్పైన్స్‌లో హయన్ తుఫాన్ వలన పది వేల మందికి పైగా చనిపోయారని, లక్షలాది మంది నిర్వాసితులు అయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ ఎల్మర్ సోరియా అధికారికంగా తెలిపారు. తుఫాన్ వచ్చిన ప్రాంతాల్లో 70-80 శాతం ఇండ్లు, ఇతర భవనాలు కూలిపోయాయి.

జీవం పుట్టుక

అమెరికాలోని వాషింగ్టన్‌లోని టెక్సాస్ టెక్ యూనివర్సిటీకి చెందిన భారత సంతతికి చెందిన బెంగాలీ శాస్త్రవేత్త శంకర్ చటర్జీ భూమిపై జీవం పుట్టుకను, దాని పరిణామ క్రమాన్ని కనుగొన్నారు. గ్రీన్‌ల్యాండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా దేశాల్లో లభించిన అత్యంత పురాతన శిలాజాలను అధ్యయనం చేసి, దాదాపు 400 కోట్ల సంవత్సరాల క్రితం భూమిని ఢీకొన్న గ్రహశకలాల ప్రభావంతోనే జీవం పుట్టిందని తెలిపారు. మొదట ఏకకణ జీవులు పుట్టి, పరిణామ క్రమంలో అనేక రకాలుగా రూపాంతరం చెందాయని తెలిపారు.

గ్రీస్ విద్యార్థి వార్షికోత్సవాలు

గ్రీస్ మాజీ సైనిక నియంతకు వ్యతిరేకంగా జరిగిన విద్యార్థి ఉద్యమం 40వ వార్షికోత్సవం సందర్భంగా నవంబర్ 18న ఎతెన్స్ నగరంలో వేలాది మంది విద్యార్థులు బారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న పొదుపు పథకాల విధానాలపై తీవ్ర నిరసనలు తెలియజేశారు. దేశం అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) షరతులకు తలొగ్గొద్దని డిమాండ్ చేశారు.

నేపాల్‌లో ప్రచండకు ఓటమి

నేపాల్ రాజ్యాంగ సభకు జరిగిన ఎన్నికల్లో నేపాల్ మావోయిస్ట్ నేత ప్రచండ నేతృత్వంలోని నేపాల్ కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఎన్) ఘోర పరాజయాన్ని పొందింది. దీంతో ఈ ఎన్నికలలో అవకతవకలు జరిగాయనీ, ఎన్నికల ఫలితాలను అంగీకరించమని నేపాల్ మావోయిస్ట్ పార్టీ నాయకుడు ప్రచండ నవంబర్ 21న ప్రకటించారు. గత ఏడు సంవత్సరాలుగా నేపాల్‌లో రాజకీయ ప్రతిష్ఠంభన కొనసాగుతున్నది. ఈకాలంలో ఏర్పడిన ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని రూపొందించ లేకపోయాయి.

బ్యాంకాక్‌లో నిరసనలు

బ్యాంకాక్ రాజధాని థాయిల్యాండ్ నగరంలో నవంబర్ 25న ప్రధాని ఇంగ్లక్ షినవత్రాకు వ్యతిరేకంగా, ప్రజా వ్యతిరేక బిల్లు అయిన అమ్నెస్టికి వ్యతిరేకంగా ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల ముందు తీవ్ర నిరసనలు చేస్తూ ప్రధాని తక్షణం రాజీనామా చేయాలని ఉద్యమకారులు డిమాండ్ చేశారు. వీ

వీక్షణం 2013 సూచిక

వీక్షణం సూచిక

మే 2013 — **సంచిక : 142**

పాఠకుల వీక్షణం
ఎవరిదీ అపార ఖనిజ సంపద? (సంపాదకీయం)
మరొక అమానుష అత్యాచారం, మళ్లీ ఉరి కోర్కెలు..; ఉత్తర కొరియాపై సామ్రాజ్యవాద దాడి (సంపాదకీయ వ్యాఖ్యలు)
కొత్త పుస్తకాలు / సి.డి.లు
ఈనేల – సి. రాజశేఖర్, ఎ. మల్లేశ్
విద్యుత్ సంక్షోభానికి కారణాలు – ఏంపెల్లి భాస్కర్
నొవార్టిస్‌కు సుప్రీంకోర్టు చెంపదెబ్బ – పి.వి. రమణ
అమరత్వానికి అటూ ఇటూ – వరవరరావు
ఢిల్లీ అత్యాచార సంఘటన, నిరసనలు – డా. ఎ. సునీత
కొరియా ద్వీపకల్పంలో రణగర్జనలు – ఎ. నర్సింహారెడ్డి
పిల్లల అనారోగ్యానికి అద్దం పట్టిన కాగ్ – డా. నళిని
ఆధార్ కార్డుల జారీ – తీరుతెన్నులు – చిమ్మె జాన్ బర్నబాస్
సామ్రాజ్యవాద ముట్టడిలో దండకారణ్యం – దబ్బేటి మహేష్
చత్తీస్‌గఢ్ పెట్టుబడులు – అభివృద్ధి బూటకం – విశ్వం
కోరుకొండ గ్రామాలపై గ్రీన్‌హంట్ దాడులు – కొర్ర జ్యోతి
మహిళలపై ప్రపంచీకరణ ప్రభావం – తోట జ్యోతిరాణి
రెండు సదస్సులు – ఎన్నో ఆశాసూచికలు – ఎన్. వేణుగోపాల్
భూమి వేట – కాకినాడ సెజ్ – హేమా వెంకట్రావ్
గల్ఫ్ బాధితులు – ఒక అధ్యయనం – బి.వి.ఎస్. స్వామి
భగత్‌సింగ్ నుంచీ వేలాడుతున్న ఉరితాడు – ఆకుల భూమయ్య
రష్యా విప్లవంలో కార్మికులు, రైతులు – కె. నరేంద్రమోహన్
చావెజ్ దృఢమైన సామ్రాజ్యవాద వ్యతిరేకి – జి. సత్యనారాయణ రెడ్డి
ఇరుగు–పొరుగు – వై. రామచంద్రం
భూగోళం – వీరబ్రహ్మాచారి, సి. రాజశేఖర్
అసహజ మరణాలు – వై. రామచంద్రం

జూన్ 2013 — **సంచిక : 143**

పాఠకుల వీక్షణం
దొంగల బృందంలో సభ్యుల వ్యక్తిగత బాధ్యత (సంపాదకీయం)
బహుళజాతి సంస్థల సేవలో భారత సుప్రీంకోర్టు; పాకిస్తాన్ కొత్త ప్రభుత్వం ఏం సాధిస్తుంది? (సంపాదకీయ వ్యాఖ్యలు)
కొత్త పుస్తకాలు / సి.డి.లు
ఈనేల – ఎ. మల్లేశ్
ఆంధ్రప్రదేశ్ – కప్పల తక్కెడ రాజకీయాలు – ఎడ్ల పోచయ్య
ధరల రైలు పరుగులు – వి. హనుమంతరావు
గ్రామసభలకే అత్యున్నత అధికారం – పి.వి. రమణ
ఎడ్సమెట్ట హత్యాకాండ – గ్లాడ్‌సన్ డంగ్ డంగ్
మళీ నెత్తుటి మడుగులో విత్తనాల పండుగ – వరవరరావు
రాజ్యాంగ వ్యతిరేక, అరాచక రాజ్యం – సుప్రీంకోర్టు తీర్పు
కూడంకుళం – సుప్రీంకోర్టు తీర్పు – పి. వరలక్ష్మి
రక్తం కారడమే, ముకలు విరగడమే హింస కాదు – చెరుకూరి సత్యనారాయణ
న్యాయ వ్యవస్థ పటిష్టత ఎప్పుడు? – చిమ్మె జాన్ బర్నబాస్
భారత – చైనా సరిహద్దు సమస్య – జి. సత్యనారాయణ రెడ్డి
మన దుస్తులకు అంటిన రక్తం, కన్నీళ్లు – సి. రాజశేఖర్
కార్పొరేట్ గుప్పెట్లో ఆదివాసుల హక్కులు – ఎ. నర్సింహారెడ్డి
బయ్యారం ఉక్కు – ఆదివాసుల హక్కు – పూకే రామకృష్ణ
కేశవరెడ్డి నవలల్లో వలసపాలన–భూస్వామ్యం – ఎస్. జగన్‌రెడ్డి
లెనిన్ రచన 'ఏం చెయ్యాలి?' – ఎస్.వి.ఎస్. నాగభూషణ్
ఆకాశంలో సగం – అడుగు భూమి లేదు – డా. జి. లచ్చయ్య
కులం పుట్టుక – నిర్మూలన – బి. సైదులు
'శ్రమ శక్తి' ఉపయోగపు విలువ గురించి – రంగనాయకమ్మ
ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ పరిపాలన – 16 – ఎస్. సరళావందనం
అవినీతికి నిలయం – విశాఖ కారాగారం – తుంపాల శ్రీరామమూర్తి
నరోద్భిజం నుండి మార్భిజం – కె. నరేంద్రమోహన్
ఇరుగు–పొరుగు – వై. రామచంద్రం
భూగోళం – వీరబ్రహ్మాచారి, సి. రాజశేఖర్
అసహజ మరణాలు – వై. రామచంద్రం

జూలై 2013 — **సంచిక : 144**

పాఠకుల వీక్షణం
చలో అసెంబ్లీ, ప్యాకేజీ, రాయల తెలంగాణ...!! (సంపాదకీయం)
ఆహారభద్రత సరే, సమాజ అభద్రత సంగతేమిటి?; సామ్రాజ్యవాద సైన్యంలో ప్రజాస్వామ్య ప్రియులు (సంపాదకీయ వ్యాఖ్యలు)
కొత్త పుస్తకాలు / సి.డి.లు
ఈనేల – ఎ. మల్లేశ్
పాలకుల దుర్మార్గానికి వేల ప్రాణాల బలి – రాజవరం పార్థసారథి
భాజపాలో మోడీ ఆధిపత్యం – ఎ. నర్సింహారెడ్డి
తుంటి నొప్పికి పంటి మందు వేస్తే ఎలా? – వి. హనుమంతరావు
స్థానిక వనరులు స్థానికులకే దక్కాలి – పి. వరలక్ష్మి
దర్బాఘాట్ ఘటన – విభిన్న స్పందనలు – ఎడ్ల పోచయ్య
జాతీయ ఆహార భద్రతా బిల్లు – డా. శ్రీనివాసరావు చొప్పర
రాజ్యవాదమే రాజ్యాంగవాదంగా విస్తరిస్తోందా? – డా. నూకతోటి రవికుమార్
హిందూ తీవ్రవాదమే అసలైన ముప్పు – ఎం.కె. కుమార్
సమాచార హక్కు – రాజకీయ పక్షాలు – ఎ. రాజేంద్రబాబు
నిర్బంధంలో అసెంబ్లీ – కె. ప్రభాకర్
మతాల మత్తు – దళారీ మేధావులు – వీర బ్రహ్మచారి
సంక్షేమ పథకాలు – పేదరిక నిర్మూలన – సిరిసనగండ్ల సాహితి, సూత్రపు అనిల్
వర్ధమాన కవి వనపట్ల 'హాలెడ' – గుడిపల్లి నిరంజన్
వికలాంగులను పట్టించుకునేదెవరు? – బిళ్ల మహేందర్
ప్రజల సొమ్ముతో ప్రజలపైనే నిఘా – లోకసంచారి
కార్మికవర్గ పార్టీ, ఆర్థికవాదం, రివిజనిజం – కె. నరేంద్రమోహన్
చిల్లర వర్తకంలోకి ఎఫ్‌డిఐలు – ప్రొ. జి. శ్రీనివాసరావు, ఇడంపాక విజయ్
భ్రూణహత్యలు – కారణాలు – దావ మాధవి, నలిగంటి రజిత
'శ్రమ శక్తి' ఉపయోగపు విలువ గురించి – రంగనాయకమ్మ
ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ పరిపాలన – 17 – ఎస్. సరళావందనం
ఇరుగు–పొరుగు – వై. రామచంద్రం
భూగోళం – వీరబ్రహ్మాచారి, సి. రాజశేఖర్
అసహజ మరణాలు – వై. రామచంద్రం

ఆగస్ట్ 2013 — **సంచిక : 145**

పాఠకుల వీక్షణం
వరదలూ వరాలూ వాదనలూ వాగ్దానాలూ (సంపాదకీయం)
దళారీల పాలనలో ప్రజల బతుకు మాయం; ప్రజా ఉద్యమాలకు ఈజిప్ట్ పరిణామాల హెచ్చరిక (సంపాదకీయ వ్యాఖ్యలు)
చరిత్ర గమనం – రాజకీయార్థిక పరిచయం
కొత్త పుస్తకాలు / సి.డి.లు
ఈనేల – ఎ. మల్లేశ్
ప్రైవేటీకరణకే ఈ స్వాతంత్ర్యం – వి. హనుమంతరావు
చిదంబరం మాయాజాలం – వి. హనుమంతరావు
ఇష్రత్ హత్య – ఎన్‌కౌంటర్ల నిజానిజాలు – ఎల్. అరణ్య
నేను చేసింది పొరపాటు కాదు – ఎడ్వర్డ్ స్నోడెన్
అమెరికా నిఘా గుట్టు రట్టు – ఎ. నర్సింహారెడ్డి
చెరిపెయ్యలేని గంటి ప్రసాదం ముద్ర – ఎన్. వేణుగోపాల్
వ్యవసాయం కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం – పి.వి. రమణ
వ్యవసాయ సంక్షోభం – ప్రమాద ఘంటికలు – ఆశాలత
దిగ్విజయ్ మాయాజాలంలో తెలంగాణ – ఎ . రాజేంద్ర బాబు
మార్క్స్‌తో అమెరికన్ విలేఖరి సంభాషణ
వ్యవస్థీకృతమవుతున్న అవినీతి – యాటల్లి రామచంద్రం
ఎన్నికల ఎత్తుగడే బంగారు తల్లి పథకం – చిమ్మె జాన్ బర్నబాస్
విలువలు లోపిస్తున్న జర్నలిజం – ఎం. ఆదిశేషయ్య
ఒక ఆదివాసి రాజకీయ ఖైదీ కథ – పి. మంగరాజు
సెజ్‌లు సాధించిందేమిటి? – డా. ఇమ్మానేని సత్యసుందరం
ఎఫ్‌డిఐకి తలుపులు బార్లా ... – ఎ. సంతోష్
ఉచిత విద్యుత్తు మీద నెపం – ఎం. తిమ్మారెడ్డి
ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ పరిపాలన – 18 – ఎస్. సరళావందనం
చంద్రవెంకటేశ్వర్రావు
మూడు ప్రపంచాల సిద్ధాంతం – ప్రజాస్వామిక చర్చ – లంకా పాపిరెడ్డి
ఇరుగు–పొరుగు – వై. రామచంద్రం
భూగోళం – వీరబ్రహ్మాచారి
అసహజ మరణాలు – వై. రామచంద్రం

సెప్టెంబర్ 2013 — **సంచిక : 146**

పాఠకుల వీక్షణం
సిడబ్ల్యుసి తీర్మానం తర్వాత... (సంపాదకీయం)

అసహజ మరణాల సూచి

సంకలనం : వై.రామచంద్రం, ఎ.మల్లేశ్

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్ధాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగానూ, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(1 అక్టోబర్ నుండి 30 అక్టోబర్ 2013 వరకు 11 జిల్లాలలో అసహజ మరణాల పాలైన వారి సంఖ్య - 1262)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు స్త్రీ	ఇతరాలు పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.	పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)	(20)	(21)	(22)
ఆదిలాబాద్	-	2	-	23	25	8	6	3	3	2	3	3	2	1	25	30	-	-	-	2	-
మహబూబ్‌నగర్		5	-	11	19	7	10	1	-	-	19	25	27	12	89	15	-	1	1	-	15
నల్గొండ	వివరాలు అందలేదు																				
హైదరాబాద్	వివరాలు అందలేదు																				
మెదక్	-	7	-	11	16	-	4	2	2	2	4	1	1	6	40	41	-	-	-	-	-
కరీంనగర్	-	10	6	10	15	2	5	2	4	6	4	4	-	4	20	4	-	-	-	-	-
రంగారెడ్డి	వివరాలు అందలేదు																				
అనంతపురం	-	4	1	4	3	-	2	-	1	2	1	5	-	7	9	6	-	-	-	-	-
ఖమ్మం	-	3	-	7	17	4	5	4	1	3	-	2	1	4	11	19	-	-	-	-	6
నిజామాబాద్	-	-	-	6	12	2	-	2	-	3	2	3	4	3	18	12	-	-	-	-	-
విజయనగరం	-	-	-	2	3	3	2	3	5	4	1	2	-	1	20	10	-	-	-	-	5
శ్రీకాకుళం	-	-	-	8	6	7	9	5	-	1	2	1	3	3	16	15	-	-	-	-	6
చిత్తూరు	-	-	-	12	13	35	32	-	-	-	12	15	31	-	45	-	-	-	-	-	-
విశాఖపట్నం	-	-	-	6	14	-	3	1	2	8	-	5	6	3	16	12	-	-	-	18	5
మొత్తం	**-**	**31**	**6**	**100**	**143**	**68**	**78**	**23**	**17**	**31**	**48**	**66**	**75**	**44**	**309**	**164**	**-**	**1**	**1**	**20**	**37**

వీక్షణం దగ్గర అమ్మకానికి ఉన్న పుస్తకాలు

ఆర్థిక వ్యవస్థ – సామ్రాజ్యవాదం

ఒక దళారీ పశ్చాత్తాపం	జాన్ పెర్కిన్స్	రు. 50
కుట్రాజకీయం	స్టీఫెన్ కింజర్	40
అభివృద్ధిని ఇలా చూద్దాం	ముదునూరి భారతి	80
కొత్తచూపు	ఆర్.ఎస్. రావు	120
ఊరి దారి	ఎన్. వేణుగోపాల్	60
రాబందు వాలిన నేల	ఎన్. వేణుగోపాల్	180
వ్యవసాయం – ప్రపంచీకరణ	కె.ఆర్. చౌదరి	100
సామాజిక విద్య – ఒకమిథ్య ప్రజా ఎజెండా లేని	ఎ. నర్సింహారెడ్డి	100
పార్లమెంటరీ రాజకీయాలు	ఎ. నర్సింహారెడ్డి	40
ఒక ప్రేతాత్మక కథ	అరుంధతీ రాయ్	25
రాజ్యం – సంక్షేమం	కె. బాలగోపాల్	100

తెలంగాణ

లేచినిలిచిన తెలంగాణ	ఎన్. వేణుగోపాల్	120
తిరగబడ్డ తెలంగాణ	ఇనుకొండ తిరుమలి	100
తెలంగాణ రాజకీయాలు	దాగ్మార్ బెర్న్‌స్టార్ఫ్, హ్యూగ్ గ్రే	80

శాస్త్రవిజ్ఞానం

విశ్వాంతరాళం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	90
మానవ పరిణామం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	90
జీవకణాలూ నాడీకణాలూ	కొడవటిగంటి రోహిణీప్రసాద్	80
ప్రకృతీ – పర్యావరణం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	90
అణువుల శక్తి	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
జీవశాస్త్ర విజ్ఞానం – సమాజం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
మనుషులు చేసిన దేవుళ్లు	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
విజ్ఞాన శాస్త్రం మనిషి విస్తరణ	జెడి బెర్నాల్	80

కులం–మతం

శూద్రవర్ణం ఎలా పుట్టింది	ఆర్.ఎస్. శర్మ	80
కులం వర్గం	బొజ్జా తారకం	30
ఎస్సీ, ఎస్టీ నిధులు, విధిలింపు – మళ్లింపు	బొజ్జా తారకం	40
ఎస్సి, ఎస్టిలపై అత్యాచారాలు	బొజ్జా తారకం	50
ఖైర్లాంజి	ఆనంద్ తేల్‌తుంబ్డే	100
గులాంగిరి	జోతిబా పూలే	40
కుల నిర్మూలన	అంబేద్కర్	30
రాముని కృష్ణుని రహస్యాలు	అంబేద్కర్	20
దళితులు – రాజ్యం	అంబేద్కర్	25
శూద్రులు – ఆర్యులు	అంబేద్కర్	8
ఆధునిక భారతదేశంలో అంటరానితనం	అంబేద్కర్	25
దాస్య విముక్తి కోసం	అంబేద్కర్	15
భారతదేశం ప్రజాస్వామ్యం	అంబేద్కర్	12
ఆంగ్లేయపాలకులు – అంటరానివాళ్లు	అంబేద్కర్	20
రాష్ట్రాలు – మైనారిటీలు	అంబేద్కర్	40
రాముని కృష్ణుని రహస్యాలు	అంబేద్కర్	20
మతతత్వంపై బాలగోపాల్	కె. బాలగోపాల్	150
దళిత	కె. బాలగోపాల్	120
దేవుని రాజకీయతత్వం	కంచె ఐలయ్య	70
నేను హిందూవు నెట్లయిత?	కంచె ఐలయ్య	80

సాహిత్య విమర్శ – వ్యాసాలు

గురజాడ దేశభక్తి	ఎన్. వేణుగోపాల్	20
మహోదయం	కె.వి.ఆర్.	200
పరామర్శ	నల్లూరి రుక్మిణి	80
సాహిత్యంపై బాలగోపాల్	కె. బాలగోపాల్	150
విరసం సాహిత్య విమర్శ	విరసం ప్రచురణ	150
కెవిఆర్ సాహిత్య వ్యాసాలు–1	శారదాంబ స్మారక కమిటీ	300
అలిశెట్టి ప్రభాకర్ కవిత	అలిశెట్టి మిత్రులు	150

చరిత్ర–జీవిత చరిత్ర

భారత చరిత్ర పరిచయ వ్యాసాలు	డి.డి. కొశాంబి	40
ప్రాచీన భారత దేశ చరిత్ర	కె. బాలగోపాల్	50
చరిత్రలో ఏం జరిగింది?	గార్డన్ చైల్డ్	రు. 80
తరతరాల భారతదేశ చరిత్ర	రొమిల్లా థాపర్	80
ఆధునిక భారతదేశ చరిత్ర	బిపిన్ చంద్ర	100
బాబాసాహెబ్ అంబేద్కర్	బి. విజయభారతి	70
కన్నబీరన్	వ్యాస సంకలనం	50
చేగువేరా	కాత్యాయని	80
ఒక సెక్స్ వర్కర్ ఆత్మ కథ	నళినీ జమీలా	50
పరాయి పాలనను ఎదిరించిన ఝున్సీ	మహాశ్వేతాదేవి	150
నిర్జన వారధి	కొండపల్లి కోటేశ్వరమ్మ	100
ఇంట్లో ప్రేమ్‌చంద్	శివరాణీ దేవి	120
పరిచయాలు	ఎన్. వేణుగోపాల్	50
నా ప్రజాజీవితం	పెండ్యాల రాఘవరావు	50
ఆర్.ఎస్.రావు స్మృతిలో	వ్యాస సంకలనం	50
హక్కుల బాటసారి	బుర్ర రాములు రచనలు	50
నిగాహ్	కె. బాలగోపాల్ వ్యాస సంకలనం	200
ఛత్రపతి సాహూ మహరాజ్	కాత్యాయని	40
టాల్‌స్టాయ్ పరిచయ వ్యాసాలు	యన్.వి.ఎస్. నాగభూషణాచార్యులు	30

విప్లవోద్యమం

పోలీసులు అరెస్ట్ చేస్తే	బొజ్జా తారకం	30
భారత్‌పై అరుణతార	యాన్ మిర్డాల్	100
జంగల్‌నామా	సత్నామ్	100
జనహృదయం జనార్దన్	సూరపనేని మోహనరావు	60
కోటి జ్ఞాపకాలు	విరసం ప్రచురణ	50

తత్వశాస్త్రం

మార్క్సిస్ట్ సాహిత్య విమర్శ	డా. శ్రీనివాస్	100
లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్ ప్రచురణలు అన్నీ		

కథ – నవల

గంగానమ్మ	విజయ	15
రుదాలి	మహాశ్వేతాదేవి	45
ఏడుతరాలు	అలెక్స్ హేలీ	80
కథలగూడు	దేవులపల్లి కృష్ణమూర్తి	60
పథేర్ పాంచాలి	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	100
వనవాసి	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	100
చంద్రగిరి శిఖరం	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	50
అపరాజితుడు	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	100
నేల నాగలి – మూడెద్దులు	బొజ్జా తారకం	25
పంచతంత్రం	బొజ్జాతారకం	100
ఇస్మత్ చుగ్తాయి కథలు	ఇస్మత్ చుగ్తాయి	100
పంచమం	చిలుకూరి దేవపుత్ర	100
అజేయుడు	అలెగ్జాండర్ ద్యుమా	160
ఘంటారావం	విక్టర్ హ్యూగో	100
స్పార్టకస్	హోవార్డ్ ఫాస్ట్	80
రేపటి కల	రిచర్డ్ రైట్	50

Fifty Years of Andhra Pradesh	**(1956-2006)**	300
Towards Understanding Semi Feudal - Semi Colonial Society	R.S. Rao	300
In search of Method	Mudunuri Bharathi	200
Individual Sub-groups, Groups and Freedom	Mudunuri Bharathi	75
Crisis and Development in Marxian Framework	Mudunuri Bharathi	80
Methodoly of Social Enquiry	Mudunuri Bharathi	150
On Education	Mudunuri Bharathi, R.S. Rao	100
Understanding Maoists	N. Venugopal	300

వీక్షణం, మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3,
హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029.
ఫోన్ : 040-66843495
Email: veekshanam2003@gmail.com, www.veekshanam.wordpress.com

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 149 - December 2013 ● ISSN 2231-6892
● RNI Regn.No.APTEL/2003/11482 ● Published on 29/11/2013 ● Postal Regn. No. L II/RNP/HD/1100/2011-13

వీక్షణం మీ నుంచి కోరుతున్నది
రచనా సహాయం, ఆర్థిక సహాయం

మీ వంటి వేలాది మంది పాఠకుల ఆదరాభిమానాలతోనే వీక్షణం నానాటికీ అభివృద్ధి చెందుతున్నదని మీకు తెలుసు. వీక్షణం తాను పెట్టుకున్న ప్రజా చైతన్య పురోగమన, విస్తరణ లక్ష్యాలకు మరింతగా చేరుకోవాలంటే మీవంటి అభిమానులు, పాఠకులు, రచయితలు, దాతలు మరింతగా చేయూత నందించవలసి ఉంది. మీ చేయూత రచనల రూపంలో కావచ్చు, ఆర్థిక సహాయం రూపంలో కావచ్చు.

వీక్షణంకు రచయితల నుంచి, అభిమానుల నుంచి రచనలు గణనీయంగానే అందుతున్నప్పటికీ ఇంకా ఎక్కువ, ఇంకా నాణ్యమైన రచనలు రావలసి ఉంది. అందుకు మీ పూనిక అవసరం. వీక్షణం మూడు రకాల రచనలకు ప్రాధాన్యతనిస్తుంది : 1) ప్రధాన స్రవంతి ప్రచార సాధనాలలో విరివిగా సమాచారం వస్తున్నప్పటికీ ప్రజానుకూల విశ్లేషణ లేని అంశాలపై ప్రజా దృక్కోణం నుంచి లోతైన విశ్లేషణలు. 2) ప్రధాన స్రవంతి ప్రచార సాధనాలు సాధారణంగా విస్మరించే ప్రజా జీవన పరిణామాల గురించి సమాచార, విశ్లేషణా రచనలు. 3) ఏ సమాచారాన్నయినా అర్థం చేసుకోవడానికి అవసరమైన పనిముట్లు అందించే దృక్పథ ప్రధానమైన రచనలు.

వీక్షణం ఆర్థిక స్థితి సమస్యాత్మకంగా ఉన్నదని, ఏ నెలకానెల అన్నట్టుగా సాగుతున్నదని మీకు ఎప్పటికప్పుడు నివేదిస్తూనే ఉన్నాం. ప్రతి సంచిక ఆర్థిక లోటుతో నడుస్తున్నది. వ్యక్తిగత చందాలు, సంస్థల చందాలు, పుస్తకాల అమ్మకాలు, విరాళాలు, ప్రకటనలు వంటి వనరులన్నీ ఇంకా పెరిగితే గాని పత్రిక మనుగడ సుస్థిరం కాదు. వీక్షణం అభిమానులు, పాఠకులు ప్రతి ఒక్కరూ పూనుకుని తమ వంతు బాధ్యతగా చందాలు చేర్పించడం, విరాళాలు, ప్రకటనలు సేకరించడం వంటి అన్ని రూపాలలో ఆర్థిక సహాయం అందించడం అవసరం.

తెలుగు సమాజంలో ప్రగతిశీల ఆలోచనాధారలో, ప్రజానుకూల పత్రికల సంప్రదాయంలో

కృషి చేస్తున్న రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక వీక్షణం

తెలుగు సమాజం తనతో తాను చేసుకుంటున్న సంభాషణ వీక్షణం

ఈ సంభాషణను విస్తరిద్దాం! తెగిపోకుండా కాపాడుకుందాం!

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Deccan Press for Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020
and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao